RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 1 Monthly January 2024 ISSN No. : 2456-4702 Rs. : 15/-

భావవీణ
పాఠకులకు, ఆచార్యులకు,
అధ్యాపకులకు,
విద్యార్థినీ, విద్యార్థులకు
నూతన సంవత్సర
మరియు సంక్రాంతి
శుభాకాంక్షలు...





శ్రీ కె. యస్. లక్ష్మణరావు



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue : 1 - January 2024 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 15/-**

**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
***M.A.(Tel), M.A.(Pol-Sci.)., M.Ed., Ph.D.,***
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Hyderabad Central University, Hyderabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy& Religion Studies,
   Andhra University, Visakhapatnam.
7. **Prof. T. Ramaprasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
   Principal,
   St Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Prof. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Professor, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narsapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur- 2 . 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 9949929674, 7989088274

# BHAVAVEENA

(MONTHLY MAGAZINE)

Journal - Arts, Literature, Cultureand Language Study

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **జనవరి – 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/–** |
| కాపీలకు | : | **డి.నెం. 135–14–716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి.నెం. 135–14–716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |

# కె.యస్. లక్ష్మణరావు

ప్రముఖ విద్యావేత్త, మితభాషి, సౌమ్యుడు, విద్యా సంస్కర్త ఉపాధ్యాయ ఉద్యమనేత శ్రీ కలగర సాయి లక్ష్మణరావు అందరికీ కె.యస్. లక్ష్మణరావు గా సుపరిచితుడు. "ఆదర్శ సమాజ స్థాపన ఉన్నత విద్యావంతుల ద్వారానే సాధ్యం" అని ప్రగాఢంగా నమ్మి, వారి శ్రేయస్సు కోసం నిరంతరం పరితపిస్తున్న శ్రమైక జీవి కె.యస్. లక్ష్మణరావు. వీరు శ్రీ కలగర వెంకటేశ్వరరావు మరియు జయలక్ష్మి దంపతులకు జులై 11, 1956వ సంవత్సరంలో పోతునూరు గ్రామం, దెందులూరు మండలం తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం ఏలూరు జిల్లా)లో జన్మించారు.

కె.యస్. లక్ష్మణరావు మెట్రిక్ 1976లోనూ, ఇంటర్ 1972-74లోనూ, బి.ఏ 1974-77 సి.ఆర్. రెడ్డి కళాశాల ఏలూరులోను, ఎం.ఏ రాజనీతి శాస్త్రం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. తరువాత గుంటూరులో హిందూ కళాశాలలో రాజనీతి శాస్త్ర లెక్చరర్‌గా 25 సంవత్సరాలు పనిచేశారు. ఆ రోజుల్లో జన విజ్ఞాన వేదికకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగాను, యునైటెడ్ టీచర్ ఫెడరేషన్‌లో క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధ్యాయ ఉద్యమనేతగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు పొందారు. ఆయన 2007 సంవత్సరంలో పి.డి.ఎఫ్ తరపున కృష్ణా - గుంటూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలిలో అడుగుపెట్టారు. తరువాత 2009లో మళ్ళీ ఎన్నికై విద్యా వ్యవస్థలోని సమస్యలు, బోధనా సిబ్బంది సమస్యలపై శాసనమండలిలో గట్టిగా గళమెత్తారు. ఫలితంగా 2019లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికల్లో 80 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించి ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

మంచి, మానవత్వంతోపాటు గొప్ప సామాజిక స్పృహగల గొప్ప విద్యా సంస్కర్త. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కె.వి.ఆర్ జయలక్ష్మీ ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా ప్రతిభావంతులైన ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులను, వివిధ కళాశాల, విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఆచార్యులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందిస్తున్న గొప్ప మనస్సున్న మహారాజు. బోధనలో వివిధ రంగాలలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న విద్యా, ఉపాధ్యాయ ఉద్యమనేత కె.యస్. లక్ష్మణరావు సదా చిరస్మరణీయులు.

**- సంపాదకవర్గం**

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగు భాష ఆధునీకరణకు ప్రసార మాధ్యమాల పాత్ర | - ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 7 |
| 2. | తెలుగు భావకవితా సౌందర్యం | - ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 15 |
| 3. | దళిత-బహుజన సాహితీ కెరటం : శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావు | - డా॥. బాసాని సీతారాములు | 23 |
| 4. | గిరిజన సంస్కృతి - లంబాడాల దీపావళి పండుగ | - డా॥. లక్ష్మ ణ్ నాయక్ బాణోత్ | 27 |
| 5. | ఆధునిక సాహిత్య వేత్త యిక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం - ప్రకృతి వర్ణన | - డా॥. పి. శ్రీనివాసరావు | 31 |
| 6. | జాషువ కవిత్వం - స్త్రీ సామాజిక జీవితం | - డా॥. లింగాల మంగమ్మ | 35 |
| 7. | స్కైబాబు 'బేచారె' - భగ్నప్రేమ కథల్లో - పాత్రల స్వేచ్ఛాయుత "ప్రణయ సంఘర్షణలు" | - డా॥. మామిడి లింగయ్య | 40 |
| 8. | దాశరథి రంగాచార్య నల్లనాగు (కథా సంపుటి)-వస్తు వైవిధ్యం | - డా॥. కె.డి.డి మృణాళిని | 45 |
| 9. | జానపద సాహిత్యాంలో పొడుపు కథలు - విశిష్టత | - కె. అమృతజ్యోత్స్న | 51 |
| 10. | ఆర్వీయస్ సుందరంగారి ఆంధ్రుల జానపద విజ్ఞానం సామెతలు సమాలోచన | - గంధం వేణు | 55 |
| 11. | బాల సాహిత్యం స్వరూపం - పరిణామం | - డా॥. బి. చక్రవర్తి | 61 |
| 12. | హేతువాద సాహిత్యంలో త్రిపురనేని రామస్వామిచౌదరి | - డా॥. ఎం. వెంకటగౌరి | 65 |
| 13. | నుదురుపాటి వెంకన్నకవి - సాహిత్య పరిచయం | - డా॥. కె. రమేశ్ | 71 |
| 14. | తెలుగు సినిమా పాటల్లో రామాయణ చిత్రణ | - ఎం. లక్ష్మి | 76 |
| 15. | గురజాడ రచనల్లో స్త్రీలు - సమకాలీనత | - తోట రామకృష్ణ | 80 |
| 16. | పెద్దింటి అశోక్ కుమార్ కథల్లో దాంపత్య జీవితం-పరిశీలన | - చెల్లా దేవి | 83 |
| 17. | "అంతర్జాతీయ తెలుగు కవిత్వానికి అతడో చిరునామా!" | - రామాపురం శ్రీనివాసులు | 87 |
| 18. | గురజాడ స్త్రీజాడ | - తుళ్ళూరు రవి | 91 |
| 19. | బహుజన సాహిత్యం - ఆచార్య దార్ల దృక్పథం | - ఎర్రోళ్ళ ఆంజనేయులు | 95 |
| 20. | స్త్రీవాద, బాల కార్మికుల కథలు - సామాజికత | - రెబ్బ మల్లికార్జున్ | 104 |
| 21. | Insider | - Dr. M. Koteswar Rao | 110 |

# తెలుగు భాష ఆధునీకరణకు ప్రసార మాధ్యమాల పాత్ర

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, తెలుగుశాఖ అధ్యక్షులు, మానవీయ శాస్త్రాల విభాగం,
యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

భాషనిత్య చలనశీలమైంది. భాషలో నిరంతరం అనేక మార్పులు జరుగుతూ ఉంటాయి. అలాంటి మార్పులు ఈ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాల వల్ల మరింత విస్తృతంగా కనిపిస్తున్నాయి.కొన్ని ప్రత్యేకమైన సాఫ్ట్వేర్ల ద్వారా తమ భావాలను అందరికీ అందుబాటులోకి ఉండేలా వెబ్సైట్లో ప్రచురించుకోవడం లేదా ఇంటర్నెట్ ద్వారా తమ భావాలను పరస్పరం పంచుకొనే అవకాశం ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలు అని అంటారు. తొలుత వెబ్సైట్లు ద్వారా అందుబాటులో ఉండే ఆర్కుట్, ఫేస్ బుక్, బ్లాగ్స్, ఈ మధ్య కాలంలో వాట్సాప్, ట్విట్టర్, లింక్ డాన్, ఇన్ స్టా గ్రామ్ మొదలైన వాటిని సామాజిక మాధ్యమాలుగా గుర్తిస్తున్నారు. ఈ వ్యాసంలో వీటివల్ల తెలుగు భాష ఆధునీకరణకు జరిగే ప్రయత్నాలను చర్చించే ప్రయత్నం చేస్తాను.

(Key Points : సామాజిక మాధ్యమాలు, భాష, తెలుగు భాష, నూతన పారిభాషిక పదాలు, కొత్తపదాలు)

సామాజిక మాధ్యమాలలో ఉపయోగించే భాష పత్రికలు, పత్రికలో ఉపయోగించే భాషనే సామాజిక మాధ్యమాలు పరస్పరం తీసుకుంటూ వాటిని విస్తృతంగా ఉపయోగించుకోవడం కూడా జరుగుతుంది. వీటితో పాటు రేడియో, టివి ఛానెల్స్, యూట్యూబ్ కొన్ని ప్రైవేటు మీడియో ఛానల్స్, పోడ్ కాస్ట్ ప్రసారాలు కూడా భాషా వినియోగంలో కొత్త కొత్త పదాల పుట్టుకకు కారణమవుతున్నాయి. ఇలా పరస్పర వినియోగంలో కేవలం పండితులే కాకుండా తమ భావాలను ఇతరులకు పంచుకోవాలనుకునే వాళ్లంతా తమకు తెలిసిన భాషనే ఉపయోగిస్తున్నారు. ఇలా ఉపయోగించడంలో తెలుగు భాష తన స్వీయ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసుకుంటున్నా, ఆధునికీకరణ వైపు పయనిస్తుందని కూడా వ్యాఖ్యానించు కోవచ్చని నా అభిప్రాయం. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలలో తెలుగు భాష అనూహ్యమైన మార్పులకు గురికావడానికి గల కారణాలను భాషా శాస్త్రవేత్తలు ఇప్పటికే అనేక కోణాలనుంచిఊహించారు.

- తెలుగు భాషపై పట్టు ఉన్న వారి కంటే శాస్త్ర సాంకేతిక రంగాలతో కూడా పరిచయం ఉన్న వాళ్లు మాత్రమే సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా పాల్గొంటున్నారు.ఆ విధంగా తెలుగు భాషాపదాలుగా సంస్కృతం, ఆంగ్లం, హిందీ తదితర భాషలతో కలిపి కొన్ని కొత్త కొత్త సమాసాలను ప్రయోగిస్తున్నారు. మరి కొంతమందికి తెలుగు, ఇతర భాషాపదాలనే స్పష్టత తెలియకుండా నిత్యవ్యవహారంలో ఉన్న మణిప్రవాళశైలినే ప్రయోగిస్తున్నారు. తెలుగు భాష, సాహిత్యాల్ని ప్రత్యేకంగా అధ్యయనం చేసినవాళ్ళే చాలామంది సంస్కృతం, తెలుగు భాషాపదాల్ని గుర్తించలేకపోతున్నారు. అటువంటప్పుడు తమ చదువంతా సాంకేతిక విద్యపై ఆధారపడినవాళ్ళు తెలుగు భాషలో సరిగ్గా రాయడంలేదనుకోవడం కొంత హాస్యాస్పదమే అవుతుంది. ఇటువంటప్పుడే భాషాశాస్త్రవేత్తల కృషి అవసరమవుతుంది.
- మన తెలుగు పత్రికలలోనూ, టెలివిజన్ లోనూ నిత్య వ్యవహారంలోనూ మనం అనేక భాషా పదాలను కలుపుకుని ఉపయోగిస్తూ ఉన్నాం. వాటిని సామాజిక మాధ్యమాల్లో కూడా ఉపయోగిస్తున్నారు.
- తెలుగులోని కొన్ని అక్షరాలు క్రమేపీ రకరకాల

కారణాల వల్ల మాయమైపోతున్నాయి. అవి కొన్ని తరాల వాళ్ళకి తెలియడం లేదు. ఒక టీవీలో వార్తలు చదివే వారు ఇలా చదివారు. "ఋష్యమూక పర్వతం...ఋష్యమూకపర్వతం" ఇలా రాయడం వల్ల వారు ఉద్దేశించిన అర్థం ప్రేక్షకులు లేదా శ్రోతలకు స్పష్టంగా అందకుండా, గజిబిజిని కలిగి స్తుంది. రాసిందొకటి, చదివేది మరొకటి కావడం ఈ గందరగోళానికి కారణం.

- సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాష ఆధునీకరణ జరుగుతుందనిఆశించడం కొంత అత్యాసేనేమో అని కూడా అనిపిస్తుంది. కేవలం తెలుగు పదాలను మాత్రమే వాడాలనుకొనేవారికి ఇది నిరాశనే కలిగి స్తుందనే అభిప్రాయం మరొకటి.
- తెలుగు భాషలో కలిసిపోయిన పదాల్లాగే మరికొన్ని పదాలు చేరుతున్నాయనుకొనేవారికి సామాజిక మాధ్యమాలలో కనిపించే ట్వీట్, రీట్వీట్, లైక్, షేర్, సెల్ఫీ, ఫ్రెండ్, అన్‌ఫ్రెండ్...ఇలాంటి పదాలు తెలుగు భాషను ఆధునీకరణ వైపు నడిపిస్తున్నా యనుకుంటారు.
- సామాజిక మాధ్యమాల ప్రభావం ఎంతవరకు ఉందనేది తెలియాలంటే నేడు ఇంచుమించు అన్ని మీడియా సంస్థలు సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రత్యేకమైన ఎకౌంటుని ప్రారంభించి, తమ మీడియా లింకులను కలుపుతూ తమ పత్రికలు, టీవీలలో కూడా వాటిని ప్రదర్శించుకుంటున్నారు. దాని ద్వారా తమ మీడియా వైపు పాఠకుడు/ ప్రేక్షకుడిని తీసుకెళ్ళాలనుకుంటున్నాయి. దీని కోసం హేష్ ట్యాగ్ (#) ఇస్తూ, తమ మీడియా హైపర్ లింక్స్ కలుపుతున్నాయి. సాధారణంగా ఈ హెష్‌టాగ్ ఇంటర్నెట్‌లో ట్రెడింగ్‌ను తెలియ జేస్తుంది. ఈ గుర్తును ట్విట్టర్‌లో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
- సామాజిక మాధ్యమాల వల్ల తెలుగు భాషలో ప్రవేశించిన కొన్ని పదాలు. సెల్ఫీ, లైక్ చేయడం, మెసేజ్ చేయడం, షేర్ చేయడం, సబ్స్క్రయిబ్ చేయడం, చాటింగ్, వాయిస్ మెసేజ్, గ్రూప్, కాన్ఫరెన్స్, స్మార్ట్ ఫోన్, ఎమోజీ, వెబినార్, డేటా, మెమొరీ, సైన్ ఇన్, సైనౌట్, లాగౌట్, స్పామ్, పాస్ వార్డ్, నెటిజన్, విజువల్, సైట్, బైట్..ఇలా అనేక పదాలు సామాజిక మాధ్యమాలలో నిత్యం వ్యవహారంలో కనిపిస్తున్నాయి. ఇటువంటి పదాలను కొంతకాలం తెలుగులో యథాతథంగా స్వీకరించి, వాటికి తెలుగు పదాలు సృష్టించుకొని, అవి వాడుకలోకి తీసుకొని రావచ్చు. ఒకవేళ మనం అనువాదం చేసినవీ లేదా సృష్టించిన పదాలు ఈ పదాలకంటే క్లిష్టంగా ఉంటే వీటినే తీసుకొని ఆదాన పదాలుగా స్వీకరించవచ్చు.

సామాజిక మాధ్యమాలలో తెలుగు ఆధునీకరణ ప్రక్రియ మూడు మార్గాలు:

సామాజిక మాధ్యమాలలో తెలుగు ఆధునీకరణ ప్రక్రియ మూడు మార్గాల్లో జరుగుతుందని మనం గమ నించవచ్చు.

1. అన్యభాషా పదజాలాన్ని విస్తృతంగా ఉప యోగించడం. ప్రపంచీకరణ ఫలితంగా వచ్చిన మార్పుల వల్ల చదువుకున్నా, చదువుకోకపోయినా కొన్ని భాషా పదాలు సామాన్యులకు కూడా అర్థం అవుతున్నాయి. అందువల్ల ఆ భాషాపదాలు అవి అన్య భాషా పదాలైనప్పటికీ తమ తెలుగు భాషా పదాలుగా వాడుకుంటున్నారు.

ఉదా : పానీపూరి. దీనికి తెలుగు పదం ఏమిటి? కంప్యూటర్....దీనికి తెలుగు చేసే ప్రయత్నంలో 'సంగణన యంత్రం' అన్నారు. దీన్ని ఎంతమంది స్వీకరిస్తున్నారు? అయినా భాషాశాస్త్రవేత్తలు అనువాదాలు చెయ్యకుండా వదిలేయకూడదు. తర్వాత తర్వాత ఆ పదం వాడుకలోకి రావడం, ఆ పదం అలవాటు పడడం వల్ల ఆ పదం

తెలుగు పదంగా వాడుక లోకి వస్తుంది. మన తెలుగు భాషా పదసంపద పెరుగుతుంది. ఉదాహరణకు అంతర్జాలం అనేపదం ఇటీవల బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. దీన్ని ఇంతకు ముందు ఇంటర్నెట్ అనే పదంగానే చాలా కాలం పాటు వాడుకున్నాం. తర్వాత అదే పదాన్ని అంతర్జాలం అని అనువాదం చేశారు. ఆ పదం క్రమేపీ వాడుకులోకి వచ్చింది. ఈ మధ్యకాలంలో ఫాంట్ అని ఆంగ్ల పదానికి ఖతి అనే సంస్కృత పదాన్ని తెలుగు పదంగా వాడుకోవడం మొదలైంది. ఇలాంటప్పుడు మనం కొన్ని సంస్కృతపదాలను తెలుగు పదాలనే భ్రమలోకి నెట్టేస్తున్నాం. కాకపోతే, ఇంగ్లీష్ లేదా హిందీ భాషాపదం కంటే తెలుగులో తత్సమ, తద్భవ రూపాలుగా సంస్కృత పదాలెన్నో చేరిపోయాయి. అందువల్ల అవి తెలుగు పదాలుగానే సామాన్యులు భావిస్తుంటారు. కానీ, వీటిని కూడా మనం తెలుగు పదాలుగా అనువాదం లేదా సృజించుకోవడం చేయ వలసిన అవసరం ఉంది.

2. కొన్ని పదాలను సామాజిక మాధ్యమాలలో ప్రత్యేకించి అనువాదం చేసి ప్రయోగించు కుంటున్నారు. కొన్ని పదాలు అనువాదాల కంటే కూడా ఆ పదాలను యధాతథంగా వాడుకోవడమే బాగుందని కూడా భావిస్తున్నారు.ఉదా: =ముశ్రీ జుర్ఫ్‌వ తెలుగులో స్థిరాస్తి అని వివాదం లేకుండా పరిష్కారం చేసుకుని మాట్లాడుకున్న రియల్ ఎస్టేట్ అనే పదంలో ఉన్నంత భావం ఇక్కడ రావట్లేదు. రియల్ ఎస్టేట్ అనగానే అదొక వ్యాపారంలో భాగమని అర్థమవుతుంది. కానీ, స్థిరాస్తి అనేదానిలో ఆ భావం రావట్లేదు. ఇటువంటి పదాలను కొంచెంలోతుగా పరిశీలించుకోవాలి.

మరొక ఉదాహరణ : మిషన్ కాకతీయ...దీన్ని ఒక పత్రిక వారు 'యంత్ర కాకతీయ ' అని అనువదించారు. అలాగే 'ఎయిర్ హాస్టెస్' .... గగన సఖి అని అనువాదం చేశారు. Contractor తెలుగులో గుత్తేదారు అని పత్రికలు రాస్తున్నాయి. కానీ, జన వ్యవహారంలో కాంట్రాక్టర్ అనే పదమే బాగా వ్యవహారంలోకి వచ్చేసింది.

3. కొన్ని మిశ్రమ సమాసాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యవహారంలో ఉన్నాయి. ఉదాహరణ: ఓటర్ల జాబితా, బడ్జెట్ ప్రసంగం... వీటిని యధా తథంగా స్వీకరించడమే ఉత్తమమని భావిస్తున్న భాషాశాస్త్రవేత్తలు ఉన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో తెలుగు పదాలు కూర్పు:

సామాజిక మాధ్యమాల్లోని ఫేస్బుక్ అనే పదాన్ని ముఖపుస్తకం అని కొంతమంది వాడుతున్నారు.. ట్వీట్‌ని కూత అనీ, సెల్ ఫోన్, మొబైల్ ఫోన్ అనే పదాల్ని చరవాణి, కరవాణి వంటి పదాలతో అనువదించారు. కానీ,అవి వాడుకలోకి రాలేకపోతున్నాయి. అయినా కొన్ని పత్రికలు వాటిని అలాగే ప్రచారంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. అలాంటి ప్రయత్నాల వల్ల ఆ పదాలు క్రమేపీ తెలుగు భాషాసంపదను పెంచుతాయి. 'మీకంటూ ఈ పదాలకు తెలుగు పదాలే సృష్టించు కోలేకపోయారు' అనేవాళ్ళెదురు పడితో ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో మాకూ ఈ పదాలు ఉన్నాయని చూపించుకోవచ్చు.

సాధారణంగా పత్రికల్లో వచ్చే భాషే సామాజిక మాధ్యమాల్లోనూ వస్తున్నప్పటికీ సామాజిక మాధ్యమాల్లోని కొన్ని భాషా పదాలు అనువాదానికి లొంగకుండా యధాతథంగా వాటిని వాడుకోవడం మంచిదనే అభి ప్రాయంతో కొన్ని భాషా పదాలు తెలుగు వ్యవహారంలో ఇమిడిపోతున్నాయి. అలాంటి పదాలను, ముఖ్యంగా శాస్త్ర, సాంకేతిక పదాలను యధాతథంగా వాడుకోవడమే బాగుందని భావిస్తూ ఒక బ్లాగరు ఇలా రాశారు.

- ' 'తెలుగులోగానీ, ఏ భాషలోగానీ Localization అంటే Applicationలో ఉన్న ప్రతి ఇంగ్లీషు పదాన్నీ dictionary లోంచి ఎనబవవఓ చేసి వచ్చినదాన్ని వాడడమని ఎందుకనుకుంటారో? నిక్షిప్తం రీతి, స్థాపకవ్యవస్థ, పూర్వవీక్షణ, పునరుక్తి,

విధి ఫలకం, స్వయంపాతం, అనుకూలీకృతం" - ఇవన్నీ ఏడో తరగతి తెలుగు పరీక్షలో సంధులో సమాసాలో కాదు. Microsoft Word Telugu LIP లో వీవఅబ Items. ఏమిటీ పదాలు? ఎందుకొచ్చిన గోల? ' Save' అనేందుకు నిక్షిప్తం అనాలా? Layout అనేందుకు స్థాపకవ్యవస్థ అనాలా?

- అవే పదాలు తెలుగులో రాయొచ్చు కదా? గిడుగువారి ఆదర్శాలకి నీళ్లొదులుతూ గ్రాంథిక భాషని తెలుగు softwareలోనూ, కొన్ని తెలుగు వెబ్ సైట్లలోనూ మళ్లీ తలెత్తుకునేలా చేయడం చూస్తే బాధగా ఉంది.తెలుగును రక్షిస్తున్నామను కుంటూ (అమాయకంగానో, భాషాభిమానంతోనో) ఇలా రాయడమే నిజంగా తెలుగుని ఖూనీ చేయడం.
- ఇంగ్లీషు పదాలు వాడినంత మాత్రాన భాష బలహీనపడిపోదు. సంస్కృతం onslaughtని తెలుగు సమర్థవంతంగా ఎదిరించలేదూ?
- *ఆ processలో ఇంకా అందంగా తయారైంది. సూర్యుడికి అచ్చతెలుగు పదమైన 'పొద్దు'ని ఎంతమంది ఆ అర్థంలో వాడుతున్నారు?* (https://manatelugu.blogspot.com/)

## టింగ్లీష్ :

చాలామంది నేటికీ తెలుగులో టైప్ చేయకుండా ఇంగ్లీషులోనే టైప్ చేస్తూ లిపి పరంగా ఇంగ్లీష్ భాష పరంగా తెలుగు ను వాడుతున్నారు. దీన్ని తింగ్లీష్ అని కొంతమంది పిలుస్తున్నారు.. తెలుగులోనే రాయడానికి అనేక సాధనాలు, సులభమైనటువంటి కీబోర్డ్‌లు ఉన్నప్పటికీ చాలామంది తెలుగు భాషలో రాయడం చాలా కష్టంగా భావిస్తున్నారు..

కేవలం చేత్తో టైప్ చేయనవసరం లేకుండానే మాట్లాడుతూ ఉంటే తెలుగులో టైప్ అయిపోయే విధానంగా కూడా మన తెలుగు భాషాలిపిని అభివృద్ధి పరిచారు.. తెలుగు లిపిని అభివృద్ధి పరిచారు. ఇది సామాజిక మాధ్యమాల వల్ల తెలుగు భాషకు జరిగి గొప్ప మేలు.

ఇవన్నీ కష్టమనుకుంటే, కొంచెం చేతిరాత బాగా ఉంటే దాన్ని కాగితం మీద రాసి, ఒక యాప్ ద్వారా దాన్ని ఫోటో తీసుకుంటే అది ఆటోమేటిగ్గా తెలుగు లిపి లోకి టైపు అక్షరాలు గా మారిపోయి తెరపై కనిపిస్తుంది... చిన్నచిన్న అక్షర దోషాలు వచ్చినా దానిని ఎడిటింగ్ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.. దీన్ని కష్టపడి పుస్తక ప్రచురణ కోసం మరలా టైప్ చేసుకోవాల్సిన పని లేకుండా యూనికోడ్ లోకి వచ్చేస్తుంది. అప్పడు యూనికోడ్‌లో గానీ, లేదా సంప్రదాయంగా వస్తున్న ప్రచురణ విధానం ప్రకారం డైనమిక్ ఫాంట్ గా మార్చుకొని, మరలా వాటిని మనకి ఇష్టమైన ఫాంట్స్ గా మార్చుకొని వాడుకోవడం ఎంతో సులభం. అంతే కాదు ఒకవేళ మనం మన వ్యాసాలు, పుస్తకాలు అప్పటికే డైనమిక్ ఫాంట్స్ (అను, శ్రీలిపి, ఇతరాలు) ఉంటే వాటిని అనేక పద్ధతుల ద్వారా నిమిషాల్లో యూనికోడ్ గా మార్చుకునే సౌకరాలు అందుబాటులోకి వచ్చాయి. డైనమిక్ ఫాంట్ కీ, డైనమిక్ ఫాంట్ నుండి యూనికోడ్ ఫాంట్ కీ, పిడిఎఫ్, ఇమేజ్ ఫార్మేట్స్ నుండి కూడా ఒక చిన్న యాప్ సహాయంతో మరలా ఎడిటబుల్ ఫాంట్ లోకి మార్చుకొనే విధంగా కొన్ని యాప్స్ తయారు చేశారు..

యూనికోడ్ ఫాంట్ వచ్చిన తర్వాత పుస్తక ప్రచురణ లోను, దాన్ని చదివి వినిపించే పోడ్కాస్ట్ అని చదివి వినిపించే రీడింగ్ బుక్ వ్యవస్థకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఇది తెలుగు పుస్తక ప్రచురణలో ఇప్పుడిప్పుడే కనిపిస్తుంది. మనం చదివి డిజిటల్ రికార్డింగ్ చేయడం ఒక పద్ధతి అయితే, మనకు కావలసిన భాగాన్నే చదివి వినిపించమనే విధంగా పుస్తకాలు పుస్తకాలే చదివి వినిపంచే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఇంతకు ముందు ఎడోబ్ సాఫ్ట్వేర్ లో ఇంగ్లీషు మరికొన్ని భాషలను

మాత్రమే చదివి వినిపించే సౌకర్యం ఉండేది. ఇప్పుడు తెలుగు అక్షరాలను మనకు నచ్చిన స్త్రీ, పురుష గొంతులతో వినే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీని వల్ల దృశ్యవీక్షణం చేయలేని (విజువల్లీ చాలెంజ్డ్ పీపుల్) వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. పత్రికలు చదవడం మొదలు ముఖ్యమైన వెబ్ సైట్ లలో కూడా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. వెబ్సైట్ అంతా కూడా ఒక చిన్న మార్పు చేస్తుకోవడం ద్వారా తెలుగులోకి అనువాదం చేసి, చదివి వినిపించే ప్లగిన్స్ వచ్చాయి. ఇదంతా తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతూనే, తెలుగు భాషాసాహిత్యాలను విశ్వవ్యాప్తం చేస్తున్నాయి.

ఇవన్నీ సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగును లిపి పరంగానూ, భాషా పరంగానూ ఆధునికరించడంలో సాధించిన పరిణామాలు.. ఒకప్పుడు ఇండెక్స్ తయారు చేయాలంటే కొన్ని రోజులు, నెలలు పట్టేది. యూనికోడ్ వచ్చిన తర్వాత తెలుగు భాషలో కూడా ఇండెక్స్ తయారు చేయడం...అంటే పద సూచికలు తయారు చేయడం చాలా సులభంగా మారిపోయింది.. కొన్ని నిమిషాల వ్యవధిలోనే వాటిని తయారు చేసే అవకాశం కలుగుతుంది. దీని వల్ల పదకోశాలు, నిఘంటువులు, పరిశోధనలు ఎంతో సులభంగా, శాస్త్రీయంగా జరుగుతున్నాయి. యంత్రానువాదం అంతా పరిపూర్ణమైన భావాన్ని ఇవ్వలేకపోయినా, మనకి ఏ భాషలో ఉన్న విషయాన్నైనా మన భాషలో ఆ మూల భావాన్ని గ్రహించడానికి ఎంతో సహకరిస్తుంది. అలాగే, మనం తెలుగులో రాసినటువంటి విషయాన్ని కూడా ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి వాళ్ళు తమ భాషలో అనువదించుకొని అంటే యంత్రం ద్వారా అనువదించుకొని దీనిలో ఉన్న మూలభావాన్ని తెలుసుకోవడం చాలా సులభమైంది.. అందువల్ల ఇతర భాషలో ముఖ్యంగా ఇంగ్లీషులోనే రాయాలని లేకపోతే మనం జ్ఞానం ఇతరులకు తెలియకుండా పోతుందేమోననే ఒక భయం క్రమేపీ పోతుంది.. మనం మనకు తెలిసిన తెలుగు భాషలోనే రాసినా ఇతర భాషలలో దాన్ని గుర్తించగలిగే సాధనాలు అందుబాటులో ఉన్నాయనే నమ్మకం సామాజిక మాధ్యమాలు కలిగించగలిగాయి. ఇవన్నీ పోజిటివ్ గా చూడకుండా విమర్శించేవాళ్లు కూడా ఉన్నారు.సామాజిక మాధ్యమాలలో భాష పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో కూడిన అభిప్రాయాలు కూడా ప్రచారంలో ఉన్నాయి.

‘‘ఉన్నదున్నట్లు ప్రచురించే, ప్రసారం చేసే అవకాశాలు లేని, రాయడానికి, మాట్లాడడానికి వీల్లేని, నిఘంటువులలో చోటు చేసుకోని, అనభ్య, అమానుష, అప్రజాస్వామిక భాష రాజ్యమేలుతున్న స్థితిలో, సామాజిక మాధ్యమాలు అడ్డూ, అదుపూ లేని, నేరుగా, వీడియో, ఆడియో రికార్డింగులు ఉన్నది ఉన్నట్టుగా, వెనువెంటనే సెల్‌ఫోన్ల ద్వారా గమ్యాలకు చేరుస్తున్నాయి. ’’ (సంగనభట్ల కిష్టయ్య, సరిహద్దులు లేని సామాజిక మాధ్యమాలు (వ్యాసం), ఆంధ్రభూమి ఆదివారం, Sunday, 20 October 2019)

సామాజిక మాధ్యమాలలో ఉపయోగించే భాష సరిగ్గా లేదనే వాళ్ళు ఒక విషయాన్ని గుర్తించాలి. మైక్రోసాఫ్ట్, , గూగుల్ వంటి కంపెనీలు కొత్త పదాలను నిఘంటువులో ఎప్పటికప్పుడు ఆ పదాలను పొందుపరచమని అడుగుతూ ఉంటారు.. మనం సామాజిక మాధ్యమాలలో కొత్త భాషాపదాలను రాసేటప్పుడు నిఘంటువులలో వాటిని పొందుపరిస్తే అంటే ఆ పదాలను చేరిస్తే, అది ఆటోమేటిగ్గా అప్ డేట్ చేసుకొనే కంపెనీలు కొన్ని ఉన్నాయి. మరికొన్ని కంపెనీలు మన ప్రైవసీని అలాగే ఉంచి, మనికి అభ్యంతరం లేకపోతే ఆ పదాలను వాళ్ళకు అందించమని, నిష్ణాతుల పరిశీలన అనంతరం ఆ పదాలను, ఆ సరైన అనువాద వాక్యాలను అందరికీ అందుబాటులో తీసుకొస్తామని ప్రకటిస్తున్నాయి. ఈ విధంగా నాకు ప్రత్యక్షంగా తెలిసిన ఆచార్య పులికొండ సుబ్బాచారిగారు తాను ప్రత్యేకించి డిక్షనరీలో చేర్చిన పదాలు ఒక కంపెనీకి అందించారు. సాధారణంగా

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

శాస్త్రసాంకేతికరంగాల్లో ఉన్నవాళ్ళు గ్రాంధిక భాషాపదాలనే మెయిన్ డిజిటల్ డిక్షనరీలో చేరుస్తున్నారు. ఆధునిక వ్యవహారంలో ఉన్న లేదా మాండలిక పదాలని భావించే పదాలను తక్కువ దృష్టితో చూడ్డం వల్లనో, తెలియకనో ఆ పదాలను చేర్చి, అందుబాటులోకి తీసుకొని రావడం లేదు. అందువల్ల రచయితలు తమ సృజనాత్మక సాహిత్యంలో ఇటువంటి భాషాపదజాలాన్ని విస్తృతంగా ప్రయోగించాలి. అప్పుడు ఆ పదజాలం వాడుకలో ఉం దని గమనిస్తారు. అప్పుడు తెలుగు ఆధునిక భాషా పదజాలం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందను కుంటున్నాను. ఉదాహరణకు గూగుల్ తయారుచేసే అనువాదానికి సంబంధించి ఆ అనువాదం సరిగ్గా లేకపోతే గనక దాన్ని మెరుగుపరచమని అడుగుతుంది.అటువంటి భాషాభివృద్ధి కార్యక్రమంలో ఈ భాషా శాస్త్రవేత్తలు స్వచ్ఛందంగా ఆ తప్పులను సరిదిద్ది కొత్త పదాలను, వాక్య నిర్మాణాలను అందించవచ్చు.వాటిని మరలా ఆ రంగంలో నిష్ణాతులైన వారికి చూపించి దాన్నెంతవరకూ స్వీకరించాలో అంతవరకూ స్వీకరిస్తారు. అవసరమైతే ఆ కంపెనీ వాళ్ళు ఇటువంటి సలహాలు, సూచనలు చేసేవారిని సంప్రదిస్తారు. ఆతర్వాత చేసే అనువాదాలకు ఆ పదాలలోని అనువాదం మరింత మెరుగుపరుచు కోవడానికిఉపయోగపడుతుంది..

సామాజిక మాధ్యమాలలో తెలుగు భాష అభివృద్ధి - కొన్ని సూచనలను సామాజిక మాధ్యమాలలో తెలుగు భాష అభివృద్ధి చెందాలంటే కింది సూచనలను పాటిస్తే బాగుంటుంది..

- నిత్య వ్యవహారంలో కలిసిపోయిన అన్య భాషా పదాలను వాడుకుంటూనే వాటికి తెలుగు అనువాదాలను అలవాటు చేయాలి.
- అన్య భాషా పదజాలాన్ని వ్యతిరేకిస్తున్న భావం ప్రాచుర్యంలోకి తీసుకురాకుండా మన భాషా సంపదను పెంచుకోవడం వల్ల వచ్చే ప్రయోజనా లను వివరించగలగాలి.
- కొంతమంది సామాజిక మాధ్యమాల్లో కూడా గ్రాంథిక భాషను ప్రయోగిస్తూ వితండ వాదనలు చేస్తున్నారు.. వాటిని తగ్గించి వ్యావహారిక భాషను ప్రయోగించాలి.
- సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాషా శాస్త్రవేత్తలు కొంచెం దృష్టిని కేంద్రీకరించి తెలుగులోను,, తెలుగు లిపిలో తమ భావాలను రాయాలి.. దీనికి అందుబాటులో ఉన్న అనేకమైన కీబోర్డులను, సాఫ్ట్వేర్లను ఉపయోగించుకోవాలి.
- తెలుగు భాష పేరుతో సంస్కృత భాషా పదజాలాన్ని రుద్దే ప్రయత్నం చేయకూడదు.
- తెలుగు భాషలో రాస్తే, తెలుగు భాషను వినియోగిస్తే వచ్చే ఆర్థిక ప్రయోజనాలు ఏమిటో వివరించ గలగాలి.
- తెలుగు లిపిలో తెలుగు భాషలో రాసుకోవడం వలన మన సంస్కృతీ వైభవాన్ని ఎలా కాపాడు కోవచ్చో సోదాహరణంగా వివరించేలా వ్యాసాలు రాయగలగాలి.
- మనకు కావలసిన పారిభాషిక పదాలు, వాటి వివరణలు, నిర్వచనాలు వంటివి తెలుగులో అన్వేషిస్తే అవి లభ్యమయ్యేలా వెబ్ సైట్లలో పొందుపరచగలగాలి.
- వివిధ వెబ్సైట్లలో తెలుగు సాహిత్యం ప్రచురించే వాటిలో వ్యాఖ్యలను సాధ్యమైనంత వరకు తెలుగులోనే రాస్తూ ఉండాలి.
- అప్పుడప్పుడు కొన్ని పదాలకు తెలుగు అనువాదా లను అన్వేషిస్తూ, ఒకవేళ ఆ అనువాదం సరైనది కాదనిపిస్తే సరైన అనువాదాన్ని సూచించాలి.
- మనకు ఉచితంగా అనేక బ్లాగులు అందుబాటులో ఉన్నాయి.మన రచనలను వాటిలో రాస్తూ లేదా పాత రచనలను వాటిలో పోస్ట్ చేస్తూ ఉండాలి.. అలాగే, సామాజిక మాధ్యమాలు కూడా అందు

బాటులో ఉన్నాయి. వాటిలో సాధ్యమైనంత వరకు తెలుగులోనే మన అభిప్రాయాలను మన రచనలను ప్రచురిస్తూ ఉండాలి.

- మన తెలుగు పదాలు సంక్లిష్టత నుండి సరళత్వం వైపు పయనించేటట్లు ఉండాలి.
- ఈ కామర్స్ వెబ్సైట్లలో కూడా తెలుగులోనే మనం మనకు కావలసిన వాటిని అన్వేషిస్తూ ఉండాలి.. ఫీడ్ బ్యాక్ అడిగేటప్పుడు మన అభిప్రాయాలను తెలుగులోనే రాస్తుండాలి.
- స్మార్ట్ ఫోన్లలో తెలుగు భాష ద్వారా ఉపయోగించడానికి వీలుగా అనేకమైన యాప్స్ వస్తున్నాయి. వాటిని పరీక్షిస్తూ ఉండాలి. వాటిలోని లోటుపాట్లను మనం ఫీడ్బ్యాక్ ద్వారా అందించి, అది మరింత బాగా వినియోగంలోకి రావడానికి మన సూచనలు సలహాలు తెలుగులోనే ఇవ్వగలగాలి.
- ఇంటర్నెట్లో ఉపయోగించే బ్రౌజర్స్ తెలుగులో కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ, ఆ తెలుగుని ఉపయోగిస్తే మనం మనకు కావలసిన వాటిని త్వరగా చేరుకోలేక పోతాం. అందువల్ల ఇంగ్లీషులో మనకు సులభంగా తెలిసేటట్లు ఉండే అంశాలను అవసరమైతే ఇంగ్లీషులోని పదాన్ని తెలుగులో రాస్తూ తెలుగు లిపిలో మనం ఆ బ్రౌజర్స్ ని ఉపయోగించేలా తయారు చేసుకోవాలి. క్రమేపి ఆ పదాన్ని తెలుగులో ఎలా పిలిస్తే బాగుంటుందో ఆ పదాన్ని తెలుగు పదంగా మార్చు కోవాలి.
- ఇప్పుడు ఇంటర్నెట్ బ్రౌజర్ తో పాటు స్మార్ట్ ఫోన్ లో కూడా మనకి కొన్ని ప్లగ్ఇన్స్ ద్వారా పూర్తిగా అన్ని విషయాలు తెలుగులోనే చదువుకునే అవకాశాన్ని కలిగిస్తున్నాయి.. కానీ, ఆ అనువాదాల వలన మనం ప్లగ్ ఆన్స్ ని ఉపయోగించి తెలుగుని ఉపయోగించుకోలేకపోతున్నాం. కనుక ఆ పారిభాషిక పదాల తెలుగు అనువాదం పట్ల సాంకేతిక నిపుణులు, భాష శాస్త్రవేత్తలు కలిసి పని చేయవలసిన అవసరం ఉంది.
- తెలుగు సాహిత్యాన్ని యూనికోడ్లో అందిస్తున్న వెబ్సైట్స్ ద్వారా తెలుగు అభివృద్ధి బాగా జరుగుతుంది.. మనకు కావలసిన పదాలు, పద్యాలు వెతికితే అవి సెర్చ్లో కనిపిస్తాయి. సామాజిక మాధ్యమాలలో రాసే వారికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. నిఘంటువు కూడా తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతుంది.. ఈ రెండు పనులను ఆంధ్రభారతి.కామ్ వారు అందిస్తున్నారు.
- ఈ మధ్యకాలంలో ఛందస్సుని నేర్చుకునే వారికి కూడా తెలుగు ఛందస్సు యాప్ రూపొందించారు.. అలాగే, హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారు వ్యాకరణాంశాల్ని సరిచూసుకోవడానికి సంస్కృత విభాగం వారు ఒక వెబ్సైట్ ని రూపొందించారు.. ఇవన్నీ సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాషాభివృద్ధికి, ఆధునీకరణకు తోడ్పడేవే.

ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లీష్ ఎంత వేగంగా విస్తరిస్తుందో, ప్రాంతీయ భాషలు కూడా అంతే వేగంగా విస్తరించడానికి అనేక అవకాశాలు ఉన్నాయి.. దీనికి సామాజిక మాధ్యమాలు అత్యంత శక్తివంతంగా తన తోడ్పాటును అందిస్తాయి. ప్రపంచంలోని అన్ని విషయాలను తమ భాషలో శక్తివంతంగా చెప్పగలిగే పదాల మన భాషలో ఉంటే ప్రపంచ భాషలు కూడా తెలుగు భాషా పదాలను స్వీకరిస్తాయి.కాబట్టి ప్రతి దానికీ తెలుగులో ఒక పేరు పెట్టి దాన్ని ప్రాచుర్యానికి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ సామాజిక మాధ్యమాల్ని ఉపయోగించుకోగలగాలి. తెలుగు భాషకు గల శక్తిని కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, సినిమాల ద్వారా ప్రాచుర్యంలోకి తేగలగాలి.మన భావాలు శక్తివంతంగా మన సాహిత్యం ద్వారా వ్యక్తీకరించగలిగినప్పుడు ఆ పదజాలం పెరుగుతుంది. ఏదైనా విషయాన్ని వివరించడానికి కథ నవల వంటి ప్రక్రియల్లో వాటిని శక్తివంతంగా

వివరించగలిగే అవకాశం కలుగుతుంది.అందువల్ల సామాజిక మాధ్యమాల్లో రచనలు చేసేవారు కూడా మన తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు గానే భావించవచ్చు.. ఆ విధంగా చూసినప్పుడు ఫేస్బుక్, బ్లాగుల ద్వారా జరుగుతున్న కృషి సామాన్యమైనది కాదు.ఈ మధ్యకాలంలో ప్రారంభమైన ఫోర్డ్ కాస్ట్ కూడా మన తెలుగు భాష అభివృద్ధికి అత్యంత శక్తిని సమ కూరుస్తుంది. భవిష్యత్తు పోడ్ కాస్ట్ ల పైనే ఆధారపడి ఉంటుందని కూడా అనిపిస్తుంది. ఫోర్డ్ కాస్ట్ కూడా సామాజిక మాధ్యమాల్లో ఒక భాగమే..

**ఆధారాలు :**

1. https://manatelugu.blogspot.com/Microsoft Office Telugu LIP and తెలుగు/SUNDAY, AUGUST 07, 2005.
2. Umirov.S.,EXPLORING THE IMPACT OF SOCIAL MEDIA ON LANGUAGE LEARNING: UNCOV ERING THE PROS AND CONS,See discussions, stats, and author profiles for this publication at: https://www.researchgate.net/publication/368755494
3. Lydia Nurjannah, Mita Afrianti, Rafi Na2. 2zly, Yuslia Safitri, Muhammad Taufik Ihsan, A REVIEW OF LITERATURE ON USING SOCIAL MEDIA TO LEARN ENGLISH IN A RELAXED AND CONVENIENT MANNER (Research Article),Indonesian Journal of Research and Educational Review, (Research Article),Volume 1, No. 1, 2021, pp 67-73.
4. Jovelyn M. Cantina, Linguistics in Social Media: An Analysis on the Writing Conventions of Students' Blog Posts ( Research Article),Sprin Journal of Arts, Humanities and Social Sciences, https://sprinpub.com/sjahss, Vol.01(11). November 2022, pp, 15-23
5. కిష్టయ్య,సంగనభట్ల.సరిహద్దులు లేని సామాజిక మాధ్యమాలు (వ్యాసం), *ఆంధ్రభూమి ఆదివారం,*Sunday, 20 October 2019.
6. చెన్నయ్య, జె. పత్రికలు-ప్రసారమాధ్యమాలు : తెలుగు.స్వీయ ప్రచురణ: హైదరాబాద్., 2010.
7. చెన్నయ్య, జె.(సంపా.) తెలుగు పత్రికలు, ప్రసారమాధ్యమాల ప్రభావం, తెలంగాణ సారస్వత పరిషత్ : హైదరాబాద్; 2016.

❖❖❖

# తెలుగు భావకవితా సౌందర్యం

**- ఆచార్య ఎం.రామనాథం నాయుడు,** తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

సంప్రదాయ కవిత్వ వృక్షానికి పూచిన నవ కుసుమమే భావికవిత్వం. నవ్య సాహిత్య చరిత్రలో ఆంగ్లకాల్ప నికోద్యమ మానస పుత్రికయే భావికవిత్వమని కొందరు విమర్శకులు భావించారు. ఇది లిరిక్‌కు సమానార్థకం. భావకవిత్వాన్ని దువ్వూరి రామిరెడ్డిగారు 'గీతకవిత్వమని', దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు 'కాల్పనిక కవిత్వ'మని, రాయప్రోలుగారు 'అభినయ కవిత' అని, నోరి నరసింహ శాస్త్రి గారు 'నవ్యకవిత' అని వ్యవహరించారు. భావంలో పుట్టి పాఠకుల భావంలోకి ప్రాకి ఆ భావాన్ని ఆకట్టుకునే భావప్రధాన కవిత్వమే భావకవిత్వంగా భాసించింది. మూడు దశాబ్దాలపాటు ఆంధ్రదేశాన్ని ఆనంద డోలికల్లో ఊగించిన రసమయకవిత్వం భావకవిత్వం.

ఆధునికయుగంలో వెలసిన నవ్యకవులలో భావ కవులదే అగ్రతాంబూలం. భావకవిత్వాకాశంలో కమనీయ కాంతిని ప్రసరించే నక్షత్రాలుగా పలువురు కనిపిస్తారు. వారిలో పేర్కొనదగ్గవారు రాయప్రోలు, విశ్వనాథ, వేంకట పార్వతీశ్వరులు, కృష్ణశాస్త్రి, దువ్వూరి, బసవరాజు, వేదుల, నాయని, పింగళి, కాటూరి, జాషువా, తుమ్మల, తల్లావజ్ఝల, బాపిరాజు మొదలైనవారు.

భావకవిత్వ లక్షణాలుగల కవిత్వానికి భావకవిత్వమనే పేరు స్థిరపడడానికి కొన్నాళ్ళు పట్టింది. 'భావపదము', 'భావగీతము' అనే పేర్లు రాయప్రోలు సుబ్బారావుగారి రచనల్లో మొట్టమొదట చోటుచేసుకున్నాయి. విశ్వనాథ సత్యనారాయణగారి గిరికుమారుని ప్రేమగీతములలో, కృష్ణశాస్త్రి గారి ఊర్వశిలో భావగీతము అనే పదం ప్రయోగింపబడింది. తరువాత చాలామంది భావగీతమనే శబ్దాన్ని ప్రయోగించారు. భావకవిత్వమనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఖాయం చేశారు.

## నిర్వచనం :

కవులు, విమర్శకులు పలువురు భావకవిత్వాన్ని తమ తమ ఆలోచనకు, అభిరుచికి తగ్గట్టు నిర్వచించారు. "కవియొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్ని గూఢతాపము, ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావకవిత్వమని" విశ్వనాథ సత్యనారాయణగారు నిర్వచించారు. ఒక వ్యక్తి తన హృదయగత భావావేశాన్ని ఖండకావ్యంలో వ్యక్తీకరించడమే భావకవిత్వమని విశ్వనాథవారి అభిప్రాయం.

"హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్ల కల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలలో ఏ సమ్ముహూర్తాననో కావ్యగీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణ రచనాధోరణిలో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించి రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించ గలుగుతుంది. ఉత్కృష్ట భావగీతానికి నా నిర్వచనం ఇది" అని శ్రీశ్రీ పేర్కొన్నారు.

కవికొండల వెంకటరావుగారు "భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వమని" నిర్వచించారు.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు "భావప్రధాన కవిత్వమే భావకవిత్వమ"న్నారు.

"ఏదో ఒక భావాన్ని ఆధారం చేసుకొని అల్పా వకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చే యత్నమ"ని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి అభిప్రాయం.

"వస్తు భావ రచనలలో భావమునకు ప్రాధాన్య మిచ్చిన కవిత్వమని" ఆచార్య సి.నారాయణ రెడ్డిగారు భావకవిత్వాన్ని నిర్వచించారు.

**లక్షణాలు :**

విమర్శకుల నిర్వచనాలనుబట్టి భావకవిత్వ స్వరూప స్వభావాలను బట్టి భావకవిత్వ లక్షణాలను స్థూలంగా ఈ విధంగా చెప్పుకోవచ్చు.

1. భావకవిత్వం పద్యంలోగాని వచనంలోగాని గేయంలోగాని ఉండవచ్చు.
2. వస్తువుకన్న అభివ్యక్తికన్న భావానికే ప్రాధాన్యముండే కవిత్వం భావకవిత్వం.
3. ఇది ప్రధానంగా ఆత్మాశ్రయంగా ఉంటుంది.
4. హృదయంలో నాటుకొనేవిధంగా భావతీవ్రత దీనిలో ఉంటుంది.
5. మొదట భావానికి తరువాత రచనకు దానితర్వాత వస్తువుకు ప్రాధాన్యత ఉంటుంది.
6. ఇది వైవిధ్యభరితంగా ఉంటుంది.
7. భావకవిత్వంలో ప్రకృతి, ప్రణయం, ప్రబోధమే ప్రాధాన్యం వహిస్తాయి.

**భావకవిత్వ శాఖలు :**

భావకవిత్వ స్వరూపాన్ని, స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని డాక్టర్ సి.నారాయణ రెడ్డిగారు భావకవిత్వాన్ని ఆరుశాఖలుగా వర్గీకరించారు. అవి ప్రణయకవిత్వం, దేశభక్తి కవిత్వం, ప్రకృతి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, భక్తికవిత్వం, స్మృతి కవిత్వం.

**1. ప్రణయ కవిత్వం :**

భావకవుల్లో ఎక్కువమంది పాఠశాలల్లోను, కళాశాలల్లోను ఆంగ్లవిద్యనభ్యసించారు. వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్ మొదలైన మేటి ఆంగ్లకవుల ప్రభావం వారిమీద పడింది. ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలోని స్వచ్ఛంద ప్రణయం వారినాకర్షించింది. ప్రేమించడమనేది ఎంతో ఉదాత్త కృత్యమని వారికనిపించింది. పైగా మేఘసందేశం వంటి మన ప్రాచీనకావ్యాల వియోగ శృంగార మాధుర్యం వారిని బాగా ఆకట్టుకొంది. వయసులో ఉన్న స్త్రీలను కలుసుకోవడం, మాట్లాడడం వారిని ఆకర్షణకు గురిచేశాయి. మనసులో ప్రేమబీజాలు వేశాయి. ప్రేమారాధనే పవిత్రకృత్యమనే భావన వారిలో బలపడింది. వారి యౌవనం కూడా ప్రణయకవిత్వ రచనకు పురికొల్పింది.

ప్రాచీన కవులు ప్రణయం అనేపదాన్ని స్నేహం అనే అర్థంలోనే ఎక్కువగా ఉపయోగించారు. కొందరు స్త్రీ, పురుష శృంగారపరంగా కూడా ప్రణయశబ్దాన్ని వాడి ఉన్నారు. భావకవులు మాత్రం స్త్రీ పురుషుల శృంగారాన్నే ప్రణయంగా పేర్కొన్నారు. అమలిన శృంగారాన్నే వారు ఆదరించారు. సంభోగ వియోగ శృంగారాల్లో వియోగ శృంగారానికే పెద్దపీట వేశారు. భావకవులు ఆవిష్కరించిన సంయోగ శృంగారంలో కూడ అసభ్య వర్ణనలకు చోటివ్వ లేదు. వీరు స్త్రీకి పూజ్యస్థానాన్నిచ్చి గౌరవించారు. వీరు ప్రేయసీప్రియులకు, పార్వతీ పరమేశ్వరత్వాన్ని ఆపాదించారు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరి సంయోగ శృంగారం సభ్యతాపరిధిని దాటలేదు. స్త్రీని ఆటవస్తువుగా గాక సహచరిగా, ప్రేయసిగా, ఇల్లాలుగా భావించారు. కాబట్టే స్త్రీ, పురుషులమధ్య ఏర్పడే శృంగారభావాన్ని ప్రణయంగా పరిగణించారు. కవిత్వీకరించారు.

విప్రలంబ దశలోనే ప్రణయమాధుర్యమధికంగా ఉన్నట్టు గుర్తించి భావకవులు దాన్ని ఆకాశానికెత్తారు. వియోగంలోని వింత మాధుర్యాన్ని ఉత్కృష్టమైందిగా వీరు గ్రహించారు. ఒక వస్తువును పొందేముందు తపన అధికంగా ఉంటుంది. ఆ తపనలో మాధుర్యముంటుంది. వస్తువును పొందిన తరువాత ఆ మాధుర్యం ఉండదు. మనసు తేలిక పడుతుంది. ఈ విషయాన్ని గుర్తించో ఏమో భావకవులు ప్రణయానికెంతో ప్రాధాన్యమిచ్చారు.

ప్రణయకవిత్వంలో రెండు పాయలు కనిపిస్తాయి. 1. ఆత్మాశ్రయరీతి 2. వస్త్వాశ్రయ రీతి. ఈ రెంటిలో ఆత్మాశ్రయరీతే బలీయం. భావకవిత్వంలో వస్త్వాశ్రయ రీతికి కూడా సముచిత స్థానం ఉంది. రాయప్రోలు వారి తృణకంకణం, అబ్బూరివారి మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డిగారి కడపటి వీడ్కోలు, వేంకట పార్వతీశ్వరుల జలజమాలిక వస్త్వాశ్రయానికి ఉదాహరణంగా చెప్పుకోదగ్గ కృతులే.

భావకవులు ప్రేమించడం ప్రకృతి సహజమన్నారు. ప్రేమకు హేతువులుండవని వారి అభిప్రాయం. ప్రకృతి

సహజంగానే ప్రేమ ఏర్పడుతుందని దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలియజేశాడు.

సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?

బసవరాజు అప్పారావు తన ప్రేమ వైఫల్యాన్ని, ఆశాభంగాన్ని దేవుడితో మొరపెట్టుకున్నాడు.

"పానకమ్ములో
పుడక నేటికిటు
పడవేసితివో దేవా!
ముద్దు గులాబిని
ముట్టబోవగా
ముల్లు విరిగెనో దేవా!
తీయని పూవుల
దేనెలాన బోవ
తేటి గుట్టెనోదేవా!
గగనమున పతం
గముపై బోవగ
తెగియెనో దారము దేవా!"

భావకవుల్లో ఆశ ఎంత అధికంగా ఉండేదో నైరాశ్యం కూడా అంతే అధికంగా వారిని చుట్టి ముట్టింది. వారిలో గూడు కట్టుకుపోయిన నైరాశ్యం భక్తికి బాటవేసింది. ఎన్నో భక్తి కవితలను కుసుమింపజేసింది.

**2. దేశభక్తి కవిత్వం :**

భావకవులలో దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావు దేశభక్తి కవిత్వాన్ని వెలార్చారు. ప్రణయకవిత్వం తరువాత భావకవిత్వ క్షేత్రంలో దీనిదే పైచేయి అని సినారె అనడం దేశభక్తి కవిత్వ ప్రాధాన్యతను వెల్లడి చేస్తుంది.

భావకవుల భావాల్లో దేశభక్తి వికసించి పరమళించింది. గురజాడ వారి దేశభక్తి గేయం ఆంధ్రులందరికీ సుపరిచితమే; ఆదరణీయమే. దేశాన్ని ప్రేమించమని, మంచిని మాత్రమే పెంచుమని ఆయన ఉద్బోధించాడు. దేశమంటే మట్టి కాదని మనుషులతో కూడిందే దేశమని ఆయన ఎలుగెత్తి చాటాడు. 'దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా, ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టిమేల్ తలపెట్టవోయ్', స్వంతలాభం కొంత మానుకు, పొరుగువారికి తోడుపడవోయ్, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్'. గురజాడ దేశభక్తి, విశ్వభక్తి వినుతికెక్కాయి. దానికి ఆయన రచించిన ఈ పంక్తులే తార్కాణం.

"ఎల్ల లోకములొక్కయిల్లై
వర్ణభేదములెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమ బంధము
వేడుకల కురియగా..."

రాయప్రోలువారి దేశభక్తి అపారం. వారి ప్రబోధగీతం ప్రతి ఆంధ్ర హృదయంలోను మార్మోగుతూనే ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా, ఎంత ఉన్నత స్థితికి చేరుకున్నా మాతృదేశాన్ని మరువకూడదని రాయప్రోలు వారి ఆదేశం.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

భారతదేశానికి సాటి ఎక్కడా లేదని రాయప్రోలు వారన్నారు. భరత పుత్రుడనని సగౌరవంగా పలుకమని రాయప్రోలువారు భారతీయుల వెన్నుతట్టారు.

"లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి ధీరులింకెందు
అవమాన మేలరా అనుమానమేల
భరత పుత్రుడనంచు భక్తితో బలుక"

స్వాతంత్ర్య రథాన్ని అంబరవీథిలో సంబరంగా దర్శించిన హృదయ దేశభక్తుడు దువ్వూరి రామిరెడ్డి.

"అంబుదంబుల అమృతపూరంబులొలుకగా
ఇంద్రచాపంపు తోరణ మింపు గులుకగా"

వినువీథిలో వెడలు స్వాతంత్ర్య రథమును దర్శించి అద్భుతావృతులైనారు ఈ కవి. రామిరెడ్డి గారు నైవేద్యము, మాతృమందిరము వంటి ఖండికలే గాక 'మేలుకో భారత కుమారా మేలుకోరా తరుణ ధీరా' అని ప్రారంభమయ్యే గేయాన్ని కూడా విరచించి దేశభక్తిని ప్రబోధించారు. వీరేగాక పలువురు కవులు భరతమాత వైభవాన్ని ప్రస్తుతించారు.

బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరంలో ఉపన్యసించాడు. అతని ఉపన్యాసంతో బాగా ప్రభావితులైన చిలకమర్తి లక్ష్మీనరసింహారావు ఒక పద్యాన్ని విరచించి వినిపించారు. అది ఉత్సాహంతో సభను ఉర్రూతలూగించింది. ఆ పద్యమిది -

"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియగట్టి"

ఆనాటి జాతీయోద్యమంలో ఆంధ్రులు కూడా తమవంతు పాత్రను చక్కగా నిర్వహించారు. ఎన్నో త్యాగాలకు సిద్ధమయ్యారు. చెరసాలలకు వెళ్ళారు. దుర్భర జైలు జీవితాన్ని అనుభవించారు. ఈ అంశం చిలకమర్తి వారిచేత హృద్యమైన పద్యాన్ని ఆవిష్కరింపజేసింది.

"చెరసాలల్ పృథు చంద్రశాలలెయగున్
చేదోయి గీలించు నయ్యురదండల్ విరి దండలయ్యెడున్
హేయంబైన చోడంబలే పరమాన్నంబగు
మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్పు నవ్వానికిన్
భరతఖండంబె యొక పెద్ద బందెఖాన
అందులోనున్న ఖయిదీలు పొందు జనులు
ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని
బెట్టుటే గాక చెరయంచు వేరగలదె"

**3. ప్రకృతి కవిత్వం :**

భావకవులు భగవంతునితోబాటు ప్రత్యక్షంగా కనిపించే ప్రకృతిని కూడా ఆరాధించారు. ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులయ్యారు. పరవశించారు. భావముప్పొంగగా పద్యాలు గీతాలు హృద్యంగా విరచించారు.

గురజాడ అప్పారావుగారు తమ నీలగిరి పాటలలో నీలగిరి సౌందర్యాన్ని చిత్రించేందుకు ప్రయత్నించారు. గురజాడవారి కంటికి నీలగిరి 'బృందారక ముని బృందసేవిత నందనవనం'గా గోచరించింది. అక్కడ అన్నిచోట్లా కనిపించే పచ్చని బయళ్ళు, రొదచేసే పిట్టలు, సువాసనలు గుబాళించే చెట్లు, కాసారాల గట్లు, కొండలు, తోటలు, అచ్చంగా తోచే మబ్బులు ఆయన్ను బాగా ఆకట్టుకొన్నాయి.

పూర్ణమ్మ కథను ప్రారంభిస్తూ కొండల నడుమను కోనొకటున్నది, కోనకి నడుమా కొలనొకటుంది, కొలని గట్టునా కోవెల లోపల వెలసెను బంగరు దుర్గమ్మ' అని ఒక భావచిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కథలోనే గురజాడ వారు చేసిన సాయంకాలం వర్ణన కూడా చక్కగా హృదయాన్ని ఆకట్టుకొంటుంది. 'ఆవులు, పెయ్యలు మందల చేరినాయి, పిట్టలు చెట్లను గుమిగూడినాయి. మింటను చుక్కలు మెరుస్తున్నాయి. కొండల్లో చీకటి నిండింది. మేతకు మెకములు మెసలుతున్నాయి. దుర్గకు మెడలో హారములు అమరినాయి'.

రాయప్రోలు సుబ్బారావుగారిని గ్రామ సౌందర్యం బాగా ఆకర్షించింది. గ్రామాల్లో ఆయనను ఆకట్టుకొన్న అంశాలు అనేకం. వాటిలో కొన్ని కొత్తగా పెండ్లయిన లేత జవ్వనులు, ఈ మధ్యనే ఈడేరిన కన్నియలు, గడుసు పోకడల నెఱజాణలు, తల్లిపాలు తాగకుండా బంధాలు పడ్డ వత్సాలు, చెర్లాటలాడే లేగలు, బువ్వనెత్తిన పెట్టుకొని రవిక తొడుగని గొల్ల కుఱ్ఱది, పిఱుదులసియాడ జీర రాపిళ్ళు పెరయ, ఒడిసెలతో పొలాన్ని కాచే కాపు కూతురు, అలల రాయంచ ఒయ్యారాలు, నదిలో నడిచే నావ. ఈ విధంగానే నాయని సుబ్బారావు, బసవరాజు

అప్పారావు మొదలైన భావకవుల రచనల్లో సముచితంగా, సందర్భోచితంగా ప్రకృతి రచనలు గోచరిస్తాయి.

**4. సంఘసంస్కరణ కవిత్వం :**

భావకవుల సంఘసంస్కరణ కవిత్వం మీద మానవోద్యమ ప్రభావం, గాంధేయ ప్రభావం ఉన్నాయి.

వంగదేశంలో రాజారామ్మోహన్‌రాయ్ మానవోద్య మానికి శ్రీకారం చుట్టారు. ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం పంతులు దాన్ని కొనసాగించారు. బాల్య వివాహాల ఖండనం, కన్యాశుల్క నిరసనం, వర్ణవ్యవస్థా నిరసనం, సంఘ వ్యవస్థానిరసనం క్రమంగా వచ్చాయి. మానవోద్యమం తరువాతి తరంలో గాంధేయోద్యమంగా రూపుదిద్దుకొంది. మానవోద్యమాన్ని గాంధేయోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని భావకవులు తమ సంఘసంస్కార కవిత్వాన్ని వెలయించారు. కొందరు భావకవులు వితంతువుల దైన్యాన్ని ఆవిష్కరించారు. మరికొందరు కన్యాశుల్క దౌష్ట్యాన్ని ఖండిస్తూ రాశారు. కొందరు వర్ణవ్యత్యాస మూఢవిశ్వాసాలను దుయ్యబట్టారు. కొందరు అస్పృశ్యతను నిరసించారు. ఇంకొందరు విశ్వప్రేమకు పెద్దపీట వేశారు.

ఆనాడు బాల్యవివాహాల సమస్య ఎంతో ఇబ్బంది కరంగా పరిణమించింది. కన్యాశుల్కాలకు ఆశపడి కన్యల తల్లిదండ్రులు వృద్ధులకు కూడా ముక్కుపచ్చలారని తమ ముద్దుబిడ్డలను కట్టబెట్టేవారు. ఈ దౌష్ట్యాన్ని నిరసిస్తూ మంగిపూడి వెంకటశర్మ 'బాలవితంతు విలాప'మనే కావ్యాన్ని రచించారు. ఆనాటి తల్లిదండ్రుల వైఖరికి అద్దంపడుతూ శర్మగారు రచించిన పద్యం గమనార్హం.

పొత్తిళ్ళలోనున్న నెత్తురు కందుల
పెండ్లిండ్లు సేయ భావించునొకడు
పురుడు వోవకమున్నె బొట్టెల నమ్మంగ
బేరసారములు గావించునొకడు
కన్నులు తెరవని కసుగాయలను గట్టి
పెట్టి వృద్ధులను సేవించునొకడు
పాలైన విడువని పసికూనలను గూర్ప
వెనరాయబారి రావించు నొకడు

కన్యాశుల్కాన్ని నిరసిస్తూ గురజాడ అప్పారావు 'పూర్ణమ్మ' అనే ఖండికను, రాయప్రోలు సుబ్బారావు 'స్నేహలత' అనే ఖండకావ్యాన్ని రచించారు. ఆనాడు స్త్రీలకు పురుషులతో సరిసమానంగా స్వేచ్ఛ ఇవ్వబడేది కాదు. ఆడపిల్లలను చదివించేవారు కాదు. వారిని వంట ఇంటికి పరిమితం చేసేవారు. ఈ స్థితిని నిరసిస్తూ వెంకటశర్మగారు స్త్రీలను కూడా పురుషులతో సమానంగా చూడమని ప్రబోధించారు.

"బాలుర కెట్టులో బాలల కట్టులే
యున్నత విద్యల నొసగుడయ్య
యువకులకెట్టులో యువతుల కట్టులే
స్వేచ్ఛా ప్రదానంబు సేయరయ్య'

ఏకేశ్వరోపాసన, విగ్రహారాధన నిరసన భావకవులను బాగా ప్రభావితం చేశాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి తన గేయంలో విగ్రహారాధనను పరోక్షంగా నిరసించిన తీరు గమనార్హం.

"శిథిలాలయమ్ములో శివుడు లేడోయి
ప్రాంగణమ్మున గంట పలుకలేదోయి
దివ్య శంఖము గొంతు తెరువలేదోయి
పూజారి గుడినుండి పోవలేడోయి
చిత్ర చిత్రపు పూలు చైత్రమాసపు పూలు
ఊరూర ఇంటింట ఊరకే పూచాయి
శిథిలాలయమ్ము శిలకెదురుగా కునుకు
పూజారి కొకటేని పూవులేదోయి"

వర్ణవ్యవస్థను అస్పృశ్యతను భావకవులు నిరసించారు. వర్ణవ్యవస్థ బంధాలను తెగద్రుంచవలసిందిగా భావకవి విజ్ఞప్తి చేశాడు. జగదీశ్వరాలయంలో చీకటి గదులుండ వన్నాడు.

"గుణములేనివానిదేకులమైతేనేమి
తృణమైతేనేమి శ్రీ చరణమంటునేని

ఏ కౌటిల్యము వీని నేర్పరిచిందో కాని
చీకటి గదులున్నే జగదీశ్వరాలయములోనే"

జాషువా తన గబ్బిలంలో వర్ణవ్యవస్థను, అస్పృశ్యతను నిరసించడమే గాక వర్ణబాహ్యుని ఆవేదనను, ఆక్రందనను హరునికి వినిపించుమని గబ్బిలాన్ని కోరాడు.

**5. భక్తికవిత్వం :**

భావకవులు పాపాలకు భయపడ్డారు. ప్రణయంలో కలిగిన తాపాలను పక్కనబెట్టి భగవంతుని పాదాలను ఆశ్రయించారు. భగవంతుణ్ణి ఆరాధిస్తే పాపాలు పటాపంచలౌతాయని విశ్వసించారు. కన్నీటితో భగవంతుణ్ణి ఆరాధించుమని కృష్ణశాస్త్రి భావజగత్తు నుద్బోధించాడు.

"కురియుమురా కన్నీటిని
మరి మరి విలపింపుమురా
సరసము గూర్చి పరమేశుడు
తాల్చునురా పాపీ!"

భగవంతుని పాదాలకు శోకిన కన్నీళ్ళు పవిత్రమౌతాయని భావకవులు భావించారు. తమకా అవకాశం ఇమ్మని ఆర్ద్రహృదయంతో దేవులపల్లి వారు దేవుడికి విజ్ఞప్తి చేశారు.

కలుష దుర్దాంత పంక సంకలిత కుహర
ముల జనించు మదీయాశ్రు మలినధార
స్వామి, భవదీయ పాద దేశమున పారి
పరమ పావన జాహ్నవీ ప్రతిభగాంచు
తావకీన పదనరోజ దళములందు
నిలువనిమ్మొక్కటేని కన్నీటి చుక్క
కడలి ప్రసరించు నెత్తావి కమ్మదనము
త్రావినిమ్మో ప్రభూ దాని తనివిదీర -

భావకవులు భగవంతుడికి ఆత్మసమర్పణ చేసికొన్నారు. తమ జీవన కుసుమాన్ని స్వీకరించమని ప్రాధేయపడ్డారు. ఈ భావంతోనే వేదుల సత్యనారాయణగారు ఒక పద్యాన్ని, ఒక గీతాన్ని రచించారు. అవి రెండూ కూడా పాఠకుల దృష్టిని బాగా ఆకర్షించాయి.

"నాదు జీవిత కార్యమే నాడు నీకు
నంకితము జేసికొంటి నాయంత నేను
నాటి ప్రేమాక్షరములు కన్నీట గడిగి
చెరిపి వేయ నాతరమౌనె జీవితేశ"

"కోసి కొనుము యీ కోమల కుసుమము
కోరి విరిసె నీ కోసమే స్వామీ
తేనెల సోనలు తీరిక మునుపే
తీయని వలపులు మూయక మునుపే
కోసికొనుము యీ కోమల కుసుమము
కోరి విరిసె నీ కోసమే స్వామీ"

భావకవుల భక్తిని అనురక్తి కూడా స్పృశించింది. మధురభక్తి పరిమళించింది. శృంగార రసాధి దేవత అయిన శ్రీకృష్ణుడు వారి మధురోహలకు విందుగా లభించాడు. గోపికల గుండెలను ఆకట్టుకునేందుకు కృష్ణుడెలాంటి పాటలు పాడాడో తెలుసుకోవాలని వారికనిపించింది. మరుక్షణమే బసవరాజు అప్పారావు గారి గుండె నుంచి ఒక ప్రశ్నాస్త్రం సూటిగా కృష్ణుడికేసి బయలుదేరింది.

"ఏమని పాడితివో గోపాల
గోపాల కృష్ణా
ఏమని పాడితివో?
భామలు పదియారువేలు
పరవశులై సొక్కి సోల" ॥ఏమని॥

బృందావనమా
నందమయముగా ॥ఏమని॥

యమునా నదిలో
నమృతము పొంగగ ॥ఏమని॥

వెన్నెల
వెల్లి విరయగ ॥ఏమని॥

లోకములన్నియు
లోలాడంగా
నేమని పాడితివో
గోపాల కృష్ణా
ఏమని పాడితివో?" ॥ఏమని॥

శృంగార రాయని బంగారు తలపు పాటగా పల్లవించి శ్రోతల హృదయవీణల్ని మీటింది. బసవరాజు గారే శ్రీకృష్ణుని శృంగారతత్త్వాన్ని చల్లగా మెల్లగా ఎద నిమిరేలా రచించారు.

"నల్లవాడే
గొల్ల పిల్లవాడే
చెలియ
కల్లగాదె వాని
వల్లో జిక్కితినే"

**6. స్మృతి కవిత్వం :**

భావకవిత్వంలో స్మృతి కవిత్వం కూడా పేర్కోదగ్గ శాఖే. భావకవులు ప్రణయానికీ, భక్తికీ ఇచ్చిన స్థానాన్నే స్మృతికి కూడా ఇచ్చారు. హృదయాన్ని ఆకర్షించిన మదిరాక్షికే గాక హృదయాన్ని ఆకట్టుకొన్న భగవంతుడికేగాక తమ హృదయాన్ని ప్రభావితం చేసిన బంధుమిత్రులకు కూడా తమ మనసులో స్థానం కల్పించారు. వారి వియోగాన్ని సహించలేక కవితలల్లారు. ఆ కవితలలో వారి స్మృతికి నివాళులర్పించారు. ఈ స్మృతి కవిత్వాన్ని సతీస్మృతి అని, సుతాధిక స్మృతి అనీ, మిత్రస్మృతి అని, సోదర స్మృతి అని, సోదరీ స్మృతి అని, దేశనాయక స్మృతి అని అనేక రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

ఎన్ని ఉన్నప్పటికీ భార్యావియోగం తనను ఏమీలేని వాణ్ణిగా మిగిల్చివేసిందని దువ్వూరి రామిరెడ్డిగారు తమ భార్యాస్మృతి నావిష్కరిస్తూ వాపోయారు.

"ఉప్పులోపింప మిగతవి యుండి కూడ
జవియు సారంబు కొఱవడు సాదకమున
మనసు గలిసిన యిల్లాలు మణిగిపోవ
నన్ని యుండియు లేనట్టులయ్యె నాకు"

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల ఆధునికయుగంలోనే స్మృతి కవిత్వమా విర్భవించిందని చెప్పుకోవచ్చు. 19వ శతాబ్దం చివర వావిలాల వాసుదేవశాస్త్రి గారు పిత్రారాధనము, రుక్మిణీస్మరణము అనే కావ్యాలు రాశారు. ఇవి రెండూ స్మృతి కావ్యాలే. అప్పటి నుంచీ స్మృతి కావ్యాలు చెదురు మదురుగా వచ్చాయి.

భావకవులలో ప్రఖ్యాతి వహించిన రాయప్రోలు సుబ్బారావుగారు గోపాలకృష్ణ గోఖలే మరణానికి తట్టుకోలేక ఆయన పేరుమీదుగా ఒక స్మృతి కావ్యాన్ని రచించారు. భావకవిత్వోద్యమంలో వచ్చిన తొలి స్మృతి కావ్యమిదే కావచ్చు. తర్వాత బసవరాజు అప్పారావు, విశ్వనాథ, నాయని సుబ్బారావు మొదలైనవారు ఎన్నో స్మృతి కావ్యాలను, గీతికలను వెలయించారు.

గురజాడ అప్పారావు గారి నిర్యాణానంతరం దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రాసిన గేయం చక్కని స్మృతి కావ్యమే. అప్పారావుగారి గీత శీకరములు.

"యుగయుగంబుల నుండి మ్రోగెడు
విశ్వగాన వియత్తరంగిణి
భంగముల నుప్పొంగున"ని కవి ఊహించాడు.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి మృతికి బసవరాజు అప్పారావు గారు

"ఏల పాడేనింక యమునా కల్యాణినే
లీలా మానవుడు గోపాలుడు లేడాయె" అని దుఃఖా
విలురయ్యారు.

కాశీనాథునివారు శివైక్యం చెందగానే ఆంధ్రకవులెందరో స్మృతి గీతలు రచించారు. వానిలో తుమ్మలవారు రాసిన 'విశ్వదాత' పేర్కొనదగిన స్మృతిగీతం. దీనిలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు 'మాతృదాస్య పాశచేద కౌశల్యమును గన్న కర్మయోగి'గా బలికర్ణమాంధాతల విస్మృతికిందెచ్చు విశ్వదాత'గా 'చదువులమ్మకు సేవ సలుపు బంటుగా' కీర్తింపబడ్డారు.

గాంధీజీ నిర్యాణానంతరం వెలువడిన ఖండకావ్యాల్లో జాషువా గారి 'బాపూజీ' కావ్యం ఎన్నదగింది. 'మగ్గిన పండు', 'క్షమాప్రవాసి' యైన మహాత్ముడు తుపాకి గుండ్లకు బలియైపోయిన విషయాన్ని తలచుకొని కవి

'ఇదియే పోవడమా! జగజ్జనక! రానే రావుగా' అని ఆక్రోశించారు. 'భారతజ్యోతి గప్పున నారిపోయిన'దని 'జగమొక్కుమ్మడి ఠొమ్ము గ్రుద్దుకొని మూర్ఛన్ దేలి తబ్బిబ్బు చెందినద'ని, 'ఖదరు రాటాల ఝుంకార రవళి'తో పాటు 'గండు పేదల నోటి కబళరాసి' కూడ ఆగిపోయి నట్లేయని కరుణ రసాత్మకంగా చిత్రించారు జాషువా.

భావకవిత్వం బావామరదళ్ళ కవిత్వమని కొందరు ఎద్దేవా చేశారు. అది ఊహాజగత్తులోనే విహరించిందని వాస్తవ స్పర్శ దానికి లేదని మరికొందరు విమర్శించారు. ఏది ఏమైనా భావకవిత్వం భావుకుల మనఃఫలకాల మీద చెరగని ముద్ర వేసింది. కొన్నాళ్ళకు తన అస్తిత్వాన్ని కోల్పోయి భావకవిత్వం మరుగున పడింది. అయినప్పటికీ ఇతర కవిత్వోద్యమాలకు పరోక్ష ప్రేరణగా భావకవిత్వం కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు - డా॥ సి.నారాయణరెడ్డి.
2. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి.నాగయ్య.
3. తెలుగులో ఆధునిక కవితారీతులు - ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి.
4. ఆధునికాంధ్ర కవిత్వం ఆవిర్భావ వికాసాలు - వచార్య ఎస్వీడి చంద్రశేఖర్.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 01, January 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# దళిత-బహుజన సాహితీ కెరటం : శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావు

- డా॥. బొసాని సీతారాములు, తెలుగు సహాయ ఆచార్యులు, ప్రిన్సిపాల్ (ఎఫ్.ఏ.సి.), ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సిద్దిపేట.


## సంక్షిప్త పరిచయం :

'బహుజన సుఖాయ - బహుజన హితాయ' అని క్రీస్తు పూర్వమే సబ్బండ వర్గాల ప్రజల సుఖాన్ని, హితాన్ని కోరుకోవటమే పాలకుల లక్ష్యంగా ఉండాలని, ఆ మార్గంలో ప్రయాణించటమే లోకహితమని బోధించారు మహాముని గౌతమ బుద్ధుడు. భారతదేశంలోని నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ద్వారా రూపుదిద్దుకున్న కుల అంతరాలను రూపుమాపుతూ, అందరూ సమానమే అందరికీ సమానహక్కులు, స్వేచ్ఛ ఉండాలని, వాటిని సాధించే ప్రక్రియను ఆనాడే గౌతమ బుద్ధుడు ప్రతిపాదించాడు. ఆ మహాత్ముని మార్గంలో దేశంలో అనేకమంది మేధావులు, కవులు, రచయితలు, ఉద్యమ కారులు బహుజనుల హితం కోసం, సమసమాజం కోసం పరితపిస్తూ అనేక పరిణామాలను తీసుకువచ్చారు. బహుజన ఉద్యమం, బహుజన సాహిత్య విస్తరణలో దక్షిణ భారతదేశానికి ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణ ప్రాంతంలో భాగ్యారెడ్డి వర్మ, ఆంధ్ర ప్రాంతంలో కుసుమ ధర్మన్న, జాషువా వంటి కవులు, ఉద్యమకారుల చేతిలో దళిత, బహుజన ఉద్యమం వేళ్ళూనుకుంది.

కుల నిర్మూలన, ఆత్మగౌరవం, రాజ్యాధికారం ముఖ్యమైన లక్ష్యాలుగా రూపుదిద్దుకున్నదే దళిత - బహుజన సిద్ధాంతం ఈ సిద్ధాంతీకరణకు ప్రధాన భూమిక డా॥బి.ఆర్.అంబేద్కర్ కుల నిర్మూలన, గతి తార్కిక భౌతికవాదం ఆత్మగౌరవ పోరాటాలని చెప్పవచ్చు. అభ్యుదయ, విప్లవ వాదాలకు మార్క్సిజం ఎలాగో దళిత-బహుజన వాదానికి అంబేద్కరిజం అలాంటిది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువల ఆధారంగా దళిత-బహుజన రాజ్యాధికార సాధనే బహుజనవాద లక్ష్యంగా చెప్పవచ్చు.

తెలుగునాట దళిత-బహుజన వాదాన్ని బలపరుస్తూ పీడిత, నిమ్నకులాల వారిని చైతన్యపరుస్తూ ఉద్య మించినవారు తమ సాహిత్యం ద్వారా అగ్రవర్ణాల దోపిడీని ఎండగడుతూ దళిత-బహుజనులను చైతన్య పరుస్తున్న మహర్షులు ఎందరో ఉన్నారు. వారిలో ఒక దళిత - బహుజన సాహితీ కెరటం - శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావు.


**ముఖ్యాంశాలు :** కుల నిర్మూలన, దళిత -బహుజన వాదం, దళిత సాహిత్యం, అణగారిన వర్గం, శ్రమ దోపిడీ, జానపదం, కుల విజ్ఞానం

## శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావు :

పూటగడవని నిరుపేద రజక కుటుంబంలో 1932లో గుంటూరు జిల్లా 'నిడుబ్రోలు' (పొన్నూరు)లో జన్మించారు. తల్లిదండ్రులు శ్రీమతి ఆదెమ్మ, శ్రీ కోటయ్యలు. కుటుంబంలోని తొమ్మిదిమంది సంతానంలో మస్తాన్‌రావు గారే పెద్దవారు. కుటుంబ పోషణకు వారి తల్లిదండ్రులకు రెక్కల కష్టమే ఆధారం. మస్తాన్‌రావు గారు చిన్ననాటి నుండే కుటుంబ పోషణకు, తనకంటే చిన్నవారియొక్క ఆలనాపాలనకై శ్రమించక తప్పలేదు. ఇంటి బాధ్యతలు నెరవేరుస్తూనే చదువు కొనసాగించే క్రమంలో కొంత వెనుకబడి తన తమ్ముడితో కలిసి 7వ తరగతి నుండి ఇంటర్మీడియెట్ వరకు కొనసాగించారు.

బాల్యం నుండి వివిధ సంఘాల్లో, ఉద్యమాలలో మస్తాన్‌రావుగారు చురుకుగా పాల్గొనేవారు. దాని కారణంగా ఇంటర్మీడియెట్ పూర్తిచేయటానికి ఆయనకు 5 సం॥రాలు పట్టింది. తర్వాత ఇంజనీరింగ్ పూర్తిచేశారు. ఈ క్రమంలో అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. విద్యార్థి దశనుండే అనేక ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. రజకజాతి అభ్యున్నతికోసం ఉద్యమించారు.

ఈ నేపథ్యంలో దళిత సంఘాలతో కలిసి పనిచేయటం జరిగింది. మస్తాన్‌రావుగారు ముఖ్యంగా రజక చైతన్య ఉద్యమం, హేతువాద ఉద్యమం, దళిత ఉద్యమం, బలహీనవర్గాల చైతన్య పోరాటాలకై బహుజన ఉద్య మాలలో కీలకంగా పనిచేశారు. దళిత రచయితల సంఘంలో శ్రీ కత్తి పద్మారావుతో కలిసి పనిచేశారు. వెనుకబడిన వర్గమైన రజకుల అభ్యున్నతికోసం రజక విద్యాపరిషత్‌లో చేరి పేద రజక విద్యార్థులకు అండగా ఉండి, వారి చదువులలోను, ఉద్యోగ అవకాశాలలోను వారికి కావలసిన శిక్షణ మొదలైన అవసరాలను తీరుస్తూ విరాళాలు సేకరిస్తూ రజకుల అభివృద్ధికి కృషి చేశారు. బడుగువర్గాలవారు తమ విముక్తికి విద్యను ఒక సాధనంగా చేసుకోవలసిన చారిత్రక అవసరం ఉందని చెబుతూ రజక విద్యార్థులను చైతన్య పరిచారు.

## శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావు గారి రచనలు :

అనాది కాలం నుండి పీడనకు, దోపిడీకి గురవుతున్న బహుజన కులాల అభ్యున్నతికై ఆయన రచనలు ఎంతో దోహదం చేశాయి. శ్రమ దోపిడీని ఎండగడుతూ భూస్వామ్య వర్గాలు చేస్తున్న దాష్టీకాలను ధైర్యంగా ఎదిరిస్తూ తన రచనలు 1.ప్రగతిపథం 2.కాకిలోకం ద్వారా బహుజన వర్గాలలో చైతన్యాన్ని రగిలించాడు. ప్రాచీనకాలం నుండి యంత్రంలా పనిచేస్తూ సమాజానికి అనేకరకాలుగా సేవలందించిన రజకులకు సమాజంలో పురస్కారాలకు బదులు తిరస్కారాలే ఎదురయ్యాయి. రజకుల్లో అవిద్య, అవగాహనాలోపం, అమాయకత్వం వలన భూస్వామ్యవర్గాలు రజకులను సులభంగా శ్రమదోపిడీ చేసేవారు. రజకులు పడుతున్న వేదనలకు, సంఘర్షణలకు, వారి చైతన్యానికై వచ్చిన సానుభూతి, స్వానుభవ కవిత్వాన్ని అంతటినీ సేకరించి గ్రంథరూపం లోని తెచ్చారు మస్తాన్‌రావు గారు.

### రజక గీతాలు :

అత్యంత వెనుకబడిన కులమైన రజకుల శ్రమను భూస్వామ్య పెత్తందార్లు ఏవిధంగా దోచుకుంటున్నారు, రజకులు బట్టలుతుకుతూ పడేపాట్లు, వారి చితికిన బతుకులను తెలియజేస్తూ వచ్చిన కవిత్వాన్నంతా సేకరించి తన సంపాదకత్వంలో 'రజకగీతాలు' అనే పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తకం ద్వారా అనేకమంది రచయితలు రజక వృత్తిదారులపై చూపిన సానుభూతి, స్పందనను మనం గ్రహించవచ్చు. 'రజకగీతాలు' చదువుతున్నంతసేపూ ఎండనక, వాననక పసికూనల నుండి పండుటాకుల వరకు చెమటోడ్చి పొద్దంతా బట్టలు ఉతికి, ఇస్త్రీ చేసి ఉడిగిపోయిన శరీరాలతో కూడిన రజకులు కనపడతారు. సాకిరేవు దగ్గర నీడలేక ఏ చెట్టుకిందనో, కొమ్మకిందనో పసిపిల్లలను పడుకోబెట్టి, గొంతెండిపోయి ఎంత ఏడ్చినా ఓదార్చలేని పని ఒత్తిడిలో మునిగిపోయే రజక స్త్రీల శ్రమ వర్ణనాతీతం. తమ బ్రతుకులు ఎలాగో గడిచాయి. కనీసం తమ పిల్లలకైనా విముక్తి మార్గం లభిస్తుందేమోనని రచకులు పడే బాధలు ప్రతి పాఠకుణ్ణి ఆలోచింపచేస్తాయి.

పగలంతా కష్టపడి బట్టలుతికి, పొద్దుపోయిన తర్వాత బిక్షగాళ్ళ మాదిరిగా పాత్ర పట్టుకొని ఆసాముల ఇండ్లకు పోయి అన్నం అడుగుతారు. ఇది బిక్షా? శిక్షా? ఇదే విషయాన్ని మస్తాన్‌రావుగారు ''రజకనారి'' కవితా ఖండికలో...

''పగలు పడరాని యడుమల బడియు నీవు
నీటు విడనాడి పిడికెడు కూటి కొఱకు
బుట్ట గైకొని వీధులం బోదువేల?
బిక్షమా? యిది శిక్షయా? ఓ బిసరుహాక్షి'' అని అంటారు.

ఎంత కష్టపడినా వారు పెట్టే అన్నం ఒక్క డొక్కకు సరిపోదు. సరికదా కొందరు ఏ పాచిపోయిన అన్నమో వేస్తే... ఆ అన్నమే మరుసటి రోజు ఉదయం చాకిరేవు దగ్గర -

''మురుగు సద్దన్నము యెర్రకారపు ముద్ద
బక్క పేగుకు పడదు బాధ దేవుడెరుగు

ఏడుపే తరుగగరా ఓరన్నా మనకు
ఏందిరా యీ బ్రతుకు రజకన్నా" అంటూ

'రాజ్యము వీరభోజ్యము' అనే కవితా ఖండికలో ఉన్నత కులంవారమని చెప్పుకునే వాళ్ళు పాచిపోయిన అన్నం పెడుతూ కనికరం లేకుండా రజకులను ఎంతహీనంగా చూస్తున్నారో తెలియపరిచారు మసాన్‌రావు గారు.

ఎండాకాలం ఎండ వేడికి పశుపక్ష్యాదులు సైతం చెట్లను ఆసరా చేసుకొని సేదతీరుతాయి. కాని, మెదడు కూడా కరిగిపోయే మండుటెండలో రజకులు శ్రమించాల్సిందే. ఆ సమయంలో పసిపిల్లల పరిస్థితి చెప్పనలవి కాదు. ఈ విషయాన్నే శ్రీ దేవరపల్లి మస్తాన్‌రావు గారు 'రజక నారి' అనే కవితా ఖండికలో -

"గుబురు చెట్టున గట్టిన గూటియందు
బిల్లలం గుల్కుచున్నది పిచుక గూడ
కలచు చుండెడి మండుటెండలకునైన
నీడ చేరగ నోచవో నీలవేణి" అంటూ

రజక స్త్రీలు మండుటెండలో చెరువులో బట్టలు ఉతుకుతూ పడుతున్న పాట్లను వివరించాడు. చలి, వర్షం ఎండ - మూడు కాలలలో కూడ రజకులు విలపిస్తూ కాలపరీక్షలో నెగ్గారని చెబుతున్నాడు కవి.

ఎండకు ఎండుతూ, వానకు నానుతూ, ఎముకలు కొరికే చలిలో వణుకుతూ ఎవరు చేస్తారు ఈ పని? ఏమిటీ బానిసబతుకు అని ఆవేదన చెందాడు. మైలబట్టలు శుద్ధిచేసే రజకుల్ని ఉన్నతకులాల వారు ఒరేయ్, ఒసేయ్ అని పిలుస్తారేగాని, పేరు పెట్టి పిలిచి కనీస గౌరవం కూడ ఇవ్వరు. ఇలా ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేస్తున్న రజకుల వేదనను మస్తాన్‌రావుగారు తన మాటల్లో...

"ప్రసవము గాంచినట్టి పసిపాపల పొత్తిళ్ళు
శుద్ధిజేయు నీ
కుసుమ కరమ్ములన్ మురికిగుడ్డెల
నంటెడు తల్లివైన ని
న్నసె! ఒసె! యంచు నెంతో పరిహాసము
మీఱగ బల్కరించు నా
పసరము కున్నెబుద్ధి? తన బాలుని
నట్టుల బిల్వనొప్పునే?" అని

అగ్రకుల అహంకారపు మాటలను, పరుష పద జాలాన్ని వ్యతిరేకిస్తూ, అలాంటి వారిని ఎదిరించాలని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని ఉద్బోధించాడు. రజకుడు అనగా ప్రాచీనకాలం నుండి సమాజ సేవకు ఉపయోగపడుతున్న వాడని...

"రజకుడనగ ప్రజారోగ్య రక్షకుండు
రజకుడన నొక్క మాటలో ప్రజల హితుండు" అని

సమాజ హితం కోరి శ్రమించే వారు రజకులని, వారిని గౌరవించవలసిన అవసరముందని తన 'రజక గీతాలు" అనే పుస్తకం ద్వారా వ్యక్తీకరించాడు.

## రజక సేవ (బుర్రకథ) :

ఈ బుర్రకథను మస్తాన్‌రావుగారు 1950లో రాశారు. గ్రామ జీవనంలో రజకుల పాత్రను, వారి జీవనచిత్రణ, సంఘాలుగా ఏర్పడి అందరూ సంఘటితమై ప్రభుత్వ పరంగా, వృత్తిపరంగా హక్కులను, సదుపాయాలను సాధించుకోవటం, ఐక్యతను సాధించి రజకుడు సంఘ నాయకుడు కావటం రాజ్యాధికారంవైపు అడుగులు వేయటం ఇందులోని ప్రధానాంశం.

"రామాపురమను గ్రామమందు
రామయ్యను రజకుడొకడు ॥తందాన॥
వీరమ్మనియెడు ఇల్లాలతనికి
అర్థాంగియై వొప్పు ॥తందాన॥ అంటూ

సాగే ఈ బుర్రకథ రజక జాతి అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తిగా రామయ్య పాత్ర కథానాయకుడుగా రూపు దాల్చింది ఈ బుర్రకథ.

## శ్రామిక సింహం :

ఇది గద్య, పద్య గేయాత్మిక ఉద్బోధ. బి.సి.ల పరంగా

చెప్పిన ఉద్బోధ ఇది. దీన్ని కూడ 1950లోనే రాయటం జరిగింది. ఇది "విప్లవోపేతమైన ఉడుకు రక్తంతో ఉగ్రూతలూగే రజక పనివాడా మేలుకో! నరనరాన నాట్యం చేసే నీ అరుణ రక్తాన్ని ఆస్వాదన చేసి బొజ్జలు పెంచుకున్న బూర్జువా బాబుల తుచ్ఛపీఠాలను పెకలించ టానికి పూనుకో!" అనేవిధంగా సాగుతుంది.

పెత్తందారీ అగ్రవర్ణాలకు, బూర్జువా దోపిడీ వర్గాలకు, పెట్టుబడిదగారీ వర్గాలకు వ్యతిరేకంగా దళిత బహుజన, మైనారిటీ వర్గాల సమీకరణకు తోడ్పడే ఉత్తేజపూరిత ఉద్బోధగా "శ్రామిక సింహాన్ని" వెలువరించారు. మోసం చేసే వర్గాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే గొప్ప కావ్యమిది.

దీపావళి : ఇది పద్య, గేయ ఖండ కావ్యం. దీనిని 1968లో రాశారు. ఇందులో 20 పద్య ఖండికలు, 20 గేయ ఖండికలు, 10 వచన కవితలు ఉన్నాయి. ఇవన్నీ ఇంతకు పూర్వమే వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. దీనికి కవిరాజు కొండవీటి వేంకట కవిగారు పీఠిక రాశారు. దీనికి దీపావళి అనే పేరు పెట్టటానికి కారణం ఇందులో "దీపావళి" అనే ఖండిక ఉండటం ఒక కారణమైతే, ప్రతి ఖండికకూ ఒకటో దీపం, రెండో దీపం అనే శీర్షికలు పెట్టటం మరో కారణం.

**కాకిలోకం :**

ఇది ఐదు కథల సంపుటి. కర్తవ్యం, కాకిలోకం, గొంతెమ్మ కోరిక, మరో రెండు కథలు ఉన్నాయి. యథార్థ, సామాజిక సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లు తెలిపే వివిధ కథానికలు ఇందులో ఉన్నాయి. ఇవి కూడ రజక పత్రికలతోపాటు ఇతర పత్రికల్లో కూడ వచ్చాయి.

**ప్రగతిపథం :**

ఇది ఉపన్యాస వ్యాస సంపుటి. 1972లో ముద్రిత మయింది. ఇందులో 10 వ్యాసాలు ఉన్నాయి. రజకుల మీద రెండు ('తెల్లజెండా' రజక పత్రిక ప్రారంభోత్సవ సభలో) ఆవుల గోపాల కృష్ణమూర్తి, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారకోపన్యాసం, అత్తోట రత్నకవి సన్మాన సభలో ఒక ఉపన్యాసం, డా॥బి.ఆర్. అంబేద్కర్ స్మారకోపన్యాసం, సామాజిక తత్త్వంమీద ఒక వ్యాసం, బి.సి. ఉద్యమం మీద, వెనుకబడిన తరగతుల వేదికమీద ఒక ఉపన్యాసం కలిసి "ప్రగతిపథం"గా రూపుదిద్దుకున్నది.

**దళిత దశాబ్దం :**

ఇది 1997లో అచ్చయింది. వివిధ పత్రికల్లో వచ్చిన దళిత బహుజన వ్యాసాలు. అర్ధ శతాబ్దకాలం వివిధ పత్రికల్లో ప్రచురితమై, ఇంతవరకు పుస్తకాలుగా రూపుదిద్దుకున్నవి పోను, దొరికినంత వరకు విషయాను సారంగా విడదీసి ఎడిట్ చేసి కొన్ని సంపుటాలుగా వెలువరించాలనే తలంపుతో తొలివెలుగు ఈ "దళిత దశాబ్దం".

**ముగింపు :**

ఈవిధంగా మస్తాన్‌రావు గారు జీవించినంత కాలం అనేక ఉద్యమాలలో పాల్గొంటూ, నిరంతరం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికై శ్రమిస్తూ వారిలో చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించే అనేక వ్యాసాలు, కవితలు, కథలు, బుర్రకథలు ఇలా అనేక రచనలు చేస్తూ తెలుగునాట ఒక 'బహుజన సాహిత్య కెరటం'గా వెలుగొందారు.

**ఆధార గ్రంథాలు :**

1. రజక గీతాలు - కవితా సంకలనం - దేవరపల్లి మస్తాన్‌రావు
2. దళిత దశాబ్దం - పీఠిక - దేవరపల్లి మస్తాన్‌రావు
3. దీపావళి - ఖండ కావ్యం - దేవరపల్లి మస్తాన్‌రావు
4. శ్రామికసింహం - దేవరపల్లి మస్తాన్‌రావు
5. ప్రగతిపథం - వ్యాస సంపుటి - దేవరపల్లి మస్తాన్‌రావు
6. కాకిలోకం - కథా సంపుటి - దేవరపల్లి మస్తాన్‌రావు

❖

# గిరిజన సంస్కృతి - లంబాడాల దీపావళి పండుగ

- **డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్,** ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేర్, యాదాద్రి, భువనగిరి జిల్లా.

**ఉపోద్ఘాతం :**

మానవుడు సహజంగానే ఉత్సాహ ప్రియుడు. ఈ ఉత్సాహ ప్రియత్వమే మనం ఆచరించే పండగలకు మూల కారణం. ప్రపంచంలో మరే జాతికిలేని పండుగలు హిందువులకున్నాయి. మనం పూజించే అసంఖ్యాకమైన దేవతల పేరుతో, రుతుభ్రమణ పండుగలు జరుపుకోవడం మన సంప్రదాయం. పండుగలు మన ధార్మిక, సామాజిక జీవితానికి మూల కందాలుగా ఉన్నాయి. అందరూ అన్ని పండుగల్ని జరుపుకోరు. వారి వారి సంప్రదాయాలు, విశ్వాసాలు దేశాచార కులాచార, మతాచారం ప్రకారం కొందరు కొన్ని పండుగలు జరుపుకుంటారు.

లంబాడాల పండుగలను పరిశీలిస్తే కొన్ని ప్రత్యేకతలు కన్పిస్తాయి. సాధారణంగా జానపదులు జరుపుకునే పండుగలను జరుపుకుంటూనే మరోవైపు వీళ్ళ ఆచార వ్యవహారాల్లో భాగంగా మరికొన్ని పండుగలను జరుపుకోవడం విశేషం.

**ముఖ్యాంశాలు** : ధప్కార్‌దేర్, కాళ్, మాస్, పిసిపాసి లాప్సి, దువాళీర్ 'వింతి', గోవుపూజ.

**దవాళీ (దీపావళి) పండుగ :**

దేశమంతటా ఆనందంతో భక్తిశ్రద్ధలతో ఆచరించే పండుగ దీపావళి. ఇది రెండు రోజుల పాటు వైభవంగా సాగుతుంది. ఆశ్వయుజ బహుళ చతుర్ధశిని నరక చతుర్ధశి పేరుతో, అమావాస్యను దీపావళి పేరుతో జరుపు కుంటారు. ఈ పండుగను గురించి రెండు కథలు ప్రచారంలో ఉన్నాయి. సత్యభామ సహకారంతో శ్రీకృష్ణుడు నరకాసురుణ్ణి సంహరించడం సామాన్యంగా అందరికీ తెలిసిన కథ. నరక చతుర్ధశి నాడు ఉదయమే లేచి తలంటి స్నానం చేస్తారు. ఈ స్నానంతో నరకాసురుని పీడ వదలిపోతుందని వారి నమ్మకం". బాలవటుడి రూపంలో బలి చక్రవర్తిని శ్రీమహావిష్ణువు పాతాళానికి అణచివేసింది ఇదేరోజని భాగవతం చెబుతుంది. రావణ సంహారం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు వచ్చి భరతుని కలిసిన వేళ ఈ వేడుక నిర్వహించారని మరో కథ. పై సందర్భాలు వేరైనా సారం ఒక్కటే చెడుపై మంచి విజయం సాధించడం. అంతేకాకుండా సర్వతమో గుణాలను హరించే శ్రీ లక్ష్మీదేవి పుట్టినరోజు కూడా ఇదేరోజు. ఆ రోజు క్షీరాబ్ది తనయ ఎవరికిటికి వెళ్లాలా! అని చూస్తుందట. ఏ ఇల్లయితే శుభ్రంగా అలికి ముగ్గులు వేసి దీపాల సవ్వడితో అలంకరించి ఉంటుందో అక్కడ నివాసం ఏర్పరచుకోవడానికి సిరి అడుగు పెడుతుందట. అందుకే శ్రీ మహాలక్ష్మి తమ ఇంటికే రావాలని దీపాలను వెలిగించి దీపలక్ష్మి నీకు స్వాగతమంటూ సాదరంగా ఆహ్వానించడం మన సంప్రదాయం.

'దవాళి' అంటే దీపావళి. ఈ దీపాల పండుగను లంబాడాలు రెండు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజు 'కాళ్ మాస్' అని రెండవ రోజును దవాళి అని ఆచరిస్తారు. దీపావళి రోజు జగదాంబ లక్ష్మీదేవి ప్రసన్న దినమని వీరి భావన. గోమాతను లక్ష్మీదేవిగా భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. తండాకు సర్వాధికారి అయిన తండా నాయక్ నాయకత్వంలో కార్యక్రమానికి నాంది పలుకుతారు. దీపావళి పండుగను పెద్దలు, పిల్లలు సమానంగా జరుపుకున్నా ఇందులో కన్యలకు ఎక్కువ ప్రాధాన్యత కన్పిస్తుంది. ఉపవాస దీక్షలో ఉండడం, లక్ష్మీదేవిని పూజించడం, గోపూజ చేయడం, హారతి పాటలు పాడడం మొదలైన పనులన్నీ అమ్మాయిలతో ముడిపడి ఉం టాయి.

'కాళ్ మాస్' రోజు ఇంటిల్లిపాది వేకువనే నిద్రలేచి ఇల్లంతా అలుకు పూత చేసుకొని తలస్నానమాచరిస్తారు.

రశ్రీనూతన వస్త్రాలు, ఆభరణాలు అలంకరించు కుంటారు. బిడ్డ అల్లుళ్లను పండుగకు ఆహ్వానిస్తారు. వారికి కొత్త వస్త్రాలు పెడతారు. తీపి వంటలతో దేవతలకు నైవేద్యం సమర్పించి ఆ తర్వాత అందరూ సంతోషంగా పంక్తి భోజనం చేస్తారు.

## 'ధప్కార్ దేర్' పూర్వీకులను పూజించడం :

కాళ్ మాస్ మొదటిరోజు సాధారణ పండుగ చేసుకున్న లంబాడాలు దీపావళి రెండవరోజు మాత్రం పూజా కార్యక్రమాలలో మునిగిపోతారు. ఈరోజు ఇతర సమాజాలకు భిన్నంగా లంబాడాలు 'ధప్కార్ దేర్' అంటే స్వర్గస్తులైన పెద్దలకు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన వస్త్రాలను వారికి భక్తితో సమర్పిస్తారు. శాఖాహార వంటలు తయారుచేసి దూపదీపాలతో వారికి నైవేద్యం సమర్పిస్తారు.

అదేవిధంగా దీపావళి రోజు ప్రధాన కార్యక్రమం జగన్మాత లక్ష్మీదేవితో పాటు మాతృ, పితృ దేవతలకు నైవేద్యం పెట్టుటకు ఉదయమే పొయ్యి దగ్గర చక్కగ అలికి ముగ్గులేస్తారు. కొద్దిపేడను పొయ్యి పక్కన పెడతారు. రాత్రి నానబెట్టి ఆరబోసిన బియ్యాన్ని పిండిగా విసురుతారు. ఈ పిండిలో బెల్లం, సుగంధ ద్రవ్యాలు వేసి పాయసం వండుతారు. దీనినే 'పిసి పాసి లాప్సి' అంటారు.

ఆ తర్వాత పాయసాన్ని వేరువేరుగా విస్తారాకుల్లో పెట్టి దానితోపాటు పొయ్యి దగ్గర కొబ్బరికాయలు, ఆకులు, వక్కలు, అగర్‌బత్తుల దీపం, పసుపు, కుంకుమ చెంబెడు నీళ్లు సర్వసామగ్రి సిద్ధం చేసి అక్కడున్న వారందరూ బొట్టు పెట్టుకుంటారు. ఆ తర్వాత ఉపవాస దీక్షలో ఉన్న ఆ ఇంటి పెద్దనెత్తిపై రుమాలు కట్టుకొని పొయ్యి దగ్గరకు వచ్చి దీపం వెలిగించి పొయ్యిలో ఉన్న నిప్పురవ్వలపై వేరువేరుగా ఉన్న విస్తరాకులలోని పాయసాన్ని చేతిలో తీసుకొని నేతిని కలుపుతూ పొయ్యిలో నిప్పు కణాలపై ఒక్కొక్క దేవతకు మూడు ముద్దలు మూడుసార్లు పేరు పేరున ముందుగా లక్ష్మీదేవికి ఆ తర్వాత వారి వంశ పూర్వీకులకు భక్తితో నైవేద్యం సమర్పిస్తారు. నైవేద్యం పెట్టిన పూజారి తన చేతిని అక్కడ సిద్ధంగా ఉంచిన చెంబు నీళ్లలో కడిగి ఆ నీళ్లను పవిత్రంగా భావించి ఇంట్లో నలువైపుల, పశువులు కట్టే గుంజలపై చల్లుతారు. ఆ తర్వాత కొబ్బరి కాయలు కొట్టి ఆ నీళ్లను పూజ అయిన తర్వాత తీర్థంగా అందరూ స్వీకరిస్తారు.

ఆ తర్వాత అందరూ సామూహికంగా వరుసగా నిలబడి లక్ష్మీదేవితో పాటు మాతృ, పితృ దేవతలను పేరు పేరున 'వింతి' అంటే విన్నతి చేస్తూ తమ కుటుంబాన్ని, తండను ఆపదల నుండి, కరువు కాటకాల నుండి కాపాడి కష్టాల నుండి గట్టెక్కించి అందరిని క్షేమంగా చూడాలని వేడుకుంటారు.

## దవాళిర్ వింతి :

"దవాళి మారి యాడి! జగదాంబ
హమార్ నంగరీర్‌సాయి వేస్ యాడి
హమార్ పాంట పైరన్ బర్కత్ దేస్ యాడి
థోడాన్ ఘణో కరేస్ యాడి
ఏకెనె దీ కరేస్ యాడి
హమార్ కచ్చాబచ్చార్
గావుడి గోదార్ సేర్ సాయి వేస్ యాడి
హం మాణస్ ఛుక్ జాయంతి
తుమత్ ఛుకేస్ యాడి
ఈ వరసె దాడేరో పూజ తోనె పూంచోవ యాడి"

**భావం :** ఓ దీపావళి తల్లీ ! జగదాంబ ! మా తండాను కాపాడు తల్లీ ! కొంచెం ఉన్నదాన్ని అధికం చేయి తల్లీ! ఒకటికి రెండు అయ్యేట్లు చూడు తల్లీ ! మా పిల్లల్ని, పశువుల్ని అందర్నీ చల్లగా చూడుమ్మా! మేము మానవులం మరచినా నీవు మాత్రం మమ్మల్ని మరవకు మాతా! ఈ సంవత్సరం పూజ నీకు భక్తితో సమర్పిస్తున్నాం తల్లీ!

జగన్మాతను భక్తితో కొలిచిన తర్వాత స్వర్గస్తులైన మాతృ, పితృ దేవతలను అంటే వారి వారి వంశ పూర్వీకులను దాదా, దాది అంటే తాత నానమ్మ మొదలైన వారందరికీ కూడా 'వింతి' అంటే విన్నతి చేస్తారు. ఈ విధంగా భక్తిశ్రద్ధలతో ప్రార్థించిన తర్వాత అందరూ కలసి నైవేద్యానికి సంబంధించిన పదార్థాలను తృప్తిగా భుజిస్తారు.

**గోవుపూజ :**

దీపావళి సందర్భంగా లంబాడా కన్యలు గోవులను పూజించడం సంప్రదాయం. ఆరోజు పశువులను శుభ్రంగా కడిగి వాటి కొమ్ములకు నూనె రాసి వివిధ రంగులను వేసి, ఆభరణాలతో వాటిని అలంకరిస్తారు. ఇక కన్యలు గోవుల పేరుమీద ఉపవాస దీక్ష చేపట్టి తాము పూజించేది గోరూపంలో ఉన్న లక్ష్మీదేవి కాబట్టి ఆ జగన్మాత కరుణ, కటాక్షం తమపై ఉంటే మంచి భర్తలు లభిస్తారని వీరి సంప్రదాయాలో దాగి వున్న నమ్మకం. అందుకే దీపావళి రోజు ఉదయమే కన్యలు స్నానం చేసి కొత్త బట్టలు ధరించి వివిధ రకాల పూజలను బుట్టలలో సేకరించి ఆడపిల్లలందరూ సామూహికంగా పాటలు పాడుతూ తండలోని ప్రతి పశువుల కొట్టానికి వెళ్లి గోపూజ చేసి పండుగ రోజు తమ కొరకు వండుకున్న తీపి పదార్థాలు వాటిని పెడతారు.

అదేవిధంగా యువకులు ఆ రోజు స్నానాలు ఆచరించి కొత్త బట్టలు కట్టుకొని తలపై పాగడి ధరించి గుంపుగా తండాలోని నాయక్ ఇంటితో సహా ప్రతి ఇంటికి వెళ్లి రామనామాన్ని స్మరిస్తూ దీపావళి శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకుంటారు. యువకులు తండా నాయక్‌తో సహా పెద్దలకు పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదములు పొందుతారు. అదేరోజు సాయంత్రం యువకులు, బాలురు గడ్డిపోచలతో పిట్టలు పెట్టుకున్న గూళ్లను సేకరించి వాటికి నిప్పు అంటించి పశువుల చుట్టూ తిప్పుతూ ఈ విధంగా పాటలు పాడుతారు.

'అగ్‌ఝుడ్ బగ్‌ఝుడ్ గావుడీర్ గంగోడ్ ఝుడ్
అగ్ ఝుడ్ బగ్ ఝుడ్ బళదేర్ గంగోడ్ ఝుడ్'

**భావం** : ఆవులకు, ఎడ్లకు ఉన్న గోమార్లు, పిడుదులు, జోరీగలు ఈ అగ్ని దీపాలతో రాలిపోవాలని ఈ విధంగా చేయడం వల్ల పశువులను బాధించే జోరీగలు, గోమార్లు పిడుదులు దూరమవుతాయని వారి నమ్మకం. తమ పశుసంపద గురించి అవి క్షేమంగా ఉండాలని ఆశిస్తూ ప్రార్థిస్తారు. లంబాడాలు పండుగ సందర్భంగా కూడా ఎంత శ్రద్దతో పశుసంపదల పట్ల జాగ్రత్తలు వహిస్తారో తెలుస్తుంది.

దీపావళి రోజు కన్యలందరూ మేర పాటలు పాడుతూ ప్రతి ఇంట్లో దీపారాధన చేస్తారు. హారతి పళ్లెంలో దీపంతలను వెలిగించి తమ ఇండ్లలో ముందుగా లక్ష్మీదేవిని, ఆ తర్వాత గోవులను హారతినిచ్చి పూజించిన తర్వాత తల్లిదండ్రులతో సహా కుటుంబ సభ్యులందరికీ హారతినిసూత మేర పాటలు పాడుతారు. వారందరూ కళ్లకద్దుకొని మొక్కుతూ హారతి పళ్లెంలో తమకు తోచినంత కానుకలను వేస్తూ అమ్మాయిలను ఆశీర్వదిస్తారు.

కన్యలందరూ తమ తమ ఇండ్లలో హారతి పూజలైన తర్వాత ఒక సంకేత స్తలానికి చేరుకుంటారు. అమ్మాయిలందరికి చేతులలో హారతి పళ్లాలు అందులో దీపాల కాంతులు కన్యలందరి కాళ్లకు కట్టిన ఘల్లు ఘల్లుమనే గజ్జెల ధ్వని దీపావళి సంబరం కాస్త అంబరాన్ని తాకే సమయంలో తమ తండాకు పెద్ద దిక్కయిన ఆ తండా నాయకుడి ఇంటికి పెద్ద గుంపుగా దీపావళి పాటలు పాడుతూ బయలుదేరి వెళతారు. నాయకుని దంపతులు వారికి స్వాగతమిచ్చి వచ్చిన కన్యల నడుమ దంపతులిద్దరూ కూర్చోగా అమ్మాయిలందరూ వారి చుట్టూ చేరి వారిక బొట్టుపెట్టి దీపాలతో హారతినిస్తూ వారి వారి వంశస్తుల గుణగనాలను నాయకుని దాన గుణాన్ని పొగుడుతూ పాటలు పాడుతారు. దానికి మెచ్చిన నాయక దంపతులు వారి వారి హారతి పళ్లాలో కానుకలిస్తూ వారందరిని ఆశీర్వదిస్తారు.

ఆ తర్వాత అమ్మాయిలందరూ బేద, గొప్ప అనే బేధం లేకుండా తండాలోని ప్రతి ఇంటికి వెళతారు. ఆడ పిల్లలందరూ వేరే వేరు బంధుత్వమును కలిగివుంటారు. కావున బంధుతాన్ని బట్టి వారిని సంబోధిస్తూ వారి గుణ గణాలను మెచ్చుకుంటూ మేర పాటలు పాడుతూ హారతినిస్తారు. వారందరూ హారతిని స్వీకరిస్తూ పళ్లాలలో కానుకలిస్తూ కన్యలను ఆశీర్వదిస్తారు. ఆ సంవత్సరం పెళ్లి కావలసిన అమ్మాయిలు వచ్చే దీపావళికి తాము ఉండబోమని వారి ఆత్మీయుల ముందు విలపిస్తారు. వారు వారిని సముదాయిస్తారు.

ఒకవేళ కన్యలు పొరపాటున ఏ ఇంటికైన మేర కొరకు మరచినట్లయితే ఆ ఇంటి యజమాని తండా నాయక్‌కు ఫిర్యాదు చేస్తాడు. నాయక్ జరిగిన తప్పుకు అమ్మాయిల చేత అతనికి క్షమాపణ చెప్పించి మరోసారి ఆ విధంగా జరగకూడదని మందలిస్తాడు.

దీపావళి నాడు తండా కన్యలు ఇంటింటికి తిరుగుతూ పాడే పాటల్లో ఆవుకు, అమ్మకు, నాన్నకు, నాయక్‌కు, అన్నకు అందరికీ పేరు పేరున సంవత్సరానికి ఓసారి వచ్చే ఈ దీపావళికి దీపాలతో శుభాకాంక్షలు తెలుపుతున్నాం అని పాడుతారు.

అమ్మాయిలందరూ హారతిలిస్తూ భక్తి సంభరాలలో మునిగి ఉండగా అబ్బాయిలందరూ దీపావళి కోలా కాలుస్తూ, గుంపులు గుంపులుగా తండా మొత్తం తిరుగుతూ కేరింతలు కొడుతూ ఆనంద సాగరంలో విహరిస్తూ ఈ విధంగా కోలా పాటలు పాడుతారు.

"కోలాగాలె కమిటి గాలె
గూడురు లంజా గుద్దా గాలే
అమట్ గాలె కోమట్ గాలె
కోమటామెకు పూగుగాలె" అని పాడుతారు.

**ముగింపు :**

లంబాడాలైన తెలుగులో కోల పాలు పాడడం విశేషం బహుశా! ఇది తెలుగు వారి ప్రభావమని చెప్పడంలో సందేహం లేదు. అంతేకాకుండా తమ తండాలో ఎవరైనా వక్రమార్గంలో అక్రమ సంపాదనకు పాల్పడిన లేదా అక్రమ సంబంధాలు పెట్టుకున్న వాళ్ళను సక్రమమైన మార్గంలో పెట్టుటకు ఈ సందర్భంగా వారి పేరు ప్రస్తావించకుండానే పరోక్షంగా వారిపై అప్పటికప్పుడు పాటలు గట్టి పాడుతారు. వారిని అవహేళన చేస్తూ హెచ్చరిస్తారు. వాళ్ళు మంచి మార్గంలో పయనించడానికి ఇది ఎంతో తోడ్పడుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్రజ్యోతి దినపత్రి 'సమిష్టితత్వమే పండుగ పరమార్థం' తేది : 09-10-2008.
2. డా॥. ఆర్వీ.ఎస్. సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, పుట 306.
3. ఈనాడు దినపత్రిక ఆదివారం స్పెషల్ తేది : 26-10-2008.
4. బి.చీనియా నాయక్, బంజారా చరిత్ర, సంస్కృతి - ప్రగతి, పుటలు : 242, 243.
5. డా॥. ఎం. గోనా నాయక్, సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు, పుట : 67.

❖❖❖

# ఆధునిక సాహిత్య వేత్త యిక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం - ప్రకృతి వర్ణన

- డా॥. పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరు జిల్లా.

యిక్కుర్తి నరసింహారావుగారు 1949 ఏప్రిల్ 23వ తేదీన వీరరాఘవరావు, శకుంతలమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. 14.07.1975 న శ్రీకాంతమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కృష్ణా జిల్లా ముసునూరులో M.E.Oగా చేస్తూ 2007వ సంవత్సరంలో పదవీ విరమణ చేశారు.

కవితల ద్వారా సమాజానికి సందేశం ఇవ్వడం, వ్యంగ్యంగా నిశితంగా సమాజాన్ని పరిశీలిస్తూ ప్రజలలో మార్పు తీసుకురావచ్చనే ఉద్దేశ్యంతో కలంచిందులు, సుహృద్గీత అనే కవితా సంపుటాలను యిక్కుర్తి నరసింహారావు గారు రాశారు. ఈ కవితలలో అనేకమైన సామాజిక అంశాలతో పాటు ప్రకృతిని గురించి వర్ణన చేశారు.

## యిక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం - ప్రకృతి వర్ణన :

ఆధునిక కవులలో భావ కవిత్వపు జాలును తెలుగు సాహిత్యంలో చూపించిన కవి యిక్కుర్తి. ఎంతో మంది కవులు ప్రకృతిని ఇతివృత్తంగా తీసుకుని గొప్ప రచనలు చేశారు మనిషి జీవితంలో కవిత్వం ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అందులో ప్రకృతి కవిత్వం ఎంతో మంది కవుల కలాలలో గొప్పగా సాగింది.

ఆకులో ఆకునై అంటూ సాగిన దేవులపల్లి, నండూరి ఎంకి పాటలు, కృష్ణశాస్త్రి పుష్ప లావికలు మల్లెమాల ఫల విలాపం వంటి రచనలలో చక్కని ప్రకృతి వర్ణనల ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి పట్ల ప్రేమను ఎంతో చక్కగా వర్ణించిన తీరును చూస్తే వారికి ఎంతో బాధ్యత ప్రకృతి పట్ల వుందని తెలుస్తుంది.

అలాంటి వరుసలో నిలబడిన కవి యిక్కుర్తి. వారి సాహిత్యంలో అనేక సందర్భాలలో వారి కవితలలో, పాటలలో ఎంతో చక్కగా చేసిన ప్రకృతి కవిత్వం హృదయాలను ఉప్పొంగేలా చేస్తాయి. అంతటి నిగూఢత్వం, నిర్మలత, వారి సాహిత్యంలో కనిపిస్తాయి. అంతగా మన సాహిత్యంలో పర్యావరణానికి ఎంతో ప్రాధాన్యతను కలిగించారు.

మనసంతా ఆనందం పులుముకుని ఆసక్తితో, ఉత్సుకతతో ఒక్కసారి యిక్కుర్తి వారి ప్రకృతి తోటలోకి అడుగు వేసి విహరిద్దాం.

"నల్లని ఆకాశంలో
తెల్లని మంచు తునక లాంటి
జాబిల్లి చిరునవ్వులో
చల్లని తుంపరలు కురిశాయి
నల్లని కోయిల కంఠం
కమ్మగా పలికింది
నల్లని కలువ చిరునగవులలో
తెల్లని జాబిలి మెరిసింది
చల్లని ఈ లోకం
కమ్మని అనుభూతినిస్తున్నది.

(సుహృద్గీత పుట సంఖ్య - 83)

యిక్కుర్తి వారి ప్రకృతి వర్ణన ఇలా సాగుతుంది. నల్లని ఆకాశం, అందులోని మంచు లాంటి తెల్లని మబ్బు తునకలు నిండు పున్నమి నవ్వితే తుంపరలుగా మెరిసాయి అంటారు కవి. ఇదొక అలౌకికమైన భావన.

కోయిల నల్లగా వున్నా దాని గొంతు తియ్యగా కమ్మగా పలికిందంటారు. ఈ లోకం చల్లదైనదని ఎంతో కమ్మని

అనుభూతిని కలిగిస్తుందని కవిభావన మన మనస్సుకు ఏదో తెలియని హృదయ తాపాన్ని కలిగించి మురి పిస్తుంది.

ప్రకృతి ఎంతటి రమణీయమైనది ఎంతటి మనోజ్ఞ మైనది ఎంతటి సౌందర్యమైనది. చూసే మనస్సు వుండాలేగాని జగమంతా సౌందర్యమే నిండివుందని పిస్తుంది. ఇలా సాగుతుంది వారి కవిత్వపు యేరు.

తెల్లని ఆకాశంలో
రెక్కలు విప్పిహాయిగా
పక్షులు పరుగెడుతున్నాయి
ఆలోచించుకో!
వాటికున్న స్వేచ్ఛత నీకున్నదా!
అంటూ మానవ జాతినే ప్రశ్నించాడు.

(సుహృద్గీత పుట సంఖ్య - 18)

అవును నిజమే. మానవులకు అంతటి ఉదాత్తత వున్నదా అనే సందేహం కలగక మానదు. మనిషి స్వార్థ చింతనలో జీవిస్తాడు. ప్రకృతి ప్రశాంతతో మనలను ఆహ్వానిస్తుంది. ఇదొక విచిత్ర స్థితి.

తెలివైన మనిషిని సైతం ప్రకృతి తన ఒడిలో సేద తీరేలా చేస్తుంది. పక్షులు ఆకాశంలో ఎగిరినంత స్వేచ్ఛ, ఆనందం నిజంగా మనిషికి లేదని వాటిని ప్రోది చేసుకోవాలని కవి ప్రశ్నించాడు. ప్రకృతిలోని చైతన్యాన్ని గ్రహించమని మనలను మనం మార్చుకోవాలని వారంటారు.

యిక్కుర్తి పాటలలోనూ వారి భావ కవిత్వం ఇలా వుంది.

"ఆకురాలినగాని అలలు కదిలిన గాని
సుడులు రేగిన గాలి అలజడి చేసినా
మనసంత వాడి సద్దు మనిగేన్నా
గుండెలోతుల చేరి తమ కాన తరచేనా

(చుక్కపాటలు పుట సంఖ్య - 41)

ప్రకృతికి పరవశమొందిన ఏ హృదయమైనా ఇంతటి తియ్యదనాన్ని పొంది తీరుతుంది. ఆకుల, అలల సవ్వడులు, గాలి అలజడులు, మనస్సులో రేగిన మధురిమలు తియ్యని భావంగా మారి మనసంతా చేరి మైమరిపిస్తుంది. గుండెలోతులో తిష్ట వేస్తుంది.

భావ కవిత్వంలో ప్రకృతి వర్ణన మనలోని భావోద్వేగా లకు ప్రతీక, వాటిని కవి ఎంతగా నిశితంగా గమనించారో అంతగా మన భావాలతో ముడి వేసాడు. అందుకే మన హృదయాలు ప్రకృతిలో విలీనమౌతాయి.

అందుకేనేమో చిన్నప్పుడు అమ్మ చందమామ రావే.... జాబిల్లి రావె అంటూ జోల పాటలు పాడి మనలను అలరిస్తుంది మురిపిస్తుంది. ప్రకృతి రమణీయతలోని సౌందర్యం అదేనేమో మరి.

"తూర్పు నడిపాపిట తిలకం
జాగృతికి జాగ్రత్తకూ సంకేతం
కాటుక దిద్దుకొంటున్న సంధ్య
స్వప్నానికి సుషుప్తికీ ప్రియధూతిక"

(కలంచిందులు పుట సంఖ్య - 13)

కవి ప్రకృతిని ఎంతగా ప్రేమించారో ఈ కవితే నిదర్శనం. కవి ప్రకృతి సౌందర్యోపాసకుడు. కాబట్టి కమ్మని కవిత వారి కలం నుండి జాలువారింది.

ఉదయిస్తున్న సూర్యున్ని వర్ణించిన అపురూప ఘట్టమిది. తూర్పుదిక్కు రెండుగా చీలినట్లుగా సూర్య కాంతి తిలకంగా రూపుదిద్దుకుని, జాగృతిని చైతన్య పరచడానికి సంకేతంగా ఉదయిస్తున్నదా అనేలా ఉషోదయ వర్ణన చేశారు కవి.

సూర్య అస్తమయం నల్లని కాటుకలాగా అది కలలాగా ఉందంటాడు కవి. ఇంతగా వారు ప్రకృతిని చూచి పరవశమొంది ఈ చక్కని పంక్తుల పరిమళాలను మనకు అందించారు.

"వసంతంలో నా నరనరాన్నిగిచ్చి
నిర్ణిద్రం చేసి
ఏకాకిని చేసిన యవ్వనమా

ఈ శిశిరంలో ఏమైపోయావు"

(కలంచిందులు పుట సంఖ్య - 47)

వసంతం సమస్త ప్రకృతికి ఆనందాన్ని చైతన్యాన్ని కలిగించే ఋతువు. వసంతం ఎప్పుడూ మనసులను కల్లోల పరుస్తూ ఆనందిస్తుంది.

కొత్త ఆశలు, కోరికలు, ఊహలు, వొయలు అన్నింటిని పంచి, ఆనందాన్ని కలిగించే వసంతం ఏమి చేయకుండానే నన్ను ఏకాకిని చేసి కళ్ళముందు నుండి అలా వెళ్ళిపోతున్నావా? అని యవ్వనం బాధపడుతుంది.

వసంతంలో ఉండే సంతోషం, ఆనందం ఆవిరై జీవితం శిశిరం లాగా మారిపోయిందని ప్రకృతి సహజమైన వసంత, శిశిర ఋతువులను గురించి కవి వర్ణించిన తీరు బాగుంది.

అది ఒక వసంతం
ప్రతిమనసు ప్రశాంతం
లేత మామిడి చివురుల కొమ్మపై
కెంజాయి కాంతులలో
గొంతువిప్పి కన్నె కోకిలమ్మ
కవి వ్రాయలేని గీతాన్ని
కమ్మగా పాడింది.

(సుహృద్గీత పుట సంఖ్య - 83)

వసంతం వసివాడని అనుభూతిని, ఆనందాన్నిస్తుంది. ప్రకృతికే కాదు మనిషికి హృదయ వికాసాన్ని కలిగిస్తుంది.

మామిడి చిగురుటాకులను తింటూ కమ్మని పాటలను పాడుతూ, కవి కలానికి అందని గుసగుసలను చేస్తూ గొంతువిప్పి అదే ఆ నల్లని కోయిల స్వరంలోని మాధుర్యం వసంతాన్ని మరింతగా మారుస్తుందని కవి వర్ణన బాగుంది.

"సుప్రభాతానికి హారతియా అనిపిస్తూ
అరుణుడు ఉదయిస్తున్నాడు మళ్ళీ
అది ఒక వసంతం
ప్రతి మనసు ప్రశాంతం

(సుహృద్గీత పుట సంఖ్య - 90)

సూర్యోదయంలాగా వసంతం ప్రతి మనసును ప్రశాంతం చేసి సంతోషపెడుతుందని కవి తెలియని అనుభూతిని కలిగించే వసంతాన్ని హృద్యంగా వర్ణించాడు.

"వొయ్యార మెందుకె ఆ సయ్యాటలెందుకే
చిట్టి చేమంతి నీవట్టి డాబులు తెలిసే
చుక్కసిగలో నక్కి వెక్కిరిస్తున్నావు
కొండలెక్కినంత టెక్కు చూపిస్తావు
నల్లమబ్బులోన జాబిల్లి సొగసుతో
మురిసిపోతున్నావు మిడిసి పడుతున్నావు.

(చుక్కపాటలు పుట సంఖ్య - 61)

ప్రకృతి సౌందర్యాలను ఎంతో సహజంగా వర్ణించాడు కవి.

చుక్కజడలో చిట్టి చేమంతుల సొగసులు గుబాలిస్తున్నాయి. అవి కొండలు ఎక్కినట్లు గర్వంతో ఉన్నాయి. నల్లని కురులను నల్లని మబ్బులనుకుని మిడిసి పడుతున్నాయి అంటాడు కవి.

ప్రకృతిలోని కొండలు, కోనలు, నదులు, మబ్బులు, వెన్నెల వంటి రమణీయమైన సౌందర్యాలను చుక్కలాంటి ఆమెలో ఇమిడ్చి చక్కని ఉపమేయాన్ని చూపి ఆనందించాడు కవి.

"చందమామ వచ్చాడు ఎండి ఎలుగిచ్చాడు
పైరగాలి వీచింది చుక్కమనసిచ్చింది
మల్లెపూలు ముడిచింది మబ్బుతునకలా వుంది
మంచె మీద కూచుంది మహారాణి నేనంది.

(చుక్కపాటలు పుట సంఖ్య - 45)

అందమైన చందమామ తెల్లని వెన్నెలను కురిపిస్తాడు. పైరగాలి ఏదో తెలియని ఆనందాన్ని పంచుతుంది. ఎక్కడో తెలియని బంధం ముడిపడింది. మన ప్రేమకు ప్రకృతి నిలువుటద్దంగా వుంది. మల్లెపూలు ప్రకృతిలోని అందానికి ప్రతీక. మబ్బు తునకలు సౌందర్యాన్ని కలిగించే అనుభూతిని కవి హృద్యంగా వర్ణించారు.

"పొన్న చెట్ల నీడలో చుక్క వూసులాడ
గున్నమావి సెట్టుమీద కోయిలమ్మ గోల
(చుక్కపాటలు పుట సంఖ్య - 45)

పొన్నచెట్టు నీడలో చుక్క ఊసులాడింది. మామిడి చెట్టుమీద కోయిలమ్మ కూతలు మనసుకు సంతోషాన్ని కలిగిస్తాయి. ప్రకృతిలోని సహజమైన దృశ్యాలను, ప్రకృతి వర్ణనలను ఇందులో కవి చక్కగా వర్ణించాడు.

ఇలా వారి కవిత్వంలో ప్రకృతి ఒక భాగమైంది. ఎందుకంతగా మన కవులు ప్రకృతి ఆరాధించారంటే మనందరి జీవితాలు ప్రకృతి చుట్టూ ముడిపడివున్నాయి. గాలి, నీరు, ఆకాశం, భూమి సకల జీవరాశులు, వనాలు, కొండ, కోనలు ఇలా ఎన్నో మానవునితో బలమైన బంధాలు కలిగి వున్నాయి. అందుకే ప్రకృతి - మనిషి వేర్వేరు కారని కవులు నిరూపించి ఆరాధించమన్నారు. మనం ఎప్పుడైతే ప్రకృతిని వినాశనం చేస్తామో అప్పుడే మనిషి మనుగడ ప్రశ్నార్థకమౌతుంది. అందుకే మనం ప్రకృతి ప్రేమికులుగా వుండాలని ఆ భావాన్ని పోనివ్వకుండా మన కవులు చక్కని ప్రకృతి కవిత్వాన్ని ప్రాచీన కాలం నుండే రచిస్తున్నారు.

"అదిగో సుందర మందార మధుర
పుష్ప సమంచిత లతావళీ వనంలో"
(సుహృద్గీత పుట సంఖ్య - 47)

అంటూ పరవశం పొందుతాడు.

**ముగింపు :**

ప్రకృతిని రక్షించమని మనిషితో
"మంచి చెడుల సామీప్యంలో
మానవతను నిర్ణయించు కాని
మనిషిగా జీవించు"
(సుహృద్గీత పుట సంఖ్య - 47)

అంటూ చక్కని హితవు పలికి ప్రకృతిలో మమేకమైపోమ్మని యిక్కుర్తి చెప్పారు. యిక్కుర్తి తన కవితలలో ప్రకృతి వర్ణనలను ఎంతో హృద్యంగా వర్ణించారు.

**ఆధార గ్రంథాలు :**

1. యిక్కుర్తి నరసింహారావు - సుహృద్గీత
2. యిక్కుర్తి నరసింహారావు - కలం చిందులు
3. యిక్కుర్తి నరసింహారావు - చుక్క పాటలు

❖❖❖

# జాషువ కవిత్వం - స్త్రీ సామాజిక జీవితం

- డా॥. లింగాల మంగమ్మ, సహాయ ఆచార్యులు, విభాగాధిపతి, తెలుగు విభాగం,
సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ మహిళా కళాశాల, హైదరాబాద్.

మానవ జన్మకు ఆధారం స్త్రీ.శక్తి స్వరూపినిగా స్త్రీకి దేవతామూర్తులలో కూడా అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ మానవ జీవితంలో స్త్రీ తల్లిగా, చెల్లిగా, భార్యగా కీలక స్థానాన్ని ఆక్రమించింది. అంతేగాక స్త్రీ ప్రేమకు, సహనానికి మరో రూపంగా నిలిచింది. ప్రస్తుత కాలంలో స్త్రీలు తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అణగారిన బానిస బతుకులకు అలవాటుపడిన ఆనాటి స్త్రీల నుండి స్వాభిమానంతో వ్యక్తిత్వాన్ని నిలుపుకోడానికి ప్రయత్నం చేస్తున్న నేటి కాలపు స్త్రీల వరకు అందరూ సమాజపు ఇనుప సంకెళ్ళకు బందీలైనారు. అలాంటి స్త్రీలలో చైతన్యం కలిగించిన కవులు, రచయితలు, నాటకకర్తలు, కళాకారులు ఇలా ఎందరో వారివారి ఆలోచనారీతులకు తగిన విధంగా స్త్రీల కష్టనష్టాలనూ, బాధలను, అభ్యునతి మొదలైన అభిప్రాయాలు తమ రచనల్లో వ్యక్తపరిచారు. ఆనాటి నుండి సమాజంలో అట్టి స్త్రీ మూర్తి ఉనికి ఏవిధంగా ఉందో రచయితలు తమ రచనల్లో కవిత్వీకరించారు. అలా కవిత్వీకరించిన మానవతావాది, అభ్యుదయవాది జాషువ. స్త్రీలపట్ల గౌరవాదరాలను తెలియజేస్తూ, వీరోచిన మహిళలకు నీరాజనాలు పలుకుతూ, దగాపడిన స్త్రీలకు ఉత్తమ మార్గాన్ని ప్రబోధించి కవిగా తనవంతు ధర్మాన్ని నెరవేర్చారు జాషువ. భారతదేశంలో పురుషుడికున్న స్వేచ్ఛ స్త్రీకి లేకపోవడం, పురుషహంకారం, పురుషాధ్యికత వల్ల స్త్రీ అణచివేయబడిన తీరు మొదలైనవాటిని వివరించి, స్త్రీకి పురుషుడితో సమానత్వం కావాలనీ, అది సాధించిన నాడే స్త్రీకి న్యాయం జరుగుతుందని కవితా రూపంలో నిరూపించిన మహాకవి జాషువ. అట్టి జాషువ కవిత్వంలో స్త్రీ సామాజిక జీవితాన్ని వివరించడం ఈ పత్ర ఉద్దేశం.

**మాతృప్రేమ :**

పిల్లల భవిష్యత్తుకు ఒక మంచిబాటను ఏర్పరచడానికి తల్లి పాత్ర ఎంతో ముఖ్యమైంది. ఆమె తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ఎన్నో కష్టాల్ని ఎదుర్కోవలసి వచ్చినా వెనుకాడదు. ప్రతిశిశువు తన మొదటి పాఠాల్ని తల్లి ఒడిలోనే నేర్చుకుంటాడు. అందుకే 'మాతృదేవోభవ' అంటూ ఆమె సేవలను సమాజం గుర్తించింది. 'మాతృప్రేమ'ను గురించి వివరిస్తూ జాషువ ఇలా అన్నారు.

సీ. "మా తల్లి కడుపులో మసలు ప్రేముడి చింది/
జలధులై యిల మీద నిలుచు నేము............"

(ఖం.2, పు.26)

కొంచెం తలనొచ్చుకొన్నట్లుంటే ఆమె మనసులో ఆకాశం క్రుంగిపోతుందనీ, భగవంతుడు ప్రశ్నిస్తే తనకోసం ఆమె శరీరాన్ని కోతకు కూడా అప్పగిస్తుందట. అరవై యేళ్ళు నా నెత్తిమీదకు వచ్చినా తల్లికంటికి చిన్నవాన్ని కాకపోను అంటాడు. నేను ఇల్లు వదిలి వెళ్ళినప్పుడు మళ్ళీ తిరిగి వచ్చేవరకూ మా అమ్మ ప్రాణం మూడు కాళ్ళతో నా వెనుక తిరుగుతూనే ఉంటుంది. ఎంత రక్తం ధారపోసినా ఇలాంటి తల్లి ఋణం తీర్చుకోలేమన్నారు జాషువ.

**మాతృబోధ :**

తమ పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే తల్లులున్నట్లే చీటికి మాటికి తన బిడ్డలను వెనకేసుకొచ్చే తల్లులు తమ పిల్లల బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేస్తున్నారని బాధపడ్డాడు జాషువ. నీవు కుల గోత్రాలున్నవాడివి, నీకు నీ స్నేహితులకు మధ్య అంతరాలున్నాయంటూ బాల్యంలోనే ద్వేషబీజాలు నాటి

అహంకారాన్ని నేర్పించి చిన్నపిల్లలను తప్పు దారులు చూపించే తల్లులు శాంతికి, ఉన్నతికి విఘ్రిములు, విద్యామందిరంలో స్తంభాలలాంటివారని జాషువ తెలియజేశారు.

సీ. "కొడుకుల నేరాలు మడిచి,దాపుననున్న / పరుల నెత్తులమీద బారవైచి ............" (ఖం.5, పుట.3)

కొడుకుల నేరాలు దాచి సమీపంలో ఉన్న ఇతరుల నెత్తిమీద రుద్ధి, పిల్లల ఏడ్పు మాన్పించడానికి అధికమైన ప్రేమతో తియ్య తియ్యని చిరుతిండ్లు నేర్పుతూ, తనబిడ్డ అసత్యాలు పలుకుతున్నా వద్దని వారించకుండా ముద్దు లాడుతూ, తీవ్రరోగ పీడితులైన సమయంలో కూడా మందులు ఇప్పించకుండా దయ్యాలకు మొక్కుతూ, ఈడు రాకముందే వేడుకకోసం అర్థంలేని తంతు జరుపుతూ, భావిజీవితాలు పాడు చేసే స్త్రీ తల్లికాదు ఆమె జంగుబిల్లి అన్నారు జాషువ.

బాలుర లేతమనస్సులో వీరోచిత భావాలను బూచులను చూపి అణచివేసి వారికి పిరికితనాన్ని నేర్పుతున్నారు కొందరు తల్లులు. ఇలాంటి పైశాచిక వాత్సల్యం జాతికి తీరని వజ్రాఘాతంగా పేర్కొన్నారు జాషువ. ఆదిగురువులైన తల్లిదండ్రులు తమ పుత్రులకు చెడ్డ లక్షణాలు నేర్పి పట్టభద్రుల్ని చేసినా, వారికి ఉన్నతపదవి వస్తుందేమోకాని గుణం మాత్రం రాదనని ఆవేదన వ్యక్తం చేశారు జాషువ. మొగ్గల్లాంటి పిల్లల లేత మనస్సును ద్వేషాగ్నిలో ఉగ్గున్న రంగరించుతున్న అభాగ్యపు తల్లులున్నప్పుడు ఉత్తమ గురువులు బుగ్గలు పిండి సదాశయాలు నేర్పించినా చెడిన బుర్రలు విద్యకు తావిస్తాయా? కొడుకులకన్నా స్వర్గాలు గొప్పవి కావనే వాడియైన ప్రేమతో నవనాడులూ పొంగిపోతున్నాయట. ఇలాంటి తల్లులు సమాజానికి ఉపయోగపడకపోగా చీడపురుగుల్లాంటి వారని జాషువ నిరసించాడు.

## సతీస్మృతి :

భార్య అంటే ఎలా వుండాలో ఆమె ఎడబాటు ఎలాంటిదో షాజహాను పాత్ర ద్వారా జాషువ తెలియజేశారు. భార్యా వియోగంతో బాధపడుతున్న షాజహానును, వారి దాంపత్యాన్ని చక్కగా వర్ణించి తన మనోభావాలతో ఆ పాత్రకు ఊపిరి పోశారు జాషువ. అందుకే "మగని రొమ్మున కుంపటి తగులబెట్టి కాయము త్యజించెనే మొగలాయి రాణి" అని అనగలిగాడు జాషువ.

భార్యా వియోగం తర్వాత ఎక్కువకాలం జీవించకుండా తాను కూడా త్వరలోనే ఆమెను కలుసుకుంటాననే భావం వ్యక్తం చేస్తూ తన ఆదర్శదాంపత్యాన్ని ప్రకటించుకున్నారు జాషువ.

సీ. "అనుపేటిం పదిలంబుగాంబతి రహస్యం బెల్లగాపాడు వి,
శ్వసనీయంబగు వ్యక్తి భార్యయు కదా
క్ష్మాచక్రమందట్టి నీ ....." (ముంతాజ్.పు.11)

పతి రహస్యాలన్నీ కాపాడే విశ్వసనీయమైన వ్యక్తి భార్య కదా! అలాంటి నీవు అసువులు వీడగానే ప్రబల సైన్యముండి కూడా భీతిల్లుతున్నాను. వసుధారాజ్యము కలిగినా నేను నిర్భాగ్యుడనే అని తన దీనస్థితిని వ్యక్తపరిచాడు జాషువ.

అనుకూల దాంపత్యం వల్ల కలిగిన ప్రేమానురాగాలే స్త్రీ అభ్యుదయానికి కంకణం కట్టేలా చేశాయి. అనుకూలవతియైన తన భార్య నుద్దేశించి జాషువ "మహాసతుల్ తలన్ జెక్కిన రత్నమో యన ప్రసిద్ధి వహించినట్టి ధన్యురాలు" అని పొగిడాడు.

శా. "ఇల్లాల్లేని గృహంబులో సుఖము లేదెవ్వారికే నింటిలో
నల్లుంద్రున్ గొడుకుల్ కుమారితలు సౌఖ్యశ్రీలు
చేకూర్చి పూ ...... (నా కథ. పు.134)

ఇంట్లో అల్లుళ్ళు, కొడుకు, కోడళ్ళు, కూతుళ్ళు అందరూ ఉండి సిరి సంపదలను అనుభవిస్తున్నా, ఇల్లాలులేని గృహంలో ఎవరికీ సుఖంలేదనీ, పురుషునికి జవసత్వాలుడిగే నాటికి తోడునీడగా ఉంటూ ఇల్లు గట్టెక్కించడానికి ఇల్లాల్లుండాలనీ భార్య విలువను తెలియజేశారు జాషువ.

**సాంఘిక దురాచార ఖండన :**

19వ శతాబ్దిలో ఎంతోమంది సంఘ సంస్కర్తలు ఉద్యమాలు చేసి మన సమాజంలో ఉన్న అనేక దురాచారాలను రూపుమాపడానికి ప్రయత్నించారు. వాటిలో బాల్యవివాహాలు, నిర్బంధవైధవ్యం, సతీ సహగమనం, స్త్రీ విద్య మొదలైనవి ముఖ్యమైనవి.

**బాల్యవివాహాలు :**

బాల్యవివాహాల వల్ల స్త్రీలకు చిన్నప్పుడే విద్యాగంధం లోపించి అనేక కట్టుబాట్లతో వారి జీవితం ప్రారంభమయ్యేది. శారీరకంగా, మానసికంగా ఎదగని వయసులో వివాహం చేసుకొని పిల్లల్ని కన్నందువల్ల రోగాలతో బాధపడుతూ కాలాన్ని వెళ్ళబుచ్చేవారు. భర్త చనిపోయినట్లైతే సహగమనం చేయాలి, లేదా ఇతరుల అవమానాలు సహిస్తూ జీవితాంతం వైధవ్యాన్ని అనుభవిస్తూ జీవచ్ఛవంలా బతకడమే మార్గం.

బాలికకు పన్నెండేళ్ళు వచ్చేలోపే వివాహం చేయాలనీ, అలా చేయకపోతే ఆమె తల్లి, తండ్రి, సోదరుడు నరకానికి వెళ్తారని స్మృతులు భయపెట్టాయి. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను దృష్టిలో పెట్టుకొని 1927 సం॥లో శారదాబిల్లు ప్రవేశపెట్టబడింది. అయినా ఇంకా మనదేశంలో బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ముక్కుపచ్చలారని అమాయక బాలికల దుస్థితి చూచి హృదయం ద్రవించిన కొందరు కవులు తమ కవిత్వాల్లో బాల్య వివాహాలు నిరోధించమని ప్రబోధించారు. అలాంటి వారిలో జాషువ కవి ఒకరు.

క. ''పడుచుం బిల్లల, ముసలికి ముడిబెట్టితి /
పసుపుంగుంకుమలకున్వ్రేలియై ........''
(ఖం.కా.3, పుట.21)

పడుచు పిల్లలను ముసలి వాళ్ళకు ముడిపెట్టిన దానికి ఫలితంగా ఆమె పసుపు కుంకుమలకు దూరమై తన పాపాలను ప్రతిరూపం అన్నట్లుగా అనాథయై ప్రత్యక్షమవుతుందని కవి పేర్కొన్నాడు. హృదయంలేని ఎనుబదేళ్ళ ముసలివాని కౌగిటిలో బంధింపబడిన పసిపత్ని కడుపులో సాగుతున్న సంకుల సమరఘోష ఏ శ్రుతులకు విన్పిస్తాయి? అంటూ దయలేని సోమయాజిని ప్రశ్నించాడు.

**వైధవ్యం :**

బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలలో వైధవ్యం ఒకటి. వయసుమీరినవాడికి, పసిపిల్లలకు వివాహం చేయడం వల్ల అమాయకులైన బాలికలు లేత వయస్సులోనే భర్తలను పోగొట్టుకొని జీవచ్ఛవాలుగా మిగిలేవారు. అందుకే వితంతు బాలికలకు వివాహం చేయమని గాంధీజీ పిలుపునిచ్చారు. నలుగురిలో ఆమె కనిపిస్తే అశుభంగా భావించడం, బానిసకన్నా హీనంగా చూడడం పరిపాటి. తన కొడుకు చావుకు కారణం కోడలేనన్న దృష్టితో అత్తలు పెట్టే బాధలు సహిస్తూ, తోటి స్త్రీల అవమానాలను భరిస్తూ చేయని తప్పుకు శిక్షను అనుభవిస్తున్న విధవను చూచి భార్య మరణించిన వెంటనే పురుషుడు వివాహ ప్రయత్నాలు చేస్తున్నప్పుడు స్త్రీకి అలాంటి అవకాశం ఎందుకివ్వలేదని శాస్త్రాలు రాసిన గురువుల స్వార్థాన్ని ఇలా నిరసించాడు.

తే. ''సతి గతించిన యుత్తర క్షణము నంద
......................'' (ఖం.కా.5, పుట.52)

బాల వితంతువుల హృదయవేదన, సనాతుల స్వార్థ పర్వతం, ముసలిభర్తలతో పడుచుభార్యలు పడే కష్టాలు, బాల వితంతువులు యౌవనంలో కోరికలను అణచుకోలేక కాలు జారితే ఫలితమెలా ఉంటుందో, సంఘం క్రూరదృష్టితో ఎలా కాటు వేస్తుందో 'తెరచాటు' నాటకంలో తెలియజేశారు.

**సతీ సహగమనం :**

బ్రిటీషు వారి కాలంలో సతీసహగమనాచారం చాలా ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. రాజారామ్మోహనరాయ్ లాంటి వాళ్ళ కృషి ఫలితంగా 1829 డిశంబరు 4వ తేదీన సహగమన నిషేధచట్టం వచ్చింది. భర్తకు సేవ చేయడమే భార్యధర్మం కనుక భర్త చనిపోయిన తర్వాత ఆమె కూడా

అతనితోపాటు పరలోకానికి వెళ్ళి అక్కడకూడా సేవించడం ఆమె ధర్మంగా సమాజం భావించింది. సహగమనం చేయని స్త్రీకి భర్తమీద గౌరవం లేదని భావించేవారు. తన మనస్సును వేధిస్తున్న ఈ సమస్యలను సంఘసంస్కరణ దృష్టితో జాషువ ఖండించారు. సహగమనాచారాన్ని -

చ. 'పతి మరణింప నాతని శవంబునకున్
సతినంటగట్టి స / ద్గతి లభియించునంచు కనికార
మొకించుక లేక యగ్నికా'' (ఖం.కా.5- పు.52)

భర్త మరణించగానే అతని శవానికి భార్యనంటగట్టి అతనితో మరణిస్తే నీకు మోక్షం కలుగుతుందని చెప్పి కొంచమైనా కనికరం లేకుండా అగ్నికి ఆహుతి చేసే ఈ పురుషుడు ఎప్పుడైనా ప్రసన్నుడై నిన్ను ఉక్కు పగ్గాల నుండి విముక్తి చేస్తాడా? అని సహగమన ఆచారాన్ని పాటించాలనుకొనే మహిళను ప్రశ్నించారు జాషువ.

**స్త్రీ విద్య :**

బాల్యవివాహాల వల్ల హిందూ స్త్రీలు పాఠశాల స్థితిని దాటలేకపోయారు. ఎన్ని కష్టాలు వచ్చినా సంప్రదాయం పేరుతో మోసగించబడుతున్న స్త్రీల దయనీయ జీవితం జాషువాను కదిలించింది. పురుషులు నెత్తిమీద కొమ్ములు మొలిచిన మహాత్ములేమీకారు. స్వార్థపూరితమైన ఈ సంఘమే నిన్ను శాసించి చదవు లేకుండా ఆజన్మాంతం బానిసగా కట్టివేసింది. పరదాదాటి స్వతంత్రవీథుల్లో నీ పాదపద్మాలుంచి క్రీడించమని జాషువ ప్రబోధించాడు.

శా. "ఎన్నేండ్లాయెనొ పురుషుండొకడ సాహిత్యాంబు
పూరంబులో/ దున్నంబోలి చరింపసాగి?
పెడబుద్ధుల్ దప్పిపోలేదు గ..." (ఖం.కా.4, పు.36).

అబల విద్యావంతురాలై పురుషునికి తోడుగా నిలవక పోతే దేశం నిద్ర మేల్కోదని జాషువ భావించారు.

**ద్వంద్వనీతి ప్రమాణాలు :**

తాను పుట్టి పెరిగిన సమాజం నిర్దేశించిన సంస్కృతీ విలువల ప్రభావం వల్లనే వ్యక్తుల శీలం, నడవడిక, వ్యక్తిత్వం ఏర్పడతాయి. ప్రకృతి సిద్ధమైన, శారీరకమైన, మానసిక సంబంధమైన తేడాలుంటే ఉండవచ్చు. కానీ సమాజ విలువకు లోబడి స్త్రీ పురుషుల ప్రవర్తన, సంప్రదాయాలు, నమ్మకాలు ఉంటాయి.

ప్రాచీన కాలంలో గార్గి, మైత్రేయిలాంటి స్త్రీలు కూడా అనేక రంగాల్లో నేర్పరులై ఉన్నప్పటికీ వారి సంఖ్య చాలా తక్కువ. ఎక్కువ శాతం ఆనాటి సమాజం గీసిన గీత దాటకుండా, ఆ సమాజ పరిధిలోనే ఉండేవారు. సమాజపు కట్టుబాట్లు దాటితే ప్రమాదకరపు పరిస్థితులు ఏర్పడ తాయనే భయంతో స్త్రీలు ఆ లక్ష్మణరేఖను దాటేవారు కాదు. కొంతమంది స్త్రీలు మాత్రమే వారి మానసిక బలంతో సామాన్య జీవితం నుండి అసామాన్యులుగా తయారవుతారు. ఇందుకు కారణం సమాజంలో స్త్రీలకో నీతి, పురుషులకోనీతి ఆచరణలో ఉండడమే కారణమని చెప్పవచ్చు.

స్త్రీలు స్వేచ్ఛగా ఉండకూడదనే ఉద్దేశంతో భర్తే దైవమనీ, పాతివ్రత్యమే ధర్మమనీ, పతివ్రతయైన స్త్రీ భర్త కొట్టినా తిట్టినా చిరునవ్వుతో ఉండాలనీ, జీవితాంతం భర్తకు సేవచేస్తూ కాలం గడపాలనీ చెప్తారు. అనేక ధర్మ సూత్రలు చెప్పి, స్త్రీ పురుషుల మధ్య అసమానత్వాన్ని పెంచిపోషించారు. దీనినే పురాణాలు కూడా పెంచి పోషించాయి. స్త్రీల దుస్థితిని గమనించిన జాషువ తన కవితల్లో ఈ సామాజిక జాడ్యాన్ని నిలదీశాడు. పురుషులు నిర్మించిన సంఘానికి స్త్రీలు చిక్కారనీ, దుష్టులైన భర్తల దయలేని స్థితికి స్త్రీలు బలవుతూ, భరించలేనివారు ఆత్మహత్యలు చేసుకుంటూ, పుట్టింట్లోనో, అత్తింట్లోనో స్త్రీ అనాదరణకు గురవతున్నదనీ ఇలాంటి సామాజిక అన్యాయాలకు బలికాకుండా రక్షించమని 'కొత్తలోకం'లో వేడుకున్నారు జాషువ.

అర్థంలేని ఆచారాలతో స్త్రీలను వ్యక్తిత్వం లేకుండా తయారుచేయడమే కాకుండా వంటింటి కుందేలుగా మార్చడానికి శాయశక్తుల్లా కృషి చేసింది ఈ సమాజం. పురుషాధిపత్యానికి స్త్రీల నరనరాల్లోకి ఇంకిపోయేలా చేశాయి మూఢాచారాలు. పురుషలకొక నీతి, స్త్రీలకొక

నీతిని నిర్దేస్తున్న నైతిక సూత్రాలలోని ద్వంద్వ ప్రమాణాలు ఏవిధంగా స్త్రీని కుక్కిన పేనులాగా చేస్తున్నాయో 'అల్లుడు' అనేఖండకావ్యంలో కవి జాషువ పేర్కొన్నారు.

వేయి రామరాజ్యాలు వచ్చినా, పదివేల స్వరాజ్యాలు వచ్చినా నీ మీద జాలిచూపే మహనీయులు పుట్టరు. స్త్రీల దుఖాన్ని పోగొట్టే శాసనాలకు నాయకులే విరోధు లయ్యారు. కూడుగుడ్డ కోసం స్త్రీ ఎప్పుడైతే క్రూర దాస్యాగ్నికి శరీరాన్ని అర్పించి బాహ్యాప్రపంచానికి దూరమైందో ఆనాటి నుండి తరతరాలుగా స్త్రీలు నానా బాధలు అనుభవిస్తున్నారంటూ ఆమె అబలత్వాన్ని చూసి బాధపడ్డాడు.

శా. "పిల్లల్లేరని వంకబెట్టుకొని నీ ప్రేమన్ విసర్జించి,
మా, రిల్లాలిన్ గొనివచ్చి నీదు తలపై నెక్కించి, నీ
పక్కలో " (ఖం.కా.5 -పు.62)

పిల్లలు లేరనే వంకతో నీ ప్రేమను వదలిపెట్టి, మరో ఇల్లాలని నీ తల మీదకు ఎక్కించి నీ పక్కలో బల్లెం పెట్టిన దుష్టులకు అండగా ఉండే ధర్మాలు భర్త చనిపోయాక నీవు మరోభర్తను చేపట్టడానికి ఎందుకు అంగీకరించవో అర్థంకావంటూ పురుషుడు స్త్రీకి ద్రోహం చేయడానికి జాషువాకవి ఖండించాడు.

మగతెగ, ఆడతెగ అని రెండు తెగలున్నాయి. ఆడతెగ లేకుంటే మగతెగకు పుట్టగతులు లేవు. ఈ రెండు తెగల అనుబంధాలు ఇలా ఉన్నాయట.

క. "ఆడుది లేకుండిన నీ, రేడు జగంబులను
శోభయేలేదు నరుం............."

స్త్రీ లేకపోతే పద్నాలుగు లోకాలలోను శోభ ఉండదట. స్త్రీని సేవచేసే యంత్రంగా భావించి మానవుడు ఆమెను బంధించి వ్యర్థజీవిగా చేశాడని స్త్రీ పురుషులలో కన్పిస్తున్న ద్వంద్వనీతి ప్రమాణాలను జాషువ తన కవిత్వంలో జాషువ కవి చక్కగా వర్ణించారు.

## ముగింపు :

అనేక కావ్యఖండికల్లో, ఖండకావ్యాల్లో, కృతిభర్తల్ని గూర్చి చెప్పిన పద్యాల్లో గృహస్త జీవితంలో స్త్రీలు నిర్వహిస్తున్న పాత్రను జాషువ ప్రశంసించారు. మహిళాభ్యుదయానికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధంగా ఉన్న కట్టుబాట్లను, మూఢనమ్మకాలజను, అవిద్యను, ద్వంద్వ నీతి ప్రమాణాలను తన కవితల్లో నిరసించారు జాషువ. మాతృమూర్తి నుండి తాను పొందిన ఆనందానురాగాలు, దాంపత్య జీవితంలో చవిచూసిన భార్య ప్రేమ వారికి స్త్రీల మీద గౌరవాన్ని ఇనుమడింప జేశారు. అందుకే స్త్రీల దుస్థికి చింతిస్తూ తన కవిత్వంలో స్త్రీల స్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించారు జాషువ. మహోన్నతమైన ఆశయాలతో తన కవితలో మహిళా భ్యున్నతికి పెద్దపీట వేసిన జాషువ గారికి మహిళా లోకమెంతో ఋణపడి ఉంటుంది. ఆయన కవితల్లో ప్రబోధించిన చైతన్యాన్ని స్త్రీలోకం ఇంకా గ్రహించాలి.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. గంగప్ప,ఎస్. నవయుగకవి చక్రవర్తి జాషువ.గుంటూరు : శశీ ప్రచురణలు,2000.
2. రామకృష్ణ, తుమ్మల. పరిచయం (ఆధునిక సాహిత్య వ్యాసాలు). హైదరాబాదు : చంద్రకళా పబ్లికేషన్స్,2014.
3. భాస్కర చౌదరి. జాషువా జీవిత కవితా ప్రస్థానం.
4. భాస్కర చౌదరి. జాషువాకృతుల సమాలోచన.
5. హేమలతాలవణం. జాషువారచనలు. (2,3.వ సంపుటాలు).
6. హేమలతాలవణం. మా నాన్నగారు.
7. సత్యవతి, తేళ్ల. హేతువాది జాషువ (వ్యాససంపుటి). గుంటూరు : హారిక ప్రచురణ, 2001.

# స్కైబాబు 'బేచారె' - భగ్నప్రేమ కథల్లో - పాత్రల స్వేచ్ఛాయుత "ప్రణయ సంఘర్షణలు"

- డా॥. కూమిడి లింగయ్య, తెలుగు అధ్యాపకులు, తెలుగు విభాగం, యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, సుబేదారి, హన్మకొండ.

మనిషి బాల్యం నుండి జీవితాన్ని కోల్పోయేవరకు అనుక్షణం ప్రతీక్షణం తనకూ, తన ఆత్మసంతృప్తికీ ఏది కావాలో దానిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ తప్పక ఉండి ఉండాలి. అయితేఅటువంటి స్వేచ్ఛాయుత వాతావరణం ఎదుటి వ్యక్తి ఇష్టానికి వ్యతిరేకంగా ఉండకూడదు. ఎదుటి వ్యక్తులకు ఆనందానుభూతిని కలిగిస్తూ, సమాజ జీవిత వ్యతిరేక కార్యకలాపం కాకుడా, హృదయానందాను భూతిని పొందే హక్కు అధికారం, స్వేచ్ఛ మనిషికి అత్యంత ఆవశ్యకం కూడ, అయితే మనుషుల అంతరాత్మ సంతృప్తిలో ప్రణయ సంఘర్షణలు, మంచీ, చెడులకు అతీతమైన ఆలోచనల పరంపరతో నడుస్తుంటాయి. ఇలాంటి నేపథ్యంలో వచ్చిన కథల్లో 'స్కైబాబు' రాసిన కథలు చాలా ముఖ్యమైనవి. వీరు రాసిన కథల్లోని పాత్రల యొక్క స్వేచ్ఛాయుత ప్రణయ సంఘర్షణలను గురించి చర్చించడమే ఈ ప్రసంగ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

సాహిత్యోద్యమాలను వెన్నాడుతూ వచ్చిన సాహిత్యాన్ని చదువుతూ ఉంటే మధురానుభూతులు మనసులో దోబూచులాడుతూనే ఉంటాయి. దళితవాదం, మహిళా వాదం, ఇలా ఎన్ని వాదాలు చదివినా అలవికాని ఆనందానుభూతితో పాటు, సమస్యలపై సానుభూతి కలిగి, ఆ సమస్యలను అధిగమించడంలో సఫలీకృతులం అవ్వాలని చూస్తాం. అయితే ముస్లింవాద సృజనకారుల్లో అద్భుతాలు సృష్టించిన 'స్కైబాబు' రాసిన కథలను చదివినపుడు భగ్నప్రేమ తాలూకు చీకటి మయ ప్రాంతాలలోని మనుషుల జీవితాల్లో వెలుగురేఖలు ఎప్పుడు ప్రసరిస్తాయని అనే ఆవేదనతో కూడిన కన్నీటి స్పర్శకనుల కొలుకుల్లోంచి బయటికి తొంగిచూస్తుంది. అటువంటి గొప్ప కథలను "స్కైబాబు" రాసినారు.

మనిషికి కావల్సిన స్వేచ్ఛాయుత వాతావరణానికి కులం, మతం, ప్రాంతం, మనిషి ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏవీ అడ్డతగులు కూడదు. కాని మన సమాజంలో నెలకొని ఉన్న అనేక అడ్డుగీతల వలన కొన్ని వర్గాకలు, తెగలకు, మాతాలకు చెందిన ప్రధం జీవనం కష్టాల్లోకి, సమస్యల్లోకి నెట్టివేయబడుతూనే ఉంది. అయితే స్కైబాబు రాసిన కథలు చదివితే, ఆయా కథలలోని పాత్రలు సజీవులై స్వేచ్ఛకోసం, సంఘర్షణలో పడుతూ, పరిష్కారమార్గాలను అన్వేషించుకుంటున్నట్లుగా మనకనిపిస్తుంది. ముస్లిం సమాజంలోని స్త్రీ, పురుషుల మానసిక సంఘర్షణ మూలాలు, ఆర్థిక, సామాజిక కోణాల్లోని పరిష్కారాలను చూపిస్తాయి.

'స్కైబాబు' బేచారె భగ్న ప్రేమక కథల పుస్తకంలో మొదటి కథ 'బేచారె' కథ ఇందులో 'జుబెదా' పాత్ర అత్యంత దయనీయమైన పాత్రగా తోస్తుంది. ఒక స్త్రీలోని మానసిక అంతర్గత సంఘర్షణకు అసంతృప్తికీ కారణం ఎవరు అనే ఆలోచనలు మొదలవుతాయి. మనసు కోరుకున్న పురుషున్ని పెండ్లిచేసుకోలేక పోయిన జుబేదా ఎక్కువ గతజ్ఞాపకాలతో కంటనీరు తీస్తూ, భగ్న ప్రేమలోనే విరహవేదన అనుభవిస్తూ మనసు కోరుకొని పురుషునికి శరీరాన్ని అప్పగించి, విరహయోగ ప్రాప్తిలోని నైరాశ్యంలోనే ప్రబతుకు నీడుస్తుంటుంది. ప్రేమతాలూకు గత జ్ఞాపకాలలోనే గడుపుతూ, మనసు నిండా ప్రేమ పురుష 'మునీర్' రూపాన్నే తలుచుకుంటూ ఉంటుంది. ప్రేమ విఫల జీవులు చేసే ఇటువంటి తలపుటాలోచనల్లో,

నిరాసక్తత, నిర్లిప్తత జీవితం పట్ల అసంతృప్తితో కాలాన్ని నెట్టుకు రావడం ఉంటుంది. ప్రేమించిన పురుషున్ని పొదలేక పోవడానికి కారణాలు అనేకంగా ఉంటాయి. ముస్లిం స్త్రీలలో ఇలాంఇ అసంతృప్తికర జీవితాలు ఉంటాయనీ, వీటికి సరైన పరిష్కార మార్గాలుండవని 'జుబెదా'' పాత్ర ద్వారా తెలుస్తుంది. స్త్రీలకు మనసు కోరుకున్న పురుషున్నే, దేహానికి అనుమతించడం ఉంటుంది. కాని ఇక్కడ 'జుబెదా'' జీవితంలో విషాదం ఏమంటే మనసుకోరుకున్న పురుషున్ని గతంలో శరీరానికి అనుమతించినా, ప్రస్తుతం పెండ్లి ద్వారా వచ్చిన పురుషున్ని శరీరానికి వదులుతూ, నిరాశగా బతుకు నీర్చుతూ ఉంటుంది.

చాల సంవత్సరాల తరువాత ''మునీర్'' ఫోను ద్వారా మాట్లాడగానే అతని గొంతును విన్న ''జుబెదా'' ఎంతో సంతోషంతో ఎక్కువగా మాట్లాడలేక పోతుంది. ''మునీర్''లేని జీవితాన్ని గడుపుతూ అసంతృప్తిగానే ఉన్న ''జుబెదా'' ఏదో పొగొట్టుకున్న వ్యక్తిలా మాట్లాడుతుంది మునీర్‌తో, చాఆ సంవత్సరాల తరువాత ఒకరి నొకరు కనీసం చూసుకోవాలనే కోరికతో ఉంటారు. నలగొండలోని ఉద్యానవనంలో ఇద్దరూ కలిసి మాట్లాడాలనుకొని, మాట్లాడుకోలేకపోతారు. సంఘంలోని కట్టుబాట్లు, నియమాలను అనుసరించి, పరపురున్ని కలుసుకొని మాట్లాడాలనుకొని మాట్లాడే స్వేచ్ఛకూడ పెండ్లి ద్వారా కోల్పోయానని జుబెదా భావిస్తుంది. ''మునీర్''ను పొందలేని 'జుబెదా'' అదేబాధతో ఉంటూ చాలా వరకు చిక్కిశల్యమై పోతుంది. ''జుబెదా''తో కూడిన ఆనందాన్ని వదులుకున్న మునీర్ కూడ చాలా బాధపడుతుంటాడు. అయితే నల్లగొండ ఉద్యానవనంలో కలిసి మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్న ''జుబెదా'' ఎందుకు మునీవర్ వద్దకు వెల్లలేదు అనేవాటికి సమాధానం కథలో, ముగింపులో చక్కని సందేశాన్ని ఇమిడ్చినారు కథకులు. మునీర్‌ను అమితంగా ప్రేమించిన జుబెదా''ఆ జ్ఞాపకాలలోనే ఎక్కువ ఆనందాన్ని పొందుతూ ఉంటుంది. కొన్నాళ్ళు ప్రేమానుభూతిని పొందింది ఆ అనుభూతిని చేజార్చుకోరాదనే తలంపుతో మునీర్‌ను కలవడానికి వెళ్ళలేదు జుబెదా, 'భగ్నప్రేమ హృదయాలు గత జ్ఞాపకాల పొరలలోనే ఎక్కువ ఆనందాన్ని పొందాలని చూస్తారని సంఘనియమాలను దాటితే లేనిపోనికష్టాలు వస్తాయని ప్రేమికులు, భగ్నప్రేమికులు ఆలోచిస్తారు. ఊహాత్మక జీవితాల్లోనే ఉషారు ఎక్కువగా ఉంటుందని ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది. ప్రస్తుతం మళ్ళీ 'మునీవర్'ను కలిస్తే గతం తాలూకు జ్ఞాపకాల పొరల్లోని సంతోషం సన్నగిల్లుతోందని భావిస్తుంది జుబెదా' అటువంటి భగ్నప్రేమికులది గొప్పజ్ఞాపకాల సందప అని, అటువంటి జ్ఞాపకాల సంపదని పోగొట్టుకోకూడదని జుబెదా భావిస్తుంది. ఇది భగ్నప్రేమికుల గొప్పలక్షణం, ఏకారణం చేతనయినా ప్రేమ పొందలేకపోతే గతం తాలూకు జ్ఞాపకాల పొందుతారని రచయిత తీర్మాణించారు. అంతేకాదు ఈ క్షణంలోని మునీర్‌ను కలిసినంత మాత్రాన్నే మునీర్‌ను ఇపుడున్న పరిస్థితుల్లో సొంతం చేసుకోలేననీ గతంలో సొంతమైన మునీర్ జ్ఞాపకాలను చెరిపేసుకోలేననీ, మునీర్‌తోనే ఫోనులో చెపుతుంది జుబెదా అలాంటి మాటలు విన్న మునీర్‌కు విషయం అర్థం కాగానే తాను ఏంకోల్పోయాడు అర్థం చేసుకోగానే కళ్ళనుండి నీళ్ళు వస్తాయి. భగ్నప్రేమికుల హృదయానిభూతికి చెందిన కథావస్తువుతో నిర్మించిన కథలోని ముగింపు చదివిన పాఠకులకు కూడ కంటనీరు తెప్పిస్తుంది. ఈ ప్రేమకథ విషాదాంత ప్రేమకాదు. మోదాంత ప్రేమ కథ కాదు, మోదపుటానంద హృదయాంతరాల జ్ఞాపకాల తాలూకు భగ్నప్రేమకథ, ఈ ప్రేమ మనసు పొరల్లో శాశ్వతం అశాశ్వతమైన ప్రేమకథ కాదు. ఈ కథకు చక్కని ముగింపు నిచ్చిన రచయిత కథా రచన గొప్పతనం గ్రహిస్తారు పాఠకులు. సంఘ నియమాలతో సర్దుబాటు గుణం సంపాదించుకోవటం కూడ ముఖ్యమే కదా ! పెళ్ళికి ముందు ఆర్థిక స్వేచ్ఛలేని ప్రేమికులు కనీసం లైంగిక

స్వేచ్ఛను పొంది, ఆ విధంగా విధివశాత్తు వీడిపోయినా, గతం జ్ఞాపకాలతో, పెళ్ళిద్వారా దొరికిన వ్యక్తితో పిల్లలతో జీవితాన్ని గడుపుతున్న ముస్లిం మహిళల ధీన స్థితిని, గతినీ కళ్ళకు కట్టినట్లు చిత్రించారు స్కైబాబు. అయితే ముస్లిం స్త్రీలు బాగా చదువుకొని, ఉద్యోగం చేస్తూ ఆర్థిక స్వేచ్ఛను, లైంగిక స్వేచ్ఛనూ, సామాజిక స్వేచ్ఛనూ పొదాలనే ఉబలాటం తాలూకు వేదనను రచయిత ఈ కథలో ప్రవేశపెట్టి, అటువంటి మార్పు దిశగా కృషి చేయాలని ముస్లిం మహిళలకు ఈ కథ ద్వారా చెప్తూ వారి జీవితాలకు స్వేచ్ఛను కోరుకుంటూ, బురఖా చాటు వ్యవహారాలను త్యజించాలని తమ కథల ద్వారా తెలుపుతూ ఉన్నారు కథా రచయిత స్కైబాబు.

"స్కైబాబు" రాసిన మరోమంచి కథ "ఊహ' - ఈ కథను చదివినపుడ, రచయితపైన "చలం" ప్రభావం ఉన్నట్లు, కుప్పి పద్మ ప్రభావం ఉన్నట్లు అనిపిస్తుంది. కథ మొత్తం అంతగొప్పవాళ్ళ సరసన "స్కైబాబు"ను చేర్చింది. ఈ కథను చాలాసార్లు చదివితే గాని అర్థథం కాదు. త్రీకలతో కూడి ఉంటుంది. ఆయా ప్రతీకలను అర్థం చేసుకోవడానికి, మరో మారు కూడ కథను చదవాల్సి వస్తుంది. ఈ కథను ఎన్నిమార్లు ఎక్కువగా చదివితే అంతగా ఈ కథ అర్థమవుతూ ఉంటుంది. మొదటి నుండి చివరివరకూ విడవకుండా పాఠకులను చదివించే కథ ఇది. 'ఊహ' పాత్ర చాలా గొప్పదిగా ఈ కథలో కనిపిస్తుంది. "ఊహ" తన ఇష్టాకు వ్యతిరేకంగా ఏపనీ చేయదు. తన ఇష్టాలను ఇష్టపడుతూ ఇంకా, తతను తాను తన ఇష్టప్రకారంగా మలుచుకునే ఆదర్శ స్వేచ్ఛాజీవి. ఈ 'ఊహ' వలెనే ప్రతి మమిళామణి ఉండగలిగితే, జీవించే ప్రతీక్షణం కూడ ఆనంద మయంగానే గడిచిపోతుంది. ఆకర్షణీయంగా తనను తాను తీర్చిదిద్దుకొని, ఆనందపడుతుంది ఊహ. ఒక స్త్రీ లేదా మహిళామణి ఎలా ఉండాలో అలా ఆదర్శంగా మసలుకునేలా పాత్రను తీర్చిదిద్దారు రచయిత. ఈ కథను చదివిన మహిళా పాఠకుల మనస్సులో తప్పక మార్పు వచ్చే విధంగా ఈ పాత్ర తీర్చిదిద్దబడింది. లోకంలో వ్యవహరించే ఇతర మనుషుల ప్రవర్తనతో అప్పుడప్పుడు విసిగిపోతూ ఉండగా, తనను తాను ఎలా ఉండాలో మలుచుకుంటుంది. స్త్రీయొక్క స్వాతంత్ర్య, స్వేచ్ఛ, అనుభూతి, అనుభవాల కలయికతో కూడిన పాత్ర ఈ 'ఊహ' పాత్ర. సమాజంలో స్త్రీకు తెలియకుండా తమచుట్టూ కట్టబడిన అడ్డుగోడల లాంటి నియమాలను, నిబంధనలనూ ఏమాత్రం లెక్కచేయదు. రాజీపడిపోతూ బతికే మనస్తత్వం కాదు ఊహది. ఉన్న ఈ ఒక్కజన్మకి రాజీపడిపోతే, ఆనందాన్ని వదిలేయటం ఎందుకు అని తనకు తాను ప్రశ్నించుకుని, ఆ విధమైన పద్ధతులను అసయ్యించుకుంటుంది.

స్త్రీలకు తమ మానసిక స్థితికి, తన హక్కులకు భంగం కలిగించని పురుషునితో వివాహమనే సంకెళ్ళపరమైన విషయం లేకుండా చాలా సంతోషంగా గడిపే హక్కు అధికారం, ఒక జీవులుగా వారికి ఉంటుంది. కాని పురుషస్వామ్య వ్యవస్థలోని అనేక అడ్డంకులు, స్త్రీలకు గల హక్కులను హరిస్తూ ఉంటాయి. అటువంటి విషయాలను ఆలోచించిన ఊహ చాలా బాధపడి పోతూ,స్వేచ్ఛా పూరిత వాతావరణంలోకి, తన స్నేహితు రాలి సహాయంతో అడుగుపెడుతుంది. జీవితపయనంలో ఆనందం ముఖ్యం. ఆనందంగా ఉండడానికి, సమాజంలో ఇన్ని ఆంక్షలు ఎందుకు అని ప్రశ్నించు కుంటుంది ఊహ. ఈ ప్రశ్నకు జవాబును తానే వెతుక్కుంటూ, సమస్యల పరిష్కారాల మార్గాలను అన్వేషించుకుంటూ ముందుకు వెళ్తుంది. ఇన్ని సంఘర్షణల నేపథ్యపుటాలోచనలోనే ఉంటూ, ప్రణయాత్మక సుఖపర జీవన విధానాన్ని అన్వేషించు కోవడం చేసే 'ఊహ' పాత్ర ప్రణయసంఘర్షణలోనే మునకలయ్యే స్త్రీలకి ఆదర్శప్రాయమైన పాత్రగా చెప్పుకోవచ్చు.

పాత్ర యొక్క స్వభావం, స్వేచ్ఛామానసిక స్థితి, ఈ స్వేచ్ఛను అన్ని జీవులూ కోరుకుంటాయి. ఒక్క మానవజీవి

మాత్రం ఊహల్లో ప్రయాణిస్తూ, కాలం గడపడం మానివేసి, నిజజీవితంలోని ఆనందాతిశమ సౌఖ్యాలాలసతో ఆకాశంలోని విహంగంలా స్వేచ్ఛగా విహరించాలి. అలాంటి ఊహకు మొదట కొంత అవరోధాలు కనిపించినప్పటికీ, చివరకు స్వేచ్ఛ కోసం ప్రయానందాను భూతి కోసం ప్రయాణం చేస్తూ, సంఘం చెక్కిన కట్టుబాట్లను తెరిచివేస్తూ, వెడలిపోయే ఆదర్శ స్త్రీపాత్ర 'ఊహ' ఈకథను ఎన్నిసార్లు చదివితే అంతగా అంతరార్థం బోధపడుతుంది.

కట్టుబాట్లు, నియమాలకు చెందిన విషయాలను ఊహించుకొని, జీవితం ఎంతగా అతలాకుతలం అయిపోతుంది అనే విషయాన్ని కూడ ఆలోచిస్తూ తన జీవితానందానికి అన్వేషణ మొదలుపెడుతుంది. స్వేచ్ఛాపిపాసి అయిన ఊహకు,స్వేచ్ఛగా ఉండే హక్కు ఉంది. కాని ఏదో సంశయంతోనే ఊహల్లో బతుకుతూ, తనకు అనుకూలమైన ఒక జీవాన్ని వెతుక్కొని, ఆనందాను భూతిని పొందుతుంది. తాను కోరుకున్న రీతిగా ఉన్న జీవితో తృప్తికరమైన జీవితాన్ని గడుపుతుండగా, మళ్ళీ ఏదో అసంతృప్తికి లోనవుతుంది ఊహ. ప్రణయకాలపు సమయాల్లోని అనుభవ ఆరాటం తెలిసిన ఊహకు, తాను అనుకున్నది నిరంతరం దొరక్కపోవడంతో అవాక్కయిపోతుంది. తన బాధనంతా తన స్నేహితురాలతో పంచుకుంటుంది. చివరికి తనస్నేహితురాలు సలహాలిస్తుంది. ఊహ ప్రపంచంలో విహరించడం మానివేసి, ఈ లోకలో మనకు తెలియకుండా గీయబడిన అనేక చిత్రాలను చిత్తు చేయాలి అని చెప్తుంది. స్త్రీయే, స్త్రీగా బ్రతుకగలగాలి. నిత్య చలన శీలత కలిగి ఉండాలి. అప్పుడే సజీవంగా బతుకున్నట్టు అనే ప్రబోధను విని ఆశ్చర్యపోతుంది ఊహ పరుషులతో కూడిన ప్రణయాను భూతి పురుస్వామ్య వ్యవస్థలతో కూడి ఉంటుంది. దానిని స్త్రీ స్వామ్యవ్యవస్థ కోణంలో ఆలోచిస్తూ, స్వేచ్ఛాజీవిగా బతుకుతూ లైంగిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ స్వచ్ఛను అనుభవించాలని తన స్నేహితురాలు చెప్పగానే, ఇన్నాళ్ళు ఊహల్లో బ్రతికానా అంటూ ఊహ తీవ్రంగా దుఃఖిస్తూ, నిజంగా తనకేంకరూలో ఆదిశగా ప్రయాణిస్తుంటుంది.

"స్త్రైబాబు" రాసిన మరోమంచి కఝథ 'లోహం' లోఖం కథలో భగ్నప్రేమతాలూకు కృతజ్ఞపకాల దొంతరలు కనబడుతుంటాయి. వివాహానికి ముందు ఒక పురున్ని చాలా వరకు ప్రణయించిన స్త్రీకి, దురదృష్టవశాత్తు మరో పురుషునితో వివాహం జరిగితే,ఆ పురుషునితో పిల్లలను కంటూనే, తన పూర్వ ప్రణయ పురుషునికి చెందిన గత జ్ఞాపకాలలో తలమునకలవుతూ ఉంటుంది. పూర్వ పొందిన ప్రణయా తాలూకు అనుభవాల జ్ఞాపకాలతో విరహతాపంతో, వేదనంతో గడుపుతూ ఉంటారు. ఈ కథలో పద్మజ పాత్ర చాలా ముఖ్యమైంది. లోకంలో ఇటువంటి పాత్రలు చాలా కనబడుతాయి. ఒక స్త్రీకి పెళ్ళి, పిల్లఉ కలిగిన తర్వాత, చాలా రోజులకు తను మనస్సు, శరీరం అంగీకరించిన ప్రణయ పురుషుడు కనబడగానే ఎక్కాడారాని ఆనందం పొందుతూ ఆశ్చర్యపోతుంది. ఆ స్త్రీ ఈ కథలో పద్మజ పరిస్థితి కూడ అదే. తన పూర్వి ప్రియుడు మునీర్ కనబడగానే చాలా ఆనందాతిశయంలో చూనస్తూ ఉంటుంది. పద్మజ పిలిచినప్పటికి, వినిపించుకొనట్లు, ఏదో కోల్పోయినట్లు వెళ్ళిపోతాడు మునీర్. స్త్రీ పురుషుల ప్రణయ పుటాలోచనల్లో స్త్రీది ఒక అడుగు ముందుకాగా, తన భవిష్యత్‌ను గురించి బాగా ఆలోచించి,ఆర్థిక, సామాజిక పరిస్థితి సరిగాలేని ప్రణయ పురుషున్ని కూడవదిలి వెళ్ళుతుంది అనడానికి నిదర్శనం పద్మజ.

ప్రణయసుఖానందమయ జీవితాన్ని గురించికాక, ఆర్థిక విషయాలను ఆలోచించే స్త్రీ, ప్రేమను నిలబెట్టు కోలేక, తర్వాత విరహవేదనను అనుభవించాల్సి వస్తుంది. కాని స్త్రీ సహజ ఆలోచన తన బంగారు భవిష్యత్ కాని పేదవాడైన మునీర్ పద్మజను ప్రేమించినప్పటికీ పెళ్ళి చేసుకోలేకపోయి, అదే నిర్వేదంలో బతుకీడుస్తుంటాడు. ఎప్పుడు కవిత్వం సాహిత్యం అంటూ తిరిగే మునీర్‌ను

చాలా ప్రేమిస్తుంది. పద్మజ కాని ఆర్థిక విషయాల ఆలోచనలతో కూడిన 'కిరణ్'ను పెళ్ళి చేసు కుంటుంది. సంపదలో ఆనందం ఉందనుకుంటుంది. కాని పేదరికం అయినా ప్రణయ సుఖం, ప్రేమానంద గొప్పదని అంచనా వేయని పద్మజ. పెళ్ళిని మానేసిన 'మునీర్' ఆలోచనలతో విరహం అనుభవిస్తుంటుంది. మనసు, శరీరం అంగీక రించిన పురుషునితో ఆనందం ఉంటుంది కాని, సంపద వాంచించే ఆలోచనల్లో ఎక్కువ ఆనందం జీవితకాలపు టానందం దొరకదని గ్రహించలేని 'పద్మజ' లాంటి స్త్రీలు మన సమాజంలో చాలామంది కనబడుతారు. అలాగే ఈ కథలో ఆదర్శపు శ్రీ 'సలిమా' కనబడుతుంది. పద్మజ పెండ్లి తర్వాత మునీర్ సలీమతో బంధాఇన్న పెనవేసు కుంటాడు. పెళ్ళిలేని అధికారం ఉండని ప్రేమపూర్వక బంధాన్ని కలుపుకుంటాడు. సలీమకూడ అలాంటి బంధాన్న ఇష్టపడుతుంది. పెళ్ళి ద్వారా వచ్చే బంధంలో ప్రేమ పూర్తిగా మాయమైపోయి, అధికారం మాత్రమే మిగులుతుందని నమ్మే స్త్రీ సలీమ. అధికారం పెద్దనం చెలాయించే పెళ్ళి బంధంలో ప్రేమ మిగలదనే నమ్ముతాడు "మునీర్" ఇలా ఇరువురి ఆలోచనలు ఒకటై, తనువుల ఒకటై ప్రేమానుభూతి పొందుతున్న సలీమను చూసిన పద్మజ, కొంత అసూయపడే చూపులతో చూస్తూ ఉంటుంది. ఇలాంటి ప్రేమబంధం గొప్పదని రచయిత ఈ కథలో సలీమ, మునీర్ పాత్రల ద్వారా చెబుతున్నాడని పాఠకులు గ్రహించుకుంటారు. ఇలాంటి బంధంలో ఉండాలంటే ప్రేమకు చెందిన చాలా ధైర్యం ఆ జంటకు అవసరం అని కూడ రచయిత అభిప్రాయంగా మనం చెప్పుకోవచ్చును.

పద్మజకున్న అనేక సందేహాలను కూడ సలీమ తీర్చుతుంది. వారి సంభాషణలోనే ఈ విషయం తెలుస్తుంది. సలీమ, మునీర్‌లు తమ ఇష్టప్రకారం మెదులుకుంటారని, సంతోషంగా గడవపడానికి కావాల్సిన సమయాన్ని కేటాయించుకొని, సంతోషకరమైన జీవిత గడుపుతున్నారని గ్రహిస్తుంది పద్మజ. ఇష్టాల్ని వదిలేసుకొని, నిరాశగా కిరణ్‌తో బతుకుతున్న పద్మజ, పెండ్లి ద్వారానే అన్ని అడ్డంకుల వలన తమ యిష్టాలు పోతాయని పద్మజ గ్రహిస్తుంది. మహిళలు ఇలా ఇష్టాలు, కోరికలను వదులుకొని, కోరికలను అణచివేసుకొని, రోగులుగా మారిపోతుంటారని పద్మజ గ్రహిస్తుంది. సంఘ గౌరవ మర్యాదలకోసం, ఇష్టాలను వదులుకొని, కష్టాలను కొనితెచ్చుకోవడం వ్యర్థం అని భావించి, బాదపడు తుంటుంది పద్మజ. మహిళలు ఇలా ప్రణయ సంఘర్షణల్లో కూరుకుపోయి, చివరి జీవితం గడపగైడదని రచయిత తన ఉద్దేశ్యాన్ని కథలో ఇమిడ్చినాడని చెప్పుకోవచ్చు. తనకంటూ ఒక వ్యక్తిత్వం నిర్మించుకొని, తమ అస్తిత్వం కోసం బతకాలని ఈ కథారచయిత పాఠకులకు ఈ కథ ద్వారా తెలియజేస్తూ ఉన్నాడు. అతి సామాన్య పేదరికంలో ఉంటూ మునీల్ ద్వారా, పెళ్ళిలేకుండా లైంగికపరమైన సుఖాన్ని పొందుతున్న సలీమను చూసిన పద్మజ ప్రణయం తాలూకు సంఘర్షణలో చిక్కుకొని, ఈ చిక్కుల నుండి తప్పించు కున్న ఆలోచనలు చేస్తూ ఉంటుంది. శారీరక మానసికా నందం లేని ఐశ్వర్యంతో కూడిన జీవితం వ్యర్థం అనే విషయాన్ని పాఠకులు ఈ కథ ద్వారా గ్రహిస్తారు.

**ఆధార గ్రంథాలు :**

1. స్కైబాబా, వతన్, నసల్, కితాబు ఘర్, హైదరాబాద్.
2. అలీ, హరేక్‌మాల్, నల్లగొండ.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 01, January 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# దాశరథి రంగాచార్య నల్లనాగు (కథా సంపుటి) - వస్తు వైవిధ్యం

- డా॥. కె.డి.డి మృణాళిని

తెలంగాణా ప్రాంతమే తెలుగు కథకు పుట్టిల్లు. ఈ ప్రాంతంలో 'బృహత్కథ' పుట్టి ప్రపంచానికే కథా ప్రక్రియను పరిచయం చేసింది. ఇలాంటి తెలంగాణా ప్రాంతంలోనే తెలుగు చిన్నకథ పుట్టి ఎంతో వస్తు వైవిధ్యంలో అప్రతిహతంగా కొనసాగుతూ వున్నది. తెలుగు కథా వికాసానికి దాశరథి రంగాచార్య కూడా తనదైన మార్గంలో దోహదపడ్డారు.

మొదటితరం కథలు రాసినవాళ్ళు కేవలం కథలు రాసి ఊరుకోలేదు. తెలంగాణా సామాజిక వికాసం కోసం సమాజంలో విస్తృతంగా పనిచేసారు. ఆ క్రమంలో కథలురాసారు. భాగ్యరెడ్డివర్మ, మాడపాటి హన్మంతరావు. సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, పి.వి. నరసింహారావు, కాళోజి నారాయణ రావు, దాశరథి రంగాచార్య మొదలైన వారి జీవితం సాహిత్యం వేరువేరు కావు". (తెలంగాణ కథలు కథన రీతులు, బి.యస్. రాములు, పుట-20). ఈ రచయితలు ఈ ప్రాంత సామాజిక, రాజకీయ జీవితాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి మార్పును కోరుతున్నారు. ఏదో ఒక రంగానికే పరిమితం కాకుండా సాహిత్య, సామాజిక, రాజకీయ సాంస్కృతిక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేసారు.

ఆరు, ఏడు దశాబ్దాల తరువాత వీరి కృషి పలు రంగాల్లో ఎలా ప్రతిఫలించిందీ, విమర్శకులు అంచనా వేస్తూనే ఉన్నారు. తెలంగాణా ప్రాంత ప్రత్యేక పరిస్థితుల్లోంచి ఆవిర్భవించిన వీరి మేధ, సృజనాత్మకత చారిత్రక ప్రాధాన్యం కలిగింది. తెలంగాణా ప్రాంతమే వీరి కార్యాచరణకు భూమిక అయినా వారు సాధించిన ఫలితాలు సమాజమంతా అనుభవిస్తున్నాయి. వారి ఆలోచనా తరంగాలు విస్తరించని రంగాలు లేవు.

ఇలా తెలంగాణా ప్రాంతంలో రెండోతరం కథా రచయితగా ప్రాదుర్భవించిన దాశరథి రంగాచార్య పండిత కుటుంబంలో పుట్టి, అక్కడే నిలిచిపోక సంప్రదాయ భావభూమికను దాటి, ఈ ప్రాంత పోరాటాల నేపథ్యం నుండి ఎదిగివచ్చిన అరుదైన రచయిత. తాను వట్టికోట ఆళ్వారుస్వామి సంప్రదాయాన్నే కొనసాగిస్తున్నానని చెప్పుకున్నా, అది ఒక కోణం నుంచి అంగీకరిస్తూనే ఇంకా విస్తృతమైన సృజన ప్రపంచంలోకి చొచ్చుకపోయిన రచయితగా సాహితీప్రపంచం వారిని గుర్తించి గౌరవించింది.

మళ్ళీ మహాత్ముడు మనమధ్యకు వచ్చాడు, పెన్సిలు భారతం, నిరుద్యోగం, ప్రేమకథ, పిచ్చుకలు, జై జవాన్, తెరవెనుక, అప్పిచ్చువాడు, ఆకలి, నవల, అగ్గిరెమ్మలు, నల్లనాగు, శంక, కుక్కపిల్ల, విశ్వాసం, విలువల వలువలు, చదువు, గెలుపెవరిది?, మర్రిచెట్టు, అర్ధరాత్రి, అరుణోదయం, తామరపూలు.

రంగాచార్య నవలాకారుడిగా ప్రసిద్ధి పొందినా, అప్పుడప్పుడు కొన్ని కథలు రాశారు. అలా రాసిన 21 కథలను "నల్లనాగు" పేరుతో విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 1978లో ప్రచురించారు. "తోడుగా, నీడగా ఉండి నన్ను వీడి వెళ్లిపోయిన భాయ్ జాన్ నార్ల చిరంజీవికి" అంకితమిచ్చారు. రంగాచార్య కథలు సంఖ్యాపరంగా స్వల్పమైన, కథా లక్షణాలను కలిగి ఉన్నాయి.

రంగాచార్య చిన్ననాటి అనుభవాలతో "తామరపూలు" కథ రాశారు. ముత్యాలమ్మ కుంటలో తామరపూల అందం, వర్షాలు పడకపోతే, విరాటపర్వం చెప్పించడం, ముస్లిములు నమాజు చేయడం, కప్పను కర్రకు కట్టి, ఇంటింటికీ తిరగడం, బిందెలతో నీళ్లుపోయడంలాంటి ఆచారాలు ఇందులో కనిపిస్తాయి.

నగరంలో అప్పులిచ్చేవాళ్లు ఎలా ఉంటారో, అప్పుల జీవితాలు ఎలా ముగిస్తాయో, హుసేన్ సాగర్ ఎంత మంది అభాగ్యులను తనలో దాచుకుందో "అప్పిచ్చువాడు" అనే కథలో చూస్తాం. ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరు ఎలా ఉంటుందో "పెన్సిల్ భారతం" వర్ణిస్తుంది. మన సమాజంలోని ఎండకాలం చదువులను "నిరుద్యోగం" ఎండగడుతుంది. అన్నం అనురాగం కంటే గొప్పది అని "విలువల వలువలు" కథ నిరూపిస్తుంది. అన్నం అనురాగంకంటే గొప్పది అని నిరూపిస్తుంది "విలువల వలువలు" కథ. ఆకలి రాజ్యంలో విలువల వలువలు ఎలా దిగజారిపోతున్నాయో కథ వివరిస్తుంది. రచయితల జీవితాలను "నవల" కథ చిత్రిస్తుంది.

"మళ్ళీ మహాత్ముడు మన మధ్యకువచ్చాడు" కథ ఒక ఊహాచిత్రం. ఈ దేశం సుభిక్షంగా ఉండాలని స్వప్నించి, స్వాతంత్ర్యం సాధించాక మతతత్త్వశక్తుల చేతిలో మహాత్ముడు బలైపోయాడు. తాను సాధించిన స్వాతంత్ర్య ఫలాలు ప్రజలకెలా అందుతున్నాయో చూడడానికి మహాత్మగాంధి భూమిమీదికి, ఈ దేశంలోకి వస్తాడు. గాంధీగారిని ఆశ్చర్య పర్చిన దృశ్యాలు ఆకలి, దారిద్ర్యం, సమ్మెలు, కాల్పులు, హాహాకారాలు. స్వాతంత్ర్యానికి ముందు ఈ దేశ ప్రజలు ఏ సమస్యలతో బాధపడ్డారో అనంతరం అవే సమస్యలతో సతమత మవడం ఈ దేశ జీవితంలోని విషాదం. గాంధీ ఆశయా లను కొనసాగిస్తున్న తరాలు, కొందరువ్యక్తులు కూడా ఈ దేశంలో లేకపోలేదు. వారు గాంధీలాగా పారిశు ద్ధ్యపనులు చేపట్టుతూ, రోగగ్రస్తులకు సేవచేస్తూ ఉం టారు. ఖాదీ ధరిస్తే భరించలేని నాయకులే నేడు మనలను పాలిస్తున్న నాయకుల్లో ఉండడం క్షమించ దగినది కాదు. ఈ నాయకులే డెమోక్రసీని 'ఫ్యాబ్రిక్ డెమోక్రసి'గా మార్చి మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తున్నామని చెప్పడం విడ్డూరమే. గాంధీ ఆశయాలను ప్రచారం చేయాల్సిన నాయకులు, అలా చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ సహకరించాల్సిన పాలకులు, ఇందుకు విరుద్ధంగా జాతిపిత అడుగుజాడల్లో నడుస్తున్న వారిని నేరస్తులుగా భావించి జైల్లో పెడతారు. ఇలాంటి విషాద సన్నివేశాలను గాంధీ దర్శించి తాను స్వప్నించిన స్వతంత్ర భారతం ఇదేనా అని వాపోవడం కన్పిస్తుంది. గాంధీజీ అను యాయుల్నే కాదు. ఆయన ఆశయాల్నీ పట్టించుకునే నాయకులే దేశంలో లేకపోవడం విషాదమే.

ప్రేమ కథలో మేరీ తల్లిదండ్రులు రజాకార్ల అఘాయిత్యానికి గురై మరణించారు. బాల్యం నుంచి తల్లిదండ్రుల గారాబం మేరీకి తెలియదు. ఒంటరిగా 25 ఏళ్ళు గడిపింది. లెక్చరర్ గా ఉద్యోగంలో చేరింది. "నల్లగా, సున్నగా, గుండ్రంగా' ఉండే మేరీ జీవితాన్ని పంచుకునే భాగస్వామి కోసం ఆమె ఎదిరిచూస్తుంది. తన తలలో తెల్లవెంట్రుక కన్పిస్తే ఝల్లుమన్నది". రోజూ తన దగ్గరికి వచ్చే సంధ్య తన కంటే చిన్నది. ఆమెను ప్రేమిస్తున్నానంటూ ఒక వ్యక్తి ప్రేమలేఖ రాసాడు. 'ప్రేమించేవాడుంటే మోసగించేవాడుంటేమి? అని తన మనస్సులోని భావాల్ని సంధ్యకు చెప్పింది. అంటే మేరీ సహచరుని కోసం ఎదిరిచూస్తుంది. ఈ క్రమంలో ఉద్యోగం కోల్పోయి నిరుద్యోగి అయిన రమేశ్ ను పూర్తిగా నమ్మి సర్వం అర్పిస్తుంది. తనకు వస్తున్న నెల జీతాన్ని ఇష్టపడే తనతో రమేష్ ఉన్నాడనే వాస్తవం తెలుసుకున్నాక కూడా మేరీ రమేశ్ ను ప్రేమిస్తూనే ఉంది.

తెరవెనుక జై జవాన్ కథల్లో ఒకటి స్వార్థంతో కుట్రతో కూడుకున్న కథయితే, మరొకటి త్యాగంతో కూడుకున్న కథ.

ఊసరవెల్లి రాజకీయాలు విద్యార్థులని, సమాజాన్ని ఎంత నాశనం చేసి, అశాంతిని సృష్టిస్తాయో తెరవెనుక కథలో చూస్తాం. కుటుంబ సమస్యలతో బాధపడ్తున్న రవి ఒక విద్యార్థి. దారిద్ర్యంతో చదువు కొనసాగించలేక ఉద్యోగం కోసం రాజకీయ నాయకుడైన పరం ధామయ్యను ఆశ్రయిస్తాడు రవి. పరంధామయ్య స్వార్థ పూరితమైన, విషపూరితమైన ఆలోచనలకు చక్కెర గుళికలాంటి మాటలు జోడించి "పరీక్షలుకాదు-డిగ్రీలు

కావాలి'' ''యువజనులు సాధించలేనిదీ లేదు'' అని ఉద్యమం తీస్తే సమస్యలకు పరిష్కారం దొరకుతుందని రవికి చెప్పుతాడు. రవి తన ఘాటైన ఉపన్యాసాల ద్వారా విద్యార్థులను రెచ్చగొట్టి హింస ప్రేరేపించేలా చేసి సమాజాన్ని అశాంతికి గురిచేస్తాడు.

చివరికి ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు జరుపాలని వారిని ఆహ్వానిస్తే విద్యార్థుల తరుపున పరంధామయ్య చర్చల్లో పాల్గొని, తనకు మంత్రిపదవిస్తే ఉద్యమం ఆగిపోతుందని శాంతి వెల్లి విరుస్తుందని చెప్పి ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తాడు. తిరుగులేని విద్యార్థి శక్తిని పాచికగా వేసి మంత్రి పదవితో తెరమీదికి వస్తాడు పరంధామయ్య. మాజీమంత్రి తాజామంత్రిగా రవిని నిరాదరిస్తాడు. పరంధామయ్య అసలు స్వరూపం తెలుసుకున్న రవి మళ్ళీ విద్యార్థి ఉద్యమానికి ఊపిరిపోసి పరంధామయ్య బంగ్లా ముందు విద్యార్థులతో కలిసి ఉద్యమంగా వెళ్తాడు. తన పోలీసులతో రవిని కాల్పించిన పరంధామయ్య, 'విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనకూడదని' ఒక పత్రికా ప్రకటన ఇచ్చాడు.

మంచి వ్యవస్థ నిర్మాణానికి రాజకీయ వ్యవస్థ పనిచేయాలి కాని, స్వార్థం కోసం విధ్వంసం సృష్టించవద్దు సమాజాన్ని అశాంతి పరచవద్దు. విలువైన జీవితాలతో ఆటలాడుకోవద్దు అనేది తెరవెనుక కథ ఇస్తున్న సందేశం. ఈ కథలో తెర వెనుక ఉండి విద్యార్థులను స్వార్థం కోసం వాడుకున్న పరంధామయ్య రాజకీయ అస్థిరతని ప్రోత్స హించాడు. విద్యార్థులు, యువకుల భావోద్వేగాలను స్వార్థానికి వాడుకున్నాడు. వారి ఉద్యమంతో మంత్రి పదవి చేపట్టాక విద్యార్థులను విస్మరించడమే కాకుండా బంగారు భవిష్యత్తున్న వారిని పొట్టన పెట్టుకోవడం కన్పిస్తుంది. ఇది వర్తమాన రాజకీయ చిత్రపటమే. న్యాయన్యాయాలు రాజకీయాల్లో కనుమరుగై దుష్ట విలువైన స్వార్థమే నిజమైన విలువగా కొనసాగుతుందనేది ఈ కథలో చూస్తాం.

తెరవెనుక కథలో రాజకీయ నాయకుడి స్వార్థం కన్పిస్తే, జై జవానులో సైనికుడి త్యాగం కనిపిస్తుంది. స్వార్థం అశాంతికి దారితీస్తే, త్యాగం సుశాంతికి దారి తీస్తుందని ఈ కథల సారాంశం.

అసమానతల వ్యవస్థలో మోసం, దగా, వంచన ఒకవైపుంటే, కుటుంబం ప్రేమ, త్యాగం ఆదర్శాలు మరొక వైపుంటాయి. ఒక మధ్య తరగతి వాడు మరో మధ్య తరగతి వాడిని ఎలా మోసం చేస్తాడో, ఆ మోసాన్ని తట్టుకోలేక ఎదుటివాడు ఎలా బలవుతాడో తెలిపే కథ ''అప్పిచ్చువాడు''.

వెంకట్రావ్ ను తల్లిదండ్రులు చదివిస్తారు. భవిష్యత్తులో సహాయపడతారని తమకు తెలిసిన సంబంధాన్ని చూసాం వివాహం చేసుకోమంటారు. చదువు కునే రోజుల్లోనే తాను ప్రేమించిన సావిత్రిని ఆదర్శ వివాహం చేసుకుంటాడు. తండ్రి మరణం తర్వాత వెంకట్రావ్ కు సమస్యలు తోరణాల్లా ఎదురు నిల్చాయి. ''పట్టా ఎందుకూ పనికి రాదనుకున్నాడు. పట్టాకోసం పెట్టిన పొలం ఉన్నా బాగుండేదను కున్నాడు. ఆదర్శాలు ఆగర్భ శ్రీమంతుల సొత్తు అనుకున్నాడు. ప్రేమలు, పెళ్ళిళ్ళు పేదవారికి కావనుకున్నాడు.'' పెరుగుతున్న అవసరాలు కాల్చేస్తున్న ఆకలికోసం ఊళ్ళో ఉన్న భూమిని తెగనమ్మి 'కడుపుతో ఉన్న భార్య, కాలు కదపలేని తల్లి'తో కలిసి హైద్రాబాద్ కు చేరుకుంటాడు.

వెంకట్రావ్‌కు రామస్వామి ద్వారా చిన్న గుమస్తా ఉద్యోగం లభిస్తుంది. ఉద్యోగం కోసం రామస్వామి వద్ద అప్పు తీసికున్న వెంకట్రావ్ నెలా నెలా వడ్డి వాటంగానే కడుతున్నాడు. ప్రతి నెల జీతం డబ్బులు రామస్వామికి వడ్డి కట్టడానికే సరిపోతలేవు. ఇంట్లో తల్లీ భార్యాపిల్లల అవసరాలు తీరడం లేదు. రామస్వామికి ఒక నెల అప్పు కట్టకూడదని నిర్ణయించుకున్న వెంకట్రావ్ రామస్వామిని ప్రతిఘటించి వడ్డీ కట్టకుండానే వెళ్ళిపోతాడు. రామస్వామి మనుషులు వెంకట్రావ్ పై దాడి చేసి డబ్బులు లాక్కుం టారు. ఈ చికాకుతోనే ఇంటికి వచ్చి జబ్బుతో మంచానపడ్డ తల్లికి మందులు తేలేక, భార్యాపిల్లలకు తిండిపెట్టలేక

  ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

విసుగుతో పిల్లలను కొట్టి హుస్సేన్ సాగర్లో దూకి చస్తాడు. ఇదొక మధ్య తరగతి జీవి వ్యథ.

ఆకలి కథలో ప్రతివాడు తనలాగే వ్యవస్థ ఉండాలని కోరుకుంటాడు. తను ఎవరికి ద్రోహం చేయ్యనని, నియమనిష్ఠలతో జీవితం గడుపుతానని సకాలంలో అన్ని కార్యక్రమాలు చేయగలుగుతానని ఇలా మధ్య తరగతి ఆలోచనలతో ఉండి ఇదే చైతన్యవంతమైన జీవితమని, జీవిత పరమార్థం ఇదేనని అనుకుంటూ ఉష్ట్రపక్షి జీవితం గడుపుతాడు. చిన్న సమస్య ఎదురైనా జడుసుకునే ఈ జీవులు సమస్యలతో వేగిపోయే వాళ్ళను చూసినా, ముఖ్యంగా కనీస అవసరమైన 'ఆకలి' తీరని మనుష్యులను చూస్తే ఒకప్పుడు జంకూ, మరొకప్పుడు అసహ్యం కూడా కలుగుతుందని "ఆకలి" కథ చెప్పుతుంది.

రచయిత, పబ్లిషర్, వేశ్య పాత్రలు గల కథ 'నవల'. ఆర్థిక లేమితో బాధపడుతున్న రచయిత ఉన్న కొద్ది చిల్లరతో నోటుబుక్కు, పెన్సిల్ కొని రైల్వేస్టేషన్లో కూర్చుండి నవలరాయడానికి వస్తువు కోసం ఆలోచిస్తున్నాడు. మూడు రోజుల నుండి విటులు దొరకక ఆకలి మంటతో దహించుకుపోతున్న వేశ్య 'పావలా ఇచ్చినా, బేడా ఇచ్చినా వస్తానంటూ' రచయితతో దీనంగా అంటుంది.

ఆ పూటకే కాఫీ డబ్బులు లేని రచయిత వేశ్యను చూసి జాలిపడి వేశ్య జీవితాన్నే వస్తువుగా చేసికొని "ఆకలికి అమ్ముడుపోయిన ఆడది" అనే నవల రాస్తాడు. దేహాన్నే పెట్టుబడిగా పెట్టి రాత్రంతా సంపాదించిన డబ్బుల్లోంచి రచయితకు బేడా ఇచ్చి కాఫీ తాగుమంటూ ఒక సలహా కూడా ఇస్తుంది వేశ్య. "కథల పిచ్చిమానుకో, కూలి చేసుకో" అంటూ వెళ్ళిపోతుంది.

చదువు కథలో కరువు కాటకాలొచ్చి చెయ్యడానికి పని దొరక్క చంకబిడ్డను వెంకయ్య దొర కమ్ముకున్న దంపతుల వ్యథార్థ గాథ గుండెలని పిండేస్తుంది. బిడ్డనమ్ముకున్న పదమూడేండ్ల తరువాత భర్త చనిపోతాడు. వృద్ధాప్యంలో కొడుకైనా తోడుంటాడనే ఉద్దేశ్యంతో దొర దగ్గర పెరుగుతున్న తన కొడుకును తన కిప్పించమంటూ కలెక్టర్ తో ప్రాధేయపడుతుందా స్త్రీ. కథ విన్న కలెక్టరు, జవానులు కూడా అర్థమవుతారు. తల్లీ బిడ్డలను విడదీసే హక్కులేదని చట్టం చెప్పుతుందని వెంకయ్య దొరకు కలెక్టర్ చెప్పి, వీరణ్ణి తన తల్లి దగ్గరకు పొమ్మంటే వీరడు తల్లి వెంట వెళ్ళడానికి ఇష్టపడడు. కారణం అమ్మ దగ్గర బువ్వ దొరకదంటాడు వీరడు. "అన్నం అనురాగానికంటే గొప్పదనే" కఠోర వాస్తవాన్ని, సామాజిక సత్యాన్ని ఈ కథ తెలుపుతుంది.

ఈ దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలొచ్చి ప్రజాస్వామ్యదేశంగా రూపుదిద్దుకుంటున్నా ఫ్యూడల్ సంప్రదాయం మాత్రం విడిచి పెట్టలేదు. 'దొరతనాలు పోయినా దొరలు పోలేదు. బానిసత్వం పోయింది కాని బానిసలు పోలేదని తెలిపే కథ "చదువు".

చదువు, గుణం, అందం, డబ్బు ఉంటే కావల్సినవన్నీ వాటంతట అవే వస్తాయనుకుంటారు చాలా మంది. ఇవ్వన్నీ ఉన్న రమణి ప్రేమించినవాడిని పెళ్ళి చేసుకొని కావాల్సిన ప్రేమను పొందలేక మోసపోయి ప్రతీకారం తీర్చుకున్న కథ "అర్థరాత్రి అరుణదోయం".

తండ్రి తప్ప అన్నీ ఉన్న రమణి వయస్సు జలపాతంలో కొట్టుకుపోతూ శరత్ ప్రేమలో నిండా మునుగుతుంది. వివాహం చెయ్యకపోతే శరత్ తో లేచిపోతానని రమణి తన తల్లి రాజమ్మతో అంటుంది. హద్దులు మీరి భ్రమల్లో విహరిస్తున్న కూతురుకు అడిగినంత కట్నమిచ్చి శరత్ తో వివాహం చేస్తుంది. వాస్తవ జీవితంలోకి అడుగిడిన రమణి శరత్ కు డబ్బే ప్రధానం కాని తాను కాదని త్వరగానే గ్రహిస్తుంది. శరత్ తల్లిని తన తల్లితో పోల్చుకొని తన తల్లిది ప్రేమ, త్యాగం, అత్తది ఆశ అని గ్రహిస్తుంది. రాజమ్మ వద్ద ఉన్న డబ్బంతా పంపినా శరత్ కు ధనదాహం తీరలేదు. రమణి మీద ప్రేమతో నివసిస్తున్న ఇల్లును సైతం అమ్మి రాజమ్మ డబ్బు పంపించింది.

అయినా అత్తకు, భర్తకు ధనదాహం తప్ప మరోటి లేదని గ్రహించి శరత్ చేతిలో మోసపోయిన తాను ఆత్మహత్యకు పాల్పడాలనుకొని విరమించుకుంది. ఇక

రాజమ్మ దగ్గర డబ్బు లేదని గ్రహించి తల్లి కొడుకులు రమణిని అరబ్బుకు అమ్మివేయాలని నిర్ణయించు కున్నారని పనిమనిషి చిత్తమ్మ ద్వారా తెలుసుకుంది రమణి. చిత్తమ్మ ఇచ్చిన ధైర్యంతో తనను కొనుక్కున్న అరబ్బును, కట్టుకున్న భర్తను అర్థరాత్రి రోకలి బండతో కొట్టి చంపేస్తుంది. భర్త, అరబ్బు పీడవదలిన ఈ అర్థరాత్రే తన జీవితానికి అరుణోదయమని రమణి భావిస్తుంది.

"అగ్గిరెమ్మలు" కథలో సుజాత అందమైనదే. కాని నిలువెల్లా ఆవేశంతో తొణకిసలాడుతుంది. ఇది వర్గవ్యవస్థ. ఈ వ్యవస్థను అంతం చేయాలనే ఆవేశం. ఈ వ్యవస్థను అర్థంచేసుకొని, ఆచరణలో పెట్టడానికి జ్ఞాన సముదాయాలైన పుస్తకాలు దోహదం చేసాయి. ఆవేశం, ఆలోచన ఉంటే వ్యవస్థను మార్చవచ్చనే విశ్వాసం ఆమెలో బలంగా కనిపిస్తుంది. సుజాత పరిచయానికంటే ముందు సమాజాన్ని ఒక రకంగా చూసిన వ్యక్తి, సుజాత పరిచయంతో విశాల దృక్పథంతో సమాజాన్ని వీక్షించడం మొదలుపెట్టాడు. విప్లవం ద్వారా మాత్రమే సమాజంలో మార్పు వస్తుందనే సుజాతతో ఏకీభవించిన వ్యక్తి ఆమె పథంలో పయనించడానికి సిద్ధపడతాడు. సుజాతనే జీవిత భాగస్వామిని చేసికోవడానికి ఆమె అభిప్రాయాన్ని సంస్కారవంతంగా తెలుసుకుంటాడు.

విశ్వనాథం దగ్గర స్టెనోగా పనిచేసే షర్మిల ప్రమోషన్ కోసం విశ్వనాథాన్ని వలలో వేసుకోవాలని చూస్తుంది. షర్మిల కుహనాబుద్ధిని గ్రహించిన విశ్వనాథం ఆమెను ట్రాన్స్ఫర్ చేస్తాడు.

విశ్వనాథం భార్య, భర్త ఉత్తమ వ్యక్తిత్వాన్ని, నిగ్రహాన్ని మెచ్చుకుంటూ ముద్దు పెడుతుంది. షర్మిల వ్యవహారంలో అటు ఆఫీసులో, ఇటు ఇంట్లోనూ గొప్ప సంస్కారవంతుడిగా మార్కులు కొట్టేసిన విశ్వనాథం, భార్య ఊరికెళ్ళినప్పుడు పనిమనిషి నీలవేణికి డబ్బు ఆశ జూపి లోబర్చుకునే ప్రయత్నం చేస్తాడు. నీలవేణి ఆయన ప్రలోభాలకు లొంగక గట్టిగా ప్రతిఘటించి విశ్వనాథాన్ని ఇంట్లోంచి వీధుల్లోకి లాక్కొచ్చి విశ్వనాథం అసలు స్వరూపాన్ని తేటతెల్లం చేస్తుంది. ఎంతో ఉత్తముడను కున్న భర్త నీచబుద్ధిని చూసి సుజాత అసహ్యించుకుంటుంది.

ఇంట్లో పని చేసే వాళ్ళను పనిమనుష్యులు అని అగౌరవపరచడం కంటే తమ సహాయకులని అంటే బాగుంటుందేమో ! కుటుంబ సభ్యుల్లా తల్లి, చెల్లి, కూతురు అందించే సేవలన్నీ అందిస్తూ, సకాలంలో యజమానుల కార్యాలు సఫలమయ్యేలా దోహదపడతారు వీరు. ఇంట్లోంటి వ్యక్తులకు పనికల్పించా మనే అహంకారం యజమానులకుండడం తగదు. వీరికీ ఆత్మాభిమానంతో గౌరవంతో బతకాలనే ఉంటుందని గుర్తించే యజమానులు తక్కువ. విశ్వనాథం లాంటి గోముఖ వ్యాఘ్రాల బారిన ఎంతమంది నీలవేణిలు పడ్తున్నారో అన్పిస్తుంది.

సభ్య సమాజంలో ఉంటూ ఉత్తమ పౌరులుగా చలామణి అవుతున్న నేరస్తులెందరో మన కళ్ళముందు కనిపిస్తారు. సాంఘిక, ముసుగులు తొడుక్కొని అటు సమాజాన్ని, ఇటు భార్యనూ మోసం చేసే పురుషులెందరో కూడా ఈ సమాజంలో ఉన్నారని చెప్పే కథ "నల్లనాగు".

దాశరథి రంగాచార్య నిశితమైన సామాజిక పరిశీలన నుండి వెలువడిన 21 కథల సంపుటి "నల్లనాగు". ఈ కథల నిండా సామాజిక వాస్తవికతే ఉంది. తెలంగాణాలోని ఫ్యూడల్ వ్యవస్థను ప్రత్యక్షంగా చూసిన రచయిత కనుక ఆ కాలంనాటి జీవితంతో పాటు, స్వాతంత్ర్యానంతరం జనజీవితంలో ఆశించిన మార్పు రాకపోవడానికి కారణ మైన రాజకీయ, పాలకవర్గాల స్థితిగతులను కథల్లో చిత్రించారు. ఏ స్వాతంత్ర్యం కోసం జీవితకాలమంతా పోరాటం చేస్తే ఆ స్వాతంత్ర్యం కాస్త కేవలం ఉత్సవాలకే ఎలా పరిమితమయ్యిందో 'దృష్టాంతం'గా కథలో రంగాచార్యగారు చిత్రించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, సమస్యల నిర్మూలనకు చేపట్టాల్సిన తక్షణ చర్యలు తీసికోకుండా ఎలా తాత్సారం చేస్తున్నారో ఈ సంపుటిలోని కథల్లో చూస్తాం. పేద, మధ్యతరగతి

జీవితాలు ఎలా కకావికలైపోయాయో, అలగా జనం ధన వ్యామోహానికి బలవుతున్న తీరు, మధ్యతరగతి ఆర్భాటాలు, ఆదర్శాలు పటాపంచలైన తీరు కన్పిస్తుంది. ఒకే కుటుంబంలోని వ్యక్తుల భిన్న మనస్తత్వంతో సర్దుకుపోయి జీవించేతీరును, సమాజమంతా ఎంత వ్యాపారాత్మకమై పోయిందో రంగాచార్యగారు చక్కగా చిత్రించారు. ఫ్యూడల్ వ్యవస్థనుండి మనం బయట పడ్డామన్న భ్రాంతేకాని, ఆ లక్షణాలు సమాజంలో ఎలా పాతుకుపోయాయో, ఆర్థిక అంతరాలు ఈ సమాజంలో ఎలా ఉన్నాయో, దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం మానవ సంబంధాలను ఎలా విచ్ఛిన్నం చేస్తున్నాయో కడుదయ నీయమైన స్థితిని వీరి కథల్లో చూస్తాం.

**ఆధార గ్రంథాలు :**

1. దాశరథి రంగాచార్యులు - నల్ల నాగు కథా సంపుటి విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాదు - 1978
2. మొదలి నాగభూషణ శర్మ - తెలుగు సాహిత్యం గాంధీజీ ప్రభావం. గాంధీ సాహిత్య, ప్రచురణాలయం, హైదరాబాదు -1970
3. కాకర్ల వెంకట నరసింహం -ఆధునికాంధ్ర కవితా సమీక్ష, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ-1982.

❖❖❖

# జానపద సాహిత్యంలో పొడుపు కథలు - విశిష్టత

- కె. అమృతజ్యోత్స్న, తెలుగు విభాగం, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

## ఉపోద్ఘాతం :

జానపద సాహిత్యంలో పొడుపు కథకు ఒక ప్రత్యేక స్థానం కలదు. కసిరెడ్డి వెంకటరెడ్డి గారు పొడుపుకథలపై సిద్ధాంత వ్యాస గ్రంథం రాశారు. సాహిత్యంలో పొడుపు కథ అనేది ఒక వినోదాత్మక ప్రక్రియ. దీనినే సంస్కృతంలో ప్రహేళిక అని కూడా అంటారు.

## పొడుపు కథ లక్షణాలు :

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు పొడుపు కథలపై చక్కని పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంథంలో ఈ క్రింది లక్షణాలను పేర్కొన్నారు.

1. సంక్షిప్తత , 2. నిగూడత, 3. అపార్థ ద్యోతకథ, 4. కథాత్మకత, 5. కథా రహితాత్మకత, 6. ప్రతికాత్మకత, 7. ఘటన విశిష్టత, 8. లోకోక్తి రమనీయకత, 9. చమత్కారి కత, 10. దృశ్యాత్మకత, 11. అలంకారిత, 12. సమస్యాత్మ కత, 13. రసాత్మకత, 14. ధన్యాత్మకత, 15. సంప్రదాయ కత, 16. కవితాత్మకత.

## పొడుపు కథల పరిచయం :

తెలుగు సాహిత్యంలో పొడుపు కథలకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. కథలు చెప్పవచ్చు, వినవచ్చు, వినిపించ వచ్చు. కథలోని అన్ని సొంపులూ, మెలకువలూ వినేవాడు తెలుసుకున్నాడా అనే ఆలోచనే రాదు. కాని వినేవాడి నుండి సమాధానం రాబట్టడంలోనే పొడుపు కథలో చమత్కారం ఉంది. స్ఫూర్తి ఉంది. కథ కాని కథ పొడుపు కథ. ప్రాచీక కాలం నుంచి పొడుపు కథలు ప్రచారంలో ఉన్నవి. క్రీస్తుకు పూర్వం నాటి వేదాలలో వీటి ప్రసక్తి ఉంది.

భాషలలో పొడుపు కథలను ఏమని పిలుస్తారు అంటే:

| | |
|---|---|
| ప్రాకృతం | : పహేళీ, హిమాలయా |
| హిందీ | : పహెలీ, భుల్ భులైయా |
| సంస్కృతం | : బ్రహ్మోదయం, ప్రశ్న లేక ప్రత్యుత్తర కూట, ప్రహేలిక, వివాద, సమస్యా గూఢ హృదయాలికా, ఇత్యాది. |
| తమిళం | : విడకట్టె, వుడుర్ |
| మళయాళం | : విడకద, కటకద. |
| కన్నడం | : ఒగటు లేక వగటు, ఒంటు, ఒడకతె, బిడ్డకతె, ఒగణు. |
| బెంగాలీ | : ప్రహెలీ, దంధా, పెయ్. |
| మరాఠీ | : ఉఖాణా, ఆహణా, ఉమణా, కులం గాదె కోడె, బయాణా. |
| గుజరాతీ | : ఉఖాణో. |
| పంజాబీ | : పహెదీ, భుజాతౌ |
| బీహారీ | : చిహా, పహెలీ. |
| ఆంగ్లం | : రిడిల్ (riddle). |

## పొడుపు కథల విభజన :

వాస్తవానికి పొడుపు కథలు అల్పాక్షరాలతో అనల్పార్థ రచనలు. హెచ్చుగా ఇందు హాస్యరచనలున్నాయి "Riddles are probably the oldest extent forms of humour" అని బ్రిటానికా చెప్పడంలో వీటి ప్రాచీనత దేశ దేశాల వ్యాప్తి వ్యక్తమౌతుంది. ఇవి హరివిల్లులాగ వింతహొయలు ఒలకపోస్తాయి.

**1. సాధారణాలు**

అంబులో పుట్టింది, జంబులో పెరిగింది
అరచేతి కొచ్చింది అంతరించి పోయింది. (పేను)

**2. వృత్తులు**

చలిలేక నిప్పులో కాలేవాడు, తాపంలేక చెరువులో నానేవాడు
బతికుండి గోతిలో కూర్చునేవాడు (కంసాలి, చాకలి, సాలె)

**3. ప్రకృతి**

అంతులేని కొమ్మకు అరవై కొమ్మలు
కొమ్మ కొమ్మకు కోటి పువ్వులు
అన్ని పువ్వుల్లో రెండే కాయలు (ఆకాశం, చుక్కలు, సూర్యచంద్రులు)
నల్లచీర చిన్నది, నాజూకు ఉన్నది
ముగ్గుపెట్టుతున్నది, ముద్దులాడుతున్నది (ఆకాశం)

**4. చిక్కు ప్రశ్నలు**

పిల్లికి ముందు రెండు పిల్లులు, పిల్లికి వెనుక రెండు పిల్లులు
పిల్లికి పిల్లికి మధ్య ఒక పిల్లి మొత్తం పిల్లులెన్ని (తొమ్మిది)
టెన్ కాయలో వన్ కాయపోతే ఎంత? (తొమ్మిది)

**5. శాస్త్ర విషయాలు**

మనుజుడేమిగాదు మాటలాడగ నేర్చు, కథలు
పెక్కు జెప్పు. కాదు జేజి మామయ్య (రేడియో)
రా రండని పిలిచేది పో పొండని తరిమేది (సైరన్)

**6. దాగిన పదాలు**

అంతా బేలుకోసం, ఎదురుచూస్తున్నారు (తాబేలు)
ఆ వుత్తరం నీకా నాకా (ఆవు)

**7. కాని పదాలు**

కారు కాని కారు (షికారు)
పతి కాని పతి (భూపతి)

**8. అర్థంలేని పదాలు**

ఉరవ పట్నం (ఉటంగీ)
రాణీ పట్నం (రటంగీ)
పెనుగొండ (పెటంగీ)

**9. శబ్ద చిత్రాలు**

పామేల దుముకు (కప్పకై)
గుడినేల కురియు (కప్పుకై)
కొంగేల పొంచు (చేపకై)
వంకర టింకర సొ (శొంఠి)

**10. గొలుసు కథలు**

విసనగొరి పట్నాన వీధెంత సక్కన (చాలు)
వీధిలో వుండే పాపెంత నక్కన (ఆముదపు చెక్క)

**11. తాత్వికమైనవి**

ఉదయం నాలుగు కాళ్ళతో నడిచేది (పసితనం)
మధ్యాహ్నం రెండు కళ్ళతో నడిచేది (మధ్యవయసు)
సాయంత్రం మూడు కాళ్ళతో నడిచేది (ముసలి వయసు)

**12. వింత ప్రశ్నలు**

పిఠాపురం చిన్నవాడా, పిట్టల వేటగాడా
బతికిన పిట్టను కొట్టవద్దు
చచ్చిన పిట్టను తేనూ వద్దు
కూరలేకుండా రానూ వద్దు (కోడిగుడ్డు)

**13. ఆలోచన రేకెత్తించేది**

కొండనుండు, పెండెనుండు,
రాజుగారి శిరసునుండు, రంభ ముక్కునుండ (పులి, పాము, కిరీటం, సత్తు)

**14. వ్యతిరేకార్థకాలతో**

తలనుంచి పొగలు చిమ్ముచుండు భూతము గాదు
కను లెర్రగా నుండు రాకాసి కాదు
పాకి పోవుచుండు పాము కాదు (రైలు)

**15. ప్రశ్నలోనే సమాధానం**

వంగ 'తోట' నుండు
వరి 'మళ్ల' నుండు
తలుపు 'మూల' నుండు
తల 'మీద' నుండు

**16. హిందీ తెలుగు మిశ్రమాలు**

ఎక్ దో కొట్టండీ, తీన్ చార్ రాణీ
వన్ మే భీ హై చంపారాణి (దానిమ్మ పండు)

**17. యక్ష ప్రశ్నలు**

భూమి కంటె బరువైనది ఏది (తల్లి)

**18.** **పద్య రూపంలో**

కములు మూడు గలవు కాడు త్రినేత్రుండు
పక్షికాదు చెట్టుపైన నుండు
జలము దాల్చి యుండు నీలమేఘుండు గాడు
దీని భావమేమి తిరుమలేశ (టెంకాయ)

**19.** **సినిమాల్లో**

ఒంటి కాలిపై నుండే, హఠయోగ ముద్రలో నుండే గట్టిగ పని సాధించినది వివరిస్తావా? చిన్నదానా! (కొంగ)

**పొడుపు కథల స్వరూపం :**

పొడుపు కథల స్వరూప స్వభావాలను గురించే రోగర్ డి అబ్రహమ్ "సమాధానం తెలియని వారిని సందిగ్ధ పరిస్థితిలో ఉంచే నిమిత్తం లేదా ప్రశ్నించే నిమిత్తం వేసే వినోద ప్రశ్నలే పొడుపు కథలు" అన్నారు.

**పొడుపు కథలు పర్యాయ పదాలు :**

అడ్డుక (త)థలు, ఎదురుకతలు, ఒడ్డుకతలు, కథకట్టు పద్యాలు, చిక్కుముళ్ళు, చిట్కాలు, చిటుకలు, చిటుకుల, పొడుపు కథలు, మారుతట్లు, యక్షప్రశ్నలు, విడుపు కథలు, శాత్రాలు, శాస్త్రాలు, సమచ్చలు, సమస్యలు.

## వర్గీకరణ



### పొడుపు కథలు వాటి ప్రయోజనాలు :

పొడుపు కథలకు ఉన్న గొప్ప సుగుణం ఏమిటంటే, ఇవి విన్న వెంటనే మనసుకి ఆలోచనలు కలిగించి, వివేచన పెంపొందించి వాటి విడుపు ఎలాగయినా విప్పాలి అనే జిగ్ఞాస పుట్టిస్తాయి. పొడుపు కథల చరిత్రకి వస్తే వీటిలో కొన్ని అతిప్రాచీనకాలం నుంచి, మన కావ్యాల్లో కథల్లో ఇమిడిపోయి ఉన్నాయి. ఉదాహరణకి కాశీమజిలీ కథలే తీసుకోండి. అందులో మనకు కావలసినన్ని పొడుపు కథలు ఉన్నాయి. మన తేట తెలుగులో లెక్కకు మిక్కిలిగా ఉన్న పొడుపు కథలు భాష, భావం ఒకదాని వెంట ఒక పోటీ పడి పరుగులు పెడుతున్నట్టుగా ప్రశ్నించే విషయాన్ని, బహుపసందుగా రూపకల్పన చేసి, కొసమెరుపుగా వాటి విడుపు తెలుపుతూ ఉంటాయి.

ఋగ్వేదంలో సైతం జీవితం విలువను తెలియజేసే పొడుపు కథ ఉంది. ఆపొడుపు కథ గురించి తెలుసుకుందామా

ద్వా సుపర్ణా సయుజా సఖయా సమానం వృక్షం పరిషస్వజాతే।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్ అన్యో అభిచాకశీతి॥

ఒకే చెట్టుపైన రెండు పక్షులు ఉన్నాయి. క్రింద కొమ్మ మీద ఉన్న పక్షి పళ్ళను తింటున్నది. అది తియ్యని పళ్ళను తిన్నప్పుడు సుఖాన్ని, చేదు పళ్ళను తిన్నప్పుడు దుఃఖాన్ని పొందుతున్నది. రెండవ పక్షి ఏమీ తినకుండా ప్రశాంతంగా కూర్చొని సుఖదుఃఖాలకు అతీతమైన ఆత్మానందాన్ని అనుభవిస్తూ ఉంది.

శరీరం - చెట్టు, పళ్ళు తింటున్న పక్షి - జీవాత్మ,
పళ్ళు తినకుండా ఉన్న పక్షి - పరమాత్మ.

విషయవాంఛలను అనుభవిస్తున్న వ్యక్తి సుఖ దుఃఖాలను పొందుతాడు. వీటికి అతీతంగా ఉన్న వ్యక్తి ఆత్మానుభూతిని పొందుతాడు. జీవాత్మ పరమాత్మతో ఏకమవ్వాలంటే ఆధ్యాత్మిక సాధనల ద్వారా శుద&ధ మనస్సును పొంది వాంఛారహిత స్థితిని చేరి సర్వత్రా ఉన్నది ఒకే ఆత్మ అను అనుభవము పొందడం ఒక్కటే మార్గం.

### ముగింపు :

ఆలోచనా శక్తిని పదును పెట్టే పొదుపు కథలంటే పిల్లలు ఎక్కువ యిష్టపడతారు. పిల్లలకు రకరకాల పొడుపు కథలు చేసి వారి మెదడును పదును పెట్టాలి. సాంప్రదాయకంగా వస్తున్న పొడుపు కథలనే కాకుండా ఆధునిక కాలానికి సంబంధించిన విషయాలపైన పొదుపు కథలు తయారు చేసి పిల్లల్లో ప్రచారం చేయాలి. పిల్లల చేత వారి సృజనాత్మకత పెంచుటకు కొన్ని పొడుపు కథలు తయారు చేయించాలి.

### ఉపయుక్త గ్రంథ సూచి :

1. చమత్కార పొడుపు కథలు, రాజమండ్రి గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్స్, సీతారమ బుక్ డిపో.1951.
2. నేదునూరి గంగాధరం - పొడుపు కథలు - జానపద గేయ వాజ్మయ వ్యాసావళి, రాజమండ్రి విశ్వ సాహిత్య మాల. 1961.
3. వెంకటప్పయ్య పొడుపు కథలు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ. నవరత్న బుక్ హౌస్ విజయవాడ.2017.
4. డాక్టర్ ఎంకే మద్దిలేటి. తెలుగు సాహిత్య దీపిక. విశ్వవాణి పబ్లికేషన్స్ కర్నూల్. 2015.
5. ఆర్ వి ఎస్ సుందరం పొడుపు కథలు తెలుగు జానపద సాహిత్య స్వరూపం, బెంగుళూరు, జానపద విజ్ఞాన సమితి. 1976.
6. బట్టు వెంకటేశ్వర్లు. జానపద విజ్ఞానం. పల్నాడు పబ్లికేషన్స్ గుంటూరు.
7. తెలుగు పొడుపు కథలు(సిద్ధాంత వ్యాసం) కసిరెడ్డి వెంకటరెడ్డి 1990.

# ఆర్వీయస్ సుందరంగారి ఆంధ్రుల జానపద విజ్ఞానం - సామెతలు సమాలోచన

- డా॥. గంధం వేణు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దర్శి, ప్రకాశం జిల్లా.

పెన్నాతీరంలో పురుడుపోసుకొని కావేరి జలపాతాల సవ్వడిలో పరవశించి కలం పట్టి సాహిత్య సేద్యం చేసిన సాహితీ కృషీవలుడు. గోదావరి జలపానంతో అక్షరాన్ని అందరికీ పంచిన అక్షర అక్షయపాత్ర ఆర్వీయస్. యుక్త వయస్సులోనే లోకం పోకడ తెలుసుకొని ఆధునిక వేమన శతకం రచించిన అపర వేమనగా కీర్తింపబడ్డారు. పిన్న వయస్సులోనే 'దేశి సాహిత్యం'మనే గ్రంథాన్ని రచించి సాహిత్య అకాడమీ అవార్డును కైవశం చేసుకున్న అపార విజ్ఞాననిధి. పుస్తకమే మస్తకమై సమస్త జ్ఞానాన్ని ప్రోది చేసుకొన్న పుస్తకాల పురుగు. నన్నయ భారతాన్ని వచనంలోకి రాసి రాశిపోసి వాసి కెక్కిన సాహితీవేత్త. తెలుగు తియ్యదనాన్ని కన్నడ కమ్మదనాన్ని ఆద్యంతం ఆస్వాదించి రెండు భాషల్లోను పాండిత్యం పొందిన సాహితీ సవ్యసాచి. పండిత వరేణ్యులకే కొరుకుడు పడని ఆంధ్రశబ్ద చింతామణి గ్రంథాన్ని ఆపోసనపట్టి, తెలుగులోకి అనుసృజనగావించిన సాహితీ బ్రహ్మ.

తెలుగు సాహిత్యంలోని విశిష్ట గ్రంథాలను కన్నడం లోకి అనూదితం చేసి తేటతెలుగు తియ్యందనాలను కన్నడీగుడులకు చవి చూపిన అపర సాహితీ చాణిక్యుడు. గాసటబీసటగా ఉన్న కన్నడ సాహిత్యాన్ని సమగ్రంగా రచించి కన్నడ సాహితీ వేత్తలకు సవాలు విసిరిన నిఖార్సయిన సాహితీ ద్రష్ట ఆర్వీయస్. కథ, నవల, కవిత, అనువాదం అని తేడా లేకుండా అన్ని ప్రక్రియల్లోకి పరకాయ ప్రవేశం చేసి తన ప్రతిభా పాటవాలతో సాహితీ పిపాసకులకు కావ్యామృతాన్ని అందించిన అభినవ వైనతేయుడు. ఇంటి పేరులో రాళ్ళు ఉన్నా వాటితో సాహితీ సౌందర్య సౌధాన్ని నిర్మించుకున్న సార్థక నామధేయుడు. తన సుందరభావాలే శతాధిక గ్రంథ రచనకు నిలయమయ్యాయి.

తమ అంతేవాసి అనంత వాసిగా ఎదగాలని మనసా వాచా కర్మణా యే గురువైనా కోరుకోవడం పరిపాటి. గురువుల అభిష్టాన్ని పసిగట్టి గురువుల కంటే ఒక మెట్టు ఎత్తు జ్ఞానశిఖరాన్ని అధిరోహించి విద్య నేర్పిన గురువుకే మార్గదర్శకత్వం వహించిన ఉత్తమ పర్యవేక్షకులు. కులానికి సంకేతం జంధ్యం అయితే ఆ జంధ్యమే వద్దని త్యజించి సమసమాజాన్ని కాంక్షించిన మానవతావాది. జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేల?. నలభయ్యేళ్ళ పాటు ఎంతో మంది విద్యార్థులకు విద్యాధనాన్ని పంచి వారిని ప్రతిభామూర్తులుగా పెంచి ఆదర్శ మూర్తిగా, స్ఫూర్తి ప్రదాతగా తన మస్తిష్క గోళాన్ని విజ్ఞాన గోళంగా నింపుకున్న బహుముఖ ప్రజ్ఞశాలి ఆర్వీయస్. తెలుగు, కన్నడం, ఆంగ్లం, సంస్కృతం, హిందీ తమిళ భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన బహుభాషా కోవిదుడు. సుజ్ఞాని జానపదవిజ్ఞానఖని అయిన ఆర్వీయస్ సుందరం కలం నుంచి జాలువారి, ప్రపంచ ప్రసిద్ధి పొందిన అమెరికా జానపద విజ్ఞానవేత్త అలన్‌డండెస్‌చే ప్రశంసలందుకొని పలుమార్లు పునర్ముద్రణకు నోచుకున్న అపూర్వ గ్రంథం 'ఆంధ్రుల జానపద విజ్ఞానం'. ఈ గ్రంథంలోని సామెతలు అనే అధ్యాయాన్ని సమాలోచన చేయడమే నా వ్యాసం ప్రధాన ఉద్దేశం.

## ఆంధ్రుల జానపదవిజ్ఞానం :

ఆర్వీయస్ సుందరం అనగానే తెలుగు సాహితీ ప్రియులకు 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' గ్రంథం మదిలో మెదులుతుందంటే ఆ గ్రంథం ప్రాముఖ్యత

చెప్పనవసరం లేదు. పలువురి ప్రశంసలు పొంది అనేకమార్లు పునర్ముద్రణ పొందిన ఈ గ్రంథాన్ని రాయడానికి ఆర్వీయస్ సుందరం పదిహేను వసంతాలు శ్రమించి రాసిన ఈ ఉద్గ్రంథాన్ని 1983వ సంవత్సరంలో తెలుగు అకాడమీ వారు ప్రచురించారు. దీనిని మైసూరు విశ్వవిద్యాలయానికి సమర్పించి డి.లిట్ పట్టా పొందారు.

**సామెతలు - సమాలోచన :**

ఈ గ్రంథంలో రచయిత ఆర్వీయస్ సుందరం సామెతల గురించి వాటి ఆవిర్భావం, వికాసం గురించి కూలంకషంగా విపులీకరించారు. సామెత అనే మాట 'సామ్యత' అనే పదం నుండి వచ్చింది. సామ్యత అనగా పోలిక అని కూడా చెప్పడం కద్దు. వీటిని ఆంగ్లంలో ప్రోవెర్బ్ అని సంస్కృతంలో సూక్తి లేదా సుభాషితం అంటారు. సోదర భాషలైన తమిళంలో పళమొళి (పాత మాట) అని కన్నడంలో గాదె లేదా నాణ్ణుడి అని అంటారు. మలయాళంలో పళమొళి లేదా లోకోక్తి అని అంటారు. తెలుగు నాట సామెతలకు ఒక విశిష్ట స్థానం ఉంది. తెలుగులో ఆంధ్రప్రదేశ్ అకాడమీ వారు సామెతలు అన్నీ సేకరించి గ్రంథాన్ని ముద్రించారు. జానపద విజ్ఞానవేత్త నేదనూరి గంగాధరంగారు 'పసిడి పలుకులు' వ్యవసాయ సామెతలు అనే గ్రంథాలను రచించారు.

సామెతలను గురించి ఆర్వీయస్ సుందరం ఇలా అంటారు.

"అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని రచన అన్న వాక్యానికి సామెతలు ఉదాహరణలుగా ఉంటాయి. సామాన్యంగా సామెతలలో ఒక వాక్యం మాత్రం ఉంటుంది. ప్రాచీన కళాత్మక అభివ్యక్తులలోసామెతలు ముఖ్యమైనవి. అయితే సామెతలు ఎప్పుడూ సంక్షిప్తంగానే ఉంటాయని అను కోవడానికి వీలులేదు. నాతి దీర్ఘమై, గభీరంగా సూచ్యంగా అనుభవాన్ని అభివ్యక్తీకపరించినట్లయితే అలాంటి వాక్యాలను సామెతలని పిలవడంలో తప్పులేదు." (ఆంధ్రుల జానపద విజ్ఞానం-173)

సామెతలు ఒక వాక్యం లేదా రెండు వాక్యాల రూపంలో ఉండవచ్చు. సామెత లేని ఇల్లు ఆమెత లేని ఇల్లు వంటిదని కొందరి అభిప్రాయం. ఆమెత లేని ఇల్లు అంటే విందు భోజనం లేని ఇల్లు అని అర్థం. ఇవి ప్రాసను కలిగి ఉండి లయాత్మకంగా ఉంటాయి. ఇవి పలకడానికి వినసొంపుగా ఉంటాయి. సామెతలు మాటలకు అందాన్నిస్తాయి. చెప్పవలసిన విషయాన్ని అల్పాక్షరాలలో అనంతార్థాన్ని అందించడం సామెత ప్రధాన లక్షణంగా చెప్పవచ్చు. వీటిలో కవితా గుణం ఉంటుంది. సామెతలు ఎవరో ఒకరి నోళ్ళలో నుండి వెలువడి వేరే వాళ్ళ నోళ్ళకు చేరి అలా వ్యవహారంలోకి వచ్చి ప్రజల నాలుకలపై నాట్యమాడుతూ స్థిరత్వాన్ని పొందుతాయి. ఇందులో అలంకారాలు కూడా ఉంటాయి.

**సామెతలు - ఉత్పత్తి :**

సామెతల ఉత్పత్తిని గురించి రచయిత తెలియజేస్తూ జానపద సాహిత్య రూపాలలో సామెత అనేది చిన్నది కావడం వలన దానిలో చరిత్రకు సంబంధించిన ఆధారా లను సేకరించడం చాలా కష్టం అంటారు. మౌలికమైన ప్రతిభ, కల్పనాశక్తి, అన్వేషణాసక్తి ఉన్న అతి ప్రాచీన మానవుడే సామెతలను సృష్టించాడని అంటారు. మనోవిశ్లేషణ సిద్ధాంతం, స్వప్న సిద్ధాంతాలు సామెతలు ఎందుకు పుట్టాయో కొంతవరకు తెలియజేస్తాయని అంటారు. భౌగోళికంగా ఒక సామెత ఏ ప్రదేశానికి చెందిందనే విషయాన్ని పరిశీలించడానికి చారిత్రక - భౌగోళిక సిద్ధాంతం, ఫిన్నిష్ పద్ధతి ద్వారా కూడా గుర్తించ వచ్చని అదేవిధంగా కొన్ని సామెతలు పురాణాలు, ఐతిహ్యాలు, కథల అధ్యయనాలను ఆధారంగా చేసుకొని ఉద్భవిస్తాయని సామెతల ఉత్పత్తి పట్ల తన అభి ప్రాయాన్ని తెలియజేశారు.

పురాణేతిహాసాల నుంచి పుట్టిన సామెతలకు ఉదాహరణగా కింది వాటిని పేర్కొన్నారు.

'రామాయణంలో పిడకల వేట'

'వింటే భారతం వినాలి - తింటే గారెలు తినాలి'

'రామాయణం అంతా విని రాముడికి సీతేం కావాలని అడిగినట్లు'

జీవితానుభవాలనుండి నుంచి కూడా సామెతలు పుడతాయనే విషయాన్ని గురించి రచయిత తెలియజేస్తూ వాటిని గురించి ఇలా అంటారు.

'రోట్లో తలపెట్టి రోకటి దెబ్బకు జడిసినట్లు'

'చిన్న మిరపకు కారం హెచ్చు'

'తీట గలవాడికి తోటగలవాడికి తీరిక వుండదు'

'తిరిగే కాలు తిట్టే నోరు వూరుకోవు'

సామెతల విభజన గురించి రచయిత ఇలా అంటారు.

'సామెతలను విభజించడంలో ముఖ్యంగా రెడు పద్ధతులున్నాయి. అకారాదిగా విభజించడం మొదటిది. దీనిలో మళ్ళీ రెండు ఉపమార్గాలున్నాయి. సామెతల మొదటి మాటను తీసుకొని అకారాదిగా అమర్చడం లేక సామెతల్లో ముఖ్యమైన పదాన్ని తీసుకొని అకారాదిగా కూర్చడం. మొదటి పద్ధతికాక మరో పద్ధతి ఉంది. అది వస్తువును ఆధారంగా చేసుకొని వర్గీకరించడం. మొదటిదాని కంటే ఇదే ఉత్తమమైనదనిపిస్తుంది. లేకుంటే సామెత ఏదైనా కావాలంటే పుస్తకమంతా వెతకవలసి ఉంటుంది. మొదట వస్తువును బట్టి వర్గీకరించి తర్వాత ఒక్కొక్క వస్తువుకు సంబంధించిన సామెతల్ని అకారాదిగా కూర్చవచ్చు. ఇలాంటి విభజనలో అకారాది పద్ధతిని అనుసరించినా ఉపవిభాగాలుంటాయి కాబట్టి సులభంగా సామెతల్ని వెతుక్కోవచ్చు'(ఆంధ్రుల జానపద విజ్ఞానం - 178)

కొన్ని సామెతలు సత్యాన్ని, నీతిని గురించి తెలియజేస్తాయంటారు.

'పరుల సొమ్ము పాపిష్టి సొమ్ము'

ఒక సూత్రాన్ని గానీ అనుభవాన్ని గురించి గానీ చెప్పేటప్పుడు ప్రయోగించే సామెతలను గురించి ఉదాహరణ కింది సామెతను ఇస్తాడు.

'మౌనం అంగీకార సూచకం'

నన్నయ కాలం నుంచే అనేక సామెతలు, పలుకు బళ్ళు ఉన్నాయని ప్రాచీన కాలానికి చెందిన కవులు కూడా వారి రచనల్లో సందర్భానికి అనుగుణంగా ప్రయోగించిన సామెతలను ఇలా తెలియజేస్తారు.

'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్' (నన్నయ)

'లేడి కడుపున పులి పుట్టునే' (నన్నయ)

'పాలలో బడిన బల్లివిధంబున నుండకుండునే' (తిక్కన)

'చెప్పకుమిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్' (పెద్దన)

ప్రజాకవి వేమన రాసిన వేమన శతకంలోని సామెతలను కొన్నింటిని ఇలా తెలిపారు.

'భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు'

'అనువుగాని చోట అధికులమనరాదు'

'తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు'

కవులు ఏదైనా ఒక విషయాన్ని వివరించవలసి వచ్చిన సందర్భాలల్లో పాఠకుల మనస్సును హత్తుకొనే విధంగా చేయడానికి అల్పాక్షరాలల్లో అనల్పార్థాన్ని చెప్పడానికి అనుభవంలోని విషయాలను వారు చూసిన లేక చెప్పగా విన్నటువంటి విషయాలను సామెతల రూపంలో చెప్పిన విధానాన్ని రచయిత విశ్లేషించిన తీరు వారి పరిశోధనాసక్తి తెలియజేస్తుంది.

శిష్ట కవులు రచించిన కావ్యాలల్లో జానపద సాహిత్యంలో అధికంగా గేయాలలో, కథా గేయాలలో, గద్య కథలలో సామెతలు పెక్కు సామెతలు కనిపిస్తాయని ప్రసిద్ధ జానపద విజ్ఞానవేత్త బిరుదురాజు రామరాజుగారి జానపద సాహిత్యం నుండి మరికొన్ని ఉదాహరణలను ఆర్వీయస్ సుందరం కింది విధంగా తెలియజేస్తారు.

'పేదవాని కోపం పెదవుల తీట'

'చల్లకోసము వచ్చి ముంత దాచంగనేల మనకు'

'ఉసురువున్నన ఉప్పమ్మవచ్చును ఊరికి పోవన్నా'

'రాజులు హృదయము రాయితో సమమండ్రు'

'కడవంత గుమ్మడి కత్తి పీటకు లోకువ'

'దాసుని తప్పు దండముతోసరి'

## తెలుగు సామెతలు - సమీక్ష :

తెలుగు సామెతలు ఎప్పుడు ఎక్కడి నుండి పుట్టాయి. అవి ఎక్కడి నుంచి వచ్చాయి అన్నది చెప్పడం కష్టతర మైనప్పటికి అవి జనాల నాలుకలపై నాట్య మాడుతూ సందర్భాన్ని బట్టి ప్రయోగింపబడుతున్నాయి. విషయా నంతా చెప్పకుండా ఒకటి లేదా రెండు వాక్యాలలో విషయావగాహన చేస్తూ శ్రోత లేద పఠితకు మనోవికాసం కలిగిస్తున్నాయనుట అతిశయోక్తి కాదు. తెలుగు సామెతలు గురించి అనుకున్నంత స్థాయిలో సమగ్ర పరిశీలన జరగలేదని సాహిత్య పరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సామెతలను విశ్లేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రచయిత వారి అభిప్రాయాన్ని తెలియ జేస్తారు.

సామెతలు వినడానికి వినసొంపుగా ఉంటూ పలక డానికి సౌకర్య వంతంగా ఉండడంతో పాటు వాటిని నేర్చుకుంటున్నామనే స్పృహ లేకుండా జ్ఞానపేటికలో నిక్షిప్తమవుతాయి. వాటి అవసరాన్ని బట్టి వాటిని ప్రయోగించడం ద్వారా ఎదుటి వారికి అందించవలసిన విషయాన్ని సమగ్రంగా అందిస్తాము.

సాహిత్య పరమైన సౌందర్యం సామెతల్లో ఉందనే విషయాన్ని గురించి రచయిత తన అభిప్రాయాన్ని ఇలా తెలియజేస్తారు.

'సామెతలు అర్థగాంభీర్యం కలవి కావడంచేత సాహిత్యపరంగా వాటికి చాలా విలువ ఉంది. అల్పాక్షరా లలో అనల్పార్థ రచనకు చక్కని ఉదాహరణలుగా సామెతల్ని చెప్పుకోవచ్చు. అయితే అన్ని సామెతలూ సాహిత్య గంధం ఉండేవనడానికి వీలులేదు. ఎందుకంటే సామెతల్లో పౌరాణికాలు, చారిత్రకాలు, నీతిసంబంధాలు మొదలైనవి అనేకం ఉన్నాయి. అయితే ధ్వని ప్రధానాలై, మనిషిలోని అనుభవసారాన్ని సూచనప్రాయంగా తెలిపే సామెతలు కూడా అసంఖ్యాంకంగా కనిపిస్తాయి. ప్రాసాను ప్రాసలే పరమావధిగా భావించి, శబ్దాడంబరంతో అకవిత్వాన్ని కవిత్వంగా భాసింపజేసిన కవులెంతోమంది మనకున్నారు. అలాంటి కవిత్వం కంటే రసాత్మక వాక్యాలైన సామెతలే ఎంతో మేలనిపిస్తాయి. అర్థానికి అర్థం. శబ్ద సౌందర్యానికి శబ్దసౌందర్యం రెండూ ఉండే సామెతలు సాహితీ విమర్శకులను ఎక్కువగా ఆకర్షించకపోవడం దురదృష్టమనాలి.' (ఆంధ్రుల జానపద విజ్ఞానం -189)

కొన్ని సామెతలను విశ్లేషిస్తూ ఆ సామెతల వెనుక దాగిన మార్మికతను గురించి చెప్పిన రీతిని పరిశీలిస్తే వారు జానపద విజ్ఞాన సేకరణకు చేసిన కృషి మోక్షసాధనకై తపస్సు చేసే తాపస్సులను తలపింపజేస్తుంది. కొన్ని ఉ దాహరణలను పరిశీలిద్దాం.

'కాలు జారితే తీసుకోవచ్చుగాని-నోరు జారితే తీసుకోగలమా' అనే సామెతను ఇలా విశ్లేషిస్తారు.

ఏ విధంగా చూచినా మహార్థం భాసించే సామెత ఇది. జీవితంలో మాటకు ఉండే విలువను, సమాజంలో వ్యక్తికి వ్యక్తికి ఉండే సంబంధాన్ని , సంఘంలో మనిషి తీసుకో వలసిన జాగ్రత్తను ధ్వని ప్రధానంగా చెబుతున్న వాక్యమిది. కాలు అన్నది వస్తువు. ఒక వస్తువును స్థలాంతరం చేయడం సులభం. కాలు జారితే దేహానికి బాధ కలగవచ్చు. కానీ నోటి మాట గాలిలో పయనించేది. ఒకసారి మాట నోటి నుంచి వెలవడితే మళ్ళీ దాన్ని వెనక్కి తీసుకోవడం సాధ్యంకాదు. మాట ప్రభావం మనసు మీద ఉంటుంది. దేహం మీద కాదు. దేహానికి కలిగే బాధకన్నా మనసుకు కలిగే బాధ గొప్పది. అందువలన నోరు జారే ముందు నాలుగుసార్లు ఆలోచించ వలసి ఉంటుంది. ఇది జీవితంలో మనకు కలిగే అనుభవం. దీన్ని వివరించే ఉపాఖ్యానాలు మన పురాణాలలో, ఇతిహాసాలలో చాలా దొరుకుతాయి. కైకేయి దగ్గర నోరు జారిన దశరథుడు

ఎన్నిపాట్లు పడ్డాడో మన మెరిగిందే. సూర్యుని దగ్గర నోరు జారిన కుంతి కర్ణుణ్ణికని ఎన్ని అవస్థలు పడిందో మనకు తెలిసిన విషయమే. ఇలాంటి సందర్భాలు పురాణాలలో చాలా ఉన్నాయని సెలవిస్తారు.

సామెతలు మన సంస్కృతికి దర్పణాలు వీటిలో మన ఆచార వ్యవహారాలు, నీతి నియమాలు మొదలైనవి ప్రతిఫలిస్తాయి. సామెతల ద్వారా ఆనాటి కాలాన్ని సమాజాన్ని అంచనా వేయవచ్చు. ఏ సందర్భంలో అన్నారు. ఎందుకు అన్నారో ఆ సామెతను లోతుగా పరిశీలిస్తే విషయం బోధపడుతుంది. సాంస్కృతికపరమైన సామెత లను గురించి రచయిత చెబుతూ వాటిలో ఆంధ్రుల సామాజిక జీవితంలో అత్తకుండే స్థానాన్ని సామెతల ద్వారా ఇలా తెలియజేస్తారు.

'అత్తకాలం కొన్నాళ్ళు - కోడలికాలం కొన్నాళ్ళు'

'అత్తకు మంచిలేదు, చింతకు పచ్చిలేదు'

'అత్తకు లేక అటికలు నాకుతూ వుంటే అల్లుడొచ్చి దీపావళి పండగన్నాడట'

'అత్తవారింటి సుఖం మోచేతి దెబ్బ'

ధనానికి, పెళ్ళికి పిసినారితనానికి సంబంధించిన సామెతలను గురించి చక్కగా విశ్లేషణ చేశారు.

## సామెతలు - తలనాత్మక అధ్యయనం :

తెలుగు సాహిత్యంలోని సామెతలకు సారూప్యత కలిగిన సామెతలు సోదర భాషలైన తమిళం, కన్నడం భాషల్లో చాలా ఉన్నాయని తులనాత్మక అధ్యయనం చేసే సమయంలో ఒక భాషలోని సామెతలను మరొక భాషలోకి అనువాదం చేసే సమయంలో లక్ష్య భాషకు అనుగుణంగా అనువదించడంసరియైన పద్ధతి కాదని కొంత అర్థ భేదమున్నప్పటికి వాటిని మూల భాషలో ఉన్నట్లే అనువదించాలని అలా చేసినప్పుడు మూల భాష ప్రత్యేకత, నుడికారపు సొంపు తెలుస్తాయని తెలియజేస్తూ భావి పరిశోధకులకు సూచన చేశారు. వీరు కన్నడ భాషలోని సామెతలకు తెలుగు భాషలోని సామెతలకు మధ్య ఉన్న సారూప్యతను ఉదాహరణ సహితంగా ఇలా తెలియజేసిన తీరు వారి పరిశోధనాసక్తికి తార్కాణం.

'రాత్రంతా రామాయణం విని రాముడికి సీతే మవుతుందని అడిగినట్లు - తెలుగు'

'బెళగానె రామాయణ కేళి బెళగ్గె రామనిగె సీతె నాగ బేకంద్వాగె - కన్నడం'

(పొద్దుటిదాకా రామాయణం విని పొద్దున్నే రాముడికి సీతేంకావాలన్నట్లు)

వీటిని పరిశీలించినప్పుడు రెండు సామెతల అర్థం ఒకే విధంగా ఉన్నప్పటికి చెప్పే విధానంలో మార్పు గోచరిస్తుంది. ఇలా కన్నడం మరియు తెలుగు సామెతల మధ్య సంబంధాన్ని తెలియజేశారు.

## సామెతల అధ్యయనం - రచయిత అభిపాయం:

సామెతలు అనేవి మనిషి జీవితాన్ని ప్రతి బింబింపజేస్తాయి. వీటి అధ్యయనం వలన లోకం పోకడ తెలుస్తుంది. సామెతల సేకరణ, పరిష్కరణ, విశ్లేషణ అనేవి శాస్త్రీయంగా జరగాలంటారు. 'సామెతలను సేకరించేటప్పుడు వాగ్రూపంగా గాని, వ్రాత ప్రతుల రూపంగా గాని ఉన్న సామెతల్ని యధాతథంగా ఏమీ మార్పు చేయకుండా లిఖితం చేయాలి. సామెతలకు మెరుగులు పెట్టే పని చేయరాదు. పాఠాంతరాలు ఉంటే గుర్తించాలి.ఎక్కడ, ఎప్పుడు, ఎవరి వల్ల వినింది. లేక ఏ గ్రంథం నుంచి సేకరించింది నమోదు చేసుకోవాలి. ఇలా శాస్త్రీయంగా సామెతలను సేకరించి, విశ్లేషించి అధ్యయనం చేస్తే సంస్కృతిని గురించిన ఎన్నోవిశేషాలు తెలిసివస్తాయి' (ఆంధ్రుల జానపద విజ్ఞానం-183) అని అంటారు.

## ఉపసంహారం :

మన పెద్దలు మాట్లాడే పది మాటల్లో ఒకటైనా సామెత ఉండేది. అలా సామెతలు ఉండడం వలన మాట్లాడిన మాటలకు మన్నిక ఉండేది. చెప్పవలసిన విషయానంతా వివరించి చెప్పవలసిన సందర్భాలల్లో ఒక సామెత చెప్పడం వలన శ్రోతకు లేద పాఠకునికి విషయావగాహన

కలుగుతుంది. ప్రపంచీకరణలో భాగంగా మనిషి జీవన శైలిలో మార్పు రావడంతో సంస్కృతి సంప్రదాయాలను పాత చింతకాయ తొక్కులాగా పరిగణిస్తున్నారు. జానపద సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని ఆదరించేవారు కనుమరుగు కావడంతో జానపదవిజ్ఞానం తన ప్రాభవాన్ని కోల్పోతుంది. భావి తరాలకు వీటి విశిష్టత తెలిసే అవకాశాలు తక్కువనే చెప్పాలి. జానపద విజ్ఞానంలో భాగమైన సామెతలు నేడు కనుమరుగవుతున్నాయి. వీటిని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఆంధ్రుని భుజ స్కంధాలపై ఉంది.

తిరిగే కాలు ఆడేనోరు ఒకచోట నిలబడవనే సామెతకు దృష్టాంతంగా ఆచార్య ఆర్వీయస్ సుందరంగారిని పేర్కొనవచ్చు. ఎలాగంటే విశ్రాంతి పొందినప్పటికీ అవిశ్రాంతంగా సాహితీ సేవలో తరిస్తున్న వీరికి వారే పోటీ రారెవరూ సాటి. భావి పరిశోధకులు, సాహితీ ప్రియుల మయిన మనం ఆ అవిశ్రాంత సాహితీ సమరయోధుడ్ని ఆదర్శంగా తీసుకొని జానపద విజ్ఞానాన్ని పరిరక్షించేం దుకు కంకణబద్ధులం కావాలని ఆశిస్తున్నాను.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. జానపద విజ్ఞాన స్వరూపం - ఆచార్య ఆర్వీయస్, సుందరం
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - ప్రతాపరెడ్డి, సురవరం
3. తెలుగు సామెతలు - వెంకటావధాని, దివాకర్ల
4. ఆంధ్రుల జానపద విజ్ఞాన సర్వస్వం - ఆచార్య ఆర్వీయస్, సుందరం

❖❖❖

# బాల సాహిత్యం స్వరూపం – పరిణామం

– డా॥. బి. చక్రవర్తి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

మానవ జీవితంలో మొట్టమొదటి దశ బాల్యం. ఇది వ్యక్తి జీవితంలో చీకూ చింతాలేని దశ. అమాయకత్వానికి, మంచితనానికి బాల్యం మారుపేరు. అందుకే పిల్లల్ని పరబ్రహ్మస్వరూపులంటారు. అలాంటి బాలబాలికల శ్రవణ పఠనాదులకు ఉద్దేశించబడ్డ రచనల సముదాయమే బాల సాహిత్యం. ఈ సాహిత్యం వాళ్ళు వినదగింది, నేర్చుకోదగింది, చదువుకోదగింది. ప్రధానంగా బాలల ఉపయోగార్థం సృష్టింపడింది. ప్రౌఢ సాహిత్య తత్వానికీ, ప్రయోజనానికీ భిన్నమైంది బాలసాహిత్యం.

బాల్యదశ వయ:పరిమితిని నిర్ణయించడంలో విద్యావేత్తలకు, మనస్తత్వ శాస్త్రజ్ఞులకూ మధ్య చాలా తేడా ఉంది. పుట్టినప్పటి నుంచి పదహైదేండ్లవరకు బాల్యమని కొంతమంది, పద్దెనిమిదేండ్ల దాకా బాల్యమని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. పదిహేనేండ్లన్నా, పద్దెనిమిదన్నా నిండు నూరేండ్ల జీవితంలో చాలా తక్కువ కాలమే. అయినా ఆ నిండు నూరేండ్ల జీవితానికీ కావలసిన ప్రాతిపదిక ఈ బాల్యదశలోనే ఏర్పడుతుంది.

ఆధునిక కాలంలో ప్రపంచమంతటా సంభవిస్తున్న వైజ్ఞానిక విప్లవ కారణంగా పిల్లలు నాడు వయసుకు మించిన మనోవికాసాన్ని పొందగలుగుతున్నారు. కాబట్టి పదిహేనేండ్లవరకు బాల్యదశగా పరిగణించడం సమంజసం. అయితే ఈ పదిహేనేండ్లవరకు బాల్యావస్థనంతటినీ ఒకే దశగా కూడా భావించలేము. అయితే ఈ పదిహేనేండ్ల బాల్యావస్థనంతటినీ ఒకే దశగా కూడా భావించలేము. పిల్లల పెరుగుదలలో, మన:ప్రవృత్తిలో కలిగే మార్పుల్నిబట్టి బాల్యావస్థను 3 దశలుగా వర్గీకరించవచ్చు. పుట్టినప్పటి నుంచి ఐదేండ్ల వరకు మొదటి దశ. ఐదు నుండి పదిదాకా రెండవదశ. పది నుండి పదిహేనేండ్ల దాకా మూడవ దశ. ఈ దశలననుసరించే బాలసాహిత్య స్వరూపం కూడా ఉంటుంది. బాలసాహిత్యాన్ని శ్రవ్య, దృశ్య, పఠన సాహిత్యాలని మూడు రకాలుగా విభజించవచ్చు. విని ఆనందించేది శ్రవ్య సాహిత్యం. చూచి ఆనందించేది దృశ్య సాహిత్యం, స్వయంగా చదువుకొనేది పఠనసాహిత్యం.

పిల్లలు భావిపౌరులనుకుంటే బాల్య దశకు ఎంతో ప్రాధాన్యం కనిపిస్తుంది. అందుకే వాళ్ళ భావి జీవితాలకు ఉపయోగకరమైందీ, విజ్ఞానదాయకమైందీ అయిన ప్రాతిపదికను ఏర్పరచాలంటే ఏమిటి మార్గం? ఆ మార్గాన్నే కొన్నివేల ఏండ్లుగా మన పూర్వులు అన్వేషిస్తూ వచ్చారు. చిన్న పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకొని వాళ్ళకు సుద్దులూ బుద్ధులూ చెప్తూ ఆ మార్గాన్ని అనుసరించే వాళ్ళు. కేవలం నీతులు చెప్పడానికని పిలిస్తే పిల్లలు దగ్గరికి రారు. కాబట్టి ఆ నీతుల్ని కథల్లో ఇమిడ్చి వాళ్లలో వినాలనే కుతూహలం రేకెత్తేవిధంగా కథలల్లి చెప్పే వాళ్ళు. ప్రపంచ జ్ఞానం, ధర్మాధర్మాలు, లోకం పోకడలు, బతుకు తెరువు, జీవుల స్వభావాలు, నీతినియమాలు, ఆచారాలు, కట్టుబాట్లు ఇలా ఒకటేమిటి ప్రపంచ పరిస్థితులన్నిటినీ ఆ కథల్లో ఇమిడ్చే వాళ్లు. ఆ విధంగా పిల్లలకు విజ్ఞానాన్ని అందించడానికి సాహిత్యం ఒక మంచి సాధనమయింది.

బాలల వయసునుబట్టి బాల సాహిత్య స్వరూపం ఉంటుంది. పిల్లలు పుట్టినప్పటి నుంచి ఐదేండ్ల వరకు మొదటి దశగా గుర్తించవచ్చు. ఈ దశలో కూడా మూడేండ్ల తరవాతనే పరిసరాల ప్రభావానికి స్పందించే మానసిక పరిణతి పిల్లల్లో కనిపిస్తుంది. ఈ దశలో పిల్లల జీవితం ఎక్కువగా ఇంట్లోనూ, ఇంటి పరిసరాల్లోనూ గడుస్తుంది. మొట్టమొదట వాళ్ళు నేర్చుకొనే విద్య తల్లిదండ్రులతో మొదలవుతుంది.

ఈ దశలోని పిల్లలకు ప్రీతికరమైంది శ్రవ్య సాహిత్యం. తల్లులు పాడే లాలిపాటలు, జోలపాటలు, బువ్వ

పాటలు, చందమామ పాటలు ఈ కోవలోకి వస్తాయి. పాటలేగాక చిన్న చిన్న కథల్ని కూడా పిల్లలు ఆసక్తికరంగా వింటారు. రంగుల బొమ్మలు, వింత వింత ఆకారాలు వాళ్ళను ఆకర్షిస్తాయి.

ఐదు, పది సంవత్సరాల మధ్యగల బాల్యం రెండవ దశ. అక్షరాభ్యాసం తరవాత భాషా జ్ఞానాన్ని పెంపొందించు కున్న ఈ వయసు పిల్లలు క్రమంగా పాటల్ని, కథల్ని అర్థం చేసుకోవడమే గాక చిన్న చిన్న పాటల్ని, కథల్ని, పద్యాల్ని చదువుకొని ఆనందించగలరు. గుడుగుడు, దడదడ, ట్రింగ్, ట్రింగ్ లాంటి ధ్వన్యనుకరణ పదాల్ని ఉచ్చరిస్తూ ఆనందాన్ని పొందుతారు. కాబట్టి వాళ్ళ సాహిత్యంలో అలాంటి పదాల్ని చెప్పించాలి. ఎందుకు? ఏమిటి? ఎలా? అనే ప్రశ్నలలో పెద్ద వాళ్ళను తికమక పెట్టే ఈ వయసు పిల్లలకు ఉద్దేశించిన సాహిత్యం వాళ్ళ కుతూహలాన్ని తీర్చే విధంగా ఉండాలి. వీళ్ళకు బొమ్మలతో కూడిన దృశ్య సాహిత్యం కూడా ఉప యోగపడుతుంది. పఠన సాహిత్యం కూడా ఎక్కువగా ఉపకరిస్తుంది. నీతి కథలు, అద్భుత కథలు, పశు పక్ష్యాదుల కథలు, ఆటపాటలు ఈ వయసు వాళ్ళను అమితంగా ఆకర్షిస్తాయి.

బాల్యంలో పదకొండు నుంచి పదిహేనేండ్ల వరకు మూడవదశ. ఈ దశకు కౌమారమని కూడా పేరు. కుతూహలం, చమత్కారం, ఆశ్చర్యం, వినోదం, విజ్ఞానం, సంతోషం కలిగించే శ్రవ్య, దృశ్య, పఠన సాహిత్యాలు మూడూ ఈ వయసు వాళ్ళకు ఉపయోగపడతాయి. పిల్లల ఆలోచనాశక్తిని, కల్పనాశక్తిని పెంపుచేసే క్రీడా విషయాలు, కథలు, నాటికలు, శాస్త్రవిజ్ఞానం, నవలికలు, జీవిత చరిత్రలు, దేశచరిత్రలు, చిక్కు ప్రశ్నలు, యుక్తి లెక్కలు విస్మయానందాలతో నిండిన మనసుల్ని ఆకట్టుకొని వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి.

తెలుగులో బాలసాహిత్యం ఎప్పుడు మొదలయిందో కచ్చితంగా నిర్ణయించి చెప్పలేము. కాని దాని పుట్టుక అతి ప్రాచీన కాలంలో గేయ రూపంలో అది కూడ జానపద సాహిత్యరూపంలో జరిగి ఉంటుందని విమర్శకుల అభిప్రాయం.

ప్రాచీన బాలసాహిత్యంలో బాలలనుద్దేశించి పెద్దలు పాడే పాటలు, చెప్పే చిట్టిపొట్టి కథలే ఎక్కువ. దానికి కారణం ఆ సాహిత్యానికి మాతృహృదయం కర్తృత్వం వహించడమే. తెలుగు తల్లులు తమ పిల్లలకు ఉగ్గు పాలతో పాటు సంగీత సాహిత్యాలను కూడా రంగరించి పోశారనడానికి లాలిపాటలు, జోలపాటలు, కథలు ముఖ్య నిదర్శనం. పాల్కురికి సోమనాథుడు 'జోసఅచుచు సన్నుతి బాడు' జోలపాటల్ని పేర్కొన్నాడు. తన కాలంలోని రాగుంజు పోగుంజులాట, కుందెనగుడి, గుడిగుంజంబు, గోరంటలాట మొదలైన ఆటల్ని పండితారాధ్య చరిత్రలో పేర్కొన్నాడు. వెన్నెలకంటి సూరన, ధూర్జటి, తెనాలి రామ కృష్ణుడు, అయ్యలరాజు నారాయణామాత్యుడు మొదలైన వాళ్ళు సందర్భానుసారంగా తమ రచనల్లో కొన్ని ఆటల పేర్లను పేర్కొన్నారు. ఈ ఆటలన్నీ పాటలు పాడుతూ ఆడుకొనేవే. తాళ్లపాక కవుల సంకీర్తనల్లో లాలి, జోల, ఉగ్గు, ఊయల పాటలెన్నో ఉన్నాయి.

ప్రాచీన బాలసాహిత్యంలో వాగ్రూపంలో అనుశ్రు తంగా వస్తున్న గేయాలేగాక అమ్మమ్మలు చెప్పే కాశీమజిలీ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, పిట్టకథలు, వినోదంకోసం వేసే చిక్కు ప్రశ్నలు, పొడుపు కథలు మొదలైనవి ప్రాధాన్యం వహించినట్లు తెలుస్తున్నది.

19వ శతాబ్ది పూర్వార్ధంలో అక్షరాభ్యాస కాలంలోనే పిల్లలకు సుమతి శతకం, వేమన పద్యాలు, భాస్కర శతకం, గజేంద్రమోక్షం, కుచేలోపాఖ్యానం, రుక్మిణీ కళ్యాణం, ప్రహ్లాదచరిత్ర మొదలైనవాటిని బాలసాహిత్యం కింద జమకట్టి పిల్లలతో కంఠస్థం చేయించే సంప్రదాయం ఉండేది. ఆ తరువాత ఆధునిక స్కూలు దేశంలో ప్రవేశ పెట్టబడింది. విషయపరంగా పిల్లలకు ఉత్సాహాన్ని, లోక నీతిని, జ్ఞానాన్ని, ఊహాశక్తిని పెంపొందించే పంచతంత్ర కథలు, అమరకోశము, బాల రామాయణము, పుదూరి సీతారామశాస్త్రి రచించిన పెద్దబాలశిక్ష (1845) బాలల

కోసం వెలువడినాయి. వీటిలోని విషయాలు పిల్లల గ్రహణశక్తికి అందుబాటులో ఉన్నా భాష మాత్రం క్లిష్టంగా ఉండేది. క్రమంగా పిల్లలే చదివి అర్థంచేసుకొనే విధంగా సాహిత్యం వెలువడింది. రచయితలే గాక పత్రికలు, సంస్థలు మొదలైనవి కూడా బాలసాహిత్య వికాసానికి తోడ్పడ్డాయి.

క్రీ.శ.16 శతాబ్ది ఉత్తరార్థంలో ఆంగ్లభాషా ప్రభావ కారణంగాను, రచయితల మౌలిక ప్రయత్నమూలంగాను తెలుగులో 19వ శతాబ్ది ఉత్తరార్థంలో గద్య పద్య గేయ రూపంగా ఆధునిక బాలసాహిత్యం ఆవిర్భవించి వ్యాప్తికి వచ్చింది. ఆంధ్ర సాహిత్య చరిత్రలో లాగే తెలుగు బాలసాహిత్య చరిత్రలోను కందుకూరి వీరేశలింగం పంతులు (1848-1919) గారితో నూతన శకం ఆరంభ మయింది. నీతికథా మంజరి పేరులో అనువదించి 1893లో రెండు సంపుటాలుగా బొమ్మలతో సహా ప్రచు రించారు. 1872లో నీతిదీపిక, 1889 లో స్త్రీ నీతిదీపిక, అబద్ధాలాడడం వల్ల వచ్చే అనర్థాలను పిల్లలకు వివరించ డానికి 1887 లో సత్య సంజీవని అనే పెద్ద కథను రాశారు. పిల్లలకోసం తెలుగు వాచకాలను రూపొందించారు. వావి కొలను సుబ్బారావు రామాయణ, భారత, భాగవత కథల్ని పిల్లలకోసం రాశారు. వేంకట పార్వతీశ్వర కవులు బాలలకు ఉపయుక్తమయ్యే బాలగీతావళులు రచించారు. అయితే ఈ రచనలన్నీ ప్రాచీన భాషా లక్షణాలకు లోబడి రచింపబడినవే.

వీరేశలింగం పంతులు గారి తరువాత బాల వాఙ్మయ వైతాళికులుగా పేర్కొన దగినవారు గురజాడ అప్పారావుగారు.

'అరటికాయ బజ్జి - మినప్పప్పు సొజ్జి

కలసిమెలసి తిందాం - కథలు వెతలు విందాం'

అంటూ పిల్లల్ని దృష్టిలో పెట్టుకొని కమ్మని శైలిలో గేయాల్ని రాశారు. పిల్లల మానసిక వికాసం కోసం లవణరాజుకల, కన్యక, పూర్ణమ్మ, దామన్ పితియస్ కథన కావ్యాలు కూడా రాసినట్లు సోమసుందర్ అభిప్రాయ పడినారు. ఖండకావ్య రచనలో సిద్ధహస్తులై నాళం కృష్ణారావు పైడిలేడి, అపవాదము, గోగీతము, విరిదండ, దీపావళి, గోరుముద్దలు, మీగడ తరకలు, వెన్నబుడగలు, పాలతరగలు, తేనె చినుకులు మొదలైన పేర్లతో మధుర గీతాలను రచించారు.

20వ శతాబ్దంలో బాలల వయోభేదాన్ని బట్టి ప్రత్యేకించబడ్డ బాలసాహిత్యం వ్యాప్తిలోకి వచ్చింది. బాలసాహిత్య రచయితలలో ప్రథములుగా గిడుగు సీతాపతి (1889-1968), చింతా దీక్షితులు (1891-1960) కనిపిస్తారు. సీతాపతిగారు పిల్లలకోసం ఎలుకా-పిల్లి, రైలుబండి, ఈగా-సాలీడు, చిలకమ్మ పెండ్లి మొదలైన గేయాల్ని రాశారు. భారతి పత్రికలో 'బాలానందం' అనే ప్రత్యేక శీర్షికను ప్రారంభించారు. 1955లో బాలానందం, 1958లో బాల వినోదం అనే గేయ సంపుటాల్ని ప్రచురించి బాలసాహిత్య రంగంలో ప్రభుత్వ బహుమానాన్ని కూడా అందుకొన్నారు.

1937 లో తెలుగు బాలసాహిత్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం మొదలయింది. ఆ సంవత్సరమే ఆకాశవాణి మద్రాసు కేంద్రం నుంచి తెలుగు పిల్లలకోసం బాలానందం పేరుతో దుర్గాబాయమ్మగారితో బాలల కార్యక్రమాలు ప్రారంభమైనాయి. మొట్టమొదట మద్రాసు, హైదరాబాదు, విజయవాడ కేంద్రాల నుంచి ఈ కార్యక్రమాలను న్యాయపతి దంపతులు నిర్వహించే వాళ్ళు. అందుకే వాళ్ళను రేడియో అన్నయ్య, రేడియో అక్కయ్య అని పిలుస్తారు. ఈ కార్యక్రమాలను నిర్వ హించిన వాళ్ళల్లో ఏడిదకామేశ్వరరావు, కె.సభా, రావూరి భరద్వాజ, వసంతరావు వెంకట్రావు, తురగా జానకీరాణి ముఖ్యులు, శని, ఆది వారాల్లో నిర్వహించే బాలానందం, బాలవినోదం కార్యక్రమాలే కాక బాలల దినోత్సవాలు, జాతీయ పర్వదినాల్లో బాలకవి సమ్మేళనాలు, పాటలు, పద్యాలు, నాటికలు, కథలు, బుర్రకథలు, ప్రహసనాలు ఎన్నో ప్రసారం చేయబడ్డాయి.

టెలివిజన్‌లో పిల్లల నాటికలు, పాటల పోటీలు, ఇతర కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి. పిల్లల్ని బాగా ఆకట్టుకొనే అవకాశం టెలివిజన్‌కు ఉంది.

పై పరిశీలనను బట్టి బాలసాహిత్యం జానపద సాహిత్యంలో పుట్టి ఆధునికయుగ ప్రారంభం నుంచి చాలామంది రచయితల కృషిఫలితంగా క్రమక్రమంగా అభివృద్ధిచెందుతూ ఒక ప్రత్యేక సాహిత్యశాఖగా స్థానాన్ని ఏర్పరచుకొంది. బాలసాహిత్యం సంపూర్ణ వికాసం చెందాలంటే ఒక రచయిత కృషి మాత్రమే సరిపోదు. రచయిత, చిత్రకారుడు, సంపాదకుడు, గ్రంథరూప నిర్ణేత, ప్రచురణ కర్త, విక్రేత, పాఠకుడు మొదలైన వాళ్ల సమష్టికృషి అవసరం. ఉత్తమ సాహిత్యాభివృద్ధికి ప్రభుత్వం, ప్రత్యేక సంస్థల ప్రోత్సాహం ఎంతైనా అవసరం.

ఆంగ్ల భాషా సాహిత్యాలకు ప్రాధాన్యం పెరగడంతో సామాజికంగా వచ్చిన మార్పుల కారణంగానూ తెలుగు భాషా సాహిత్యాలు కనుమరుగైపోయే పరిస్థితులు దాపురించాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో అభివృద్ధి చెందిన ఆధునిక బాలసాహిత్యం దాని కారణంగానే ప్రమాదంలో పడిపోయింది. తరతరాలుగా సంక్రమిస్తూ వస్తున్న జానపద సాహిత్యపు ఉనికి ఎక్కడో వెతుక్కో వాల్సిన పరిస్థితి దాపురించింది. హాయిగా పాటలు పాడుకుంటూ ఆడుకొనే సదవకాశం ఈనాటి పిల్లలకు లేదు. అమ్మఒడిలో పడుకొని కమ్మటి కథలు వినే పరిస్థితి అంతకన్నాలేదు. అమ్మపాడే లాలి పాటలు, జోలపాటలు విని మెల్లగా చల్లగా నిద్రలోకి జారుకొనే అదృష్టాన్ని తల్లులు కల్పించడంలేదు. పాటలు పాడుకొని ఆడుకొనే సమయం పిల్లలకు దొరకడంలేదు. సమయమున్నా వాటిని టి.విలు మింగేస్తున్నాయి. స్నేహితులతోను, బంధువులు ఇంటికొచ్చినప్పుడు వాళ్ల పిల్లలతోను అచ్చనరాళ్లు, వామన గుంటలు లాంటి ఆటలు ఆడుకోవడం, మెదడుకు మేతపెట్టే యుక్తి లెక్కలు, చిక్కు ప్రశ్నలు, పొడుపు కథలు పోటీపడి వేసుకొని ఆనందంగా గడిపే రోజులిక వస్తాయా? ఇవన్నీ తెలియకుండానే, వీటిని అనుభవించకుండానే తెలుగు పిల్లలు పెరిగి పెద్దవాళ్లయిపోతున్నారు. అలాంటి రోజుల్ని పిల్లల అనుభవంలోకి తేవడానికి ప్రభుత్వం, సంస్థలు, పెద్దవాళ్ళు తీవ్రంగా కృషిచేస్తే పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటల్ని వేయవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య, జి., నవ్య పరిశోధక ప్రచురణ, తిరుపతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998 శాస్త్రి, ద్వానా, ప్రతిభా పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న, వెలమల, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, విజయవాడ.
4. తెలుగు సాహిత్య చరిత్ర, 1996, శ్రీరామమూర్తి, కొర్లపాటి, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
5. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగాలు, 2015, నారాయణ రెడ్డి, సి., విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
6. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

❖❖❖

# హేతువాద సాహిత్యంలో త్రిపురనేని రామస్వామిచౌదరి

- డా॥. ఎం. వెంకటగౌరి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

**సంక్షిప్త పరిచయం :**

కవిరాజుగా పేరుగాంచిన త్రిపురనేని రామస్వామి చౌదరి 1887 సం॥ జనవరి 15వ తేదీన త్రిపురనేని బలమయ్యగారు, శ్రీమతి రామమాంబ గారికి పంచమ సంతానంగా జన్మించారు. సాంస్కృతిక పునరుజ్జీవ నోద్యమం, ఆంగ్ల విద్యావిధానాల ప్రభావంచే ప్రభావిత మైన ఆంధ్రదేశం ఆ తదుపరి ఎన్నో ఉద్యమాలకు కొలువైంది. సామినేని ముద్దు నరసింహనాయుడు, కందుకూరి, గురజాడ అప్పారావు గార్లు నిర్మించిన హేతువాద పునాదులపై అందమైన భవంతిని నిర్మించిన వారు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి. అలాగే తాపీ ధర్మారావు, గుఱ్ఱం జాషువా, నార్ల వేంకటేశ్వర రావు, ఆరుద్ర, యలమంచిలి వెంకట సుబ్బయ్య మొదలైన వారు. వీరందరిలో శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారిని తెలుగు సాహిత్యంలో హేతువాదానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. నూతన సమాజాన్ని నిర్మించుకోవాలంటే ముందుగా భావదాస్యం పోగొట్టి నూతన తాత్వికతను రూపొందించుకోవాలనే విశ్వాసంతో హేతువాత ప్రచార్థమే ఆయన సాహిత్యాన్ని సృష్టించారు. ప్రజలలో భావ విప్లవం రావాలంటే ముందుగా వారిలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలు పోవాలని ప్రజలలో మౌఢ్యాన్ని పెంచుతున్న మతాన్ని ప్రచారం చేసే పురాణాలను, కృత్రిమ అసమానతలు సృష్టించిన స్మృతులను హేతువాత దృక్పథంతో విమర్శించారు. ఈయన సాహిత్యమంతా ఇదే దృక్పథంతో సాగింది. ఈ విధంగా సాగిన త్రిపురనేని వారి హేతువాద సాహిత్య దృక్పథాన్ని తెలియజేసేదే ఈ వ్యాసం.

**త్రిపురనేని వారి రచనా వ్యాసంగం:**

జ్ఞాన సముపార్జనకు హేతువు, ప్రధాన సాధనం, గీటురాయి హేతువాదం. ఈ హేతువాదంలో మత సంబంధమైన ప్రకృతికి అతీతమైనవిగా భావింపబడే వాటిని గురించి చర్చించి, అవి ప్రాకృతికమైనవేనని నిరూపించడం జరుగుతుంది. చౌదరిగారి మొదటి రచనలైన 'శంభుక వధ', శూత పురాణాల్లో వేద ప్రామాణ్యం అంగీకరించే భావాలు కనపడినప్పటికీ తరవాత రచనలైన ఖూనీ, భగవద్గీతలలో ఆయనలో హేతువాదం సంపూర్ణ రూపంలో ప్రకటితమైంది.

త్రిపురనేని రామస్వామి చౌదరిగారి రచనల్లో ముఖ్యంగా - సూత పురాణం, భగవద్గీత, గీతాలు, శతకాలు - కుప్పుస్వామి శతకం, ధూర్తమానవా శతకం, వివాహవిధి అనేవి రాసారు. అపకం, మాలదాసరి, నరకం, గోపాల రాయ శతకం, పల్నాటి పౌరుషం, రాణా ప్రతాప్ మొదలగునవి అముద్రితాలుగా మిగిలిపోయాయి. ఆంధ్రసాహిత్యంలో ఈయన రాసిన 'సూతపురాణం' ప్రచురణతోనే హేతువాద సాహిత్య యుగం ప్రారంభ మైందని చెప్పవచ్చు.

''మానవుడు జన్మత: హేతువాది. ప్రతిదాని హేతువును గురించి ప్రశ్నించి సమాధానం తెలుసుకోవడం ద్వారానే, మానవుడు అభివృద్ధిని సాధించగులుగు తున్నాడు. కల్లబొల్లి కాల్పనిక సాహిత్యం ఈ హేతువనే దీపకళికను మసిబారేటట్లు చేసింది. త్రిపురనేని రామస్వామి చౌదరిగారి రచనల వలన మానవునిలోని ఆ దీపకళికను ఆవరించిన మసిని, నుసిని తొలగించి వేశాయి. ఆ హేతువాద జ్యోతిని దేదీప్యమానం చేశాయి. ఆ కారణం చేతనే ఆయన ఈ నాటికీ ప్రజల నాలుకల యందు జీవించి ఉన్నారు. అందుకే తెలుగు సాహిత్యంలో త్రిపురనేని రామస్వామి చౌదరి గారిని హేతువాద ప్రారంభ రచయితగా సమకాలీన సమాజం గుర్తించింది.

రామస్వామి గారి రచనల్లో ఆయా సందర్భాలను బట్టి కొన్ని లక్షణాలు వ్యక్తంగాను, మరికొన్ని లక్షణాలు అవ్యక్తంగాను కనబడతాయి. 'హేతువాదం' అనేది ఆత్మగాను, సామాజిక, చారిత్రక, ఆదర్శ, మానసిక దృక్పథాలు మూలస్తంభాలుగాను గమనించాలి. ముఖ్యంగా సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలు- వర్ణవ్యవస్థ నిరసన, బ్రాహ్మణ ఆధిపత్య నిరసన, వైదిక యజ్ఞయాగాదులు పట్ల నిరసన, మాఢాచారాల పట్ల నిరసన, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల పట్ల నిరసన, విగ్రహారాధనను నిరసించడం అనే అంశాలపై ఈయన సాహిత్యంలో చర్చించడం జరిగింది.

### వర్ణవ్యవస్థను నిరసించడం :

సంస్కృతంలో వర్ణము అనగా రంగు అని అర్థం. అంతేకాని కులం అని అర్థం కాదు. ఋగ్వేదకాలంలో చేసిన శ్రమ విభజన క్రమంగా బలపడి ఋగ్వేదానంతర కాలం నాటికి కుల విభజనగా రూపాంతరం చెందింది. సమకాలీన ఇండో - యూరోపియన్ జాతులతో, ప్రాచీన ఇరాక్‌లోని నాలుగు రకాలైన తరగతులుగా విభాగించు కోవడం జరిగింది. బహుశా ఆర్యులు వీరిని అనుసరించి ఉంటారు. అయితే సిద్ధాంత పరంగా ఆర్యులందరూ ఈ చాతుర్వర్ణ విభాగంలో భాగస్తులే కాని పిల్లలు, ఋషులు, వితంతువులను మాత్రం ఈ విభాగం నుండి మినహాయించారు. అయితే ఈ వర్ణ విభాగం మన దేశంలో కొత్త పుంతలు తొక్కింది. భారతదేశంపైకి ఉత్తరం వైపునుండి దండెత్తి వచ్చిన ఆర్యులు నాడు స్థానికంగా ఉన్న ప్రజలతో యుద్ధం చేసి వారిని పరాజితుల జేసి, వారికి సంఘులో అథమ స్థానాన్ని కల్పించిరి.కాల క్రమేణా వారి జీవనాన్ని క్రమబద్ధం చేసుకోవడానికి వారిలో వారు వర్ణ భాగాన్ని సృష్టించుకొన్నారు. ఈ వర్ణ విభాగం యొక్క ప్రస్తావన ఋగ్వేదంలో స్పష్టంగా ఉంది. పురుష సూక్తంలోని భాగమందు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అను నాలుగు రకాలుగా విభజించడం జరిగింది. కాలక్రమేణా ఈ వర్ణవిభాగం బలపడి ఒక వర్ణంలోనికి మరో వర్ణం చొరబడే అవకాశం లేకపోయింది.

ఋగ్వేదంలోని వర్ణవిభాగం దక్షిణ భారతదేశంలోకి చాలా నెమ్మదిగా ప్రవేశించింది. ప్రాచీన తమిళ సాహిత్యంలో జాతిపరమైన విభేదాలు కొద్దిపాటి హెచ్చు తగ్గులతో కూడి ఉన్నాయి తప్ప వర్ణ విభాగమనేది లేదు. క్రమంగా ఈ వర్ణ వ్యవస్థ దక్షిణ భారతంలో ప్రవేశించి బలపడి ఉత్తర భారతదేశంలో నెలకొన్న వర్ణవ్యవస్థ కన్నా విస్తృతమైపోయింది.

ఈ వర్ణవ్యవస్థను హేతుబద్ధంగా విమర్శిస్తూ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు తమ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. రామస్వామి గారి దృష్టిలో వర్ణవ్యవస్థ అనేది ప్రారంభంలో లేదు. దీనిని ప్రస్తుతిస్తూ -

"తొలు దొలుత భూత సృష్టిని సలుప వేళ
గులములుంగాని, యెచ్చులొచ్చులును గాని
నేను గల్పింపగా లేదు నేడు చూడు
తారతమ్యమే విధముగా దారుకొనెను'

అని తమ భగవద్గీత యందు పలనాటి బ్రహ్మనాయుడి నోట భూమిపై సృష్టి జరిగే నాటికి కులముగానీ, వాటియందు హెచ్చుతగ్గులుగాని లేవని, నేడు చూస్తే ఈ తారతమ్యాలు మిక్కిలిగా ఉన్నాయని రచయిత ఈ పద్యంలోని వివరణ.

### బ్రాహ్మణ ఆధిపత్యంపై నిరసన :

ఆధునిక సాహిత్యంలో బ్రాహ్మణులను తీవ్రంగా నిరసించిన కవి త్రిపురనేని రామస్వామి చౌదరిగారు. తమ సాహిత్యమంతటా బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిరసించారు. భారతీయ సమాజంలో వర్ణపరమైన విభేదాలు కలుగ జేసింది బ్రాహ్మణులే అని ఈయన అభిప్రాయం. వైదిక ధర్మం పేరిట బ్రాహ్మణులు చేసిన పున: సృష్టివల్లనే సమాజం నేడు ఈ రీతిగా ఉందని వారి అభిప్రాయం. అయితే ఈ బ్రాహ్మణ సృష్టికి ఏ విధమైన హేతబద్ధతా లేదని చెబుతూ భగవద్గీత యందు పలనాటి బ్రహ్మ నాయుడు ఇలా ప్రస్తుతించాడు.....

"వైదిక ధర్మముంజెఱుప స్వార్థపరాయణ చిత్తు లైత్రయీ

వేతుల మంచు గొందఱు వివేకము వీడి స్మృతుల్
రచించిత
ద్వైదిక ధర్మసారమని వాకొనినారు కుమార! యిట్టి దు
ర్వాదము మాపకున్న యెడ వర్థిలు దప్పక ధర్మ పాడలున్"

కొందరు వివేకమును విడిచిపెట్టి స్మృతులు రచించి నారని అందు నిర్హేతుకమైన విషయాలను వల్లెవేసి నేటి ఈ అధర్మమునకు కారకులైనారని నిరూపించారు. అంతే కాకుండా...

"వేళాకోళము గందఱ
గోళమ్మును జేసి ద్విజుల గురించి మహా
భీలముగా వర్తించిరి
కాలము కర్మం బీకటయి కారింపగా" అంటూ ద్విజుల యొక్క దుష్క్రియలను విమర్శించారు. ఇంకా అవతారా లను సృష్టి చేయడంలోనూ, దురాచారాలను పాదు కొల్పడంలోనూ, సంప్రదాయం పేరిట తమకు అను కూలమైన ఆచార వ్యవహారాలను ప్రజలయందు పాదుకొల్పడంలోనూ వారి యొక్క కృషి అవిరళనీయ మైంది. అన్నింటిలోనూ బ్రాహ్మణులు పై చేయిగా ఉం టూ, అగ్రవర్ణాలవారిమని అంటూ కింద కులాలవారిని నీచంగా చూసేవారు. అందుకు నిదర్శనంగా రచయిత ఆవేదనగా దీనిని రచించినట్లు కన్పిస్తుంది.

## వైదిక యజ్ఞయాగాదులు కర్మకాండలు, మూఢా చారాల పట్ల నిరసన :

త్రిపురనేని రామస్వామి చౌదరిగారు ఆంగ్ల విద్యా పారంగతులు కావడంతో పాటు ఇంగ్లాండ్ తదితర దేశాలు తిరిగి రావడంతో ఆయా దేశాలలో ఉన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు అధ్యయనం చేశారు. అందువలనే పాశ్చాత్య దేశాలలో ఉన్న నలుపు, తెలుపు అన్న వర్ణ వివక్షతనూ, అదే రీతిగా ఆయా దేశాలలో సైతం నెంబర్ పదమూడు హోటల్ గదిలో ఎవ్వరూ దిగకపోవడం వంటి దురాచారాల పట్ల ఆయనకు విముఖత వుంది. సదరు ఆచార వ్యవహారాలకు ఏ విధమైన హేతువూ లేదని వారి అభిప్రాయం. అందుచేతనే వారు తమ సాహిత్యం ద్వారా ఆయా వ్యవహారాలలో ఉన్న హేతుబద్ధతను ప్రశ్నించారు. వాటి మూలాలను ఖండించారు. 'భగవద్గీత'లోని కర్మయోగమందు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు బాలుడి నోట యజ్ఞ యాగాదుల యొక్క ఔచిత్యాన్ని హేతుబద్ధంగా ప్రశ్నించారు.

"యజ్ఞముల జేయనేల? యా యజ్ఞఫలము
పొంటె రాత్రిందివమ్ములు పొక్కి పొక్కి
దేవతల బట్టికొని యేల దేవురింప?
యజ్ఞముల మాన నష్టమేమైనా గలదె?

యజ్ఞాలు ఎందుకు చేయాలి? అవి చేయకపోతే కలిగే నష్టమేమిటి? ఈ యజ్ఞఫలం కోసం దేవతలు వేవురించడ మెందుకు? అంటూ యజ్ఞాలు చేయడంలోగల హేతు బద్ధతను తేటతెల్లం చేశారు రచయిత.

యజ్ఞముల తోడ సృష్టించె నఖిల జనుల
దొల్లి భగవంతుడని చెప్పుదురు నిరంత
రంబు పండితమ్మన్యులు బ్రహ్మమేని!
వారి మాటలు విస్రంభపాత్రమౌనె?"

అని యజ్ఞాలు చేయడం వల్లనే ఈ భూమిపై భగవంతుడు సృష్టిని చేశాడని పండితులు చెబుతారని వారి మాటలు నమ్మదగినవి కావని రచయిత పేర్కొన్నారు. యజ్ఞయాగాదుల వలన మనకు నష్టమేగానీ లాభం లేదని కవి భావన ఇందులో కనిపించింది.

## మూఢాచారాల పట్ల నిరసన :

మూఢాచారాల్లో ముందుగా త్రిపురనేని రామస్వామి చౌదరి గారిని బాధించినది జంతుబలులు. సూత పురాణంలో జంతుబలులు గూర్చి రాసారు. భగవంతుని పేరు చెప్పి జంతుబలులు చేయడం సమంజసం కాదని, విజ్ఞానం కల్గిన మానవులు చేయకూడని పని అని వక్కాణించారు. త్రిపురనేని గారు రచించిన 'కుప్పుస్వామి' శతకమందు ఈ జంతుబలులు గూర్చి ఇలా అన్నారు.

"మాంసం భుజింప నిచ్చించి మానవుండు

మ్రొక్కు మ్రొక్కంచు దేవుని ముందుబెట్టి
గొంతుకోసి యే మృగమునో కుడుచుచున్న
గోపపడకున్నే దేవుండు? కుప్పు స్వామి''

అని మాంసం తినాలనే కోరికతోనే మానవుడు దేవుని మ్రొక్కు పేరు చెప్పి జంతువులను బలిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. ఇది చూసిన దేవుడు తప్పక కోప్పడతాడని కూడా పలికారు. వీరు రాసిన సూతపురాణమందు జంతు బలుల విషయమై ద్వితీయాశ్వాసంలో ఇలా అన్నారు.

"ఏంటి కోపు మీద వీర రక్తము జల్లి
పలుక వాలునకును బలులు వెట్టి
మూగ దేవరులకు మ్రొక్కుబడులు దీర్చి
పైనమైరి రిపుల బారి సమర''

అంటూ ఆర్యులతో పోరాడటానికి ద్రావిడ యోధులు సన్నద్ధులైనారని, అందుకు ప్రతిగా ఆర్యుల ప్రతిక్రియను సూత పురాణంలో రచించారు. నోరులేని మూగ జీవాలను మాట్లాడలేని దేవుని పేరు చెప్పి మానవులు చేసే ఈ అజ్ఞానాన్ని ఆయన ఖండించారు

**కర్మ - పునర్జన్మ సిద్ధాంతం :**

త్రిపురనేని రామస్వామి చౌదరిగారికి కర్మ సిద్ధాంతం పునర్జన్మ సిద్ధాంతాలపై ఏ విధమైన నమ్మకం లేదు. వారి దృష్టిలో కర్మ పునర్జన్మలకు ఎటువంటి హేతుబద్ధతా లేదు. అందుచేతనే వారి అభిప్రాయాలను నిష్కర్షగా తమ సాహిత్యమందు పొందుపరిచారు. 'ధూర్త మానవా' శతకమందు రామస్వామిగారు

"మరణపు శయ్యమీద నొక మారయినన్ నను దప్పకుండ సం
స్మరణము చేసినంతటనె స్వర్గము వచ్చునటందు, వేగతిన్
బొరయును? నిట్లె నీవెపుడు బొంకుచునుందువు దీనికైనినున్
గటికర గొంతు కోసెదను కానివి చెప్పకు ధూర్త మానవా!''

స్వర్గం అనేది ఉందని చెప్పడానికి ఏ విధమైన హేతువు లేదని, అట్లు ఉందని నిర్హేతుకమైన మాట లాడినచో గొంతు గరకర కోస్తానని హెచ్చరించారు. కర్మ, పునర్జన్మల సిద్ధాంతాలు తప్పు అని దుయ్యబట్టారు రచయిత.

"చచ్చిన పిదపన్ నరకమె
వచ్చునొ స్వర్గంబొ యూడిపడునో చెప్పన్
వచ్చునె యెవ్వనికనియు
నిచ్చకముల చెప్ప లాభమేమి మహాత్మా!''

అని అంటూ రామస్వామిగారు స్వర్గం, నరకం, ఆత్మ అను వస్తువులు ఉన్నవో లేవోనని, ఉన్నవని నమ్మటం తప్పని వాదించారు.

ఆత్మయును వస్తువున్నదో యసలు లేనె
లేదో నాకు నమ్మిక గ్లగలేదు గాన
మొయిలులో నీరు నమ్మియే మూర్ఖుడైన
జెఱవు కట్టల దెగనొట్టి చెఱుపగలడె

అని రామస్వామిగారు ఆత్మ అనేది ఉందో లేదో ఎవరికీ తెలియదు అంటారు. అలాగే ఆత్మ ఉందనే భ్రమలోనే చాలామంది బ్రతుకుతారు. "మొయిలులో" లేని నీరు ఉందని భ్రమించడం తప్ప వేరొకటి కాదని, ఆ లేని నీరును ఉందని భ్రమించి చెరువు కట్టను తెగ్గొట్టం సమంజసం కాదని పలికారు.

మరణం - పునర్జన్మ: మృతిని పొందిన మనుజులు ఏమౌతారనే చర్చ కూడా త్రిపురనేని రామస్వామి చౌదరిగారు చేశారు. పిండ ప్రదానాలు చేయటం తదితర ఆచారాలను సైతం హేతుబద్ధంగా విమర్శించారు. 'కుప్పుస్వామి' శతకమందు -

చచ్చిపోయిన వెంటనే జన్మమెత్తు
జీవి కుడువ గర్మమటంబు జెప్పుచుండు
రట్టులైనచో బిత్రులోకమెట్టువచ్చు?
గుటిల జనసృష్టి గాదొక్కొ కుప్పుస్వామి

చనిపోయిన తర్వాత మనిషి మరలా జన్మిస్తాడని,

చనిపోయిన వారికి పిండప్రదానం చేయడం ద్వారా వారి ఆత్మను తృప్తి పరచవచ్చని, తద్వారా వారికి సద్గతులు కలుగుతాయని చెప్పేమాటలు కుటిల బ్రాహ్మణులు కల్పించిన సృష్టియని త్రిపురనేని రామస్వామి చౌదరిగారి అభిప్రాయం. చనిపోయినవారు ఎక్కడికి వెళ్తారనేది ఎవరికీ తెలియదని, ఎక్కడ ఉంటారో తెలియని, జీవంలేని మనుషులకు పిండాలు, నివాపజలం పెట్టడం నిర్హేతుకమైనందని చెప్పారు రచయిత. ఈ రీతిలో పునర్జన్మ అనునది కుటిల జనసృష్టి అని, పిండ ప్రదానాలు కేవలం ఆప్తులను, సదరు కర్మకాండను నిర్వహించి లాభపడు భోక్తలను, పురోహితులను తృప్తి పరచడానికి పెట్టుకున్నవి గాని వేరొక్కటి కావని అంతేకాక మరణం, పునర్జన్మ మానవునికి అతీతమైంది. మానవ ప్రమేయం లేదని రచయిత తెలియజేశారు

## విగ్రహారాధన పట్ల నిరసన :

త్రిపురనేని రామస్వామి చౌదరిగారు విగ్రహారాధన, ప్రతిమల పెండ్లి చేయుట వంటి దురాచారాలను సైతం నిరసించారు. వీరి కుప్పుస్వామి శతకమందు

"ముక్కు మొగము జెక్కమూల విరాట్టంచు
నొక్కరాయి దెచ్చి యుంచి గుడుల
గూడు గుడ్డలిచ్చి కొల్తురు ప్రజలెల్ల
గొంటె పగులు గావె కుప్పుస్వామి"

అని విగ్రహారాధన గురించి నిరసన వ్యక్తంచేశారు రచయిత. రాళ్ళకి మొక్కడం సరైనది కాదని, ప్రతీ మనిషిలోనూ దైవం ఉంటుందని, దాన్ని వదలి గుడులు, గోపురాల వెంట పరుగులు పెట్టరాదని ఉద్భోదించారు. అయినా ప్రజలు మూర్ఖంగా ఆలోచిస్తూనే ఉన్నారని అంటారు.

ఈ టకటొంకు లేమిటికిని? నిల్లును వాకిలి గట్టిపెట్టి యే
బేటను బెండ్లి నేయుమని యే నెపుడైనను గోరియుంటినే
చీటికి మాటికిన్ బరుల జేబుల గొట్టుట ధర్మ మార్గమే?
ఏటికి నీయబద్ధ మరలే! యిక సాగునే? ధూర్త మానవా!

అంటూ విగ్రహారాధనలో ఉన్న వాస్తవికతను ఒకపక్క విమర్శిస్తూ, మరొక చోట భగవంతుడే ధూర్తమానవునితో నాకు ఏడాదికోసారి వివాహం చేయమని నేను కోరలేదని పల్కడం త్రిపురనేని రామస్వామి చౌదరిగారి హేతుబద్ధతకు నిదర్శనం. ఆయనకు మూఢ విశ్వాసాల పట్ల ఉన్న వ్యతిరేకతను హేతువాద ధోరణిలో ఇలా చెప్పారు-

"శాస్త్రముల నెల్ల జదవి విజ్ఞాన మెరిగి
సంశయింపక సర్వదా చర్చజేసి
నిజమెఱుంగవలయు నిది నేర్పకున్న
మూఢ విశ్వాసమున జేటు మూడుచుండు"

చివరిగా తమ భగవద్గీత నందు ప్రజలకు హితబోధ చేయుచూ శాస్త్రములను చదివి విజ్ఞానం పొంది ఆ తదుపరి తమకు కలిగిన జ్ఞానాన్ని పదిమందితో చర్చ చేసి నిజం తెలుసుకోవాలని, అంతే తప్ప మూఢ విశ్వాసాలను యథాతథంగా అవలంబించడం వల్ల చేటు కలుగుతుందని తన భగవద్గీత ద్వారా పఠితులకు సత్యాన్ని ఉపదేశించారు. విగ్రహారాధనని తీవ్రంగా ఖండించారు రచయిత.

ఈ విధంగా త్రిపురనేని రామస్వామి చౌదరిగారు ప్రక్రియా పరంగానూ, వస్తు పరంగానూ ఆయన రచనల్లో వైవిధ్యం చూపించి హేతువాద ధోరణిని పేర్కొన్నారు. సామాజిక దృక్పథంలో భాగంగా వర్ణవ్యవస్థ, బ్రాహ్మణ ఆధిక్యత, దురాచారాలు, సనాతన ఆచార వ్యవహారాలు బ్రాహ్మణ కల్పితాలని ఈయన అభిప్రాయం. అట్లే చారిత్రాకాంశాలైన ఆర్యుల దురాక్రమణ, పురాణ పురుషుల యొక్క ఔన్నత్యం అనే అంశాలు గూర్చి విశ్లేషణాత్మకంగా తెలియజేశారు.

## ముగింపు :

నిజానికి హేతువాదం ఒక వాదం కానీ, సిద్ధాంతం

కానీ, తత్త్వం కానీ కాదు. నిత్యాభివృద్ధి చెందే విజ్ఞానాన్ని అన్వయం చేసుకొని, ఎప్పటికప్పుడు దానికి అనుగుణమైన ఆలోచనా విధానాన్ని అనుసరించేందుకు తోడ్పడేదే హేతువాదం. హేతువాదమనే పదం ఉచ్ఛరించకుండానే మన ప్రాచీన దార్శనికులు తమ దర్శనాల్లో కార్య కారణరూపంలో కొంత తర్కించారు. భారతీయ సాహిత్యంలో హేతువాత భావనలు ఉన్న తొలి గ్రంథాలు ఉపనిషత్తులు. ఇవి ఆనాటి సమాజంలో ఉన్న క్రతువులు, కర్మకాండలను నిరసిస్తూ చర్చారూపంలో వెలువడ్డ గ్రంథాలు. ఆ తదుపరి బౌద్ధంలోను, ప్రాచీనుల షడ్దర్శనాలలోని వైన సాంఖ్య వైశేషికాల్లోనూ ఇప్పటి హేతువాద ఛాయలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తాపి ధర్మారావు - పెళ్ళి దాని పుట్ట పూర్వోత్తరాలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

2. కె.కె.రంగనాథాచార్యులు - ఆధునిక తులుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు

3. కవిరాజు సాహిత్యం - 1. సూత పురాణం- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011

❖❖❖

# నుదురుపాటి వెంకన్నకవి - సాహిత్య పరిచయం

– డా॥. కె. రమేశ్, సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

## చారిత్రిక పరిచయం :

విజయనగర సామ్రాజ్య పతనం (క్రీ.శ. 1565) తర్వాత దక్షిణాంధ్ర ప్రాంతంలో ఐదు స్వతంత్ర ప్రాంతాలు ఏర్పడ్డాయి. అవి తంజావూరు, చెంజి, మధుర, పుదుక్కోట, మైసూరు. పుదుక్కోటను పరిపాలించిన రాయరఘునాథుడు (1769 - 1789) స్వయంగా ప్రతిభావంతుడైన తెలుగు కవి మాత్రమే కాక కవి పోషకుడు. ఇతడు 'పార్వతీ పరిణయం' అనే 6 ఆశ్వాసాల ప్రబంధాన్ని రాశాడు. ఈ గ్రంథం 1908 లో ప్రచురించబడింది. ఈ కథాంశం 'కుమార సంభవ' కథ నుండి గ్రహించబడింది. గతంలో కుమార సంభవ ఇతివృత్తాన్నే నన్నెచోడుడు, శ్రీనాథుడు ప్రతిభావంతంగా రచించినప్పటికీ రాయ రఘునాథ తొండమాన్ అదే ఇతివృత్తాన్ని తీసుకొని రాశాడు.

రాయరఘునాథ తొండమాన్ పార్వతీ పరిణయంలో తనకు ఆశ్రితుడైన నుదురుపాటి వెంకన్న గురించి

గీ. ముందు వెలనాడు దివ్యమౌ నందులో
నుదురుపాటి కులంబున కెదురుగాన
నచట నుద్దండ కవిసుతుడైన వెనుక
శంకరుని మించఉ ద్వచ్చర్య వేంకనార్య.
(పుట.1, పీఠిక, పార్వతీ పరిణయం: 1908)

అని చెప్పడం చేత వెంకన్న వెలనాడు ప్రాంతం నుండి తన వంశస్థులు పుదుక్కోటకి వెళ్ళారనే విషయం విదితమవుతుంది. అంతేగాక నుదురుపాటి సీతారామయ్య శిష్యుడు అయిన రఘునాథ తొండమాన్ "ఉద్దండ కవి విధేయ" అని చెప్పుకొన్నాడు అంతేగాక "ఉద్దండ కవి సుతుడైన" అని చెప్పడం చేత ఉద్దండ కవి అయిన సీతారామయ్య కొడుకు వెంకన్న మరియు రఘునాథ తొండమాన్ వీరిరువురు సమవయస్కులు, సహాధ్యాయులు అని తెలుస్తున్నది. అంతేగాక శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో పెద్దన గారి మనుచరిత్రలోని తన వంశ వర్ణణ పద్యాలను చెప్పుకొన్నట్టుగా రఘునాథ తొండమాన్ కూడా వెంకన్న గారి ఆంధ్ర భాషావర్ణవములోని తన వంశ వర్ణన పద్యాలను తన పార్వతీ పరిణయంలో చెప్పుకున్నాడు.

ఇతడు రచించిన మరొక గ్రంథం 'కవిజనోజ్జీవనీ'. ఈ గ్రంథం సమస్య పూరణలతో రచించబడింది. ఇందులో 100 పద్యాలున్నవి. కాకినాడలోని ఆంధ్ర సారస్వత పరిషత్ వారు 1937లో ప్రచురించారు. ఇతని ఆస్థానంలో పుదుక్కోటలోని తెలుగు మాట్లాడే నుదురుపాటి కవులుకూడా ఉన్నారు. నుదురుపాటి కుటుంబంలో జన్మించిన వెంకన్న ఉద్దండ కవి అనే బిరుదును కలిగి ఉన్నారు.

పై విషయాన్ని నిర్ణయించడానికి నుదురుపాటి సీతారామయ్య గురించి కొడుకైన వెంకన్న "మజ్జనకాది ధీమజ్జనవిరచిత వివిధప్రబంధముల్ వినుచు" అని చెప్పుకొన్నను సీతారామయ్య రచనలు ఏవీ కూడా మనకు లభించలేదు కాని సీతారామయ్య కవితా శైలి తెలుసుకోవడానికి కోటి తిరుమల రాయలపైన మరియు అతని కొడుకు విజయ రఘునాథునిపైన చెప్పిన కొన్ని పద్యాలు మాత్రమే లభించాయి.

క. బలవైరి గంధసింధుర
గళబంధురఘటితఘంటి కారావ నిర
ర్గళధాటీపటిమ మనీషి
లలామా నుదురుపాటి సీతారామా!
(1-1 మల్లుపురాణం (అముద్రితం)

పై పద్యంలో సీతారామయ్య కవిత్వ పటిమను గురించి వెంకన్న కవి ఈ విధంగా చెప్పుకున్నాడు.

నుదురుపాటి వారిని కోటి వారని కూడా అంటారు.

ఈ కోటి అనేది తోండమాన రాజులకు కూడా ఉంది. కోటి రాయరఘునాథ తొండమాన్ బహుశా వీరి ఆస్థాన కవులుగా ఉండడం చేత నుదురుపాటి వారికి కూడా కోటి అనే ఇంటిపేరు వచ్చి ఉంటుంది. కాని నుదురుపాటి వారి ఇంటిపేరు కోటి కాదని నిర్ణయించి చెప్పడానికి వెంకన్న రాసిన పార్వతీ కళ్యాణంలో రాజుని గురించి చెప్పిన ఈ పద్యం.

కం. తెలిపెఉ గద మీకుఉ దాపక
కులరీతులు మతిఉ గవీంద్రకోటినిజాఖ్యా
కలితజపాఫలితతపా
లలితకృపా కోటి రాయరఘునాథనృపా
(పుట.1, పీఠిక, పార్వతీ పరిణయం: 1908)

ఈ పద్యంలో రాజుని కోటి రాయరఘునాథనృపా అని సంబోధించడం వల్ల రాజు ఇంటి పేరు కోటి అని తెలుస్తుంది కాని నుదురుపాటి వారి ఇంటిపేరు కోటి కాదని విదితమవుతుంది.

నుదురుపాటి వెంకన్న పుదుక్కోట రాజ్యానికి చెందిన తెలుగు, సంస్కృత భాషలలో ఉద్దండ కవిగా ప్రసిద్ధి చెందాడు. ఇతని తండ్రి నుదురుపాటి సీతారామయ్య కూడా ఉద్దండ కవే. ఈయన రచించిన కొన్ని చాటు పద్యాలు లభ్యమౌతున్నాయి. వీరిది ఉద్దండ కవి పండిత వంశంగా చెప్పవచ్చు. నుదురుపాటి వెంకన్న రచించిన 'ఆంధ్ర భాషార్ణవము' అనే నిఘంటువు తెలుగులో అత్యంత ప్రసిద్ధమైన నిఘంటువు. 'పార్వతీ కల్యాణం' అనే యక్షగానం కూడా రచించాడు.

విజయ రఘునాథ తొండమాన్ 1789-1807 కాలంలో ఉన్న శేషయ్య కవి విజయరఘునాథ పేరును కీర్తిస్తూ ఒక సీసమాలిక శతకాన్ని రచించాడు. మన్నారయ్య, ఖడ్గలక్షణ శిరోమణి రాసిన నవనప్ప కూడా వీరి ఆస్థాన తెలుగు కవులే.

రాయల కాలంలో నియమించబడిన నాయక రాజులు స్వతంత్రులై రాయల వలె కవి పండితులను పోషిస్తూ తెలుగు సాహిత్యంలో నూతన ప్రక్రియలకు ఆధారమైనారు.

"తంజావూరు, మధుర, మైసూరులతోపాటు దక్షిణ దేశంలో పుదుక్కోట కూడా సాహిత్య రంగమే. పుదుక్కోట రాజుల క్రీ.శ. 1730-1786 ఆంధ్రనాయకులు కాకపోయిన ఆంధ్రభాషపై అభిమానముతో ఆంధ్ర కవి పండితులను ఆదరించటమే కాకుండా స్వయంగా తెలుగులో రచనలు గావించినారు. పుదుక్కోట అనగా నవసాల పురము, కొత్తకోట అని అర్థము. ఇప్పటికిని పుదుక్కోట సంస్థాన ధ్వజము నందు "శ్రీబృహదంబా సహాయము అను తెలుగులో వ్రాయబడియున్నది." (నాగయ్య,జి.2003: 458, 459)

నాగయ్య మాటల ఆధారంగా వీరి పరిపాలనా కాలంలో తమిళనాడు ప్రాంతంలో తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందిందని తెలుస్తుంది.

## నుదురుపాటి వెంకన్నకవి రచనలు :

అచ్చ తెలుగు నిఘంటువు ఆంధ్ర భాషార్ణవము పద్యరూపంలో రచించాడు. మరియు పార్వతి కళ్యాణము, మల్లుపురాణము, బృహన్నాయక దండకము, సంస్కృతంలో రఘునాతివము, వెంకన్న రచనలు. ఆంధ్ర భాషార్ణవము వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారిచే 1912 మద్రాసు నుండి ప్రచురించబడింది.

### ఆంధ్రభాషార్ణవము :

ఆంధ్ర భాషార్ణవము తెలుగులో ప్రసిద్ధమైన పద్య నిఘంటువుగా తమిళ దేశంతోపాటు తెలుగు దేశంలోనూ ప్రాచుర్యం పొందింది. ఇది మొత్తం 3 ఖాండలు. ఇప్పటి వరకు తెలుగులో వ్రాయబడిన అతిపెద్ద పద్య నిఘంటువు. ఇది అచ్చ తెలుగు పదాలకు సమానమైన అనేక సంస్కృత పదాలను తెలియజేస్తుంది. దీనిని ఆంధ్ర అమరకోశంగా పేర్కొనబడుతుంది. తెలుగు భాషలో అకారాది నిఘంటువులు రాకముందు ఈ నిఘంటువు చాలా ప్రసిద్ధి పొందింది. ఇది మాతృభూతేశ్వరస్వామికి

అంకితం చేస్తూ రఘునాథ తొండమాన్ రాయని ప్రేరణతో రచించబడింది. ఈ నిఘంటువు అవతారిక ఆధారంగా వెంకన్న ప్రతిభతోపాటు తెలుగు భాష విశిష్టత తెలుస్తుంది. ఈ గ్రంథ ప్రేరకుడైన రాయరఘునాథ తొండమాన్ కంటే ముందు 05 తరాల చరిత్రతో పాటు రాయరఘునాథుని గురించి చెప్పిన చారిత్రక విషయాలు ఎంతో విలువైనవి. ఉదాహరణకు ఈ క్రింది పద్యం గమనించదగినది.

శా. శ్రీమాత్మప్రకటీకృతాంగరుచిసారెంజూచి భాషింపుచో
నావేంయైనత్రిలోకమాతయగుట స్వైశ్యాంగ నందల్లియై
ప్రేమంబ్రోచుటఉజూడ వింతయెయనన్ శ్రీమాతృభూతేశ్వరుం
డామోదంబునఉబ్రోచుఉగాత రఘునాథాధీశ చూడామణిన్.

(దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. పుట:423).

పై పద్యంలో మాతృభూతేశ్వరికి అంకితం చేస్తున్నట్లు చెప్తూ రఘునాథరాయని ప్రేరణతో రాస్తున్నట్లుగా చెప్పుకున్నాడు.

**రఘునాతివము :**

రఘునాతివము అనే రచన అలంకార గ్రంథము. ఇది నరసభూపాలీయం మొదలైన అలంకార గ్రంథాల మాదిరిగా ఈ రచన ఎంతో మనోహరమైనది. దీనిని వెంకన్న సమకాలీన పోషకుడుయిన రఘునాథరాయ తొండైమాన్‌కు అంకితం చేశాడు. విభావనాలంకారానికి ఉదాహరణకు ఈ పద్యం చెప్పాడు.

గీ. నీవలన నాజి కలిగినభావ మెంచి, కలియుగమ్మున మించె నక్రమ మటంచు
నడవులకుఉ బాఋ నలికి నీయరులబారు, నమదహితగేయ శ్రీరఘునాథరాయ

(ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, 1916, సంపుటం 03, సంచిక 06. పుట:312)

ఈ గ్రంథాన్ని స్వంతంగా కల్పనా చాతుర్యంతో రచన చేసినట్లు చెప్పుకున్నాడు.

**పార్వతి కళ్యాణము :**

పార్వతి కళ్యాణము ముఖ్యంగా శివపార్వతుల వివాహాన్ని వర్ణిస్తూ రాసిన యక్షగానం. దీనిని మీనాక్షి సుందరేశ్వరులకు అంకితం చేశాడు. ఈ రచనలోనే వెంకన్న కవికి ''మహోద్దండకవి'' అనే బిరుదు ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఇందులో రాగతాళయుక్తాలైన అనేక ఆంధ్ర కీర్తనలు, కొన్ని సంస్కృత గేయాలు కూడా ఉన్నాయి. ఈ రచన వెంకన్నకవి సంస్కృత గేయరచనను తెలియజేస్తుంది.

చ. ఘనమణిదీపే కల్పితధూపే కనదతిచిత్రకలాపే
కనకమయోల్లన దనువమనై జభవనశుకమధురాలాపే
శ్రీకర విభవ శ్శివయా సమేత శ్శేతే మాణిక్యసౌధే
శ్రీకామాహర హర హరేతి గీతం ప్రాకార రక్షణం కుర్వంతు.

(ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, 1916, సంపుటం 03, సంచిక 06. పుట:312)

పై వాటిని చూసినట్లైతే సంస్కృతాంధ్ర భాషలలో అనర్గళమైన పాండిత్యం గలవాడని తెలుస్తుంది.

**తొండమాన్ వంశావళి :**

పుదుక్కోటలోని తొండమాన్ రాజవంశం చరిత్రపై దక్షిణాంధ్ర యుగంలోనే అత్యంత ప్రసిద్ధి పొందిన తెలుగు, సంస్కృత కవి, తొండమాన్ రాజుల ఆస్థాన కవి కుటుంబంలోనివాడైన నుదురుపాటి వెంకన్న సీసమాలిక ప్రక్రియలో 373 వరుసలలో 'తొండమాను వంశావళి' రాశాడు. తోండమాన్ వంశావళి 1914 లో ప్రచురించబడింది. ఈ వంశావళిలో రాయరఘునాథుని ఇరవై తరాల వర్ణన మరియు పుదుక్కోట రాజ్యం వివరణాత్మక కథనం, చరిత్రను, పరిపాలన దక్షతను, పరిపాలన విశేషాలను చారిత్రికంగా వర్ణించబడింది.

**మల్లుపురాణము :**

మల్లుపురాణము మల్లుల యుద్ధ నైపుణ్యాలను తెలుపుతూ మల్లు సమాజంపై రాసిన తెలుగు రచన ఇది ఒక్కటే. ఇది తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి మల్లయుద్ధ శాస్త్రగ్రంథం. ఈ గ్రంథం ప్రచురించబడలేదు. ఈ గ్రంథ తాళపత్ర ప్రతిని, లిఖిత వ్రాత ప్రతిని, ఆంధ్ర సాహిత్య పరిషత్ కాకినాడ గ్రంథాలయం నుండి సేకరించడం జరిగింది. అందులో ఒక పద్యం వారి శైలిని తెలుసుకోవడానికి ఉదాహరిస్తున్నాను.

సీ. వినుపించితిరి మీరు వీనుల విందుగా లక్ష్మీమహత్వ సల్లక్షణముల
పలికితి రాగ దాభావంబులెల్లగా వాగ్దేవతా విభవాభులెల్ల
తెలిపితి రేమారు తెలివిరెట్టింపంగ గౌరీ పదార్చన క్రమము లెల్ల
దయచేసితిరి మీరు ధర్మాదులలరంగ లలితాంబికాశ్రయ ఫలములెల్ల
విరులు తేనెలు జడిబట్టి గురియు రీతి మరి మరియు ప్రేమచే మీర రెఱుక చేయ
వింటిమోహని చరితంబు వింటి దుర్గ వేడుకలు కల్ప లీలల వింటె వింటె.

గీ. నింబజాశక్తి యను మాటనేడు వింటె, యెన్నడును నాకు నొకతెపనెరుగ జేయ
అకట మరచితో న ద యోగ్యత్వ మెంచో, అతిరహస్యంబటంచు నోయనిన యంత.

(మల్లుపురాణం. పద్యం. 1- 48, (అముద్రితం)

ఈ గ్రంథం గంధర్వ కోటలో ఉన్న ముద్దు ఒదుక నాథుడు వద్ద ఉండే బిరుదు కుప్పాల్ మల్లుడుకి అంకితం చేశాడు. ఈ గ్రంథానికి కృతిపతి అయిన బిరుదుకుప్పాల్ మల్లుని ప్రేరణతో తనకోసం బ్రహ్మాండ పురాణంలోని దేవమల్లుని చరిత్రను ఆంధ్రీకరించినట్లుగా ఈ క్రింది పద్యాల ద్వారా తెలుస్తుంది.

సీ. శ్రీకరుణ రసార్ద్రీకృత భవనుండు విద్వత్కవిచ్చటావినుతకీర్తి
మల్ల వంశాంబోధి హల్లకినీపతి గార్గ్యసగోత్ర విఖ్యాతమౌళి
సురుచిరాపస్తంభ సూత్రక్రియావేది యభ్యాసి గండగేహాభిమాని
వేంకటేశ్వరమల్ల వీరపుత్రాగ్రణి లక్ష్మణాంబా గర్భరత్న భూష

గీ. సకల రాజాధిరాజ ప్రశస్తముద్దు, వడుగ నాథేంద్రదత్త ప్రవర్ధమాన
సకలనిరవధికైశ్వర్యశాలి వుషిత, బాంధవజనుండు బిరుదు కుప్పాల్ ఘనుండు

(మల్లుపురాణం. పద్యం,1-12, (అముద్రితం)

ఉ. కొండలవంటి బట్లకులగోత్రములేమని తెల్పలేక యే
యుండుదు రందరున్ తెలియనొక్కకృతిన్ రచియింపు మీవు బ్ర
హ్మాండపురాణమందుగల మల్లకుల క్రమ మంధ్రభాష భూ
మండలి పండితోత్తములు మానసవీథిఉ దలంచి మెచ్చుగన్

(1-15, మల్లుపురాణం, (అముద్రితం)

ఈ గ్రంథాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి ఆంధ్రీకరించినట్లు తెలుస్తుంది.

**బృహన్నాయిక దండకం :**

బృహన్నాయిక దండకం రాయరఘునాథ తొడమాన్ పై రాసిన తెలుగు కవిత. ఇది నుదురుపాటి ఉత్తమ రచనగా పరిగణించబడుతుంది. అంతేగాక వెంకన్న యొక్క సంస్కృత, తెలుగు భాషల పాండిత్యాన్ని తెలియజేస్తుంది.

**ప్రారంభము :**

"శ్రీమత్ బృహన్నాయికా నామధేయే, మహాదేవజాయే మహా విష్ణుమాయే,...... శ్రీలసన్మేఖలా నూపురాలంకృతే, దివ్యపీతాంబరాలంకృతే యంచనన్ దేవబృందంబుచే

సన్నుతుల్ గాంచు శ్రీచక్రరాజంబుపై నిండుకొల్వుండు శ్రీ మన్మహారాజరాజేశ్వర రైనట్టి మేల్ భక్తచింతామణింగాను రంజిల్లు..... సంగీత సాహిత్యలోలుండు సత్కీర్తిశీలుండు శ్రీమన్మహారాజ రాజాబహద్దర్ రఘూత్తంసనాథుండు బల్ హాయిుగానంత నానావిధానర్ఘ్య రత్నాంబరా లంకృతుండై......"

**దండకం చివర :**

శ్రీమన్మహారాజరాజేశ్వరీదేవి శ్రీమత్పదాల్ వర్ణనారూప మౌనీ కృతిన్ ఆ కవీంద్రుల్ నుతింపంగ నుద్దండ విద్వత్కవిత్వాంకనుండైన శ్రీ వేంకనార్యున్ తృతీయాత్మ జుంజేయు శ్రీమత్ బృహన్నాయికా దండకంబుర్వి నాచంద్ర మస్తార కాంభోజినీ బంధుబింబంబుగా వర్ధిలున్. (దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. పుట:429).

ఈ బృహన్నాయిక దండకం పుదుక్కోట పురవరాధీశ్వరి యగు బృహన్నాయికకు అంకితం చేస్తూ రాయ రఘునాథుని గూర్చి తెలిపే పెద్ద దండకము.

**ముగింపు :**

తెలుగు సాహిత్య చరిత్రలో దక్షిణాంధ్ర యుగం నూతన ప్రక్రియలను, నూతన ప్రయోగాలకు ఆటపట్టు. అలాగే నుదురుపాటి వెంకన్న కూడా తన రచనలను నూతన దృష్టికోణం నుండి రచించారు. నుదురుపాటి సాహిత్యాన్ని ఇంతవరకు కూడా పూర్తి స్థాయిలో పరిశోధన జరగలేదు. ఇంకా కొన్ని రచనలు ముద్రణకు కూడా నోచుకోలేదు. ప్రస్తుతం ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ద్వారా మల్లయుద్ధ శాస్త్ర గ్రంథాన్ని పరిష్కరించి ముద్రణరూపంలోకి తీసుకొస్తున్నాము.

**అధారగ్రంథాలు :**

1. వెంకన్న, నుదురుపాటి. "ఆంధ్ర భాషార్ణవము", వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి. 1912.
2. కోటి రాయరఘునాథ తొండమాన్ మహీపాల, "పార్వతీ పరిణయం" శ్రీ సరస్వతీ ముద్రాక్షరశాల, కాకినాడ. 1908
3. వెంకటరావు, నిడదవోలు. "దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము". మద్రాసు: మద్రాసు విశ్వవిద్యాలయం. 1978.
4. నాగయ్య, జి. "తెలుగు సాహిత్య సమీక్ష- I" నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి. 2003.
5. సూర్యనారాయణ శాస్త్రి, మల్లాది. "సంస్కృత వాఙ్మయ చరిత్ర - ద్వితీయ సంపుటం". హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు. 1982.
6. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, సంపుటం 03, సంచిక 06. పుట:312, 1916.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 01, January 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# తెలుగు సినిమా పాటల్లో రామాయణ చిత్రణ

- ఎం. లక్ష్మి, ఉపన్యాసకురాలు, VSM కళాశాల, రామచంద్రపురం, తూ.గో. జిల్లా .

సంగీతమపి సాహిత్యం సర్వసత్యాహః స్తనద్వయం
ఏకమాపాత మధురం - అన్యదాలోచనామృతం

సంగీత సాహిత్యాలు జ్ఞాన సరస్వతి మాత స్తనద్వయం. అందునొకటి ఆపాత మధురమైన సంగీతాన్ని స్రవిస్తే మరొకటి ఆలోచనామృతమైన సంగీతాన్నిస్తుంది. ఇది ప్రాచీనులు చెప్పిన నిర్వచనం. ఆధునిక కవి కాడ్ నెల్ క్రిస్టోఫర్ అభిప్రాయం ప్రకారం "కవిత్వానికి గానగుణం స్వభావికం. ఆవేశానుభూతులను వ్యక్తీకరించే సామర్థ్యం పాటకుంది. అది ఒకే శ్రుతిలో పాడబడుతుంది. ఛందోగ్యోపనిషత్ " వాగ్వై గాయత్రి, ఇదగ్ సర్వం భూతం-గాయత్రి త్రాయ తేచ" అని వివరిస్తుంది. సంగీత రత్నాకరంలో "గీతం నాదాత్మకం వాద్యం - నాద వ్యక్త్యా ప్రకాశ్యతే! తద్ద్వయానుగతం నృత్యంచ నాదాధీనమత స్త్రయం II". నాదాత్మకమైనది గీతం. నాదం విస్తృతి వలన వాద్యం ప్రకాశమవుతుంది. గీత పద్యాలననుసరించి సాగేది నృత్యం. అనగా ఈ మూడు నాదాధీనాలే... అవి ఉద్భోదా. ఏది ఏమైనా సంగీత సాహిత్య పరిమళ పుష్పం పూదోట. పాట గేయం ప్రాచీనమైనది. భాష కంటే కూడా ప్రాచీనమనే లాక్షణికులు చెబుతారు. ఛందోబద్ధమైన మాటలతో పాటలుగా రూపాంతరం చెంది ఉండటమనేది ఎంత తక్కువ అనుకున్న యాభైవేల సంవత్సరాల కిందటి మాటేనన్న నిజాన్ని అంగీకరించవలసిందే.

కొన్నివేల శతాబ్దాలుగా నిత్యనూతనముగా నిలిచి నటువంటి రామాయణం ప్రజల హృదయములో మమేకమైంది. ఏదైతే ప్రజలు ఎక్కువగా ఆదరిస్తారో దానిని సినిమా పరిశ్రమ తమ వ్యాపార వాణిజ్యానికి అనుకూలముగా వినియోగించుకుంటుంది. ఇది వ్యాపారమే అయినప్పటకీ సినిమా అనేది ఒకకళ. 1950 నుండి ఈ కళ ద్వారా భారతీయ ఇతిహాసాన్ని రాబోయే తరతరాలకూ వ్యాప్తిచేయడం ప్రథమ ఉద్దేశ్యం. గడిచిన ఎనిమిది శతాబ్దాలలో ఎన్నో సినిమాలు రామాయణం ప్రాతిపాదికగా తీసినప్పటికీ ప్రజలకూ ఇంకా ఇంకా ఆ ఇతిహాసపు తాలూకా రమణీయతను, చరిత్రను మరింత తెలియపరిచేలా ధర్మమార్గాన్ని చాటే ఉద్దేశ్యంతో నేటికీ రామాయణం పైనా ఎన్నో చిత్రాలు వస్తూనే వున్నాయి. ప్రేక్షకులు అందరిస్తూనే వున్నారు. రాముడిని అతడు చేపట్టిన పితృవాక్యపరిపాలన పుట్టుక, శివధనుస్సు ఎక్కుపెట్టడం దగ్గరనుండి రావణ యుద్ధం వరకు ఎన్నో సంఘటలను సంక్లిప్తముగా అందించే ఉద్దేశ్యంతో కవులలో దాగిన సాహిత్యంతో ఎంతో నైపుణ్యముతో ఆనాడు మొదలైన మొట్టమొదటి సినిమా 'పాదుకా పట్టాభిషేకం'లో "రామయ్య రామయ్య తండ్రి ఎంత గొప్పవాడివయ్య రామయ్యతండ్రి.." అంటూ "తనను కనిన దశరధ మహారాజు జన్మ ఎంత ధన్యత.." అని కీర్తిస్తూ, "అయ్యమాట కాదనక అమ్మకైకేయిని ఏమనక అడవులకై పయనమయ్యావయ్యా ఆదినారాయణుడు నీవేనయ్య" నంటూ తమ గాత్రాన్ని ప్రదర్శించి ప్రేక్షకు లందరు పాడుకునే విధముగా పాడిన పాట ఎంతో రమణీయం.

'భూకైలాష్' చిత్రములో రాముని అవతారం "రవికుల సోముని అవతారం.." అంటూ రాముని అవతారమంతా ఆ పాటలో చిత్రికరించిన విధానం అమోఘమనే చెప్పాలి. ఒక్క పాటలో రాముని పుట్టుక, పుత్రకామేష్టి యాగం దాని ద్వారా ఎవరెవరికి ఏ యే పుత్రులు జన్మించారో వివరస్తూ, ఎదగడం, కైకయి కోరిన కోరికలు దాని ద్వారా అడవులకు పయనం రామాయణం, రాముని ధర్మా ధారాలు అంత ఒకే పాటలో చిత్రించిన సముద్రాల వారి ప్రవీణ.

పాత చలనచిత్రాలలో పాటలు పైన పేర్కొన్న లక్షణాలను కలిగి ఉండేవి. భాషలోని సభకు రసపుష్టిని

సంగీతం ప్రేక్షక ఆస్వాదపూరితంగా రూపకల్పన చేసేవారు. కొసరాజు, పింగళి, సదాశివబ్రహ్మం, సముద్రాల (సీ,జు) వంటి వారు 'భాషా ప్రయోగాలు' 'పదవిన్యాసాలు' చేశారు. రమణీయ రామాయణంను గేయ రూపంలో వీరంతా పరిపుష్టం చేశారు. రామాయణ గాధకు సంగీత సాహిత్యాలను సమానంగా అద్ది సరస్వతీ మాతకు పుష్పార్చన చేశారు. పాటలు వలన విజయవంతమైన చిత్రాలున్నాయి. రామాయణం ఇతిహాసం. వేల సంవత్సరాల నాటి భారతీయ ఆత్మకు ప్రతిరూపం. కుటుంబం, మానవీయ విలువలు, నైతిక విలువల ప్రదర్శన, సామాజిక ఒడంబడికలు, అనుబంధాలు, ఆత్మీయతలు వంటివి పెనవేసుకొని మహావృక్షమైన 'భార'తీయతకు పరాకాష్ఠగా నిలిచి వేలనాటి సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లుగా భాసిలుతున్న దశరధుడు, జనకమహారాజు, శ్రీరాముడు, సీత, వారి తల్లిదండ్రుల కథ మాత్రమే కాదు రామాయణం. మరెన్నో మహోన్నత సూత్రావళుల సూక్తి ముక్తావళి. కనుకనే వేల సంవత్సరాలు గడుస్తున్న "రామాయణం నిత్య పారాయణ గ్రంథం"గా వర్ధిల్లుతున్నది. వర్ధిల్లుతుంది. 1950 నుంచి 1995ల వరకు 'రామాయణం'ను సినిమా కథా వస్తువుగా స్వీకరించిన వారు లేరనే చెప్పాలి. ఏముంది అందులో 'చిత్రంగా' తీయడానికి అని ప్రశ్నించే వారికి ఇంతవరకు తెలుగులో 'రామాయణం' కథా వస్తువుగా వచ్చిన ఓ 'శతకం' చిత్రాల జాబితాను ఇవ్వవలసిందే. ఆ చిత్రాలు, వాటిలోని పాటలు నేటికీ. నాటి 'సీతారామ జననం' నుంచి నేటి గుణశేఖర్ 'బాల రామాయణం' వరకు వచ్చిన చిత్రాలలోని పాటలలో కొన్నింటిని మాత్రమే చెప్పుకోవాలి. తొలుతగా 1945లో వచ్చిన 'పాదుకా పట్టాభిషేకం' (కాంతారావు, కృష్ణకుమారి)లో గుహుడు సీతారాములను వనవాసం సమయంలో గంగానది దాటిస్తూ "ఈ గాలికెంత గుబురు, ఈ నీటికెంత అదురు" అని పాడుతూ... తండ్రి దశరధుడు గురించి, అతని యొక్క విశిష్టతను చెబుతూనే- సీతారాముల జంట యొక్క గొప్పతనం పామురులకు సహితం అర్థమయ్యే భాషలో (గుహుడు కోయివాడు కనుక) సముద్రాల రాసిన వైనం గమనించదగ్గ విషయం. రాజేశ్వరరావు సంగీతంలోని విషాద గాంభీర్యాలు సాహిత్యానికి వన్నెతెస్తే గంభీరమైన ఘంటశాల గానం అత్యంత భక్తి భావాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. తర్వాత 1958లో వచ్చిన 'భూకైలాస్' చిత్రంలో సముద్రాల రాసిన "రాముని అవతారం రఘుకుల సోముని అవతారం" అనే పాటలో మొత్తం 'రామా యణం'ను పింగళి వారు ఆవిష్కరించిన తీరు గొప్పగా ఉంటుంది. ఏ.వి.యం. వారు తీసిన ఈ చిత్రంలో నారద పాత్రధారి 'మాయసీత'కు చెబుతున్న విషయంను రచయిత అద్భుతమైన భాషాపటిమతో మృదుమధురంగా 'సరళంగా' రామాయణాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించారు. 'అదిగో చూడము బంగరు జింక... అలిగిన మరణమే నీకింతే..' 'అయ్యో రావణ భక్తాగ్రేసర అమరమే ఇక నీ చరిత.. పరస్త్రీపై మమకారం.. కలుగును ధర్మ విచార'మని కవి వ్యాఖ్యానంలో రామాయణంలో నైతికాంశాల ప్రస్తావన ఉంది. ఈ పాటలో భాష సరళతతో పాటు భావ స్పష్టతను గమనించవచ్చు. దాదాపు ఆరు నిమిషాలు ఈ పాటలో రామాయణంలో వాల్మీకి రచించిన ఆరుకాండాలు వెనుక నున్న అంతరార్థమును ఇమిడ్చి చిన్ని చిన్ని పదాలుగా మంచి- దానిని 'దృశ్యరూపంగా' సెల్యులాయిడ్ పై మలచిన తీరు దర్శకుడు శంకర్ ప్రతిభకు మచ్చుతునక. ఈ గీతంలో అలతి అలతి పదాల అనంతమైన అర్థాలు, చిత్ర కథకు సంబంధించి, రామాయణ కథలోని కీలక ఘట్టాలు దృశ్యమానమవుతాయి.

1958లో ఎన్.టి. రామారావు రాముడిగా సంపూర్ణ రామాయణం సినిమా వచ్చింది. ఇందులో కూడా 'రామాయణం' కథను క్లుప్తంగా వివరించే పాటలున్నాయి. ఇదే పేరుతో 1972లో బాపు దర్శకత్వంలో 'శోభన్ బాబు' శ్రీరాముడిగా చంద్రకళ సీతగా చిత్రం వచ్చి విజయవంత మైంది. ఈ చిత్రంలో కూడా గుహుడు పాట ఉంది. 'రామయ్య తండ్రి... ఓ రామయ్య తండ్రి' అనే పాటలో

గుహుడు శ్రీరాముడి గుణగణాలను వర్ణిస్తూ 'తాటకిని ఒక్కేటున కూల్చా వంటా, శివుని విల్లు ఒక్క దెబ్బకు విరిచావంటా... నువ్వు దాటలేక కాదులే రామయ్య తండ్రి' పదబంధాల వెనుక తన అదృష్టం కొద్ది రాముడు తన వంటి వారిని బ్రోచేందుకు వచ్చాడని చెప్పడం వెనుక ఓ సామాజిక జన ఐక్యతా సూత్రంను ఆరుద్ర చెబుతారు. ఆరుద్ర గారు గొప్ప సామాజిక బాధ్యత ఉన్న కమ్యూనిస్టు. ఆయన తన ప్రతి రాముని పాటలోని తనదైన మార్కుని ప్రదర్శించారు. ఉదాహరణ 'గోరంత దీపం'లోని 'రాయినైనా కాకపోతిని..' అనే పాటలో పిచుకలు, కాకులు, ఉడతలకు నీవు మోక్షమిచ్చావు, రాయిని నాతిని చేశావు. మనిషినై జన్మించినాను.. మత్సరములు చేరగా.. మద మత్సరములు చేరగా' అని విసురైన బాణంను విమర్శగా సంధించారు. రామయ్య తండ్రి.. ఓ రామయ్య తండ్రి' గీతంలో కూడా అదే భావజాలాన్ని విశదీకరిస్తారు. ఆరుద్ర గారు రాసిన 'శ్రీరామ గానామృతం' అనే ప్రైవేట్ ఆల్బమ్ లోనున్న ఎనిమిది పాటలలో రామాయణ కథనం అంతర్లీనంగా ఉంచి, మానవ నైజాన్ని ప్రశ్నిస్తూ మానవతకు జ్యోతులు పడతారు. ఎన్.టి. రామారావు రావణుని పాత్రలో నటిస్తూ నిర్మించిన చిత్రం 'సీతారామ కళ్యాణం'. ఇది 1961లో వచ్చింది. ఈ చిత్రంలో 'సీతారాముల కళ్యాణం చూతము రారండి' అని ఆహ్వానించే గీతముంది. రచన సముద్రాల(జూ). సంగీతం 'గాలి పెంచల'. నేటికీ శ్రీరామనవమి వస్తే వినిపించే అద్భుతమైన పాట. 'చూచువారులకు చూడముచ్చటగా, పుణ్యపురుషులకు పుణ్య ప్రదమట' అనే రచన సంవిధానంలో సీతారాముల కల్యాణ వైభవం ఎంత గొప్పదో, రామాయణంలో ఆ ఘట్టం సమయంలో వెతెంచిన దేవతలు, ఋషులు తదితరులు చూసిన వారి కెంత పుణ్యం కలిగిందోనని ఆనందపడతారు.

ఒక చిత్ర నిర్మాణం ఒక నిర్మాతకు 1963 ప్రాంతంలో కోటి రూపాయిల కలెక్షన్స్ ను ఇచ్చిందంటే ప్రస్తుత తరం నమ్మకపోవచ్చు. కానీ.. అలా అని చరిత్రలో సాక్ష్యంగా నిలిచిన చిత్రం 'లవకుశ'. ఈ చిత్రం పూర్తి కావడానికి నిర్మాత శంకర్ రెడ్డి (లలితా శివజ్యోతి) ఎంతగా వ్యథ చెందారో 'చరిత్ర'గా మిగిలిన వైనం. ఈ చిత్రంలో 'పింగళి' వారు, 'సదాశివబ్రహ్మం' గారు రాసిన 'వినుడు వినుడు రామాయణ గాథ' 'రామ కథను వినరయ్య' అనే పాటలు గొప్పగా విజయవంతమైనాయి. ఈనాటికీ అజరామ రంగా నిలిచి ఉన్నాయి. 'శ్రీరాముడు రారాజు చేయగా కోరెను దశరథ పూజారు, పౌరులెల్లరూ పొంగిపోయేర మంగళ మాట వి, కారు చిచ్చుగా మారెను కైక మంథర మాట విని' ఈ నాలుగు వాక్యాలు చాలు రచయిత 'రామాయణ కథలోని కైక, మంథర, దశరథుడు, ప్రజల యొక్క వ్యక్తిత్వాలను చెప్పటానికి. ముఖ్యంగా 'కావలిచిచ్చుగా మారెను కైక' అనే పదాల నిర్మాణం వెనుక ఆమె వలన వచ్చిన కష్టం ఆ తర్వాత ఎంతమంది బాధకు గురి చేసిందో, కొడుకు భరతుడు కాదనటం వలన ఆమె ఎంత వ్యథ చెందిందో కరుణ రసప్లావితంగా వివరించిన తీరు నభూతో... తెలుగు పాటను చిరస్థాయిగా నిలిపిన ఘంటసాల సంగీతం, సుశీల, లీల గార్ల గానం వంటి వాటికి నమో వాక్కములు తెలియజేయాలి. అదే విధంగా 'రామ కథను వినరయ్యా.. ఇహపర సుఖముల నొసగే సీత.. రామ కథను వినరయ్య' అనే పాటలో రామాయణంలో ఒక భాగాన్ని అనగా 'అయోధ్య నగరానికి రాజు దశరథ మహారాజు, ఆ రాజుకు ముగ్గురు రాణులు ముప్వురు, కౌసల్య, సుమిత్ర, కైకేయి.. నోము ఫలమున కలిగెరి వారికి కొమరులు నలుగురు..' ఇలా ఘట్టాలను వరుసగా వర్ణిస్తారు. లీల, సుశీల గానం అత్యంత మధురంగా రామాయణ కావ్యం లో మధుర ఘట్టాలను ప్రేక్షకుల ముందు ఆవిష్కరించారు.

పైన వివరించిన పాటలే కాదు.. 'శ్రీ రామాంజనేయ యుద్ధం' (బాపు) 'కృష్ణసత్య' (కె.వి.రెడ్డి) 'కృష్ణాంజనేయ యుద్ధం' (రామ రామ రామ సీత రామ రఘురామ) సి.ఎస్. రావు, 'శ్రీరామ కథ' (రామ కథ శ్రీ రామ కథ) పద్మనాభం, 'రామాలయం' (జగదభిరామా) బాబురావు,

పల్లెటూరి చిన్నోడు (సి.ఎస్.రావు) సీతా కళ్యాణం, సీతారామ కళ్యాణం (బాపు) వంటి చిత్రాలలో కూడా రామాయణ ఘట్టాలను విశదీకరించే గీతాలను ఆయా దర్శకులు పెట్టుకున్నారు. 'పది కొంపలు లేని పల్లెయినా రామమందిర ముండు వలయు గాక' అని వాల్మీకి చెప్పిన విధంగా రామాయణం లేని చిత్రాలు ఆనాడు లేవు.

**ఆధార గ్రంథాలు :**

1. సాహితీ సుధ - డాక్టర్ గుమ్మలూరు బాల శ్రీనివాస మూర్తి
2. తెలుగు పాట - డాక్టర్ రఘు శ్రీరామమూర్తి
3. వికీపీడియా కథనాలు

❖❖❖

# గురజాడ రచనల్లో స్త్రీలు – సమకాలీనత

– తోట రామకృష్ణ, పరిశోధక విద్యార్థి తెలుగు శాఖ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

నవయుగ వైతాళికుడు, నవ్య కవిత్వానికి వేగుచుక్క గురజాడ వెంకట అప్పారావు "ఆధునిక మహిళలు చరిత్రను తిరిగి రచిస్తారు అన్న దార్శనికుడు గురజాడ. ఈయన తన రచనలలో స్త్రీలకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చాడు. స్త్రీలు సమాజంలో ఎదుర్కొంటున్న శారీరక దోపిడి, కన్యాశుల్క వివాహాలు, స్త్రీలు అబలకాదు సబలని వారికి ఆత్మాభిమానం వుంటుందని ఎన్నో రచనలు రచించారు. ముఖ్యంగా వేశ్యావృత్తి, వేశ్యలు వివాహ సమస్య, యవ్వనంతో వున్న భార్యతో ముసలి భర్త కాపురం, పెద్ద వయస్సు తేడాతో జరిగే పెళ్ళిళ్ళు వల్ల వైధ్యవ్యాలు, వాటి ఫలితంగా జరిగే వ్యభిచారాలు మొదలైనవి. ఇతి వృత్తంగా ఎన్నో రచనలు మనకు అందించారు.

మీ పేరేమిటి? కథానికలో నాంచారమ్మ పాత్ర శైవ, వైష్ణవ మతాల మధ్యవున్న ఆధిపత్యపోరును, మూఢ నమ్మకాలను తొలగించే పాత్ర, శైవమత వ్యాప్తి ఎక్కువ అవ్వడానికి ప్రధాన కారణం 'గుండం' తొక్కడ మేనని తాము (వైష్ణవులు) కూడా 'గుండం' తొక్కితే శైవమత వ్యాప్తిని అరికట్టవచ్చునని గుండం తొక్కడానికి అయ్యా వార్లం గారే సమర్ధుడని మనవాళ్ళయ్యా సారధి నాయుడులు భావించి అతన్ని (అయ్యా వార్లం గారు) బలవంతంగా గుండం దగ్గరికి తీసుకొస్తారు. వెంటనే మాను వెనక నుంచి ఒక చేరకరదీపము, రెండవ చేత సూరకత్తి పట్టుకుని వచ్చిన నాంచారమ్మ మామగారి పక్కన నిలిచి ఆయన రెక్కలు పట్టుకుని వున్న నాయల వంక బాకు మొనజూపి దుష్టుల్లారా! యీ పరమ పవిత్రమైన బ్రాహ్మణ్ణి వొదుల్తారా. బాకుకు బలియిచ్చేదా?" అని అడుగుతుంది. ఆ గ్రామ మునసబు అయిన రామి నాయుడుని ఈ విధంగా ప్రశ్నిస్తుంది "నీకు కొండంత గుండె వుంది మునసబు నాయుడా, నువ్వేల గుండం తొక్కరాదూ?" యీ ముసలి బ్రాహ్మణ్ణి వొంటి మీద బట్టయినా లేకుండా నిర్దర మంచం మీంచి ఎందుకు యీడుచుకు వాసిరి? అని అంటుంది. అంతేకాకుండా నీ వియ్యంకుడు సారధినాయుడు శైవ మతంలోకి వెళ్ళితే ద్వాదశి ద్వాదశికీ "శక్కర పొంగళం", "పులిమోరీ" లేక పోతాయని గదా దుఃఖం?" అని ప్రశ్నిస్తుంది. రాముడే కాదు, ఏ దేవుడి మీదయినా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే ఒక్క గూడవే, కాదు, అన్ని కష్టాలూ తరించ వచ్చును. నేను మా మామగారి పేరు స్మరిస్తూ గుండం తొక్కుతాను. నా వెంట రాగలిగిన వైష్ణవులెవరైనా వుంటే ఎదటికి రండి అని అంటుంది. యెవడూ పలుకి లేదు నిరసన నవ్వు నవ్వి "ముసలాయనను అగ్గిలో తోసి పై నుంచి చూడటానికి మీరంతా వీరులా?" అని ప్రశ్నిస్తుంది. గుండం తొక్కడానికి మతాలతో సంబంధం లేదని భక్తి భావం వుంటే సరిపోతుందని యీ పచ్చి తురకకి గుండం తొక్కడానికి భగవంతుడు సాహస ధైర్యాలు యిచ్చాడు. గనుక మీ వైష్ణవ మతం గొప్పా అతగాడి తురక మతం గొప్పా? రామినాయుడా అంటుంది.

"దిద్దుబాటు" కథానికలో కమలిని పాత్ర నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్నదే. భర్త వ్యసనాలకో, పరస్త్రీ వ్యామోహానికో ఎరకావడం, తద్వారా భార్య జీవితంలో విషాదం నిత్యమే కానీ వైకల్పికం కాదు. ఇది సాధారణంగా స్త్రీలు తమలో తాము కుమిలి పోవడానికి. లేదా భర్తను వేధించడానికి, సాధించడానికి, చివరికి రాజీ పడిపోవడానికి దారితీసే సందర్భం. కానీ కమలిని పై మూడు పనులు చేయదు. కోమలిని స్వతహాగా విద్యావతి కనుక సమస్య పరిష్కరించే దిశగా గోపాలరావు వేశ్య వద్దకు వెళ్ళినప్పుడు ఆ రాత్రి కమలిని మంచం కింద దాక్కొని వుంటుంది. గోపాలరావు రాత్రి ఇంటికి వచ్చేసరికి కమిలిని లేకపోవుటచే గోపాలరావు పశ్చాత్తాపానికి గురి అవుతాడు. తాను రోజు చేస్తున్న తప్పుడు గుర్తుచేసుకొని

బాధపడుతాడు ఇకపై వేశ్యవద్దకు వెళ్ళినని తన పని మనిషి రావుడుతో చెప్పుతు బాధపడతాడు. ఈ మాటలు విన్న కమలిని మంచం కింద నుంచి అమృతం వొలికే కలకలనవ్వు, మనోహరమైన నూపురము రొద, విననయ్యెను.

గురజాడ వారు సృష్టించిన అద్భుతమైన పాత్ర "మెటిల్డా". ఈ పాత్ర నేటి సమకాలీన పరిస్థితులకు అద్దంపడుతుంది. ముఖ్యంగా వయసుస్సులోవున్న అందమైన స్త్రీ వయస్సురీత్యా ఎక్కువగా తేడా వున్న వ్యక్తిని వివాహం చేసుకోవడం వలన ఆ జంట సమాజంలో ఎదుర్కొంటునన అవమానాలను తెలియచేస్తుంది ఈ మెటిల్డా కథానిక.

ఈ కథానికలో వయస్సులో వున్న అందమైన అమ్మాయి 'మెటిల్డా' ఈమె భర్త వయస్సు రీత్యా పెదవాడు కావడం వలన 'ముసలిపులి' అని అక్కడ యువకులు పిలుస్తారు. మెటిల్డా అందచందాలకు ఆకర్షితులైన యువకులు ఆమెను అదేకంగా చూడటం గమనించిన ముసలిపులి ఒక యువకున్ని పిలిచి ఈ విధంగా అంటాడు. "నా పెళ్ళాం వేపు చూస్తున్నావా?" అని అడుగు తాడు అందుకుగాను ఆ యువకుడు ఈ విధంగా జవాబు యిస్తాడు. కిటికిలోంచి కనపడుతూండే మీ లైబ్రరీ చూస్తూ మీరు ఎటువంటి మనుష్యులు, ఏమి చేస్తుంటారు అని ఆలోచిస్తున్నాను". "నా పెళ్ళాన్ని చూడలేదూ?" అని అడుగుతాడు "నిజామాడమన్నాడు గనుక వొప్పు కోక విధిలేదు. చూస్తున్నాను గాని చెడ్డ తలపు మనసులో యీ షత్తువుంటే దేవుడు సాక్షి!" అంటాడు. ఆ యువకుడు దాని మాటకేం; అది కంటిక్కనపడితే నీకు ఆనందం, అవునా కాదా? నిజవన్నదేదీ?'' ఆ మాటలకు ఆ యువకుడు అవును అంటాడు. "అయితే ఈ ముండని తీసుకుపో; నీకు దానం చేశాను. తీసుకుపో? నాకు శని విరగడైపోతుంది". అంటాడు ముసలిపులి.

ఆ మాటలు విన్న మెటిల్డా ఆ యువకునికి ఈ విధంగా ఒక చీటి వ్రాస్తుంది. "మీరూ, మీనేస్తులూ నా కాపరం మన్ననివ్వరా? మీకు నేనేం అపకారం చేశాను? తలవంచకు మీ తోవను మీరు పోతేనే బతుకు తాను, లేకపోతే నా ప్రారబ్ధం'' అంటుంది.

గురజాడ వారు ముత్యాల సరాలు ఛందస్సులో వ్రాయబడిన గొప్ప గేయం కన్యక. ఈ గేయం ఈ కాలంనాటి సమకాలీన పరిస్థితులను తెలియజేస్తుంది. స్త్రీలలో ఆత్మాభిమానాన్ని, చైతన్య స్వభావాన్ని, సమస్యలెదురైనపుడు వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని 'కన్యక' పాత్ర ద్వారా గురజాడ వారు మనకు తెలియజేసారు.

కన్యక ఒక వైశ్య కూతురు ఈమె బాగా అలంకరించు కొని చెలికత్తెలతో కలసి గుడికి బయలుదేరింది. వీధిలో పట్నమును పాలించే రాజు చూసి, ఆమె అందానికి మోహితుడయ్యాడు. పట్టపగలు నాల్గు వీధుల మధ్యలో ఆ వైశ్య కన్యను బలాత్కారంగా చెంపట్టి మన్మధ రాజ్యం ఏలుకోవాలని, ఆ రాజు అనుకున్నాడు. రాజు తన దుష్టమంత్రుల సాయంతో, వైశ్యకన్యను చుట్టు ముట్టి పట్టుకోవడానికి ప్రయత్నించాడు.

కన్యక ప్రతిఘటించిన తీరు : అప్పుడు వైశ్య కన్యక తనకు ఇంక దైవమే దిక్కని తలచి, ధైర్యాన్ని వహించి ఆ రాజుతో ఇలా చెప్పింది.

"ముట్టబోకుడు, దేవకార్యం
తీర్చి వచ్చెద, నీవు పట్టం
యేలు రాజువు, నెట్టి కూతుర
నెటకు పోనేర్తున్''

బంధువులు అంటా, రాజు చుట్టూ నిలబడి యుండగా సెట్టి (కన్యక తండ్రి) తన రెండు చేతులూ జోడించి రాజుతా ఇలా విన్నవించాడు నీవు నగరాన్ని పాలించే రాజువు కదా! నీవు మా అమ్మాయిని బలాత్కా రంగా లొంగదీసుకోవాలా? నీవు పాలించే దేశంలోని వస్తువులన్ని నీసొత్తే కదా! అలాగే ఈ కన్యక కూడా, నీ సొమ్మే అవుతుందికదా? నీవు మా వైశ్యుల అమ్మాయిని కోరుకోవడం కంటె మా వైశ్య జాతికి మరొక అదృష్టం ఉండదు. కనుక అగ్ని సాక్షిగా మా అమ్మాయి, కన్యకను

పెండ్లాడి మమ్మల్ని ఆదరించుము. ఎంత మొత్తంలో కానుకలు కావలసినా, తీసికొమ్ము, మా వైశ్య జాతిని గౌరవంగా బ్రతికేటట్లు చెయ్యి. రాజుసెట్టి చెప్పిన మాటలకు వెటకారంగా నవ్వి, ఓహోహో! పట్టణాన్ని రాజకుమారుడికి ఒక వైశ్యుడు ధర్మమార్గం నేర్పడమా? అని రాజు అనుకున్నదంతా ధర్మమే రాజు చెప్పిందంతా చట్టమే రాజులకు మేలయిన వివాహ పద్ధతి, గాంధర్వ వివాహమే కదా అని రాజు సెట్టితో అంటాడు.

కన్యక తన వారందరితో కలసి దుర్గ గుడికి వెళ్ళింది. అక్కడ అగ్ని గుండంలో మంట ఆకాశాన్ని తాకుతోంది. కన్యక దుర్గను భక్తితో సేవించి తన నగలను తీసి, శక్తికి అర్పించింది. తరువాత కన్యక దుర్గ కొలనులో స్నానం చేసి రక్తగంధం, రక్త మూల్యం ధరించి, గుండం చుట్టు నిలబడ్డ తన వారికి ఇలా సందేశం ఇచ్చింది.

**కన్యక సందేశం :**

“అన్నల్లారా! తండ్రుల్లారా!” నా విన్నపం మీరు వినండి. వైశ్య కులంలో పెండ్లాం, పిల్లల్ని రక్షించు కోవడానికి, పౌరుషం మీకు ఎందుకు కలగదు? మీరు పదవుల కోసం ఆశపడక. కాసు వీసం చాలు అనుకోక, బుద్ధిబలం బాహుబలం పెంచుకొని, దేవుడిపై భారంవేసి, రాజులలో రాజుల్లా జీవించండి. రాజును పాలించే దేవుడు కూడా ఉంటాడు” అని కన్యక తన వైశ్య జాతికి ధైర్యంగా సందేశం ఇచ్చింది. తరువాత రాజుతో ఇలా చెప్పింది.

“ఓ రాజా! పట్ట పగలు నడివీధిలో జారులు, దొంగలు కూడా, స్త్రీలను మొట్టుకోరు. కాని, నీవు పట్టపగలు బలాత్కారంగా నన్ను చెరపట్టడానికి ప్రయత్నించావు. నీవు పట్టణాన్న పాలించే రాజువు కావు. నీకు కండకావరం పెరిగి దుర్మార్గానికి తలపెట్టావు. దేవుడంటూ ఉంటే దీన్ని చూస్తూ ఊరుకోడు. మాకులం పెద్దలు, ఇక్కడే ఉన్నారు. అగ్ని సాక్షికి అగ్నివుంది. నీవు కోరుకున్న కన్యను, నేను ఇక్కడే ఉన్నాను. నీవు నిజంగా పట్టమేలే రాజువే అయితే నన్ను పట్టుకో” అంటూ వైశ్య కన్యక అగ్ని ప్రవేశం చేసింది. ఈ విధంగా వైశ్య కన్యక రాజును ప్రతి ఘటించింది.

ఇంత వరకు “గురజాడ రచనల్లో స్త్రీలు - సమ కాలీనత” అనే అంశంలో భాగంగా ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక యుగం వరకు స్త్రీలు సామాజిక వివక్షత గురై అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు బాల్య వివాహాలు, కన్యాశుల్కం, వేశ్య వృత్తి ఇలా అనేక రకాలుగా స్త్రీని ఒక ఆటబొమ్మగా భావించిన సమాజం గురించి తెలుపుటకు ప్రయత్నించితిని.

**ఆధార గ్రంథాలు :**

1) గురజాడ రచనలు కవితల సంపుటం సంపాదకుడు - సెట్టి ఈశ్వరరావు

2) గురజాడ రచనలు కథానికలు - సంపాదకుడు - సెట్టి ఈశ్వరరావు

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 01, January 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# పెద్దింటి అశోక్ కుమార్ కథల్లో దాంపత్య జీవితం –పరిశీలన

– చెల్లా దేవి, పరిశోధక విద్యార్థిని, తెలుగు&ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

భారతీయ కుటుంబ వ్యవస్థలో కుటుంబ సభ్యులుగా రెండు మూడు తరాల వాళ్ళు కలిసి ఉడడం జరుగుతుంది. ఆ కుటుంబ సభ్యులందరి అవసరాల్ని గమనిస్తూ, తీరుస్తూ, అందరి పట్ల సమానత్వాన్ని చూపవలసిన బాధ్యత ఆ కుటుంబ యజమానిది. ఆకుటుంబీకుల సంపాదనంతా ఉమ్మడి ఆస్తిగానే పరిగణిస్తారు. ప్రతి ఒక్కరూ కష్ట సుఖాలన్నింటిలో పాలు పంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అనేక శతాబ్దాలుగా కొనసాగుతున్నా, నేడు వివిధ రాజకీయ, ఆర్థిక,సామాజిక కారణాల వల్లా, నగరీకరణం వల్లా విచ్చిన్నమై ప్రత్యేక కుటుంబాలు ఏర్పడటం జరిగింది. ఈ మార్పు వాళ్ళ భిన్న కుటుంబాల సభ్యుల మధ్యదూరం పెరిగింది. పూర్వం నుండి వస్తున్న సంప్రదాయాలు, బంధాలలో మార్పులు రాసాగాయి.

## దాంపత్య జీవితం - పరిశీలన :

“ఊటబాయి కథ “ సంపుటిలో “వలసపక్షి” కథలో సాయిలు అనారోగ్యం వలన కొంత కాలం ఇంటి వద్దనే ఉండాల్సి వచ్చింది. దాని కోసం తనగాడిదలను అమ్మాల్సి వచ్చింది. చేతిలో డబ్బు లేదు. శాంతంగా పొలం లేదు. భార్య ఒక్కతే బీడీలు చేసి తెచ్చిన డబ్బు ఏ మూలకూ సరిపోయేది కాదు. అప్పులు చేయడం మొదలు పెట్టాడు సాయిలు. ఇక అప్పు పుట్టలేని పరిస్థితి వచ్చే సరికి ఇంట్లో భార్య భర్తలకు గొడవలు మొదలయ్యాయి. అప్పులవాళ్ళ ఒత్తిడి అధికమయ్యింది. పూట గడవడం కూడా కష్టమయింది.ఆ సమయంలో సాయిలు భార్య భర్తని నిలదీస్తుంది.“కూసుండి తింటే గుట్టలు కూడా ఆగయి. ఒక్కదాన్ని చేస్తే నలుగురుతినుడాయే. యాది కెళ్ళి అందుతడి. దందల మన్నువడ దంద పెద్దదాయే. అడ్డెడు బియ్యం నీల్లల్ల పొత్తే ఒక్క మెతుకు మిగులదాయే” అంటూ సాయిలుభార్య విసుక్కోవడం మొదలెట్టింది. తను కష్టపడి సంపాదించింది ఇంట్లోసరిపోవడం లేదని, యిద్దరూ కష్టపడితేనే పిల్లలకి సరైన తిండి పెట్టలగమనే ఆవేదణ సాయిలు భార్యలో కనిపిస్తుంది.

“వలసబతుకులు” కథా సంపుటిలో ‘వలసబతుకులు’ కథలో ముత్తెము దేశంకాని దేశం పనికోసం వెళ్లాడు. కూతురు పెళ్లి నిర్ణయించామని భార్య చంద్రకళ ఉత్తరం రాస్తుంది. అవసరమైన పనులు చేయమని అవసరమైన డబ్బులు పంపిస్తున్నానని తిరిగి ఉత్తరం రాస్తాడు ముత్తము. కానీ డబ్బులు సమయానికిచంద్ర కళ కి అందవు. తన పుట్టుంటి వాళ్ళ సాయంతో కూతురు పెళ్లి చేస్తుంది. తిర్గి భర్తకి ఉత్తరం రాస్తుంది చంద్ర కళ. “ఆడిపిల్ల లగ్గం వట్టిగనే ఐతద! ఎన్ని సుదరాయించాలే, నీ అక్కలే వచ్చిచేసిరా లేక బావలేవచ్చి చేసిరా ! మీది కెళ్ళి అలుగుడులు గులుగుడులు.మీ అవ్వనాయిన లైతే గోగండి నాదిగాడు, చెప్పులు నాయి గావన్నట్టుతిరిగిరి. మా తమ్ముడు ఆడుకోవట్టి లగ్గం కార్యం గట్టెక్కింది. నీకు మామీద దయుంటే పైసలు పంపు అప్పులు గడుత, నాకు పెండ్లాం లేదు, పిల్లలులేరకుంటే ఊకుండు” అంటూ ఉత్తరం రాస్తుంది భార్య చంద్ర కళ. అమ్మ కడుపు చూస్తుంది, భార్య జేబు చూస్తుంది అనడానికి నిదర్శనం ముత్యం భార్య చంద్ర కళ. భర్త అక్కడ ఎలా ఉన్నడు ఆలోచన లేకుండా తన బాధలు చుట్టూ ఉన్న వాళ్ళు అంటున్న మాటలు దృష్టిలో పెట్టుకుని భర్తకి ఉత్తరం రాస్తుంది. నేటి తరంలో తమ వైపుగా మాత్రమే ఆలోచించుకునే ఎందరో భార్యలకి ప్రతీకగా కనిపిస్తుంది చంద్రకళ.

మరొక కథ “బంగారు వడ్డీ” కథలో అంజయ్య, బాలవ్వ భార్యాభర్తలు. భర్తని ఎప్పుడు డబ్బు కోసం వేధిస్తుంది. ఎలాగైనా డబ్బు సంపాదించాలనిఆలోచిస్తాడు

అంజయ్య. ఉన్న కాస్త పొలం మీద అప్పు తెచ్చి మస్కట్ వెళ్తాడుఅక్కడనుంచి డబ్బుపంపితే భార్యబాలవ్వ పొలం మీద తెచ్చిన అప్పు తీర్చుతుంది.తర్వాత భర్త అంజయ్య మస్కట్ వెళ్లడానికి సేటు వద్ద బంగారం బదులుతీసుకుని వడ్డీకి తనఖా పెడతారు. వాటికి అసలు, వడ్డీ తీర్చడానికే అంజయ్య సంపాదించంది మొత్తం సరిపోతుంది. తిరిగి వచ్చిన తర్వాత చూసుకుంటే ఏమీ మిగలదు. బాలవ్వ బాధను చూసి అంజయ్య నాకు ఇంకా వీసా గడువు ఉంది, నేను మళ్ళీ వెళ్తాను. ఈసారి మస్కట్ వెళ్తే ఎవరికి డబ్బులు కట్టాల్సిన పనిలేదు. యిప్పుడు మనకు మిగులుతుంది అని భార్యకి ధైర్యం చెబుతాడు అంజయ్య. "బాకీల మన్నువడ ఎంత దూరం పోయినా ఎప్పటి చిప్ప ఎనుగులనే. ఇక్కడ ఉంది ఎవుసం జేసుకున్నాగాని నాలుగు పైసలు సంపాయించుకుందుము భార్య వైపు నవ్వుతూ చూసాడు అంజయ్య. అతడి చూపుల్లో ధీమా ఉంది మాటల్లోఆత్మవిశ్వాసం ఉంది". వలస అంటూ భర్త అంజయ్య మస్కట్ వెళ్లి డబ్బు పంపు తున్నాడు. ఏదో విధంగా అప్పులు తీర్చి కాస్త డబ్బులు ఉంచుకుంటే పిల్లల చదువులు, కష్టాలు తీరతాయి అనుకుంది బాలవ్వ. కానీ సేటు చూపించిన వడ్డీ, బాకీల వళ్ళ ఏమీ మిగలకుండానే అయిపొయింది. భర్తని అనవసరంగా మస్కట్ పపినందుకు బాలవ్వ బాధ పడుతుంది.

"గోస" కథలో భూమా లింగం, బక్కవ్వ భార్యాభర్తలు. వీరు ఊరూరా తిరిగి జీవనం సాగిస్తూ ఉంటారు. భూమా లింగం చెప్పిన మాట వింటుంది బక్కవ్వ. కూతురూ శోభ మనవాళ్ళను తీసుకుని మరొక ఊరికి వెళ్తుంటారు. భూమాలింగం. "ఏందయ్యా ! ఎన్నడు సూదని తొవ్వ పట్టితివి. అంబటాల్ల సంగబయిలేల్లి తిమి. పొద్దు గూకింది. ఊరులేదు వాడలేదు, అటే బొప్పారంలోనో, గొల్లపెల్లిలనో ఉందామంటే నిలువ నీడలేదు. తాగ నీళ్ళు లేవు అంటిని. సాళవగల్ల ఊరికి తోలుకొని పోతనని ఈ తొవ్వ పట్టితివి. ఊరు సల్లగుండ ఇగరాదు. అగరాదు.." అంటుంది భర్తతో బక్కవ్వ. ఎప్పుడూ లేనిది ఇంతగా కూతుర్ని,మనవాళ్ళని నడిపించడం ఆమెను బాధిస్తుంది. పైగా రెండు రోజులనుంచిసరైనా తిండి లేక అందరూ నీరసంగా ఉన్నారు.

"ఘర్షణ" కథలో రాఘవ సుజాత భార్యాభర్తలు, రాఘవ మస్కట్వెళ్ళిన తర్వాత సుజాత పరిస్థితి కొంచెం ఆర్థికంగా బాగుటుంది. ఆమె కాస్తబాగుపడటం చూసి చుట్టూ ఉన్న వాళ్ళు, బంధువులు ఆమె మీద అసూయని, కోపాన్ని పెంచుకుంటారు. అవసరం ఉన్నప్పుడు ఆమెతో మాట్లాడుతూ లాభం పొందుతారు. అవసరం తీరాయ ఆమె గురించి చేదుగా చెప్పడంమొదలు పెడతారు. ఆ విధంగా సుజాత చాల మందికి పరాయిది అవుతుంది.అత్త మామ కూడా ఆమెను నిర్లక్ష్యం చేస్తారు. తన మీద ఉన్నవి లేని చెప్పిసుజాత భర్త రాఘవకి టెలిగ్రాం పంపుతారు. వేంతబే రావాలని. వచ్చిన రాఘవకిలేనిపోనివి చెప్పి పంచాది పెడతారు ఊరు లోని బంధువులు, చుట్టూ ఉన్నవాళ్ళు. ఆ సమయంలో "పిచ్చిదానా నువ్వు ఎలాంటి దానివో నాకు తెలుసు.వాళ్లకు ఎలా బుద్ధి చెప్పాలో కూడా తెలుసు. నీకు అన్యాయం చేస్తానని ఎలాఅనుకున్నావు. నిన్ను గింతనే అర్థం చేసుకున్నానా ? నువ్వు కడిగినముత్యానివని నాకు తెలుసునే. ఇక్కడి సంగతులన్నీ నా దోస్త్ చెప్పిండు. నీతప్పు ఏమీలేదు" అంటూ సుజాత ను ఓదార్చుతాడు భర్త. భర్త దూరంగా ఉన్నాడు. నచిన వాళ్ళు నచ్చినట్లు, ఇష్టం లేనివాళ్ళు వాళ్లకు నచ్చినట్లు మాట్లాడుతున్నారు. అవి నిజం అనుకుని భర్త తనని ఎక్కడ వదిలేస్తాడేమో అని బాధపడుతుంది. కానీ భార్యాభర్తలు ఒకరిని ఒకరు అర్థంచేసుకుంటే అపార్థాలకు తావు ఉండదని తెలియజేస్తుంది.

''అమాయకుడు'' కథలో గోపాల్, వసంత భార్యాభర్తలు. గోపాల్ మస్కట్వెళ్లి అయిదు సంవత్సరాలు అయ్యింది. అక్కడ నుంచి తిరిగి వచ్చాడు. వస్తూకొన్ని వస్తువులు, కొంత డబ్బు కూడా తీసుకు వచ్చాడు. అక్కడికి వెళ్లి పంపినడబ్బును భార్య వంసత జాగ్రత్త చేసింది.

గోపాల్ మస్కట్ నుంచి వచ్చిన తర్వాతప్రవర్తన మారింది. తన వద్ద ఉన్న డబ్బును జల్సాల కోసం ఖర్చు చేయడంమొదలు పెట్టాడు. పెద్ద వాళ్ళతో తిరగడం అలవాటు అయ్యింది. భర్తకి నచ్చజెప్పాలని చూసింది వంసత. కానీ గోపాల్ వినలేదు. తిరిగి వంసతను హెచ్చరించాడు. దానితో వసంత పట్టించుకోవడం మానేసింది. చివరికిగోపాల్ అందరి చేతుల్లో మోస పోయాడు. తన డబ్బు అంతా పోగొట్టుకున్నాడు.అప్పుడు కానీ భార్య చెప్పిన మాటలు అర్థం కాలేదు.ఒక సందర్భంలో అనవసరమైన పొలం కొనాలని చూస్తున్నాడు వద్దని చేపాలనుకుంది వసంత. "ఎలాగైనా అతడిని ఒప్పించి పొలం ఇల్లుకొండం మన్పించాలకుంది. భార్యకు తెలిస్తే అడ్డు చెబుతుందని తెలియకుండానేనాలుగు ఎకరాల బీడు భూమి కొన్నాడు గోపాల్". ఈ విధంగా గోపాల్ భార్య వినకుండా అనవసరంగా గొప్పలకు పోవడం తద్వారా ఉన్న డబ్బు అంతాఖర్చు చేయడం జరిగింది. భర్త చేస్తున్న పనులకి ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ముందుగానే ఊహించింది వసంత. కాని భర్తకి ఎంత చెప్పినా వినలేదు. తన హాదను తోడ బుట్టువులకి చెప్పుకుని బాధపడింది. భర్త నిజం తెలుసుకున్న తర్వాత ఆసరాగా నిలబడింది.

"తిరిగిరాని యవ్వనం" కథలో పల్లవి, రాఘవ భార్య భర్తలు. రాఘవపల్లవిని వదిలి పెట్టి మస్కట్ వెళ్తున్నానని చెప్పి బొంబాయి లో ఉంటాడు. డబ్బు, సరదాలకి అలవాటు పడి తనకి నచ్చిన జీవనం గడపాడానికి అలవాటుపడతాడు రాఘవ. కానీ కొన్ని రోజులకి రాఘవకి ఒక విషయం తెలుస్తుంది. తనకి భయంకరమైన రోగం ఉందని. చావుకి దగ్గర అవుతున్నాడని తెలుస్తుంది. ఆ విషయం తెలుసుకుని భార్య పల్లవి పై పగను పెంచుకుంటాడు. ఆమెను కూడా నాశనం చేయాలని తిరిగి ఇంటికి వస్తాడు. కానీ ఆమె చూపించినప్రేమ ఆప్యాయతలకు తనలో మార్పు వస్తుంది. ఒక రోజు రాత్రి ఉత్తరంరాసిపెట్టి తాను ఎక్కడికో వెళ్ళిపోతాడు. "నీ మంచితనం తెల్సుకునే వాటికి కాలం మించి పోయింది. బ్రతకలాన్నఆశ యిప్పుడు చిగురించినా బ్రతికించే మందు లేదు. నిన్ను బాధించాలనివచ్చి ఓడిపోయి, నీ సుఖాన్ని కోరి దూరంగా వెళ్ళిపోతున్నాను. అప్పుడుకాదు పల్లవి, యిప్పుడు నిజంగా మారి పోయాను". భార్యాభర్తల బంధం ఎంతోగొప్పది. భార్యని అపార్థం చేసుకుని ఆమె జీవితాన్ని నాశనం చేయాలను కుంటాడుకాని ఆమె చూపించిన ప్రేమ ఆప్యాయతలకి మనసు కరుగుతుంది. అదేభార్యాభర్తల బంధం.

"దగా" కథలో శ్రీలత, సత్యం భార్యాభర్తలు. ఎవరైనా దుబాయ్, మస్కట్ వెళ్ళాలి అనుకునే వారికి విసా, పాస్ పోర్ట్ ఇప్పించి ఆ దేశానికిపంపించడానికి ఏజెంట్‌గా పనిచేస్తాడు సత్యం సత్యం యిక్కడ ఒక విధంగాచెప్పి అక్కడికి పంపిస్తాడు. కానీ అక్కడికి వెళ్ళిన వారికి జీతం తక్కువ,వసతులు కూడా లేకుండా చాలా ఇబ్బందులు పడుతూ ఉంటారు. వెళ్ళినవాళ్ళు అక్కడ నుంచి తమ బంధువులకి ఫోన్ చేసి అసలు విషయం చెబుతారు. ఊరిలో ఉన్నవాళ్ళు సత్యం ఇంటి పైకి దాడికి వస్తారు. విషయం తెలుసుకున్నసత్యం బొంబాయి లోనే ఉంది పోతాడు. భార్య శ్రీలత తమ పుట్టింటి వాళుఎ ఇచ్చిన ఆస్తులు అమ్మి వాళ్ళందరికీ బాకీలను తీర్చుతుంది. ముంబాయి ఫోన్ చేసి భర్తని ఊరికి రమ్మని చెప్పింది. వస్తే ఏం జరుగుతుందో తెలిసే ఆ మాట అంటున్నావా అంటాడు సత్యం. తన నిర్ణయాన్ని చెప్పింది శ్రీలత. అలా చేయవద్దు శ్రీలత అంటూ అరిచాడు సత్యం. తననిర్ణయం మారదని గట్టిగా చెప్పి ఫోన్ పెట్టేసింది శ్రీలత. "నాన్నా..ఇండ్లు, పొలాలు అమ్ముకుని అతడిని నమ్మి డబ్బులు ఇచ్చారు. నా నగలు, ఇంట్లో సామానులు, పొలం, ఇల్లు అమ్మేసేయ్. ఎవరి డబ్బులు వారికి యిచ్చేయ్. జీతం తక్కువ అని రాసారు కదా వారికి సగం డబ్బులు యిచ్చేయండి అనితన నిర్ణయాన్ని చెప్పింది శ్రీలత" సత్యం చేస్తున్న పనులు వల్ల ఊరిలో ఒక్కొక్కరు ఒక్కోరకంగాఅనుకోవడం వింటుంది శ్రీలత

భర్తకి నచ్చజెప్పాలని చూస్తుంది. కానీసత్యం అం మాటను లెక్క చేయదు. చివరికి అన్ని దారులు మూసుకుపోయాక ఆమె చెప్పిన మాటలు గుర్తుకు వస్తాయి. భర్తను కాపాడు కోవడానికి తనఆస్తిని, ఇంటిని, ఇంటిలోని వస్తువులను అమ్మి అప్పులు తీర్చుతుంది శ్రీలత.

"జుమ్మేకి రాత్ మే" కథా సంపుటిలో "రెండు నదులు" కథలో.. పల్లవి, సాగర్ భార్య భర్తలు. పల్లవి హైదరాబాద్ లో ఉద్యోగం, సాగర్బెంగళూరులో ఉద్యోగం చేస్తుంటాడు. యిద్దరూ సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు..వారానికి ఒకసారి వీకెండ్ లో హైదరాబాద్ వస్తూ ఉంటాడు సాగర్. పల్లవి వద్దకు వెళ్ళే సమయంలో అన్ని విషయాల్లో జాగ్రత్త పడతాడు సాగర్, సాగర్వస్తున్నది తెలిసి పల్లవి కూడా అప్రమత్తం అవుతుంది. యిద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం. కానీ జీవితం మాత్రం యాంత్రీకంగా సాగుతుంది. రోజుఫోన్ చేసి మాట్లాడుకునే సమయంలో ఉన్న ప్రేమ ఆప్యాయత ఎదురుగా ఉన్నప్పుడు కనిపిచడం లేదు. కారణం వారు గడిపేస్తున్న జీవన శైలి . ఈకథ నేటి తరం ఎందరో భార్యాభర్తల జీవితాలకి అద్దం పడుతుంది. "ముందుగా సాగర్ బయటపడ్డాడు. 'ఫ్రెండ్స్ ను మనీ అడ్జస్ట్ చెయమనాలి. ఈ రోజు వెళ్తేనే బాగుంటుంది అన్నాడు. పల్లవి రిలీఫ్ గాఫీలయింది. కానీ ముఖం మీద ఆ భావం కనిపించకుండా బేలగా సరే నేను ఆఫీసుకు వెళ్తాను మరి అన్నది 'వద్దనడం లేదు చూడు అనుకున్నాడు సాగర్. పల్లవి కూడా అలాగే అనుకుంది". యిప్పుడు ఉన్న పరిస్థితులకు, పద్ధతులకు సాగర్, పల్లవులు ప్రత్యక్ష సాక్ష్యులు. భార్యా భర్తలు ఒక చోట ఉండాలి. ఒకరికోసం ఒకరు బతకాలి అలా కాకుండా ఎవరికి వారు అన్నట్టు దూరంగాఎవరి ప్రపంచంలో వాళ్ళు బతికితే ఎలాంటి మనస్తత్వాలు ఉంటాయో వీరిద్దరినిచూస్తే తెలుస్తుంది.

**ముగింపు :**

పెద్దింటి అశోక్ కుమార్ రచించిన కథల్లోని సామాజిక అంశాలు అయిన కుంటుంబ సంబంధాలులో భార్యా భర్తలు మధ్య ఉండవలసిన ప్రేమ, అభిమానాలు నేటి తరంలో ఏవిధంగా ఉన్నాయి. వలస బతుకులులో సగటు మనిషి వేరే దేశం వెళ్ళడానికి పడుతున్న పాట్లు, మధ్యలో దళారీలు వలన ఏ విధంగా మోసపోతున్నాడు, అధికారం, పలుకు బడి, పెత్తనం పేరుతో యిప్పటికి పల్లెల్లో పేదవారిని ఏ విధంగా దోచుకుంటున్నారో వంటి విషయాలు, మానవీయత వంటి కోణాల్లో రచించిన కథలను విశ్లేషించాను.

**ఆధార గ్రంథాలు :**

1. నవలాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. సమాలోచన - ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం
3. ఊటబాయి - పెద్దింటి అశోక్ కుమార్
4. వలస బతుకులు - పెద్దింటి అశోక్ కుమార్
5. జుమ్మేకి రాత్మే - పెద్దింటి అశోక్ కుమార్

❖❖❖

# “అంతర్జాతీయ తెలుగు కవిత్వానికి అతడో చిరునామా!”

- రామాపురం శ్రీనివాసులు, తెలుగు పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

నెల్లూరులో పుట్టి తెలుగు కవిత్వానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవిగా డాక్టర్. పెరుగు రామకృష్ణ లబ్ధ ప్రతిష్టులు. తండ్రి పెరుగు వెంకటేశ్వర్లు, కమలమ్మల నాల్గవ సంతానంగా జన్మించిన వీరు తండ్రి రాసుకున్న ఛందోబద్ద పద్యాలకు వారసుడయ్యాడు. తన అన్నయ్య చిన్నతనంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో కవిత్వం రాయడం చూసి ప్రభావితుడయి పదవ తరగతిలోనే తొలి కవిత వ్రాసి ఆంధ్రజ్యోతి వార్తా పత్రిక యువకలాలు శీర్షికలో ప్రచురణ పొంది కవితా యాత్రకు శ్రీకారం చుట్టారు. ఆంగ్ల సాహిత్యంలో బి.ఎ.డిగ్రీ చేసి సర్వీస్ కమీషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ ఇన్స్పెక్టర్‌గా ప్రవేశించి 2020లో వాణిజ్య పన్నుల శాఖాధికారిగా పదవీవిరమణ పొందారు. తొలి కవిత రాసిన నాటినుండి ఎక్కడ ఉన్నా కవులను కలవడం, కవిత్వపు చేయి విడవకపోవడం ఈయనను కవితా రంగంలో శిఖరస్థాయికి చేర్చాయి. 1996 వెన్నెల జలపాతం అనే తొలి కవితా సంపుటి ప్రచురించి దానికి భూమిక రాసిన యుగకవి, నెల్లూరీయులు గుంటూరు శేషేంద్ర శర్మచే “ఈయన కవితల్లో సమకాలీనత స్పష్టంగా ఉందని అది ఆయన కవితకు వెన్నెముక” అని కితాబు అందుకున్నారు. డాక్టర్. పెరుగు రామకృష్ణ కలం నుండి పలు కవితా సంపుటాలు వెలువడ్డాయి. వారి కవితా సంపుటాలలోని ప్రముఖ కవితలను విశ్లేషిండమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

## వెన్నెల జలపాతం :

“వెన్నెల జలపాతం” అనే కవితా సంపుటిలో రచయిత భావకవితా లోకం నుంచి యువకులను అభ్యుదయ మార్గం వైపు నడిపిన శ్రీశ్రీ అంటూ వారి విశిష్టతను రచయిత ఈ కవిత ద్వారా ఇలా అంటారు.

భావ కతితా లోకం నుంచి
యువ కలాల దారి మళ్ళించి
అభ్యుదయ భావం
బండ్ల బాటపై తన కలం బలంతో
సుదూరం నడిపించి

ఈ కవితలో ఆనాటి సమాజంలో భావ కవిత్వానికి అధిక ప్రాధాన్యత ఉండేది. ఆ తరుణంలో సమాజాన్ని చైతన్య పరిచే విధంగా అభ్యుదయ కవిత్వాన్ని ప్రేరేపించి నటువంటి వ్యక్తి శ్రీశ్రీ. తన అభ్యుదయ కవిత్వం సమాజానికి దగ్గరగా వుండి అందరిలో చైతన్యం తెచ్చాడని సమాజ మార్పుకు శ్రీకారం చుట్టాడని శ్రీశ్రీ గురించి రచయిత ఈ కవిత ద్వారా తన అభిప్రాయాన్ని తెలియ జేస్తాడు.

1999లో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉంటూ చేసిన ప్రయోగం 'శ్వేతసంతకాలు' అనే కవితా సంకలనం. ఆరుగురు నెల్లూరు కవుల సంకలనమిది. ఈయన ఎక్కడున్నా రచయితలను సమీకరించే గుణం కలిగి ఉండటం ఈ ప్రయత్నానికి నాంది పలికింది. దోర్నాదుల సుబ్బమ్మ, బత్తుల మనోహర్, పెరుగు సుజనారామం, వి.ప్రతిమ, షేక్ ఖాదర్ షరీఫ్ మున్నగువారు కవితా రచయితలుగా తమ కవితావాణిని వినిపించారు.పెరుగు రామకృష్ణ సంపాదకులు, కవిగా ఉన్నారు. ఈ గ్రంథానికి సుప్రసిద్ధ విమర్శకులు చేకూరి రామారావు ముందుమాట రాశారు. చేరాగారు “ఇద్దరో ముగ్గురో కలసి ఒక కవితా సంపుటి తీసుకురావడం పెద్ద ఆశ్చర్యం కాదుగాని, ఆరుగురు కవులు భిన్న మార్గాలవారు, భిన్న ధోరణుల వారు, వేర్వేరు పలుకుబడి ఉన్న వారు, స్త్రీలు, పురుషులు, వివిధ మతాలవారు, బహు కులాల వారు ఒక పుస్తకం ద్వారా

బయటకు రావడం విశేషమే. ఈ ఆరుగురువి స్పష్టంగా వేర్వేరు గొంతులు" అంటూ అభినందిచారు.

ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద నిర్వహించిన ఒక రచయితల గోష్టిలో పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. ఒక రచయిత్రి కవితకు ప్రేరణ పొంది వీరు 'నువ్వెళ్ళిపోయాక' అనే దీర్ఘ కవిత రాసి ప్రచురించారు. భర్త వియోగాన్ని భరించలేని ఓ స్త్రీమూర్తి, ఎందరో స్త్రీమూర్తుల వేదనాభరిత గాథ ఇది. "స్త్రీకు పురుషజీవితం శిలామయం. పురుషుడు వినాస్త్రీ బ్రతుకు పాషాణభరం" అన్నారు డా॥ ఆవంత్స సోమసుందర్. 'కావ్యం నిండా విషాద భరితానుభవం చిప్పిల్లుతున్నా - కావ్య రసగ్రహణ పర్యవసాయిలో ఆనందమే ప్రాప్తిస్తుంది. అలనాటి కాళిదాసుని రతీవిలాపమయినా ఈ నాటి శ్రీపెరుగు కావ్యమయినా ఒకే ఫలస్తుతి" అంటూ ఆవంత్స గారు అభినందించారు.

**నువ్వెళ్ళిపోయాక :**

"పెరుగు రామకృష్ణ పురుషుడైనప్పటికీ ఒక స్త్రీలోకి పరకాయ ప్రవేశం చేసి ఆమె ఔన్నత్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. ఇది 2003లో వెలువడింది. ఈ దీర్ఘకవితకి వేమిరెడ్డి పద్మావతిగారూ, తన తల్లిగారూ స్ఫూర్తినిచ్చారని కవి ముందుమాటలో చెప్పారు. దుఃఖానికి, సంతోషానికీ లింగభేదం లేదని నిరూపిస్తుందీకవిత. భర్త మరణంతో ఏర్పడ్డ చిరుగుకు అతుకు వేయలేననీ, గుండె లోతుల్లో గాయాలేగాని ఏ గానాలూ లేవని భార్య విలపించిన తీరు చదువుతుంటే మన గుండెల్ని పిండేస్తుంది.

నువ్వెళ్ళిపోయాక -
స్పష్టంగా తెలుస్తున్న
ఈ బ్రతుకు ముక్క
చినుగుకు అతుకు వేయలేకున్నా...
నా హృదయపు పిల్లనగ్రోవిలో
ఇప్పుడు నీ నిష్క్రమణ
మిగిల్చిన గాయాలే కానీ...
గానాలే లేవు.

భర్తను పోగొట్టుకున్న భార్యకు ఏమిచ్చినా ఆమెకు ఉపశమనం కలగదు. తన జంట పక్షి ఇకరాదని తెలిసినా, తిరిగొస్తే ఎంతో బాగుండునని ఎదురుచూపు చూస్తుంది. భర్త చిరునవ్వులే తిరిగి కావాలని భార్య కోరుకోవడం సహజం. స్త్రీ మనస్తత్వాన్ని ఖచ్చితంగా ఇందులో వ్యక్తీకరించారు పెరుగు రామకృష్ణ. అడవిని వీడిపోని పక్షిపాట లాగా భర్త, భార్యతో ఉండాలని భార్య ఆశ పడడంలో వింతేముంది? వినియోగం విషాదం ఎంత మోయలేని భారమో రుచి చూపించారు ఈ దీర్ఘకవితలో.

ఇవన్నీ నాకు తెలియదు -
ఇవేవీ నాకొద్దు -
అడవిని వీడిపోని పక్షి పాటల్లే
నాకు నువ్వే కావాలి!
చిలిపి మబ్బు తునకల్ని వెదజల్లే
నీ చిరునవ్వులే కావాలి...!
పసిపాప చేయి చెంప నిమిరినట్లు
మనసు తడిమే నీ ఆత్మీయత కావాలి!!

భర్త పోయాక స్త్రీ కట్టూ, బొట్టును కూడా మార్చేస్తుంది సమాజం. అలంకరణలనూ, ఆడంబరాలను కూడా వారికి దూరం చేస్తుంది. గోరుచుట్టుపై రోకటి పోటుల్లాంటి మాటలతో వైధవ్యం హిందూ స్త్రీల పాలిటి శాపం, ముఖంలోంచి బొట్టుతో పాటే నవ్వు కూడా వలస పోయిందని చెప్పి స్త్రీల వైధవ్య జీవితం ఎంత దుర్భరమో తెలియజేశారు.

ఉద్యోగరీత్యా సూళ్ళూరుపేటలో నివాసమున్న పెరుగు రామకృష్ణ అంతర్జాతీయ పర్యాటక కేంద్రం అయిన నేలపట్టు, పులికాట్‌లలో పక్షుల విడిది వాసం సుమారు అయిదు సీజన్లు పక్షి శాస్త్రవేత్తలతో కలసి అధ్యయనం చేసి 'ఫ్లెమింగో' అనే దీర్ఘ కావ్యం రాసి ప్రచురించారు. ఈ కావ్య విలక్షణను ప్రశంసిస్తూ అప్పటి తెలుగు విశ్వ విద్యాలయం రాజమండ్రి పీఠాధిపతి ఆచార్య డా॥

ఎండ్లూరి సుధాకర్‌గారు వీరి గురించి చెబుతూ అక్షరాల నిండా వలస పక్షుల గానముంది. ఈ రచనతో మా పెరుగు రామకృష్ణ ఫ్లెమింగో రామకృష్ణగా మారిపోయారు. పక్షిని ప్రాకృతిక, ఆధ్యాత్మిక, సామాజిక ప్రతీకగా బలంగా చెప్పాడన్నారు. ఇదే కావ్యానికి కితాబిస్తూ మరో సుప్రసిద్ధ రచయిత, అనువాదకులు, బహు భాషా ప్రవీణులు డా॥ నలిమెల భాస్కర్ 'పెరుగు రామకృష్ణ పక్షిలో పరకాయి ప్రవేశం చేశాడు. ఆయన కవిత్వంలో స్పష్టత ఉంది' అన్నారు. ఈ దీర్ఘ కావ్యం ఆంగ్లం, హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో అనువదించబడింది. అంతేగాక ఆంగ్లం నుండి రుమేనియా భాషలో అనువాదమై ప్రచురించబడింది.

## ఫ్లెమింగో :

2006లో ఇది వెలువడింది. ఈ దీర్ఘకవితకు 'విడిది పక్షుల దీర్ఘకవిత' అనే ఉపశీర్షికను ఉంచడం వల్ల ముందుగానే వస్తువు, ప్రక్రియను కవి తెలియజేసినట్లయింది. నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు దేశంలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సు. పులికాట్ సరస్సు గట్టుపైన 'నేలపట్టు' అనే గ్రామం ఉంది. సైబీరియా దేశం నుండి వేల సంఖ్యలో పక్షులు శీతాకాలంలో నేలపట్టుకు వలస వస్తాయి. అక్కడి వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక ఇక్కడికొచ్చి గుడ్లుపెట్టి, పొదిగి పిల్లల్ని వెంట తీసుకుని వెళతాయి. వేల కిలోమీటర్లు ప్రయాణించి పక్షులు ఇక్కడికి రావడం ఆశ్చర్యకరమైన విషయం. వేసవి ప్రారంభానికి పక్షులు తిరిగి వెళ్ళిపోతాయి. ఎన్నో రకాల పక్షులు పులికాట్ ప్రాంతానికి వచ్చినప్పటికీ వాటిల్లో 'ఫ్లెమింగో'లకు ప్రత్యేక స్థానముంది. అందుకే ఈ కవితకు ఆ పేరే ఉంచడం సముచితంగా ఉంది. ఈ దీర్ఘకవితలో పక్షుల సౌందర్యం, పులికాట్ సోయగాలు, పక్షుల ప్రణయ విహారాలు వంటివి మనోహరంగా వర్ణించబడ్డాయి. పక్షుల ప్రతి చేష్టను నిశితంగా గమనించి ప్రతి కవిలోనూ వాటి రామణీయకతను కవి పాఠకులకు అందించారు. ఎగిరే ఒక్కో పక్షీ ఒక్కొక్క కవితా పతాకగా కవికి దర్శనమిచ్చింది.

పులికాట్ ఆకాశమంతా భావవీచికల ప్రభంజనం
ఒక్కో పక్షి ఎగరేసిన ఒక్కో కవితా పతాక
రంగుల రామచిలక కలల ఖండకావ్యం
చీకటి అడుసు తొక్కిన నల్లకాళ్ళ కొంగ
నీలి పులికాట్‌లో కాళ్ళు కడుగుతుంది
రంగురంగుల సముద్రపు రాచిలక
గిలకబాయి చేదలా నీళ్ళలో జారుతుంది.

మామూలు రోజుల్లో నేలపట్టు అతి సాధారణమైన పల్లెటూరే. శీతాకాలం వచ్చిందంటే చాలు అక్కడి చెట్లన్నీ పక్షులతో అందంగా అలంకరించినట్లు కనిపిస్తాయి. ప్రాంతీయంగా కడప చెట్లు అని పిలిచే చెట్లపై పక్షులు వాలి గూళ్ళు కట్టుకుంటాయి. కొమ్మ కొమ్మలోనూ సంగీత కచ్చేరి జరుగుతున్నట్టు పక్షుల కిలకిలారావాలు, ప్రతి గూటిలోని రాగాల మాలికలు అక్కడి వాతావరణాన్ని సమ్మోహనం చేస్తాయి. పచ్చగా ఉండే చెట్లు పక్షుల చేరికతో రంగు రంగుల వింత శోభను సంతరించుకుంటాయి. ఈ విషయాలన్నిటితో ప్రత్యక్ష సంబంధం ఉన్న కవి అత్యంత సహజ సుందరంగా వర్ణిస్తూ మన కళ్ళముందు ఆ దృశ్యాల్ని కనువిందు చేస్తాడు. జనులందరూ ఒకచోట చేరి సంబరాలు చేసుకుంటే దానిని జాతర అని పిలుస్తాం. నేలపట్టులో వేలాదిగా పక్షులు చేస్తున్న సందడిని పక్షుల జాతరగా రామకృష్ణ పేర్కొంటారు.

అక్కడ -
కొమ్మ కొమ్మకో కచ్చేరి
గూటి గూటికో రాగవల్లరి
ప్రతిచెట్టూ రంగుల దొంతర
నేలపట్టంతా పక్షుల జాతర
కుహుకుహులు కితకితలు
కువకువలు కిలకిలలు

ఫ్లెమింగో మొదలైన పక్షులు సైబీరియా ప్రాంతంలో జీవించగలిగినప్పటికీ సంతానాన్ని పొందడం అక్కడ వీలుకాదు. అతిశీతల వాతావరణంలో గుడ్లు పొదగడం

సాధ్యంకాని పని. అందుకే అవి ఇంత దూరం ప్రయాణించి, ఇక్కడ గుడ్లుపెట్టి పొదిగి పిల్లల్ని చేసు కుంటాయి. ఈ కావ్యంలో పక్షుల ప్రణయ లీలల్ని రసవంతంగా కవి వర్ణించారు. ఆడపక్షులు గూట్లో ఉండి గుడ్లు పెట్టడం, మగపక్షులు పులికాట్‌లోకెళ్ళి చేపల్ని వేటాడి గూటికి తీసుకొచ్చి వాటికి తినిపించడం జరుగుతుంది. ప్రతి కొమ్మ మీదా పక్షుల ప్రణయం వెల్లివిరుస్తూ ఉంటుంది. ఏ జీవికైనా సంసారసుఖం వల్లనే జాతి అభివృద్ధి జరుగుతోందంటూ పక్షుల సరసకేళీ కలాపాలను కవి వాత్సాయన శిబిరాలుగా వర్ణించారు. ప్రకృతిలోని రమణీయకతను, రసానందాన్ని అందించడమే ప్రకృతి కవిత ప్రధాన విధి.

ఎన్ని ప్రబంధాలో, ఎన్ని ప్రణయాలో
ప్రతి కొమ్మా వాత్సాయన శిబిరం
ప్రతి గూడు ప్రణవోత్థాన ముఖరం
సృష్టిలేదు, వృష్టి లేదు, వ్యష్టి లేదు
సంసార సుఖం వినా విశ్వవృద&టధ లేదు
మనిషికి సంతానమే కాలబీజం

వేసవికాలం మొదలవుతుండగా పక్షులు తమ పిల్లల్ని తీసుకుని స్వస్థానాలకు బయలుదేరుతాయి. ఇక్కడ పుట్టిన పక్షులు తమ జన్మస్థలాన్ని మరిచిపోకుండా తిరిగి మరో ఏడాది తిరిగివస్తాయి. పుట్టిన ఊరిని మరిచిపోని పక్షుల కృతజ్ఞతాభావాన్ని అభినందిస్తున్నారు. పుట్టిన ఊరిని వదలివెళ్ళిన మనుషులు తిరిగి ఆ ఊరి వైపు చూడడానికే ఇష్టపడని ఈ రోజుల్లో మనం ఫ్లెమింగో పక్షులనుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పక్షుల్లో పరకాయ ప్రవేశం చేస్తే తప్ప వాటిలాంటి కృతజ్ఞత మనకు అలవడదని కవి మానవాళికి చురకనంటిస్తారు.

పెరుగు రామకృష్ణగారి కవితా సంపుటాలు తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నాయి. వీరి కవితలు ఆంగ్లం, హిందీ, కన్నడ, తమిళం, మల యాళ భాషల్లోకి అనువదించబడ్డాయి. అంతేగాక ఆంగ్లం నుండి రుమేనియా భాషలోకి కూడా అనువాదమై ప్రచురించబడ్డాయి. ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కవులచేత ప్రశంసలు పొంది, అంతర్జాతీయ కవిగా పేరుప్రఖ్యాతలు పొందారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆధునిక కవిత్వము - సంప్రదాయాలు ప్రయోగాలు - ఆచార్య సి. నారాయణరెడ్డి
2. తెలుగు కవితా వికాసం - కడియాల రామ్మోహనరాయ్
3. ఫ్లెమింగో - పెరుగు రామకృష్ణ
4. నువ్వెళ్లిపోయాక - పెరుగు రామకృష్ణ

❖❖❖

# గురజాడ స్త్రీజాడ

- **తుళ్ళూరు రవి,** పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

"దేశమంటే మట్టికాదోయి, దేశమంటే మనుషులోయి" అనే మాటను దేశమంటే పూజా పునస్కారాలు చేయాల్సిన దేవతామూర్తి కాదు. దేశం అంటే? మట్టికాదు మనుషులే దేశం. దేశాన్ని ప్రేమించడం అంటారు గురజాడ. ఈ దేశభక్తి గేయంతో మహాకవిగా గుర్తింపు పొందిన కవి గురజాడ అప్పరావు. ఈ మహాకవి జన్మించి 150 ఏళ్ళు దాటింది మరణించి వందసంవత్సరాలు గడచింది. కవిగా కవితలు, మూడు నాటకాలు, కథలు, వ్యాసాలు, ఉత్తరాలు, దినచర్యలు, అలానే కొన్ని కొత్తగా తేటైన మాటలను కూర్చుకొని ముత్యాల సరాలను ముద్దబంతి పూగుత్తిలా అందంగా అల్లి తెలుగు జాతికి అందించాడు. ఆనాటి సమాజంలో పతిస్థితులను కథావస్తువుగా తీసుకొని నాటకం రాసిన మొదటివారు కూడా గురజాడే. ఆయన రాసిన కన్యాశుల్కం తెలుగులో మొట్టమొదటి సాంఘిక నాటకం. అందించిన ఘనత గురజాడ అప్పారావుకే దక్కుతుంది.

గురజాడ అప్పారావుగారు దిద్దుపాటు కథలో "ఓరి మూర్ఖుడా! భగవంతుడి సృష్టిలోకల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహము పంచి ఇచ్చాడు. యింగ్లీషు వాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగునికన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డదా?" (గురుజాడలు, మనసు ఫౌండేషన్, 2012:527) ఆది కాలం నుండి మనం వింటున్న మాట స్త్రీ సమానం అనే మాట కానీ నిజ జీవితంలో చెప్పే దానికి చేసే దానికి పొంతన ఉండడం లేదు స్త్రీ తన అస్తిత్వాన్ని వ్యక్తం చేయడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్న స్త్రీకి స్త్రీవాదంలో ప్రధానమైన భావనలు స్త్రీ పురుష సమానత్వం, స్వేచ్ఛ, లింగవివక్ష లేకుండా స్త్రీని భోగవస్తువుగా చూసే దృష్టి పట్ల వ్యతిరేకత, ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయం అన్నింటిలోనూ సమాన అవకాశం, కొన్ని పనులే స్త్రీలు చేయగలరు అని స్త్రీలను కించపరిచేట్లు పలికే మాటలు పట్ల వ్యతిరేకత, స్త్రీ శారీరక స్థితి గతులను అస్పృశ్యతను పాటించడం, దేవాలయ ప్రవేశాలను నిషేదాన్ని వ్యతిరేకించడం, స్త్రీ పునర్వివాహం నేటి కాలంలో వరకట్నం ఎదుర్కోవడం స్త్రీవాదంలో కనిపించే అంశాలు. సమాన హక్కులు కావాలని పోరాడు తున్న అంశాలలను, వాటి ప్రాధాన్యతలను వివరిస్తున్న రచనలు ఉన్నాయి. ఇలా సుమారు వందేళ్ల తెలుగు సాహిత్యాన్ని పరిగణలోకి తీసుకుంటే గతంతో పోల్చితే 70వ దశకం తరువాత ఈ స్త్రీవాద సాహిత్యం దేశ వ్యాప్తంగా చాలా విస్తృతి పొందింది. అందుకు ప్రత్యేక కారణాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన విప్లవాలు కావచ్చు. మరొక కారణం భారత్‌లోని చదువుకున్న స్త్రీల ఆలోచన విధానంలో, రాజకీయ పరిజ్ఞానంలో అనేక మార్పులు వచ్చాయి. వాటి నీడలు మన తెలుగు రాష్ట్రాలపైనా కూడా ప్రసరించాయి. అయితే మరీ ముఖ్యంగా 1975ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్త్రీలకు సంబంధించిన అంశాలు ఎన్నో ప్రధాన స్రవంతి చర్చల్లో భాగమయ్యాయి.

కన్యాశుల్కం ఆ కాలంలో ఆనందగజపతి మహారాజు విశాఖమండలంలో జరుగుతూ ఉండే కన్యాశుల్కం వివాహాలను సేకరించడం. కన్యాశుల్కం నాటకానికి పునాది అయ్యింది. కన్యాశుల్కం అంటే చేసుకోబోయే కన్యకు ఖరీదు కట్టి వివాహం చేసుకోవడం. ఆ సమయంలో బాల్య వివాహాలు జరిగేవి. మాటలు సరిగా రాని చిన్న బిడ్డల్ని కూడా కట్నం పోసి కొనుక్కొని వయసు వాడు, ముసలివాడు అనే తేడా లేకుండా మగ మహారాజులు తాళి కట్టేవాళ్ళు. కడుపులో ఉన్న బిడ్డల్ని కూడా కొనడానికి పుట్టే బిడ్డ ఆడో మగో తెలియకుండానే బేరసారాలు జరుగుతుండేవి. ఆడ బిడ్డంటే అంతలోకువ

అదొక భయంకరమైన సాంఘిక దురాచారం. కాటికి కాళ్లు చాచుకొని వున్న ముసలి పెళ్లి కొడుకులకు ముక్కు పచ్చలారని పసి పిల్లలను డబ్బు కక్కుర్తితో నెత్తురు ముద్దలను అమ్ముకోవడం గురజాడ మనస్సును కలచి వేసింది. ఆ విషయాన్ని కన్యాశుల్కం నాటకంగా రాశారు. ఆ కాలంనాటి సాంఘిక జీవనానికి అద్దం పడుతుంది. మధురవాణి, బుచ్చమ్మ, మీనాక్షి, పూటకూళ్ళమ్మ వెంకమ్మ, సుబ్బమ్మ, యోగిని మొదలైన స్త్రీ పాత్రలను విద్యావంతులైన తెలుగువారు నేటికి ఎరిగి ఉన్నారు. వారి సంభాషణలను నెమరు వేసుకోవడం చేస్తుంటారు. ఆ నాటి సంఘంలో మంచి నీతిని పెంచే భావాలను సాహిత్యంతో ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతో సంఘానికి అప్పటి కాలంలో నాటకాలు ప్రచారంలో ఉన్న ప్రక్రియ నాటకం ద్వారా జరుగుతున్న దురాచారాన్ని ఎండగట్టి ప్రజాపక్షం నిలబడి తీర్చిదిద్దాడు. ప్రజలకు అర్థంకానీ గ్రాంథికభాష కన్నా వాడుకభాష అందరికీ సులభంగా అర్థం అవుతుందనే తపనతో కన్యాశుల్కం నాటకం వాడుక భాషలో రాశాడు గురజాడ.

కన్యాశుల్కం నాటకంలో అగ్నిహోత్రావధాన్లు ఒక ఆధిపత్య ధోరణికి ప్రతీక. స్థానికంగా, తన కుల అస్తిత్వ స్పృహతో నిజాయితీగా స్త్రీల అస్తిత్వాన్నీ, అణచివేసిన పితృస్వామ్య ఆధిపత్యాన్ని గుర్తించారు. కన్యాశుల్కంలో బుచ్చమ్మ చైతన్యాన్ని అగ్నిహోత్రావధాన్లు అస్సలు భరించలేడు. "నాన్నో తమ్ముడికి పెళ్ళి చెయ్యాలంటే నా సొమ్ము పెట్టి పెళ్ళి చేయండి కానీ దాని కొంపముంచి లుబ్ధావధాన్లుకి ఇవ్వొద్దని" చెప్పడంతో తండ్రికి వెర్రి కోపం వస్తుంది. తండ్రితో నేరుగా, నా సొమ్ము పెట్టి చేయండని ఆస్తిహక్కుని వెల్లడింది బుచ్చమ్మ. నేటికి కూడా ఆపేక్షంగా ఏదైనా చీరో సారో ఇస్తారేమోకానీ హక్కుగా కోరే స్త్రీలని భరింపలేరు. ఇది గురజాడ గుర్తించారు. స్త్రీపక్షం జరుగుతున్నా అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసారాన్ని గురజాడ స్త్రీజాడగా గుర్తించాడు.

ముత్యాలసరాలలో పూర్ణమ్మ గేయ కథానికలో తల్లిదండ్రులు తమ పిల్లలను డబ్బుకు ఆశపడి కాటికి కాళ్లు చాచుకున్న ముసలి వాళ్లకు కట్టబెట్టేవాళ్ళు.

"మేలిమి బంగరు మెలతల్లా రా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లుల గన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీ కథను"

పూర్ణమ్మను తీసుకువెళ్లడానికి ముసలిభర్త రావడం. అతణ్ణి చూడగానే పూర్ణమ్మ ఎలా అయిపోయింది?

"ముద్దు నగవులూ మురిపెంబు మరి
పెనిమిటి గాంచిన నిముషమున
బాసెను కన్నియ ముఖకమలమ్మును
కన్నుల గమ్మెను కన్నీరు".

కమలంలాంటి ఆమె ముఖంలో ముద్దొచ్చే చిరునవ్వు కరువై కళ్లలో నీళ్ళు నిలిచాయి. పూర్ణమ్మను అత్తవారింటికి సాగనంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆమె కూడా సిద్ధమైంది. అత్తవారింటికి కాదు మళ్ళీ తిరిగిరాని చోటుకు, బతుకును బద్దలు చేసిన తల్లిదండ్రులు దీవించారు.

"దీవనవింటూ పక్కున నవ్వెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా!"

ఎటువంటి నవ్వది? లోకమంతా ఉలిక్కిపడాల్సిన నవ్వు. పూర్ణమ్మ అందరి వద్దా కడసారి సెలవు తీసుకొంటుంది. అప్పుడంటుంది కదా!

"నలుగురు కూచుని నవ్వే వేళల
నా పేరొక సరి తలవండి!
మీమీ కన్న బిడ్డల నొకతెకు
ప్రేమను నాపేరివ్వండి."

ఇది పూర్ణమ్మ ఆఖరి కోర్కె ఈ చరణాలతో పూర్ణమ్మ పేరు స్త్రీజాడకు వారసత్వం అవుతుందని గురజాడ భావించారు. స్త్రీల స్థితి గతులను సంస్కరించే ఆ కాలం నాటి ప్రయత్నం స్త్రీ విముక్తి ఉద్యమం పోరాటంగా నిలుస్తుందని ఆశించారు. భవిష్యత్తులో ఆయన

ఆశాభావం వమ్ముకాకుండా పుత్తడి బొమ్మకు పూర్ణమ్మకే కాదు చదివేవాళ్ళకు కంట నీరొలుకుంది. కన్యల్ని కాటికి కాళ్లు చాచిన ముసలివాళ్లకిచ్చే దురాచారం మీద కసి పుడుతుంది. డబ్బుకు కక్కుర్తి పడే అమ్మా అయ్యలకు గట్టి బుద్ధి చెబుతుంది. దుర్గదేవి కొవెల దగ్గర పూజకని వెళ్లిన పూర్ణమ్మ యింటికి తిరిగిరాలేదు. ఇంటికి తిరిగి రాలేదంటే ఆ విధంగా ఆమె ఆనాటి వివాహవ్యవస్థ మీదా ఆ వ్యవస్థ కొనసాగడానికి కారకులైన వారందరు మీద తన తీవ్ర నిరసను తెలియజేసింది. ఆమె మరణం అంతంకాదు స్త్రీ లోకపు జాగృతికి ఆరంభం.

పూర్ణమ్మ దుర్గలో ఐక్యం కావటం అంటే ఒక అబల అసహాయురాలు శక్తిస్వరూపిణి కావటమనికూడా అర్థం చేసుకోవచ్చు. ఆవులు పెయ్యలు మందల చేరాయి. పిట్టలు గూళ్లు చేరాయి. ఆకాశంలో చుక్కలు మెరిశాయి. ఏమైపోయింది పుత్తడిబొమ్మ పూర్ణమ్మ?

"కన్నుల కాంతులు కలువలు చేరెను
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ."

పూర్ణమ్మ విషాదాంతకావ్యం వాడుక భాషలో రాసిన కావ్యంలో కవితాశక్తి పూర్ణమ్మలో కట్టలు తెంచుకుంది. ఎంతటి భావం తీవ్రతతో హృదయావేదనతో అప్పారావు పూర్ణమ్మను రచించారో ఆ గీతాన్ని ఒక్కసారి చదివితే బోధపడుతుంది. పూర్ణమ్మను చదివితే శోకపూరిత ఒక జీవితాన్నీ చూసిన అనుభూతి కలుగుతుంది. కన్యా శుల్కం దురాచారానికి ఒక చిన్నది బలి అయిపోయిన సంఘటన ఇందులో కథావస్తుతో పూర్ణమ్మ మరణాన్ని ఇంతగా హృదయాన్ని కదిలించే ఒక్కొక అక్షరం పూర్ణమ్మ ఒక్కో కన్నీటి చుక్క.

కన్యక కావ్యంలో పట్నమేలే రాజు పట్టలేని మోహానికి కన్యక ఆహుతి అయ్యింది. కన్యక అందమైన వైశ్యబాల. ఒకరోజు కన్యక దేవాలయానికి వెళ్తుండగా ఆ పురం ఏలే రాజు కంట పడుతుంది. ఆ సమయంలో దైవకార్యం తీర్చి వస్తున్నానని అప్పటికి తప్పించుకొంటుంది.

"పట్టపగలే నట్టివీధిని
పట్టబోరే జారచోరులు
పట్టదలచితివింక నీవొక
పట్నమేలే రాజువట!
కండకావరమెక్కి నీవీ
దుండగము తలపెట్టినందుకు
వుండడా ఒక దైవమంటూ
వుండి వూర్కొనునా?"

అంటూ కన్యక రాజును సవాలు చేసి మంటల్లో దూకి ఆత్మార్పణ చేస్తుంది. పట్నమేలే రాజు గర్వం మట్టి కలిసి పోయింది. స్త్రీలపై అటువంటి అత్యాచార ప్రయత్నాలు ఈనాటికీ జరుగుతూనే ఉన్నాయి. అస్తిత్వం కలిగిన కన్యక రాజు దుర్మార్గానికి అణగి మణగి ఉండకుండా నిర్భయంగా ఎదుర్కొన్న ధైర్యానికి కన్యక కావ్యం నివాళి అర్పించింది.

జీవితంలో పీడిత స్త్రీలు, వారి వివాహ సమస్యలు, యవ్వనంలో ఉన్న భార్యతో ముసలి భర్తల కాపురం, వితంతువివాహాలు, వయస్సు తేడాతో జరిగే పెళ్ళిళ్ళ ఫలితంగా వైధవ్యాలు, గర్భస్రావాలు, స్త్రీ విద్య, కులాంతర వివాహాలు, స్త్రీపైన జరిగే దుండగాలు మొదలైన అనేక విషయాల మీద గురజాడ కథలు రాశారు. మగమహారాజు దౌర్జన్యం నుంచి ఆత్మరక్షణ కోసం స్త్రీ కత్తిసాము నేర్చుకోవాలని గురజాడ చెప్పిన అక్షరాన్ని ఇప్పుడు చదివితే విడ్డూరంగా ఉండవచ్చు. స్త్రీ గొంతుకు బిగిసుకున్న పెళ్లితాడు గురించి ఆయన ఆలోచన ఎంతో ముందు చూపుకలవాడు కాబట్టి ఈ కాలంలో ఆచరణ సాధ్యమైనవి ఆనాడే భావించి భావితరాలను హెచ్చ రించాడు.

సాహిత్యరంగంలో ఇప్పుడు నేను కావిస్తున్న కృషికి సమతుల్యమైన కృషి భారతదేశంలో మరెక్కడా కనిపించదు ఈ వాక్యాన్ని స్వయంగా చెప్పుకున్నాడు గురజాడ. ఆధునిక సాహిత్యంలో అనేకమంది కవులు గురజాడపై ఉన్న అభిప్రాయాలను ప్రస్తావించారు. వచన

రచయితలు మాత్రమే అప్పారావుగారి మార్గదర్శికత్వం స్వీకరించారు. పద్య రచయితలు పట్టుకోలేకపోయారని అన్నారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. గురజాడ అప్పారావు 1915లో చనిపోయినా, 1915 తరువాతనే జీవించడం ప్రారంభించాడని పలికారు దేవులపల్లి కృష్ణశాస్త్రి. కందుకూరి వీరేశలింగం, తిరుపతి వేంకట కవులు, రాయప్రోలు సుబ్బారావు వీరిలో ఎవరును యుగకర్తలు కారని సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవి గురజాడ అని శ్రీశ్రీ నొక్కి చెప్పాడు.

ఈ సమాజంలో స్త్రీల కన్నీటి గాథలకు కారణం తెలుసుకుని, తిరిగి వివాహం చేసుకోకూడదనే నియమం, విడాకుల హక్కు లేని కారణం, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం, స్త్రీల కన్నీటి గాథలకు తన రచనల్లో కంటికి కట్టినట్లు చూపడమే కాకుండా ఆయన ఆలోచన కుంగిపోలేదు. ముందుకాలంలో స్త్రీలు ఊహించలేనంత అభివృద్ధి సాధిస్తారని నమ్మకంతో ఆధునిక భారత స్త్రీ చరిత్రను తిరగరాస్తుందనే ముందు చూపున్న కవి గురజాడ. స్త్రీ, పురుష సమానత్వం అనే భావన ఆయన రచనలో చదువుకున్న స్త్రీకి అత్యంత గౌరవం ఇవ్వడం మనకు ఆదర్శం.

**ఆధార గ్రంథాలు :**

1. ఈశ్వర్రావు, సెట్టి. మహాకవి-మహాపురుషుడు, బెజవాడ: ప్రజాశక్తి ప్రెస్, 1945.
2. ఈశ్వరరావు,సెట్టి. జాబులు-జవాబులు, దినచర్యలు, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2000.
3.గోపాలకృష్ణ, పెన్నేపల్లి. ప్ర.సం.పా., గురుజాడలు, హైదరాబాదు: మనసు ఫౌండేషన్, 2012.
4. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష, హైదరాబాదు: నవ్య పరిశోధక ప్రచురణలు, 2019.
5. ప్రభాకరరావు, దేవులపల్లి. మహాకవి గురజాడ జీవితవిశేషాలు సాహిత్య సమీక్ష, సికింద్రబాదు: శివాజి ప్రెస్,1969.
6. బాబురావు, కె. అడుగుజాడ-గురజాడ, విజయవాడ: బాలవిజ్ఞాన ప్రచురణలు, 1990.
7. రమణారెడ్డి, కె.వి. మహోదయం, విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1969.

❖❖❖

# బహుజన సాహిత్యం - ఆచార్య దార్ల దృక్పథం

– ఎర్రోళ్ళ ఆంజనేయులు, రీసెర్చ్‌స్కాలర్, తెలుగుశాఖ, మానవీయశాస్త్రాల విభాగం, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

**వ్యాస సారాంశం :**

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ప్రాచీన యుగం నుండి ఆధునిక యుగం వరకు వచ్చిన సాహిత్యమంతా ఆధిపత్య వర్గ భావజాల శ్రేయస్సు కోసమే వచ్చిందని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు ప్రశ్నించారు. నన్నయతో మొదలుకొని నేటి వరకు వచ్చిన, వస్తున్న సాహిత్యాన్ని పరిశీలించారు. తెలుగు సాహిత్యాన్ని లోతుగా పరిశోధించి దానిలోని వివిధ అంశాలను విశ్లేషిస్తూ దానికి ఎదురు నిలబడగలిగేది బహుజన సాహిత్యమే అని దార్ల గారి వాదన. ఆయన రాసిన బహుజన సాహిత్య దృక్పథం గ్రంథంలోని వ్యాసాలు తెలుగు సాహిత్య విమర్శ దృక్పదాన్ని సరికొత్త మార్గం వైపు పయనించే అవకాశం ఉంది. అందువల్ల సంప్రదయా సాహిత్యాన్ని విమర్శించే ఆలంకారిక విమర్శకంటే, పాశ్చాత్య భావనలతో సాహిత్య విమర్శ చేసే గతితార్కిక, చారిత్రక భౌతికవాదానికంటే జ్యోతిబా పూలే, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ ల భావజాలం, దానిలో దళితులు, మైనారిటీలు అంతా కలిపి బహుజన వాదంగా సూత్రీకరించిన విధానం ఈ వ్యాసంలో శాస్త్రీయంగా వివరించే ప్రయత్నం చేసాను. దీనివల్ల సాహిత్య విమర్శలో పునర్మూల్యాంకనం అనే నూతన సాహిత్య విమర్శపద్ధతి బహుజన సాహిత్యాన్ని శాస్త్రీయంగా విశ్లేషించగలుగుతుందని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు రచించిన బహుజన సాహిత్య దృక్పథంలో గల వివిధ పార్శ్వాలను వివరించి, ఇప్పటివరకు ఉన్న సాహిత్య విమర్శ పద్ధతికంటే భిన్నంగా సాహిత్యాన్ని మూల్యాంకనం చేయవచ్చే ఈ వ్యాసం ద్వారా తెలుసు కోవచ్చు.)

**కీపాయింట్స్ : ఎర్రోళ్ళ ఆంజనేయులు, దార్ల , బహుజన సాహిత్యం, కులవృత్తులు, చేతివృత్తులు**

తెలుగు సాహిత్యం సమకాలీన సమాజాన్ని ప్రతిఫలించడంలో ఎంతో ముందు ఉంటుంది. సంప్రదాయ సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు ఈ పరిణామాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఆధునిక సాహిత్యంలో మార్క్సిస్టు సాహిత్యం తర్వాత స్త్రీ, దళిత వాద సాహిత్యాలు ఒక ఊపు ఊపాయి. సాహిత్యంలో విలువలను పునర్మూల్యాంకనం చేయడం, సామాన్య ప్రజలు భాగం కావడం మొదలైంది. సాహిత్యానికి ఒక పరమ ప్రయోజనం ఉందనీ, అది సమాజాన్ని ప్రతిఫలించి తీరాలని ఈ వాదాలు గట్టిగా వాదించాయి. సాహిత్యంలో వర్గంతో పాటు జెండర్, కులమతాలు, ప్రాంతాలు కూడా మూల్యాంకనంలో భాగమయ్యాయి. వీటితో పాటు అభ్యుదయ భావజాలం పరిశీల దృక్పథం ఉన్నవాళ్లంతా ప్రపంచీకరణను వ్యతిరేకించాల్సిన అవసరం కూడా ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ అభ్యుదయకర, సామాజిక సంస్కరణలను కోరుకునే వాదాలు, ఉద్యమాలు, సిద్ధాంతాలన్నీ కలిపి బహుజన సాహిత్య వాదంగా ముందుకొచ్చాయి. దీన్ని పది సంవత్సరాల ముందుగానే పసిగట్టిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు "బహుజన సాహిత్య వాదం" పేరుతో ఒక గ్రంథాన్ని రాశారు. విడివిడిగా కూడా అనేక వ్యాసాలను ప్రచురించారు. ఈ నేపథ్యంలో బహుజన సాహిత్య వాదంలో ఆయన ప్రతిపాదించిన అంశాలను చర్చించడమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.

## ఆచార్య దార్ల పరిచయం :

దార్ల వెంకటేశ్వరరావు గారు 1973 తూర్పుగోదావరి జిల్లా అమలాపురం దగ్గర కాట్రేనికోన మండలం,చెయ్యేరు అగ్రహారంలోని శ్రీలంకయ్య, శ్రీమతి పెదనాగమ్మ దంపతులకు మూడో సంతానంగా జన్మించారు. కోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో బి.ఎ వరకూ, తర్వాత

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ తెలుగులో చేరి అక్కడే ఎంఫిల్, పిహెచ్‌డి చేశారు. డాక్టర్ యస్.టి జ్ఞానానందకవి గారి "ఆమ్రపాలి" పై ఎం.ఫిల్ "పరిశోధకుడిగా ఆరుద్ర" అనే అంశంపై పి.హెచ్.డి పరిశోధన చేసి డాక్టరేట్‌ను పొందారు. శ్రీ అనంత పద్మనాభ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల వికారాబాద్‌లో డిగ్రీ అధ్యాపకుడుగా పనిచేశారు. ఆ తర్వాత 2004 నుండి హైదరాబాద్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో అధ్యాపకుడిగా చేరి, ప్రస్తుతం తెలుగు శాఖా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**రచనలు - అవార్డులు :**

మాదిగ చైతన్యం, దళిత తాత్వికుడు, సృజనాత్మక రచనలు చేయడం ఎలా.?, సాహితీ సులోచనం, ఒక మాదిగ స్మృతి, దళిత సాహిత్యం - మాదిగ దృక్పథం, వీచిక, పునర్మూల్యాంకనం, బహుజన సాహిత్య దృక్పథం, నెమలికన్నులు, సాహిత్య పరిశోధన కళావిధానం, రాజశేఖర చరిత్ర నవల - వివిధ దృక్కోణాలు వంటి రచనలు చేసి తెలుగు సాహిత్యానికి, దళిత, బహుజన సాహిత్యానికి, ప్రత్యేకంగా విమర్శకు సంబంధించిన సాహిత్య కృషి చేసి తెలుగు ప్రజలకు అందిస్తున్నారు. ఉత్తమ బోధన, పరిశోధనకు గాను 2016 లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారు చాన్సలర్ అవార్డుతో సత్కరించారు. జాషువా జాతీయ పురస్కారం, భారతీయ దళిత సాహిత్య అకాడమి న్యూఢిల్లీ వారి డా. బి.ఆర్ అంబేద్కర్ ఫెలోషిప్ పురస్కారం 2007లో పొందారు. 2012లో ఉత్తమ సాహిత్య విమర్శకుడు, అంతర్జాల మాసపత్రిక విహంగ సాహితీ పురస్కారాన్ని 2017లో, మరెన్నో సత్కారాలు, పురస్కారాలు లెక్కలేనన్ని సభల్లో ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.

**బహుజనవాదం :**

1. The concept of Bahujan Literature was born to highlight the need to explore the socio-cultural foundation of the liberation and unity of Bahujans. It is the literature of and about the people who are victims of exploitation and oppression of all kinds (Pramod Ranjan, 2014 & 2016)
2. Dalit literature has a distinct identity and at its root is the philosophy of Jotirao Phule, Ambedkar, Buddha, and Kabir-Ravidas. Opposing the Varna system and untouchability is its underlying ideology (Kanwal Bharati, 2016)
3. In today India, the key deprived communities are women, SCs, STs, OBCs, DNTs and all Pasmanda religious minorities. The concept of Bahujan literature is concerned equally about the travails of each of these communities and believes that the reasons for the exploitation of each are more or less the same. And if these reasons are to be described in one word, that has to be Manuvad (Kostka and Ranjan, 2016).
4. This expression of Bahujan to Kanshiram literally means the community of those who are in great numbers, in a majority (Jefferlot, 1998)

పై నిర్వచనాలను పరిశీలిస్తే మన దేశంలో 2600 సం॥ కిందటే బహుజన "హితాయ -బహుజన సుఖాయ" అన్న బుద్ధుడు బహుజన తాత్వికతను సామాజికంగా, ఆర్థికంగా పీడనకు గురౌతున్న వివిధ సమూహాలను సంఘటితం చేశాడు. చారిత్రక మూలాల్లోకి వెళితే చార్వాకులు, బుద్ధుడు, బసవన్న, చొక్ మేలా, సంత్ కబీర్, తుకారాం, నానక్, వీరబ్రహ్మం, తమ తమ కాలాల్లో ప్రాంతాల్లో సాగించిన కుల వ్యతిరేక పోరాటాలు, 19వ శతాబ్దంలో మహారాష్ట్రలో మహాత్మా పూలే నడిపిన శూద్ర - అతిశూద్ర ఉద్యమం బహుజన ఉద్యమానికి పునాది వేశాయి. దీన్ని ఆధారంగా చేసుకొని తమిళనాడులో

అయోతిదాస్ (1845 - 1914) తెలంగాణలో భాగ్యరెడ్డి వర్మ (1845-1939), ఆంధ్రప్రదేశ్‌లో కుసుమ ధర్మన్న (1894-1948), కేరళలో నారాయణ గురు (1856-1941), అయ్యంకాళి (1863 -1941) మొదలైన వారు బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. (నేలమీద నిలబడి -జి.లక్ష్మీనర్సయ్య బీకొలిమి వ్యాసాలు).

అంబేద్కర్ అందించిన కుల నిర్మూలన తాత్వికత, నవయాన బుద్ధిజం, పెరియార్ నడిపిన ఆత్మగౌరవ ఉద్యమం, కాన్షీరాం ఆచరణాత్మక బహుజన రాజకీయ సిద్ధాంతం ఇవన్నీ కలిసి రూపొందినదే బహుజన వాదం. పీడిత కులాల, మైనారిటి మతాల ప్రజలు కుల వ్యవస్థ కారణంగా , హిందూ మత వ్యవస్థల కారణంగా ఎదుర్కొంటున్న వివక్షకు వ్యతిరేకంగా సాగిస్తున్న ఉద్యమాన్ని ముందు దళిత ఉద్యమం అని, తర్వాత దళిత బహుజన ఉద్యమం అని, ప్రస్తుతం బహుజన ఉద్యమం అని వ్యవహరిస్తున్నారు. కాన్షీరాం ప్రకారం (SC , ST , OBC , MINARITY) లను రాజ్యాధికారం దిశగా వీరందరినీ ఒక త్రాటిపైకి తీసుకొచ్చే క్రమంలో వచ్చినదే బహుజన వాదం అని అందుకే ఆయన బహుజన్ సమాజ్ పార్టీ ని 1984 లో స్థాపించారని దార్ల వెంకటేశ్వర రావు గారు అన్నారు.

**బహుజన సాహిత్య లక్ష్యాలు :**

1. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువల పునాదిగా ప్రజాస్వామిక సామ్యవాదాన్ని నెలకొల్పే విశిష్ట ఆశయ సాధనే బహుజనవాద లక్ష్యం.
2. ఇది దేశీయ విముక్తి సిద్ధాంతం. దీనిలో రెండు ప్రధాన అంశాలు ఉన్నాయి. A) ఒక అంశం బుద్ధిజం పునాదిగా జరగాల్సిన మానసిక సాంస్కృతిక విముక్తి. అంటే హిందూమత తాత్వికత నుంచి, సంస్కృతి నుంచి బయటపడి వికాస మానవులుగా బహుజనులు పరిణమించడం. B) ఇది రాజకీయ విముక్తి. బహుజన రాజ్యాధికారం ద్వారానే దీన్ని సాధ్యం చేసుకోవాలని దీని సారాంశం.
3. బహుజన వాదం మార్క్సిస్టు రొడ్డకొట్టుడు వాదాన్ని, మావోయిస్టు సాయుధ పోరాటాన్ని, రాజ్య నిర్మూలనను, రాజ్యాంగ ధ్వంసాన్ని వ్యతిరేకిస్తుంది. రాజ్య, రాజ్యాంగ నిర్మూలన కాదు కుల నిర్మూలన ఈ సిద్ధాంత లక్ష్యం.

తెలుగు సాహిత్యంలో అంటరానివారు, అస్పృశ్యులు, హరిజనులు, గిరిజనులు, ఆదివాసీలు, బడుగువర్గాలు, అట్టడుగువర్గాలు, దళితులు వంటి పారిభాషిక పదమే బహుజనులు అనేది కూడా. కులవివక్ష వల్ల సామాజికంగా దూరంగా ఉంచబడి, నీచవృత్తులుగా భావించేవాటిని బలవంతంగా అంటగట్టి పనిచేయించి, వాటినే బలవంతంగా వంశపారపర్యం చేసి వారిని ఊరికి దూరంగా పెట్టి అంటరానివాళ్ళు, అస్పృశ్యులు, అంత్యజులు, నీచులు, చండాలురు వంటి పేర్లతో కొంత మందిని పిలిచారు. వీళ్ళని భారత రాజ్యాంగంలో షెడ్యూల్డు కులాలు అని పిలుస్తున్నారు. ఈ వృత్తులు చేసే వీళ్ళని భారతదేశ వ్యాప్తంగా ఒకే విధంగా పిలవడం లేదు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కొక్కరకంగా పిలుస్తున్నారు. వృత్తులు ఒకటే అయినా వీరిని వివిధ రాష్ట్రాలలో షెడ్యూల్డు కులాలు గాను, షెడ్యూల్డు తెగలుగాను, వెనకబడిన వర్గాలు గానూ గుర్తించారు. అందువల్ల కేవలం కులాన్ని బట్టి మాత్రమే ఫలానా వాళ్ళని దళితులు, బహుజనులు అని స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. 1984 , ఏప్రిల్ 14 వ తేదిన భారతదేశంలో బహుజన సమాజ్ పార్టీ ఏర్పడిన తర్వాత సామాజిక రంగంలో బహుజనులు అనే భావన బాగా వ్యాప్తిలోకి వచ్చింది. మనువాద వ్యవస్థ వల్ల కష్ట నష్టాలకు గురైన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనకబడిన తరగతులతో పాటు, మతపరంగా అల్పసంఖ్యాక వర్గాలైన సిక్కు, ముస్లిం, క్రైస్తవులు, పార్శీలు, బౌద్ధులంతా బహుజనులవుతారని బహుజన్ సమాజ్ పార్టీ తమ పార్టీ ప్రణాళికలో ప్రకటించింది. బహుజనులంతా వృత్తులు ప్రధానంగా కలిగి సమాజంలో సమాన గౌరవం పొందటానికి దళితులు, గిరిజనులు,

వెనకబడిన తరగతులు, విభిన్న అల్పసంఖ్యాక మత సమూహాలను కలుపుకొని, వీళ్ళందరి లక్ష్యం కులం పోవడమే కాబట్టి , వీరికోసం ఏర్పడిన వాదమే బహుజన వాదమనీ, వీళ్ళ కోసం రాయబడుతున్న సాహిత్యమే బహుజన సాహిత్యమని అంటున్నారని దార్ల గారు నిర్వచించారు.

## తెలుగు సాహిత్య నిర్వచనాలు :

1. అస్పృశ్యత లేనివాళ్ళను అంటే యస్. సి.,యస్. టి. లను కాకుండా అణచివేతకు గురౌతున్న వాళ్ళను బహుజనులుగా పిలవవచ్చు. (దళిత సాహిత్య చరిత్ర -డా.పిల్లి శాంసన్ 2000:3).
2. మన సమాజంలో రెండు తత్వాలున్నాయని, ఒకటి దళిత బహుజన తత్వం కాగా, రెండవది బ్రాహ్మణీయ తత్వమని, మొదటిది అణచివేతకు, దోపిడికి, పతనానికి లోనైన మెజారిటి ప్రజల తత్వమైతే రెండవది ఆధిపత్య, అణిచివేత, దోపిడి, రాపిడిలను కొనసాగిస్తూ పబ్బం గడుపుకునే మైనారిటి ప్రజల తత్వమని అంటారు.(మన తత్వం - కంచె ఐలయ్య ).
3. బహుజనులది బౌద్ధ తత్వం. బౌద్దానిది ప్రేమ, కరుణల తత్వం. అష్టాంగ మార్గం దాని జీవన విధానం. త్యాగాన్ని కూడా ప్రేమగా భావించినపుడే అది నిజమైన ప్రేమ. అదే బౌద్ధ బహుజనతత్వం. (బహుజన తత్వం - బి.ఎస్. రాములు 2003).
4. కులం, జాతి అనే బాధాసర్ప దస్టులంతా బహుజను లౌతారు. (తాళ్ళూరి లాబన్ బాబు2005:24).

"ఆకలి, అవమానం నిండు కుండగా ఉండే దళిత జీవితానుభవమే నాకీ కవిత్వాన్నిచ్చింది. జీవితం ఒక ఆరాటం, దళితుడిజీవితం మరీ పోరాటం, గమ్యం మరింత సంక్లిష్టం". (దళిత తాత్వికుడు కవితాసంపుటి -దార్ల) అంటూ దార్ల వెంకటేశ్వరరావు గారు ఊహ తెలిసినప్పటి నుండి దళితుల పట్ల జరుగుతున్న అన్యాయాలను, అవమానాలను సహించలేక "దళిత సాహిత్యాన్ని వినోదం కోసం రాయటం లేదు. సామాజిక చైతన్యం, సామాజిక పరివర్తన, బాధ్యతాయుతమైన పనిగా గుర్తించి, దళితులు రాజ్యాధికారాన్ని చేపట్టే దిశగా తాను సాహిత్య రచన చేస్తున్నానని" అంటారు.

బహుజన సాహిత్య దృక్పథం గురించి రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారి మాటల్లో : ఈ పుస్తకంలోని వ్యాసాలు చదివితే దార్ల అధ్యయన విస్తృతి తెలుస్తుంది. ప్రాచీన యుగం నుండి ఎన్నెల నవ్వు నవల దాకా ఆయన అధ్యయనం పరుచుకుంది. శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య, వీరబ్రహ్మంలను పునర్మూల్యాంకనం చేశారు. జానపద సాహిత్యం నుండి డయాస్పోరా సాహిత్యం దాకా విమర్శ రాశారు. కుల పురాణాలు, బహుజన సాహిత్యాల గురించి రాశారు. అందుకే దార్ల విస్తరిస్తున్న విమర్శకుడనడం. మైక్రోలెవల్, మాక్రోలెవల్ రెండు రకాల విమర్శలలో దార్ల దిట్ట.

సాహిత్య స్వరూప, స్వభావాదుల్ని ప్రధానంగా భావజాలాన్ని అనుసరించి స్పష్టత, అధ్యయన సౌలభ్యం కోసం స్థూలంగా మూడు దృక్పథాలుగా 1. సంప్రదాయ ఆలంకారిక దృక్పథం 2. పాశ్చాత్య సాహిత్య దృక్పథం 3. మార్క్సిస్టు కళా దృక్పథం అని మూడు రకాలుగా సాహిత్య విమర్శకులు విభజించారు.(ముదిగొండ వీరభద్రయ్య, కళాతత్వ శాస్త్రం -మౌలికాంశ వివేచన ). అయితే నాల్గవదిగా దళిత, బహుజన కళాతత్వ శాస్త్ర దృక్పథంగా చేర్చుకోవచ్చని దార్ల గారు సూచించారు. కులం, మతం, ప్రాంతీయ సమస్యల్ని దళిత, స్త్రీవాద, మైనారిటీ బహుజన సాహిత్య కోణం నుండి ఎలా అర్థం చేసుకుంటున్నారనే విషయాన్ని విశ్లేషించే దిశగా ఈ వ్యాసాలన్నీ కొనసాగాయని దార్ల గారు అన్నారు.

## నన్నయ యుగం :

కవుల్ని వారి రచనల్ని కులం, అగ్రవర్ణత్వం ఆధారంగా వివక్షను ప్రదర్శించిన వైనాన్ని బహుజన సాహిత్య వాదం బయట పెడుతుంది. సాహిత్య చరిత్రలో వర్ణ వివక్ష కొనసాగిన తీరుని ఎండగడుతుందని, వైశ్యుడనే

కారణంగా మల్లియరేచన (కవిజనాశ్రయం 940)ను, క్షత్రియుడనే నెపంతో నన్నెచోడుడు (కుమార సంభవం 940)ను (మానవల్లి రామకృష్ణ కవి వాదన ) ఆదికవిగా అంగీకరించలేదు. ఇక శూద్రుల మాట సరే సరి. వారికి చదివే అవకాశమే లేనప్పుడు కావ్య రచన ఎలా చేస్తారు, అదేవిధంగా జైన మతస్తుడైన సర్వదేవుడు (పొన్న కవి) రాసిన ఆదిపురాణం, విరాటపర్వం కావ్యాలను తొలి రచనలుగా గుర్తించకపోవటానికి కారణం ఇతర మతమే అని చెప్తూ కేవలం వర్ణాశ్రమ ధర్మ పరిరక్షణలో భాగంగానే అనివార్యంగా సంస్కృత భారతాన్ని తెలుగులోకి అనుసృజన చేసిన నన్నయను ఆధిపత్యాన్ని చెలాయించుకోవడంలో భాగంగా ఆదికవిగా నిలబెట్టే ప్రయత్నం జరిగిందని దార్ల వెంకటేశ్వర రావు గారు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ఆదికవి నన్నయ, యోగివేమన విశ్వవిద్యాలయాలకు పేరు పెట్టడంలో కూడా పెద్ద మోసం ఉందనీ, నన్నయనే ఆదికవిగా నిలిపే ప్రయత్నం ఒకదానిదైతే, వేమనను హిందూ భావజాల చట్రంలో కట్టిపడేయాలనే ఆలోచన రెండవదనీ దీనిని బహుజన సాహిత్యం ఖండిస్తుందని అన్నారు.

## శివకవి యుగం :

శివ కవులు కులానికి, భక్తిభావానికి అధిక ప్రాధాన్యాన్నిచ్చి, సామాజికంగా కులవివక్షను ఎదుర్కొంటున్న వాళ్ళను దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేసినట్లనిపిస్తుంది. కానీ, వీరిలోనూ కులాన్ని విస్మరించలేమన్న వాళ్ళున్నారు. అయినప్పటికీ, తెలుగు సాహిత్యంలో తొలిసారిగా అనేక కులాల వాళ్ళను ప్రధాన జీవన స్రవంతిలోకి రమ్మని పిలుపునిచ్చిన వాళ్ళుగా శివకవులను చెప్పుకోవచ్చు.(కుల అస్థిత్వ ఉద్యమ సాహిత్యం -దార్ల బీపుట 29) దీనికి కర్ణాటకకు చెందిన బసవేశ్వరుని భావాలే కారణం. సామాజికంగా తక్కువగా చూడబడుతున్న కులాల వాళ్ళలో కొంత చైతన్యానికి బసవన్న ప్రయత్నించాడు. డోహర కక్కయ్య అనే చర్మకారుని వల్ల బసవన్న అక్క నాగమ్మ పిల్లవాడిని కన్నది. అంతేకాదు, హరళయ్య అనే మాదిగ యువకుడితో మధుపయ్య అనే బ్రాహ్మణుడి కుమార్తెనిచ్చి కులాంతర వివాహం జరిపాడు. క్రీ.శ. 1198 ఫిబ్రవరి 12వ తేదిన ఈ వివాహం జరిగిందని ఆరుద్ర (సమగ్రాంధ్ర సాహిత్యం,2002 :244 ) రాశారు. పాల్కురికి సోమనాథుడు రాసిన పండితారాధ్య చరిత్రలో పండితారాధ్యుడు దళితుల మధ్య సంస్కరణను ఆశించి నట్లుంది. అలాగే "భక్తిమీద వలపు, బ్రాహ్మణ్యంబుతో పొత్తు బాయలేను నేను బసవలింగ" అని స్పష్టంగా చెప్పిన భావాలు, దళితుల్ని తమతో పూర్తిగా కలుపుకోవడానికి అంగీకరించలేని స్థితిని తెలుపుతున్నాయని, దళితుల త్యాగాల్ని శైవమత వ్యాప్తికి ఉపయోగించుకొని అక్కడ పరోక్షంగా మరోసారి కులంపై మతం తన ఆధిక్యాన్ని ప్రదర్శించుకుందని దార్ల వెంకటేశ్వర రావు గారు తెలిపారు.

## అన్నమయ్య :

1947 వరకు తిరుపతి కొండమీదికి దళితులు దేవాలయ ప్రవేశం కోసం ప్రయత్నించారు. (చిన్నారావు, ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర 2007బీ88 ). అని చరిత్ర చెప్పినపుడు 1408లో పుట్టిన అన్నమయ్య కాలంలో దళితులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించు కున్నారనేది, దానికి అన్నమయ్యనే అండగా నిలిచాడనేది ఎంతవరకు నమ్మశక్యమో ఆలోచించవలసిందే. అందుకే నేను అన్నమయ్యను కుల నిర్మూలన ఉద్యమకారుడిగా తాను భావించనని దార్ల గారు అన్నారు. ఆయన రాసిన "బ్రహ్మ మొక్కటే -పర బ్రహ్మ మొక్కటే" కీర్తనను పరిశీలిస్తే బ్రాహ్మణుడు పీల్చే గాలి, ఉండే భూమి , కాసే ఎండా అలాగే చండాలుడు ఉండే భూమి, పీల్చే గాలి అంతా ఒకటేనని పంచభూతాలు అందరికి సమానమే నని చెపుతూనే కులమతాలు పోవాలని గానీ, అందరూ ఐక్యంగా ఉండాలని గానీ చెప్పకుండా ఎవరి స్థానంలో వారు ఉంటూనే భగవంతుని సేవ చేయాలనే ఉద్దేశ్యం కూడా అందులో అంతర్లీనమై ఉందనే విషయాన్ని దార్ల వెంకటేశ్వరరావు గారు పరిశీలించాలన్నారు. ఆలోచించి

చూస్తే ఇదంతా వర్ణాశ్రమ పరిరక్షణ కోసం అన్నమయ్య కూడా పాటుపడ్డారనే విషయం తెలుస్తుంది. (అన్నమయ్య సాహిత్యం -దళిత దృక్పథం బీపుట 65). బ్రాహ్మణ కులంలో పుట్టిన అన్నమయ్య కుల నిర్మూలన ఎలా కోరుకుంటాడని, ఆయనెప్పుడూ సనాతన ధర్మాన్ని, వైష్ణవ భక్తి తత్వాన్ని ప్రచారం చేయడంలోనే నిమగ్నుడయ్యాడని, కాబట్టి అన్నమయ్యను వేమన, గురజాడ, గుర్రం జాషువా వరుసలో చేర్చలేమని(పుట 67) దార్ల గారు కరాఖండిగా చెప్పారు.

## పోతులూరి వీరబ్రహ్మం :

శివుడు, విష్ణువు వేరు కాదనీ అంతా బ్రహ్మమేనని, తనను తాను తెలుసుకోవడమే బ్రహ్మం అని చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ శివరామ దీక్షితుడు ప్రతిపాదించిన అచల మతం ఏదైతో ఉందో అదే తత్వం వీరబ్రహ్మేంద్ర స్వామి సాహిత్యంలోనూ కనిపిస్తుందని అన్నారు. సంప్రదాయ సాహిత్యంలో కనిపించే కులాధిక్య సమాజానికి భిన్నంగా సాధనకు అవకాశమిచ్చే కులదృష్టి వీరి సాహిత్యంలో ప్రతిఫలిస్తుందని, దూదేకుల సిద్ధయ్యనో, మాదిగ కక్కయ్యనో దగ్గర చేర్చుకున్నంత మాత్రాన కులమతాలకు అతీతుడు అని చెప్పడానికి వీలులేదని అభిప్రాయపడ్డారు. నాటి సామాజిక పరిస్థితుల్లో నిమ్నకులాలుగా గౌరవ ప్రదంగా బతకలేని వృత్తులవారిలో ఒక భవిష్యత్తు ఆశను కలిగించాలని అప్పట్లో ఆ విధంగా బోధించగలగడమే గొప్ప విప్లవమని ఆయన బలమైన కుల వ్యవస్థను కూల్చలేకపోయినా, ఒక ప్రత్యమ్నాయ వ్యవస్థను సూచించే దిశగా తత్వాన్ని చెప్పారని, వీరబ్రహ్మం గారు సామాజిక విప్లవ దార్శనికుడే అవుతారని చెప్పకనే చెప్పారు.

## శ్రీకృష్ణ దేవరాయలు :

శ్రీకృష్ణదేవరాయలు రాసిన ఆముక్తమాల్యదలోని మాలదాసరి కథకు మూలంవరాహ పురాణంలోని మాలదాసరి కథనే అని పరిశోధకులు భావిస్తున్నప్పటికీ కొలకలూరి ఇనాక్ గారి మునివాహనుడు నాటకం ప్రకారంపన్నిద్దరు ఆళ్వార్లలోని చివరిపంచమ వర్ణానికి చెందిన తిరుప్పాణ్ ఆళ్వారు (మునివాహనుడు)ను దేవాలయ ప్రవేశానికి తనను నిరాకరించిన లోకసారంగ ముని (పూజారి) తన భక్తి తత్పరతతో, వాదన పటిమతో దైవాన్ని మెప్పించాడు. అప్పుడు పూజారే స్వయంగా తన భుజాలపై ఎక్కించుకొని దేవాలయానికి తీసుకెళ్లాడు. తర్వాత శ్రీరంగనాథునిలో తిరుప్పాణ్ ఐక్యమైపోతాడు. ఈ కథనే ఈ గాథనే శ్రీకృష్ణదేవరాయలు మాల దాసరి కథగా రాశాడనిపిస్తుంది. రాయలు ఆళ్వార్ల భక్తి తత్వాన్ని చెప్తూనే తన కాలం నాటి సామాజిక మత పరిస్థితుల్ని వర్ణించడానికి మాల దాసరి పాత్రను వర్ణించారనుకోవచ్చు. చాతుర్వర్ణ వ్యవస్థను రాయలు కట్టుదిట్టంగానే అమలు పరచాడనే విషయం ఇక్కడ తెలుస్తుంది. అస్పృశ్యుడు కావడం వల్ల ఆలయానికి బయటే నిలబడి మంగళకైకీ గీతాన్ని ఆలపించాడు. బ్రహ్మ రాక్షసుడితో ఒప్పందం తర్వాత తన దగ్గర ఉన్న మంగళకైశికి గాన ఫలాన్ని ధారబోసి బ్రహ్మ రాక్షసుడిని రాక్షసత్వాన్ని తొలగించి బ్రాహ్మణుడిగా మార్చేసిన సన్నివేశాలను చూస్తే మాల దాసరి తక్కువ కులం వాడైనా దైవ ప్రార్థన చేస్తూ వైష్ణవ మతాన్ని ఆరాధించినందుకు, అందులోనూ మంగళకైశికి గాన ఫలాన్ని పొందిన మాల దాసరితోనే బ్రహ్మ రాక్షసి భగవంతున్ని ప్రస్తావించడంతోనే తన రాక్షసత్వం పోయింది. అది తనవల్ల కాకుండా భగవంతుని వల్లే జరిగిందనే కారణంగా మాల దాసరికి బ్రాహ్మణుడి కంటే గొప్ప గౌరవ మర్యాదల్ని కవి ప్రత్యక్షంగా ఆపాదించలేదని అందుకనే చెప్పరానికులంగానే సంబోధించాడు. కాబట్టి కులం కృష్ణరాయ యుగంలో మనుధర్మ పరిరక్షణ మరియు మత ప్రచారం కోసమే తక్కువ కులం వారిని వాడుకున్నారు. అని భక్తి ఉన్నా సామాజికంగా ఆత్మ గౌరవాభివ్యక్తి రాయల యుగంలో కనిపించలేదని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు అభిప్రాయపడ్డారు.

## ఆధునిక సాహిత్యం :

ప్రాచిన సాహిత్యంలోని కవులంతా వర్ణ పరిరక్షణ

కోసమే రచనలు చేశారనీ, ఆధునిక సాహిత్యంలోనే బహుజన వాద సాహిత్యానికి బాటలు పడ్డాయని చెపుతూ గుర్రంజాషువా -గబ్బిలం, బోయిభీమన్న-రాగ వాశిష్టం, కొలకలూరి ఇనాక్- ముని వాహనుడు, ఖాదర్ మొహియుద్దీన్- పుట్టుమచ్చ,బన్న ఐలయ్య- నిప్పుకణిక, ఎండ్లూరి సుధాకర్- కొత్త గబ్బిలం, జి.వి.రత్నాకర్- అట్లేటి అల వంటి రచనలు బహుజన సాహిత్య దృక్పథంతోనే రాసారని చెప్పారు.

ఏకుల వెంకటేశ్వర్లు గారు రాసిన "ఎన్నెల నవ్వు-యానాదుల సంస్కృతి" అని రాసిన వ్యాసంలో కుల అస్తిత్వ ఉద్యమాల వల్ల దళితులలో విప్లవోద్యమాలకు బలైపోతున్నారనే ఆలోచన బలంగానే మొదలైంది. చెంచులు పాత్రను విప్లవోద్యమం నుండి గిరిజనులు, మరికొంతమంది పోలీసుల ద్వారా బయటికొచ్చినట్లు వర్ణించినా ప్రజాస్వామిక మార్గంలోనే తమ హక్కుల్ని సాధించుకోవాలనే ఆలోచన కలిగించారు. వర్గవాదుల్లో కూడా కులతత్వమే నాయకత్వాన్ని వహిస్తుందనీ, వాళ్లు చెప్పిందే పాటించాలని అక్కడేమి జరుగుతుందో మిగతా సామాజిక వర్గాలకు తెలిసేది తక్కువేనని, చెంచులు పాత్ర ద్వారా, అగ్రవర్ణాలకు చెందిన కేశవరావు, రమణా రెడ్డి పాత్రల ద్వారా సూచించారు.. అగ్ర వర్ణాలు తమ పిల్లల్ని చదివించుకుంటూ, ఉన్నతోద్యోగాలు చేయిస్తుం టారని, కింది వర్ణాలవాళ్లనీ, పేదపిల్లల్ని, విప్లవంలో భాగాస్వామ్యుల్ని చేస్తున్నారు.(బి. ఎస్.రాములు -బహుజన తత్వం) ఇటువంటి అంబేద్కర్ భావజాలాన్నే ఏకుల వెంకటేశ్వర్లు ఈ నవలలో విస్తరించి, చివరికి కుల అస్తిత్వ ఉద్యమ చైతన్యమే కింది కులస్తుల్ని పట్టించు కుంటుందని, వాళ్ళ అభివృద్ధి కూడా ఆ చైతన్యంతోనే ముడిపడిందని అన్నారు. యానాదుల్ని అర్థం చేసుకోవ డానికి ఎన్నెల నవ్వు నవల ఎంతగానో ఉపకరిస్తుందని దార్ల వెంకటేశ్వరరావు గారు రాసిన వ్యాసం ద్వారా తెలుస్తుంది.

బోయ జంగయ్య గారు జాతర నవలలో సంతానం లేకపోతే రాళ్ళు, రప్పలకు మొక్కే గ్రామీణుల్ని ఎలా వంచిస్తుంటారో వివరించి ప్రజల్ని చైతన్యవంతం చేశారు. శాంతికి సంకేతంగా పావురాల్ని వర్ణిస్తూ మతమేదైనా పావురాలు మసిదుల్లోనో, చర్చిల్లోనో, దేవాలయాల్లోనో కలిసి మెలిసి జీవిస్తున్నట్లే, మానవులు కూడా సమైక్యంగా జీవించాలని ఆకాంక్షించారు. (వెలుతురు, కవితా సంకలనం ) జగడం నవలలో ఐదు దశాబ్దాల భారతీయ సామాజిక జీవనంలో అట్టడుగు వర్గాల ఆశల్నీ, ఆశయాల్ని వర్ణించారని ఈయన దళిత బహుజన సాహిత్యానికి కృషి చేశారని అన్నారు.

బహుజన వాదానికి బలం చేకూర్చే ఉద్యమంలో భాగంగా అణగారిన, అణచివేతకు గురౌతున్న కులాల గురించి వ్యాసాలు రాసిన వరంగల్ జిల్లాకు చెందిన చాకలి కులంలో పుట్టి, అసోసియేట్ ప్రొఫెసర్ గా ఎదిగిన కొమ్రన్న హఠాత్తుగా మరణించినపుడు ఆయనను గురించి, ఆయన రాసిన సాహిత్యం గురించి విస్తృతంగా చెప్పే ప్రయత్నంలో భాగంగా "బహుజన కొమ్రన్న" అనే వ్యాసం రాశారు.

దళితుల్లో చైతన్యం తేవడానికి తీవ్రంగా ప్రయత్నించిన నాగప్పగారి సుందర్రాజు, మద్దెల శాంతయ్య, పత్తిపాటి మల్లేశ్వరరావు, మద్దూరి నగేష్ లు లాంటి బహుజన కవుల మరణం పట్ల కన్నీటి పర్యంతమవుతూ వారు రాసిన సాహిత్యాన్ని బహుజన సమాజమంతా చదవాల్సిన అవసరం ఉందని నేటి యువతకు సూచిస్తూ రచనలు సాగించారు. "

"సింధు తొక్కె సూరీడు / కొమ్ము కండే సూరీడు
కల్లుగీత సూరీడు / మాతంగి సూరీడు / గోసంగి సూరీడు'"గా

బహుజనులందరిని ఒక్కొక్క సూరీడుగా అభివర్ణిస్తూ రాజ్యాధికారానికి ముందుకు సాగాలన్నా శివసాగర్ గారి గురించి, ఆయన కవిత్వంలో బహుజన తత్వంను చూపుతూ, అంబేద్కర్‌ను చదువుకున్న తర్వాతే "శివసాగర్' కె.జి సత్యమూర్తిగా మారి అంబేద్కర్

సూర్యుడు'' వ్యాసాల్ని బహుజన దృక్పథంతో రాసారని వివరించారు.

మఖ్బుల్ ఫిదా హుస్సేన్ లాంటి గొప్ప చిత్రకారులను తన మాతృ దేశం వదిలి పరాయి దేశంలో తలదాచుకునేలా చేసిన హిందూ భావజాలాన్ని ఖండిస్తూ భారతీయ పికాసోగా పిలవబడ్డ ఎమ్. ఎఫ్. హుస్సేన్ లాంటి కళాకారులను, ముస్లిం వాద సాహిత్యం రాసే కవులను అందరినీ బహుజన దృక్పథం తోనే చూడాలని దార్ల గారన్నారు.

అన్నమయ్య ''బ్రహ్మమొక్కటే' అనడానికి ఆయనపై బడిన ప్రభావాలను అన్వేషించారు. ఆముక్తమాల్యదలో రాయలు దాసరికి భక్తుడుగా ప్రాముఖ్యమిచ్చినా, కుల నిర్మూలన దృష్టిలేదన్నారు. వేదాలలో కులం లేదని వాదించేవాళ్ళకు పురుషసూక్తంలోని కులం ఆధారాలను చూపించారు. వీరబ్రహ్మంను సామాజిక విప్లవకారునిగా గుర్తించారు. "జగడం" నవలలో బోయ జంగయ్య స్వంత జీవితాన్ని అన్వేషించారు. ''ఎన్నెలనవ్వు'' నవలలోని అంతర్గత ఆధారాలతో ఆ నవల కథాకాలం గుర్తించారు. భారతీయసాహిత్య భావన మీద ఆలోచన స్థిరపడు తుండగా ప్రపంచ సాహిత్య భావనను చర్చించారు. సాహిత్యం కులం గురించో, జెండర్ గురించో రాయబడినా అది విశ్వసాహిత్యంలో భాగం కావాలని కోరుకున్నారు. ఎస్.సి, ఎస్.టి., బి.సి.,మైనారిటీల పేరుతో గల 85 శాతం మంది ప్రజలను గురించి రాయబడేది బహుజనసాహిత్యమని నిర్వచించారు.

వర్గ సమస్యతో సాహిత్యాన్ని చూస్తే దాంట్లో భౌతికవాద దృష్టి ఉన్నా, సాహిత్యం సమాజ వాస్తవికతను ప్రదర్శించడంలో పాక్షికకోణమే ప్రదర్శితమౌతుంది. అందువల్ల కుల-వర్గ సమస్యల సమ్మేళనంతో సాహిత్యాన్ని విశ్లేశించేది సాహిత్యంలో బహుజన దృక్పథమవుతుంది. (దార్ల- బహుజన సాహిత్య దృక్పథం, పుట17). తమ సంస్కృతిని అణగద్రొక్కుతున్న శక్తుల్ని, వాటిని ఎదుర్కొని నిలబడగల అంతఃశక్తుల్ని గుర్తించవలసిన అవసరాన్ని దళిత, బహుజన రచయితలు గుర్తెరిగి తమ రచనలు చేయాలనీ డా.కత్తి పద్మారావు గారు సూచించారు. ఇది ప్రస్తుతం బహుజన రచయితలు గమనించాలి. (తాళ్ళూరి లాబన్ బాబు బహుజన వాదానికి రాసిన ముందుమాట). సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థను బలంగా ఆచరించడానికి ఉపయోగపడే భావజాలాన్ని భావవాదం ప్రసాదిస్తుంది. రాజులు, పోషకుల ఆధారంగా సాహిత్య సృజన జరిగిందని నిరూపించే దిశగా ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యాన్ని రాశారు. అభ్యుదయ యుగం వరకే రాసి, తర్వాత కొనసాగించక పోవడానికి కుల అస్తిత్వ చైతన్యాన్ని గుర్తించక తప్పని పరిస్థితి రావడం ఒక బలమైన కారణం. అందుకే 13 వ సంపుటి రాసేనాటికే స్త్రీ, దళిత సాహిత్య ఉద్యమాలు వచ్చినా ఆరుద్ర వాటిని చాలా జాగ్రత్తగా పక్కకు పెట్టేశాడు. కాబట్టి ఇక్కడ నుండి మళ్ళీ సాహిత్య చరిత్రను రాయాల్సిన అవసరం ఉందనీ, అదెవరు రాసిన దానిలో బహుజన దృక్పథమే ప్రతిఫలిస్తుందని దార్ల వెంకటేశ్వరరావు గారు రాబోయే కొత్త తరానికి మార్గ దర్శకత్వం వహిస్తూ బహుజన సాహిత్య దృక్పథానికి దారులు వేస్తున్నారు.

**ముగింపు :**

ఈ వ్యాసంలో బహుజన దృక్పథాన్ని సైద్ధాంతికంగా అవగాహన చేసుకోవడమెలాగో, దాన్ని సిద్ధాంతీకరించేందుకు ప్రయత్నించినవారి భావనలను క్రోడీకరించి, సంప్రదాయ సాహిత్యాన్ని అనుశీలించే పద్ధతితో కాకుండా సామాజిక, ఆర్థిక, సాంస్కతిక కోణంతో బహుజన సాహిత్యాన్ని విశ్లేషించుకోవాలని, దీనికి జ్యోతీరావు బాపూలే, పెరియార్ రామస్వామినాయకర్, డా.బి.అర్. అంబేద్కర్‌ల భావజాలాన్ని తాత్త్వికంగా తీసుకోవాలని సోదాహరణంగా వివరించాను. తెలుగు సాహిత్యాన్ని బహుజన సాహిత్య దృక్పథంతో ఎలా విశ్లేషించాలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు శాస్త్రీయంగా వివరించారు. దీన్ని ప్రధానంగా చేసుకొని ఈ వ్యాసాన్ని

పూర్తిచేశాను. దీని వల్ల తెలుగు సాహిత్యాన్ని, అలాగే మొత్తం భారతీయ సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడానికి ఈ సైద్ధాంతిక భావనలు ఉపయోగ పడతాయని నమ్ముతున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. Ranjan, P. (2014). Bahujan Literature: Conception of a concept. Forward Press, 6(5).
2. Pramod Ranjan (2016) Bahujan Sahitya Ki Prastavna, Bahujan Hitay, Bahujan Sukhay, Editor - Pramod Ranjan, Ivan Kostka, The Marginalised Prakashan, Wardha, Maharashtra, P-7.
3. Kanwal Bharati (2016) Bahujan Sahitya Ki Prastavna, MukhyadharaBanein Bahujan Avdharna, P-98.
4. Kostka, I., & Ranjan, P. (2016). The Case for Bahujan Literature.
5. Jaffrelot, C. (1998). The Bahujan Samaj Party in north India: no longer just a dalitparty?. Comparative Studies of South Asia, Africa and the Middle East, 18(1), 35-51.
6. శాంసన్, పిల్లి . దళిత సాహిత్య చరిత్ర. స్వీయ ప్రచురణ , 2000 : 3
7. రాములు, బి.ఎస్. బహుజన తత్వం. హైదరాబాద్. విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ, 2003 : 3
8. లాబన్ బాబు. తాళ్ళూరి. బహుజన వాదం. హైదరాబాద్. కుసుమాంజలి, ప్రచురణలు. 2005 : 24.
9. దార్ల వెంకటేశ్వరరావు. సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ 2012.
10. లక్ష్మీ నరసయ్య, జి. నేలమీద నిలబడి సాహిత్య వ్యాసాలు, మే 2021.
11. పద్మారావు. కత్తి. కులం పునాదులు . లోకయుతా ప్రచురణలు ఆక్టోబర్ 2021.
12. ఐలయ్య కంచె, మన తత్వం, దళిత బహుజన తాత్వికత. నవంబర్ 2008.

❖❖❖

# స్త్రీవాద, బాల కార్మికుల కథలు - సామాజికత

- రెబ్బ మల్లికార్జున్, పరిశోధక విద్యార్థి

బండారు అచ్చమాంబ నుండి నేటి వరకు ఎందరో మహిళామణులు తమ కథా కథనంతో ఆ కాలం నాటి సామాజిక జన జీవన చిత్రణను చేస్తూ తమ ఉనికిని సుస్థిరం చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో రాబోయే తరాల వారికి దిశా నిర్దేశనం చేస్తున్నారు. తెలంగాణ నుంచి రావలసినంత కావలసినంత స్త్రీవాద సాహిత్యం రాలేదని అంటారు. తెలంగాణలో రాడికల్ ఫెమినిజం చోటు చేసుకోలేదు. కాని స్త్రీ స్వేచ్ఛ సమానతలు సమానావకాశాలను కోరుతూ, స్త్రీల వ్యథలను శ్రమ దోపిడీని చిత్రిస్తూ గీతాంజలి, ముదిగంటి సుజాతారెడ్డి, అని శెట్టి రజిత కథలు రాశారు. బచ్చేదాని, విసుర్రాయి, మట్టిబంధం వంటి కథల సంపుటాలు వచ్చాయి. ఇంకో విశేషమేమిటంటె దళిత స్త్రీవాదంలో స్త్రీ స్పృహను, వ్యథలను చిత్రిస్తూ జాజుల గౌరి, గోగుశ్యామల, జె.సుభద్ర వంటి రచయిత్రులు తెలంగాణ మాండలికంలో బలమైన కథలు రాశారు. జాజుల గౌరి దళిత స్త్రీ జీవితాలను చిత్రిస్తూ 'మన్ను బువ్వ' అనే కథల సంపుటిని ప్రచురించింది. స్త్రీ దళిత స్పృహను చిత్రిస్తూ ఇతర ప్రాంతాల నుంచి సాహిత్యం ముఖ్యంగా కథలు రాలేదు. తెలంగాణా నుంచే వచ్చాయి. అదే విధంగా ముస్లిం స్త్రీవాదంలో స్త్రీల వ్యథలను షాజహానా కవిత్వంలోనే కాక కథల్లోనూ చిత్రించింది. ఇట్లా ముస్లిం స్త్రీల వ్యథను చిత్రించే కథా సాహిత్యం ఇతర ప్రాంతాల నుంచి రాలేదు.

స్త్రీ విద్యావంతురాలైనప్పటికీ నాలుగ్గోడల మధ్య బందీగా పరిగణించబడుతూనే ఉంది. విద్య ద్వారా వచ్చిన ఉద్యోగం కొద్దిపాటి స్వేచ్ఛను ఇవ్వగలిగినప్పటికీ ఇంటి చాకిరీ స్త్రీల జీవితాలను వేధిస్తూనే ఉంది. ఆంక్షలు స్త్రీ స్వేచ్ఛకు అడ్డొస్తూనే ఉన్నాయి. ఉద్యోగం స్త్రీకి ఇంటిచాకిరీతో పాటు అదనపు శ్రమ అనే మరో నూతన బానిసత్వంలోకి నెట్టివేసింది. రాజ్యాంగం పౌరులందరికీ గౌరవంగా బతికే హక్కును కల్పించినప్పటికీ అధిక శాతం స్త్రీలు కనీస పౌరులుగా కూడా గుర్తించే పరిస్థితులు సమాజంలో లేవు. స్త్రీల పనికి గుర్తింపు ఇవ్వకుండా విలువను నిరాకరిస్తున్న సమాజం మన ఎదుట ఉంది. ఇటువంటి పరిస్థితులను నిర్మూలించే లక్ష్యంతోనే చలం రచన ప్రారంభమైంది.

పెట్టుబడిదారి వ్యవస్థలో స్త్రీ ఒక విలాస వస్తువు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత', 'కార్యేసు దాసి, కరణేషు మంత్రి, శయనేషు రంభ, భోజ్యేషు మాత, క్షమయా ధరిత్రి' అంటూ వివిధ పాత్రల్లో స్త్రీ నిర్వహించాల్సిన బాధ్యతతో పాటు చేయాల్సిన వెట్టి చాకిరీని బలవంతంగా ఆమెపై రుద్దుతుంటే శారీరకంగా, మానసికంగా అనాదిగా ఎన్నో ఇబ్బందులకు గురవుతుంది. 'స్త్రీకి స్త్రీయే శత్రువు' అన్న నానుడిలో నిజం లేకపోలేదు. స్త్రీల గురించి ఎన్ని పోరాటాలు చేసినా, చట్టాలెన్ని అమల్లోకి వచ్చినా వారిపై రోజురోజు జరిగే అత్యాచారాలకు, అరాచకాలకు అంతులేకుండా పోతుంది. ఒక్క సోషలిస్టు వ్యవస్థలో మాత్రం స్త్రీని పురుషుడితో సమానంగా చూడటం జరుగుతుంది. మూడు దశాబ్దాల్లో ఉత్తర తెలంగాణా కథల్లో స్త్రీ సమస్యల్లోకి వెళ్తే 'స్త్రీ తన మానాన్ని రక్షించుకోవడానికి ఎమైన చేయగలదు' అనే వాస్తవాన్ని విప్పి చెప్పిన కథ అఫ్జల్ రాసిన 'కలిసొచ్చినవేళ'.

### ఊరికి పోదాం భూదేవి- గీతాంజలి :

అస్తమానం డబ్బు సంపాదించాలనే భర్త, వంతపాడే అత్తయ్య, కంప్యూటర్ గేమ్స్‌కు డబ్బులడిగే కొడుకు విశాల్, హైహీల్ షూస్... లిప్‌స్టిక్, నెయిల్‌పేయింట్స్ కావాలని మారాం చేసే కూతురు రిధిమ... రెండ్రోజులకోసారి తన దర్జా చూపి పోవడానికొచ్చే ఆడపడచు మృదుల, డబ్బునే తింటూ తాగుతూ బతికే ఆమె భర్త సతీష్, అతన్ని చూసి ఆత్మన్యూనతకి లోనవుతూ పోటిపడే

తన భర్త దినకర్, అతని కోరికలకు బలయ్యే తాను. బాల్యపు సుఖాను భూతుల్ని తల్చుకుంటూ కలలు కనడం మాత్రమే శివాని చేయగలిగేది. తనింట్లో పనిమనిషికున్న మనోవేదనను తీర్చుకునే స్వేచ్ఛ తనకు లేదుకదా అని వాపోతుంది.

**పైతృకం - సుజాతారెడ్డి :**

వారసులకు తండ్రినుండి వచ్చే ఆస్తిని పైతృకం అంటారని అందులో కూతురికి ఆస్తి హక్కు లేకపోవడం అనే వంచన జరుగుతుందని నిరూపించిన కథ. తల్లి సావిత్రిని చిన్నప్పటి నుండి తండ్రి పీడించడమే చూస్తుంది. తనింట్లో తనే బానిసగా భావిస్తూ సహనం, ఓర్పు, అణకువ, భర్త కెదురు తిరిగి మాట్లాడ కూడదనే జీవితాదర్శంతో పరాయికరణకు లోనైన ఇల్లాలు. తల్లిలాగే అమ్మమ్మ కూడా తండ్రి ఆస్తి, కట్న కానుకల విషయంలో వంచితురాలైనట్లు గ్రహిస్తుంది. తనూ అంతేనా అని ఓ సారి భయపడిన విజయ తాను చదువకున్నది! తల్లిలాగా, అమ్మమ్మలాగా ఆస్తి కట్నకానుకల సంకెళ్ళలో చిక్కుకొని అత్తింటికి బానిస కాకూడదు అని దృఢనిశ్చయం చేసుకుంటుంది. స్త్రీకి ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాల్సిన అవసరాన్ని చాటిన కథ.

**మాతృమూర్తి - కాలువ మల్లయ్య :**

శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన వసంతకు తండ్రి భూషణరావు ఆడపిల్లకు పెద్దగా చదువు అవసరం లేదని పదోతరగతి పూర్తి కాగానే పెళ్ళి చేయగా ప్రమాదంలో భర్త చనిపోతాడు. అన్న స్నేహితుడైన గోపి మాయమాటలు నమ్మి గర్భవతి అవుతుంది. మాతృమూర్తి కావాలనే బలీయమైన కోరికను తీర్చుకోకుండానే తండ్రి కఠినమైన మాటలను తట్టుకోలేక తనువు చాలించడంతో ముగిసిన విషాదగాథ. 'చిందొర్సాని' దొర కూతురు సుజాత వయో: క్రమంలో ప్రవర్తనా మార్పుల్ని తెల్పిన కథ. దొరల ఇళ్ళలో భార్యలు, కూతుళ్ళు, కోడళ్ళు వారిళ్ళలో పనిచేసే వారికన్నా హీనంగా మానసిక బానిసత్వాన్ని భరిస్తూ గడిపే తీరును ప్రత్యక్షంగా చిత్రించిన కథ. 'పాపం దొర్సాని' సునందాదేవి దయనీయస్థితికి అద్దం పట్టిన కథ.

**తొందరపడి ఒక కోయిల - నరేందర్ :**

పెళ్ళి చూపుల పేర సంతలో పశువులా మారిన ఆమె, తల్లిదండ్రులకు గుండెలపై కుంపటిలా ఉండటం ఇష్టంలేక మానసిక క్షోభ అనుభవిస్తుంటుంది. ఆమె బాధను అర్థం చేసుకున్న పోస్ట్ మాన్ చేయందిస్తానంటూ ఆమెలో ఆత్మవిశ్వాసం కలిగిస్తాడు. తల్లిదండ్రులకు తన నిర్ణయం తెలిపి వారిని సంతోషపెట్టి అతనిలో వెళ్ళడంతో సుకాంతమైన కథ.

**వైరుధ్యాలు- బి.ఎస్.రాములు :**

భూమయ్య ఉద్యమ కార్యకర్త తన భార్య సుశీలను కూడా ఉద్యమంలోకి రమ్మంటాడు. అందుకామె అడవుల్లోకి వెళ్ళడమే ఉద్యమం కాదని జనంలో ఉంటూనే, ఆవరిని ఉద్యమం వైపు వెళ్ళేలా చైతన్య పరుస్తానంటుంది. అంతేగాక ఇద్దరము బయట తిరిగితే పిల్లల బాధ్యత ఎట్లా అని ప్రశ్నించడం ఇల్లాలిగా ఆమెతీరు మరియు ఉద్యమం పట్ల ఆమె అభిప్రాయాన్ని చక్కగా వెల్లడి చేసినట్లయింది. ఉద్యమ నిర్మాణాన్ని సవరించాలని కోరుతుంది. ఈ కథ దంపతుల మధ్య ఉద్యమంలోకి వెళ్ళడం వల్ల కుటుంబంలో జరిగే సంఘర్షణను వాస్తవీకరించింది.

**కుంపటి- అల్లం రాజయ్య :**

దొర ప్రజల సంఘటిత శక్తిని దెబ్బతీయడానికి కాల్పులు జరపగా 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. అక్కడికొచ్చిన ఇన్స్‌పెక్టర్‌ను ఆ తుపాకీ తీసుకోమని ప్రజలు డిమాండ్ చేస్తారు. అయినా అతను చలించకపోగా, ఒక స్త్రీ 'దొరట్ల కాలుస్తుంటే చూస్తావే మయ్యా అరెస్టు చేయక.... గా బట్టలు నాకీయి, తుపాకి నా సేతికియ్యి అన్ని అరెస్టు సేత్త' అని నిలదీయడం పోలీసుల చాతకానితనాన్ని, తెలంగాణా స్త్రీల ధీరత్వాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించింది.

**రాజులు - అనిశెట్టి రజిత :**

ఈ కథలో ఆడవారు ఆపద సమయంలో తమ గాజులనే ఆయుధాలుగా చేసుకుని మగవారిని పలాయనం చిత్తగించేలా చేసిన వైనాన్ని చక్కగా చిత్రించడం జరిగింది. అతి సామాన్య స్త్రీలు కూడా పోరాటం అనివార్యమైనపుడు ఆయుధాలు లేవని వెనకకు తగ్గేది లేదని నిరూపించడం విశేషం, తెలంగాణా స్త్రీలు గాజులేసుకుని బతుకమ్మ ఆడిన చేతులు ఓ రాత్రి ప్రయాణంలో తాగుబోతుల బారి నుండి సుశీల నాయకత్వంలో పోరాడి గెల్చిన తీరు అద్భుతంగా అన్పిస్తుంది.

**గలుమ :**

ఈ కథలో మల్లీశ్వరీ అనే గృహిణి తన జీవితాన్ని పరాధీనురాలుగా గడిపిన వైనం స్పష్టమవుతుంది. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షణలోనే గడపాలని పెద్దలు నుడివినట్లుగానే సాగిపోతుందని ఈ కథ నిరూపిస్తుంది. యాభైఏళ్ళ జీవితంలో కూతురుగా, భార్యగా, తల్లిగా గలుమలో కూర్చుండి, తండ్రి కోసం, భర్తకోసం, కొడుకుల కోసం ఎదిరి చూడ్డంగా మారిన స్త్రీల జీవితాలు, వాళ్ళ ఆర్తి ఈ కథలో ప్రస్ఫుటమౌతాయి. గలుమల్ని తొలగించుకొని వంటింటి కుందేల్లుగా ఉన్న పేరును తొలగించుకొని సామాజిక జీవన స్రవంతిలో భాగం కావాలనే సందేశం ‘గలుమ’ కథలో అందించారు. మల్లీశ్వరి కూతురు పలికిన మాటల్ని బట్టి ఇప్పటి తరం స్త్రీలలో బయటి ప్రపంచం లోకి రావాలనే స్పృహ కల్గుతున్నట్లు తోస్తున్నది.

**నిరీక్షణ :**

ఈ కథలో గ్రామీణ స్త్రీలు వాళ్ళ గుండెల్లో గూడుకట్టుకున్న పవిత్రప్రేమ, ఎన్ని కష్టాలు వచ్చిన ఆ ప్రేమను గుండెలో నిలుపుకొని బతకడం, మనసిచ్చిన వ్యక్తికే తనువు అర్పించాలనే భావన ఈ కథలో కన్పిస్తుంది. తెలంగాణలో పద్మశాలీలు కులవృత్తి గిట్టుబాటు లేక బొంబాయి, భీవండి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్ళారు. అక్కడ మరమగ్గాలపై పని వెతుక్కొని అక్కడే జీవించారు. ఈ కథలో కిష్టయ్య. రుక్కమ్మ బావ మరదళ్ళు. కిష్టయ్య భీవండి వెళ్ళి కొంత సంపాదించుకొని వచ్చాక రుక్కమ్మను పెండ్లి చేసుకుంటానని చెప్పి వెళ్తాడు. అట్లా వెళ్ళినవాడు యేడాదిన్నర పాటు అక్కడే ఉంటాడు. ఇంటివద్ద తన బావరాక కోసం రుక్కమ్మ ఎదురుచూస్తూ గడుపుతుంది. ఇంతలో భీవండిలో మతకలహాలు చెలరేగడంతో అమాయకుడైన కిష్టయ్య మరణిస్తాడు. ఈ వార్త తెలిసిన రుక్కమ్మ మతిచలించి పిచ్చిదవుతుంది. ప్రతిరోజు తలారాస్నానం చేసి ఉతికిన చీర కట్టుకొని, మల్లెపూలు సిగనిండా పెట్టుకొని ముస్తాబై రాని బావకోసం ఎదురుచూస్తూనే ఉంటుంది.

**మురికి :**

కథ సమాజంలో సంపన్న స్త్రీల గాడి తప్పిన హోదాకు సంబంధించింది. ఈ కథకు వేదిక పట్టణం నడిఒడ్డులోని ‘స్త్రీల రిక్రియేషన్ క్లబ్’. సాయంత్రాని కల్లా ఆ క్లబ్‌కు సమాజంలో ఉన్నత హోదాల్లో ఉన్న వారి భార్యలు చేరుతుంటారు. వారే ఆ క్లబ్ సభ్యులు. ఖరీదైన కార్లు, బంగ్లాలు, చీరలు, నగల చుట్టే వారి మాటలు సాగుతాయి. స్త్రీల హక్కుల గురించి మాట్లాడటం, ఆచరణలోకి వచ్చేసరికి సాటి స్త్రీల పట్ల అవహేళనగా అవమానకరంగా ముచ్చటించటం, కన్నబిడ్డలకు స్తన్యమిస్తే అందమంతా కరిగిపోతుందని డబ్బాపాలు పెట్టి, ఆయా, దాదీల సంరక్షణలో ఉంచడం, అత్తమామల్ని గుదిబండలా చెప్పుకోవడం ఇవే ఆ క్లబ్బులో జరిగే చర్చలు. కాలక్షేపానికే అంటూ పేకాడటం, ఇంటివద్ద నుండి పిల్లలు ఏడుస్తున్నట్లు ఫోన్ వచ్చినా చలించకపోవడం ఇవ్వన్నీ రోజు వింటూ, చూస్తూ భరించలేనంతా మానసిక ఉద్వేగానికి గురైన ఆఫీస్ బాయ్ ఆనంద్ ‘అమ్మా మురికి మురికి... గబ్బు.. గబ్బు వాసనొస్తుంది’ అని క్లబ్ సెక్రటరీతో అంటాడు. నవనాగరికపు పోకడలకు పోయే స్త్రీల ప్రవర్తన ఏ రీతిలో ఉందో ఈ ‘మురికి’ కథ అద్దం పడుతుంది.

**బాలకార్మిక కథలు :**

జీవితంలో బాల్యం అపురూపమైన దశ. భవిష్యత్తుకు పునాది బాల్యమే అవుతుంది. తల్లిదండ్రుల సంరక్షణలో అనురాగ అప్యాయతలను పంచుకుంటూ ఇల్లే ఒక ప్రపంచంగా బాల్యం కొనసాగుతుంది. రోజులు గడిచినా కొద్దీ జ్ఞానం వికసిస్తూ పరిసరాల ప్రభావం వల్ల వ్యక్తిత్వానికి బీజం పడేది బాల్యంలోనే. ఈ బీజమే కుటుంబం అంకురంగా, సమాజం మొక్కగా, ప్రపంచం వృక్షంగా పరిణామం చెందుతుంది. స్వచ్ఛమైన, నిర్మల మనసుతో నిస్వార్థమైన వ్యక్తిగా రూపొందడానికి ప్రాతిపదికగా ఉంటుంది. పిల్లలకు జన్మనివ్వడంతో పాటు వారి భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలంటూ తల్లిదండ్రులు కలలు కనడం సహజమే. తల్లిదండ్రుల కలల్లాగే బిడ్డల జీవితాలు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. నిరక్షరాస్యత, దారిద్ర్యం, నిత్య సంఘర్షణ ఉన్న కుటుంబాల్లో బాల్యం రక్షణ లేని మొక్కలా పెరుగుతుంది. అస్తవ్యస్త పరిస్థితులు, నిత్య అభద్రతాభావంతో ఉన్న పరిసరాల మధ్య బాల్యం సున్నితత్వాన్ని కోల్పోయి మొరటుగా రూపొందవచ్చు. శుచీశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న బాల్యం సంరక్షకుడి సంబాలనలో వికసించిన తోటలా ఉండవచ్చు. ఇవన్నీ నిత్యం మనం చూస్తున్న సమాజంలో కన్పించేవే. సృజనకారులైన కథా రచయితలు సమాజంలో ఉన్న ఈ వాస్తవాన్ని కథావస్తువుగా స్వీకరించారు.

**దేవుని బిడ్డలు - బి.ఎస్.రాములు :**

ఓ ఇంజనీరు కూతురుకు, ఆ ఇంటి పని పిల్లవాడి మధ్య ఏర్పడిన స్నేహం, కూలీల సమ్మె వల్ల ఆ పిల్లవాడు అనాథ ఐన తీరును ఉద్వేగ భరితంగా చిత్రించిన కథ. ఈ కథలో ఇంకా పిల్లల మధ్య ఆర్థిక అంతరాలు తెలియకుండా ఏర్పడే స్నేహం, ప్రేమ, అనాథలుగా మిగిలి బాల్యాన్ని కోల్పోయిన జీవితాలు, పోరాట క్రమంలో విచ్ఛిన్నమయే కుటుంబాల తీరు తెన్నులు, ప్లిలల కలల ప్రపంచం, వారి స్థాయికి మించిన ఆలోచనా ధోరణులు కూడా కనిపిస్తాయి.'నేటి బాలలే రేపటి పౌరులు' అన్నానుడి ఈనాటి బాలల విషయంలో మృగ్యమవుతున్నది. చదువుల భారంతో, మానసిక ఘర్షణలతో, బీదరికపు అవమానాలతో అనాధలుగా బిచ్చమెత్తుకుంటూ, తప్పని సరి పరిస్థితుల్లో బాలకార్మికులుగా మారి జీవితాలను గడపాల్సిన దయనీయ పరిస్థితి వారికి ఎదురౌతుంది. నేటి బాలలు నత్తగుల్లలాల్ల, నడక నేర్చిన యంత్రాల్లా, పుట్టుకతోనే, మీద పడిన కష్టాలు, తల్లిదండ్రుల నిరాదరణ, తండ్రుల దుర్వ్యసనాలు, బాధ్యతారహిత ప్రవర్తనల మధ్య బతుకును ఎంతో దీనంగా హృదయాలను కదిలించేలా గడుపుతున్నారు.

**వాడిన మొగ్గలు- జీవన్ :**

తండ్రి చిన్నప్పుడే చనిపోగా హాయిగా ఆటపాటలతో కాలక్షేపం చేయాల్సిన వయసులో అక్బర్ బాల కార్మికుడుగా మారి, ఓ స్కూటర్ రిపేరు షాపులో పని చేస్తుంటాడు. అనారోగ్యంతో తల్లి కూడా మరణించడంతో అక్బర్, అక్క అనాథలవుతారు. కలలు కనడమే కానీ వాటిని సాకారం చేసుకోలేని పరిస్థితని చిత్రించిన కథ. తండ్రులు తరతరాల బాకీ పిల్లల జీవితాలకు ఎలా గుదిబండలా తయారవుతుందో, తద్వారా కన్పించే ఫలితమేమిటో ప్రత్యక్షంగా చూపించింది.

**భూనిర్వాసితులలు - పి.చంద్ :**

గోదావరిఖని ఓపెన్‌కాస్టు బొగ్గుగని ప్రాంతంలోని పరిణామాలను చిత్రించిన కథ. రాజు తండ్రి రాజేశం భూపోరాటంలో కోల్పోగా తాతతో పాటూ హోటల్లో పని చేస్తుంటాడు. తండ్రి లాగే తాత మల్లయ్య పోలీసు లాఠీలకు బలికాగా రాజులో కసి పెరుగుతుంది. దాంతో రాజు ఇరవై లక్షల విలువచేసే డంపర్‌ను తగులబెట్టి తృప్తి చెందుతాడు. కుటుంబ సమస్యలు, ఆత్మీయులు దూరం కావడం పిల్లలల్లో కసిని పెంచి ఎలాంటి దుష్పరిణామాలకు దారి తీస్తుందో ప్రత్యక్షంగా చూపిన కథ.

**పురుగు - కొలువ మల్లయ్య :**

నేటి పోటీ ప్రపంచంలో చదువుల విషయంలో తల్లిదండ్రుల ఒత్తిడి పిల్లలను పురుగులుగా మారుస్తున్న

తీరు, తద్వారా వారనుభవించే హింస, నిస్సహాయతలను వ్యక్తం చేసిన కథ. ప్రభుత్వ ఉద్యోగి, విద్యావంతుడైన వీరేశం తన పిల్లలు కిరణ్, కవితల చదువు పట్ల చండశాసనుడిలా ప్రవర్తించడం వారిని తీవ్ర భయానికి గురి చేసి చదువుపై తగిన శ్రద్ధ చూపలేకపోతారు. పిల్లలను చదివించాలే గానీ వారిపై తీవ్ర ఒత్తిడి పనికి రాదని గ్రహించేట్లు చేసిన కథ.

**కొలమానం - జాతశ్రీ :**

కోయజాతి స్త్రీల మానాలకు రక్షణ లేని తీరును చూపిన కథ. పదమూడేళ్ళ తానంగి కట్టెపుల్లలు ఏరుకోవడానికి అడివికి తండ్రి వెళ్తే వయసున్న చౌకీదారు ఆ పిల్లను రాక్షసంగా చెరుస్తాడు. అన్యాయమని అడగడానికి వెళ్ళిన గూడెం ప్రజలకు పనితో పాటూ పైసలిస్తానని మభ్య పెట్టడంతో పేదరికం వల్ల వారేమీ అనలేకపోతారు. అన్యాయం నోరును డబ్బాశతో నొక్కిన మానవ మృగాన్ని కోయజాతి ప్రజల దీనస్థితిని, స్త్రీల హీన స్థితిని ప్రత్యక్షంగా చూపిన కథ.

**రసగుల్లలు - అమ్మిన శ్రీనివాసరాజు :**

గురువు శిష్యులకు ఆదర్శంగా ఉంటూ చెప్పే వాటిని ఆచరించాలని, ఇతరులపై ఆధారపడి జీవించే తత్వం, విద్యార్థులకు గర్వం పనికిరాదని, గురువుముందు రాజకుమారుడైనా, పేదవాడైనా ఒక్కటేనని తెలియచెప్పిన కథ 'అడుగుజాడ'. ఉత్తమ పురుష కథనంలో ఓ డిగ్రీ విద్యార్థి స్వానుభవంలో నడిచిన కథ 'చదువురేఖ'. పొట్టకూటికే కోటి విద్యలు. అందులో జ్యోతిష్యం ఒకటి కానీ ఈ విద్య వల్ల ఎదుటివారిని మోసం చేయకూడ దంటూ ఆ మోసాన్ని నిరూపించి ఆ వ్యక్తిలో (జ్యోతిష్కుని) మార్పు చూపిన చక్కటి కథ. విద్యార్థులంతా ఇలాంటి మూఢనమ్మకాలను ఖండించాలి. మూర్ఖత్వం వల్ల ప్రజల్లో గౌరవం, విశ్వాసాల్ని కోల్పోవల్సి వస్తుందని, ఎవరితో ఎలా మసలుకోవాలో తెల్సి ఉండటం అన్నివిధాలా మంచిదని రాజైన ఆనందవర్మ పాత్ర ద్వారా చెప్తూ చిరకాలం ప్రజల హృదయాల్లో నిల్చిపోయే మార్పు చూపిన చక్కని కథ 'గౌరవం'. గ్రామదేవతలకు మొక్కుబడిగా ఫలాలనివ్వాలే తప్ప మూగజీవులను అమానుషత్వంగా బలి ఇవ్వడం తగదని నాటకం ద్వారా వాసు ప్రజల నుండి దురాచారాన్ని దూరం చేసిన చక్కని కథ 'దూరమైన ఆచారం'.

తమ పిల్లల గొప్పలను గర్వంగా చెప్పుకునే తల్లిదండ్రులు దాని వెనకనున్న వారి కృషిని గుర్తించాలని, పిల్లలపై తమ ఇష్టాలను బలవంతంగా రుద్దకూడదని, అది వారిని హింసించడం, అత్యాశే అవుతుందని, డబ్బు మయం, లగ్జరీ జీవితాల పట్ల మోజు, ఇద్దరూ పని చేయకుంటే కుటుంబం నడవని పరిస్థితి, ప్రెస్టేజి అంటూ విచ్చలవిడిగా తిరిగే తల్లిదండ్రులు, సంతానం కన్నా బయటి పనులే ముఖ్యమనుకునే తీరు ఇవన్నీ పిల్లల పట్ల నిర్లక్ష్యాన్ని తెలుపుతూ వారిలో మనోవేదనకు, హింసాప్రవృత్తికి, కోపధోరణికి ముఖ్య కారణాలవు తున్నాయని ఈ కథలు తెలుపుతున్నాయి.

**పనిపిల్ల - తుమ్మేటి రఘోత్తమరెడ్డి :**

'పనిపిల్ల' కథ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ కథ చదువుతుంటే విభిన్న భావోద్వేగాలకు లోనవుతాం. ఆ రోజు రాత్రి-తాను నిదురించిన గడీలో జరిగిన కరువు దాడిలో 'పనిపిల్ల' కళ్ళలో వెలుగును చూసిన మహేంద్ర మానసిక ఉద్వేగమే' ఈ కథకు ప్రాణం. భార్యను అర్థం చేసుకోవడంలో మహేంద్ర మానసిక స్థితిలోని లోపాలను, జ్ఞాన సముపార్జన ద్వారా జయించాలే తప్ప, మరో మార్గం లేదు. 'పనిపిల్ల' చాలా వివాదాస్పదమైన కథ. హాలివుడ్ మూవీ 'దిలా స్ట్ సమురాయ్'లో హీరో టామ్ క్రూజ్ మాదిరిగా 'పనిపిల్ల' కథలో మహేంద్ర నాగరికుడివలె పట్నం నుంచి వచ్చి, అనాగరిక గిరిజనుల కరువుదాడిని చూసి చలించిపోయి, మనసులో మద్దుతునివ్వడం ఈ కథలో కన్పిస్తుంది. మహేంద్ర కోణంలోంచి సాగిన ఈ కథలో అతని అంతరంగాన చెలరేగే అనేకానేక ఆలోచనలు పాఠకుణ్ణి కూడా చుట్టుముడుతాయి. అందుకే కాబోలు ఈ కథ అంతగా చర్చనీయాంశమైంది.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలకు తెలంగాణా జీవభాష ప్రాణం. "వ్యవహారిక భాషావాదులు సృష్టించిన సోకాల్డ ప్రామాణిక భాషలో తప్ప, మాండలిక భాషలో అంటే 'యాస'లో సాహిత్యం పుట్టదని నమ్మబలికి, బాషతో పెత్తనం చెలాయించిన వాళ్ళకు 'రఘోత్తమరెడ్డి కథల పుస్తకం' మంచి సమాధానం. తెలంగాణ భాష సొగసుల్ని అర్థం చేసుకొని, ఆనందించడానికయినా ఇతర ప్రాంతాలవారు, ఈ కథల్ని చదవాలి.

**భూమడు - పెద్దింటి అశోక్‌కుమార్ :**

మానవత్వం ఉట్టిపడేలా చిత్రించినారు రచయిత ఈ కథలో. అమాయకుడు భూమడు. వాని తల్లి పిచ్చిది. భూమన్ని చేరదీసి రాములు, ఎంకటి తమ హోటల్లో పెట్టుకున్నారు. వాన్ని ఇంట్లో మనిషిగానే ప్రేమతో చూసేవారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు అధికారులు పకడ్బందీగా అమలుకై సర్పంచ్‌లను ఆదేశించారు. భూమన్ని తీసుకపోయి స్కూల్లో వేఆస్తరు. వాడు తప్పించుకొని రెండు రోజులకే గ్రామం చేరుకుంటాడు. ఇక వానికి ఇల్లు లేదు, వాకిలి లేదు. బీడిలు తాగడం అలవాటు అవుతుంది. ఎవరు బీడి ఇచ్చి ఏ పని చేయమన్నా చేస్తుంటాడు, వానితోటి పని తీసుకునే వారే గాని వాని ఆరోగ్యం గూర్చి పట్టించుకున్న వారు లేరు. రాములు మనసు చివుక్కుమన్నది. వానికి జ్వరమచ్చింది. ఇంటికి రారా ! గోళి మందు ఇస్తా రారా! అంటే రాలేదు. రాములు మనసు బాధపడ్డది. భూమని కొరకు వెదకడం ప్రారంభించాడు. వాడు ఎక్కడ కన్పించలేదు. ఊరంతా తిరిగాడు, వాడు దొరకలేదు. భార్య ఎంకటితో అబద్ధమాడి వాని గూర్చి ఊరంతా తిరిగినా ప్రయోజనం లేకపోయింది.

చివరికి హోటల్‌కు వచ్చిండు. ఎంకటి కోపగించు కుంది. మన వాగులో ఎవరో సచ్చిపోయింండ్రట పోలీసులు వచ్చిండ్రని ఛాయ తీసుకురమ్మన్నారని చెపుతుంది. ఛాయతీసుక పొమ్మంటుంది. భూమనికేం కాలేదు కదా! అనుకున్నడు రాముడు మానసులో. ఛాయ తీసుకొని సైకిలుకి కట్టి ఎక్కిండు అక్కడ దృశ్యం చూసి ఆశ్చర్య పోయాడు. భూమడు శవాన్ని తీస్తున్నడు. పోలీసులు బీడి ఇస్తం తియ్యరా అంటున్నారు. శవాన్ని తీసి ఏర్పాటు చేసి... అవ్వా అన్నడు గాని ఏడువలేదు. పోలీసులు శవంతో పాటు వెళ్ళిపోయినారు. "భూమడు, రాములు అక్కడ మిగిలినారు. భూమనితో రాములు నీదెంత పాపపు పుట్టుకరా? అవ్వను గుర్తుపడితివి కనీసం ఏడ్వకపోతివి అన్నాడు. భూమన్ని తీసుకొని ఇంటికి వచ్చిండు 'ఇక్కడ బాలకార్మికులు లేరనే' అట్టను తీసి కాల్చేసిండు. ఇక ఎవడైనా రానియ్య... ఆరు నెలలు వాని ఎవ్వరు పట్టించుకున్నరు. అని కథను రచయిత ముగిస్తాడు. ఈ కథ ద్వారా చట్టాలు కాదు మానవత్వం ముఖ్యమని చెపుతాడు. పెద్దింటి అశోక్ కుమార్ తన కథల్లో తెలంగాణ లోని సామాజిక, ఆర్థిక నేపథ్యాలను ఎంతో చక్కగా వివరించారు. ఈ ప్రాంతంలో నెలకొన్న అనేక సమస్యలను ఆయన చిత్రించిన తీరు 'వాస్తవం'గా ఉన్నది. ఈ కథనంలో ఆయన తన చుట్టూ తిరగాడే సమస్యలు, తను తిరిగిన గ్రామాల్లోని విషయాలను, ఏర్చి కూర్చారు.

**ఆధార గ్రంథాలు :**

1. బాల కార్మికుల కథలు - సామాజికత ప్రజాశక్తి బుక్ హౌస్ హైదరాబాదు.
2. తెలంగాణ తెలుగు కథ, డా.పంతంగి వెంకటేశ్వర్లు (సంపాదకులు)- 2011 వరంగల్
3. తెలుగుకథ - ప్రాంతీయ అస్తిత్వం వెల్దండి శ్రీధర్ (సం) 2015 కర్నూలు
4. తెలుగులో స్త్రీవాద కథలు విశాలాంధ్ర బుక్ హౌస్ హైదరాబాదు- 2013

❖❖❖

# Insider

*- **Dr. M. Koteswar Rao,*** Associate Professor, Dept of English, Krishna University, Machilipatnam.

**Translator's Note :**

The significance of English language is seen in two ways. Firstly, English language before globalisation and secondly, English language after globalization. The policies of globalization, LPG policies, increase the importance of English language which persists to grow into by leaps and bounds in 21st century. In the era of post colonization English language has occupied significant role in non-European countries in general and in India in particular. It has been acting as a lingua Franka and opened the doors to regional languages to interact with English language and to interact with one another. Since 1980s translation from one language to another and translation from regional languages to English language increased across the world particularly in India. Since 2000, higher educational institutions started departments of translation studies to give impetus to Indian regional literatures to be translated into English language. As English readers are being increased day by day in India government and non-governmental organizations across the country have been encouraging translations from regional literatures into English to make the regional literatures available and accessible to all in English. Due to the lack writing skills in English language the regional writers confine themselves only to their regional literature (s). English language plays pivotal role in making the regional literatures to be available to the English readers and make the regional writers to be known to English readers throughout the world. Furthermore, as English language is a liberating force, it allows regional writers to get greater popularity and to interact and communicate with wider English speaking and reading audience from all corners of the world. In fact, expression of an idea or writing in regional language/mother tongue is very powerful than writing/expression of an idea in any other or foreign language. But, regional languages have great many limitations in reaching recognition in national and international platforms. Therefore, regional writers are unable to get name and fame in literary circles of the world.

Since there are great many cultural and linguistic differences between Indian regional languages and English language, translation of any literary work of art from source language into target language is tough and difficult task. McGuire writes: "Language and culture are so inextricably interlinked that no language can exist unless it is steeped in the context of culture; and no culture can exist which does not have at its centre, the structure of natural language." (McGuire: 1980, 13). Thus, translation is not simply translating literary work of art from source language into target language but it is a trans-cultural activity which is translation of a literary work of art by involving the two cultures: source language culture and the target language culture. Translators face aplenty of difficulties while translating literary work of art from the source language into the English. Native modes of idiomatic expressions, certain distinctive expressions related to culture in regional languages may not/cannot be translated from the source language into the target language i.e., English. Further, a great many words

representing tradition, sob-culture, and custom in regional languages cannot be translatable since there are no equivalent words in the target language. Sheela Reddy says "reading Indian literature in English translation is a bit like eating Puri with a fork and knife." (Outlook, Feb.25, 2002, 58). The Kannada writer U.R. Ananthamurthy remarks that "the better a writer is in a regional language; the harder he is to translate into target language (English)" (outlook, 59). When translator cannot translate a text from source language into target language the translator should protect the intent of the source text information. This usually takes place when Native modes of idiomatic expressions, certain distinctive expressions related to culture in regional languages are used in the source text. Since the responsibility of the translator here is to safeguard the intent of the work of art, a relevant and equivalent word or expression or sentence has to be chosen to serve the purpose the source text and translation.

In any language there are different varieties of dialects. In regional languages in India there are sub-regional and social/caste dialects within the same language. Translation of literary work of art depends on the translator's command of that particular dialect in regional language (s). The literary works of art that are brought out in elite/accepted regional language/dialect is less difficult to translate into target language than the literary works of art that are written in social/caste dialects. If the culture concerning the social/caste is more embedded in the literary works of art, then the translation of that literary work (s) of art becomes more and more problematic. Thus, understanding the regional and social/caste dialects, its idiomatic expressions play pivotal role in translation of literary works of art from source language into target language. Until the year 2000 regional writers were making use of accepted regional dialect in their literary works of art. However, with the advent of regionalism the writers have been making use of their own or social/caste dialect in their writings. Now making use of regional or social/caste dialects is very common and has become a fashion in the era of Existentialism and globalization. There is a big challenge in the field of translation when translating a literary work of art which is written in regional or social/caste dialect, from source language into target language. Here the translator has to solve the problem. It depends on how the translator is to treat the social/caste dialect when translating the text. This is in fact a real and additional problem to the translators when translating source language texts, written in regional or social/caste dialects, into target language (s). Therefore, the translator translates the words regarding the social dialect into an equivalent dialect in the target language when he faces difficulty in choosing the right word.

Translation from source languages, regional languages (L1), into English language erase boarders among the regional literatures and languages. It paves the way to establish the relationship between regional languages and the target languages. Likewise, it initiates a platform for all oppressed, suppressed, and exploited groups. The English language unifies diverse regional cultures and its languages. According to Dr Babasaheb Ambedkar, the architect of modern India, "there are only two countries. Firstly, there is a touchable India, and secondly there is an untouchable India."

(B. R. Ambedkar : 2016) As far as Baba saheb's definition of countries is concerned there are two cultures in India. One is the exploited/oppressed, and the other is exploiter's/ oppressor's culture. Hence, there is a great deal of gulf between the two cultures. It is the translation that fills this gulf. It is the translation of Dalit/exploited literary work of art from source language into target language unites all oppressed groups in India. It is the translation that gives strength to Dalit literature and its movement and intensifies the movement of human rights. Dalit literature fights for Liberty, Equality, and Fraternity. It is the translation of Dalit literature into English brings all oppressed groups together and encourages to fight against injustice, inequality and social evils. Writers of Dalit literature were influenced by the ideals of Dr Babasaheb Ambedkar. Writers of Dalit literature in particular and the translators of Dalit literature in general follow the words of Babasaheb. Therefore, they pay back to the society in the form of writings and translations.

This translation, Antharangam (Insider), is chosen with an aim to through a brief light on Dalit women's literature in Telugu language. This is why I have selected a short story, written by Dalit woman, which was published in Telugu in a collection of short stories and poems, anthology, titled Nallapoddu : (Darky Sun) : Dalit Women's Literature - 1921 - 2002. The anthology, Nallapoddu: (Darky Sun): Dalit Women's Literature -1921-2002, was published by Hyderabad Book Trust a well known publisher in Telugu states. The writer brought out a collection of short stories and poems. Her short stories and poem are remarkable in portrayal of the problems of the downtrodden. Her characters fight for equality in various situations. In the present story, Insider, the character poses great number of questions to Ambedkarites, men, on women's rights, and equality. Translation of the short story, Insider, is an invaluable experience. It helps Dalit women's short story reach out from regional to national readers through my modest attempt.

**Insider :**

In fact, it is a great testimony for the unity of Indians as there are no dissenting voices among the people of this subcontinent on the topics of women's liberty, independence, and equality. Don't you have a suspicious mind of a mustard seed in this above said matter? The celebration of great leaders' birth and death anniversaries, different important days ... Sir! Three hundred and sixty five days are allocated to celebrate all important days. After the allocation, all the leaders (Ambedkarites) may join together to enjoy in the night. Night celebrations might be started. Leaders start laying, and pulling out stones to the great boundless, infinite and uncompleted structures etc., Leaders deliver spectacular speeches on liberty, equality and fraternity in various meetings like an earthquake occurs and floods break out … the tongues of the little and the big leaders compete with each other and one another … oh my god! How many promises are? How many oaths and swearings are! Those who have listened to all these will have to believe that all these promises, oaths and swearings are raw facts and naked truths.

Apart from having thought of first time in India about woman's liberty, rights, he tried his best to put into practice the rights of women by bringing about Hindu Code Bill. He was at-

tacked and sacrificed by the vicious chains of aversion and resentment of Manuvaadis when he put into practice the rights and liberty of women. Thus, it paved the way to renounce his power for women's liberation. Do they (the descendants) respect the ideals of Babasaheb? The descendants deliver (ed) spectacular speeches in Babasaheb Ambedkar's birth day celebrations by tearinging their tongues. Whom so ever they are … Do they put into practice his ideals and ideology? Do they travel towards that direction?

They (men) were excommunicated and sacrificed in the plot of Chaturvarna system … the same kind of excommunication and sacrifice took place towards women … why are our women being subjected to discrimination and exploitation? Have the descendants (male Ambedkarites) ever thought of this discrimination on women by their own men?

Women are at home with the various relationships like mother, wife, sister, and sister-in-law and so on … do these so called Ambedkarites try their best to improve their women's way of thinking? Or do they take with them their women to the meetings and assemblies that are being attended? Or do they discuss the rights, the laws, and the movements with their women? Or do these Ambedkarites recognise their women as their equivalents?

If a woman is educated a society will be lightened. Mahatma Jyothiba Phule got his wife educated by fighting against the then orthodox society, and by fighting against his father who is the captive of the conspiracy of the Hindu religious society. With his wife he established schools to literate and educate girl children. He longed to raise the consciousness of the society. Even after seventy five years of independence there has not been any change in the societies, communities, and families of the Dalits, disadvantaged and backward communities (MBCs). Mahatma Jyothiba Phules' spirit, longing and quest are lacked in their descendants. They do not put into practice the ideals of Jyothiba. Therefore, even after decades and centuries there might not be any change in the society.

They (descendants) openly/out rightly say on public platforms that they are the descendents of Babasaheb, but mentally they are Manuvaadis! They want to put into practice all kinds of discrimination and inequalities. Having bent the necks of the society and the country, at present, the ruling powers: money, religion, caste, and despotism/tyranny are ruling the society and nation. Why are these descendents unable to conjoin/integrate themselves to fight against the so called ruling powers? Why are these descendents always after positions? Why are they watering down and weakening the democratic movements? Why are they unable to remove selfishness from them? Why are they unable to end the Caste devil that is unrestrainingly mushrooming day by day? Why do they want to construct buildings by making the caste as foundation? Why have the number of viewers been increasing day by day by making the caste as a foundation to construct buildings. Questions … questions … questions! There are many unanswered questions.

These are not only the questions to pose but there are many questions too … there is an answer to all these questions posed … denying the equality to women is the reason for these questions! By means of laws we think that miracles/wonders may happen. And we think that by dawn human society may be decorated by the rays of consciousness is just a hallucination! Practice with sincerity is the only way. For that, endeavour is needed.

Getting to know about politics, and constitution is none of your business you women. Cook, serve and take care of your husband and children carefully … we have been listening to these words and sentences at our homes even now. The ideology which has influenced our way of thinking and culture for centuries together has been sit and settled in our brain (s). To extirpate that ideology a great deal of mental struggle has to be started. A man has to emancipate himself from this ideological slavery. Hence, he can do independent thinking.

What do we think of at present? We are not supposed to think of who are the representatives to which caste. We are supposed to think of who represents which ideology. Are you, the majority, representing the ideology of the Manuvaadam? The Ambedkarites are still saying at their women that they are ineligible for independence. Can't you (the descendants of Babasaheb) emancipate yourself from the clutches and ideology of slavery? Can't you (the descendants of Babasaheb) liberate yourself from the chains of patriarchal oppressive structures?

**About the Author :**

Jansi K.V. Kumari was born in the year 1954 in Kaakulapaadu (Village), Gannavaram (Mandal), Krishna District, Andhra Pradesh, India. She did M.A., English Literature in Andhra University and joined a Programme officer in Aakashavaani (Duradarshin), Vijayawada in the year 1976. She first published a short story 'Nishidhi'(Darkness) in1974 and essays on 'Universal Shakespeare', Milton Paradise Lost', 'Shelly', and 'John Keats'. She brought out 'Nishabda Sangeetham' (Silent Music) in 1998 and an Anthology on short story in 2001. She has to her credit hundreds of poems, short stories and essays. As part of her job in Aakashavaani (Duradarshin) she had to write narratives. Her narratives deal with the issues of the lives of the prisoners in the jails, child labour, national and religious integrity, and women issues. Her short stories and essays focus on injustice being done to the poor, and women, anarchy in the contemporary Indian society, inequality between men and women. The short story, Insider, questions men in particular and Ambedkarites in general, whether they put into practice Babasaheb's ideology and what they talk and deliver on the public platforms.

**References :**

1. Ambedkar B.R. *Writings and Speeches.* Vol.1. Mumbai: Government of Maharastra, 2016.
2. Dangle, Arjun (ed), *Poisoned Bread.* New Delhi: Orient Blackswan, 2009.
3. Lakshmi, Haribandi. *Translation Studies Theory and Practice.* Hyderabad: Booklinks Corporation, 2007.
4. McGuire, Susan Bassnett. *Translation Studies.* London: Methuen, 1980.
5. Purushottam K., Gita Ramaswamy and Gogu Syamala (eds), *The Oxford India Anthology of Telugu Dalit Writing.* New Delhi: Oxford University Press, 2016.
6. Reddy, Sheela. Midnight Orphans. *Outlook.* Feb.25, 2002.

**Work cited :**

1. Syamala, Gogu (ed), *Nallapoddu: Dalit Women's Literature -1921-2002.* Hyderabad: Hyderabad Book Trust, 2004.

❖

